తాళ్ళపాక పదసాహిత్యము - సంపుటము -

# శృంగార సంకీర్తనలు



అన్నమాచార్య ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 13

# శృంగార సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్తలు

కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ

కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

1998

T.T.D. Religious Series - 545

ప్రథమ ముద్రణ : 1965

ద్వితీయ ముద్రణ : 1998

© తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

PLACED ON THE SHELF
Date.....................

ప్రతులు : 2,000

వెల : రు. 25-00

ప్రచురణ :
శ్రీ M.K.R. వినాయక్, I.A.S.
కార్యనిర్వాహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No. 128.30
Date ...............
TIRUPATI.

ముద్రణ :
త్రివేణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్
14/264, ఈడేపల్లి
మచిలీపట్నం - 1
ఆంధ్రప్రదేశ్

# విన్నపము

ఇందరికి అభయంబు లిచ్చు చేయి
కందువగు మంచిబంగారు చేయి ॥

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి. ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు. పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమత: తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A.,Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము.

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి, ప్రపత్తి, దేహాత్మైక విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు; జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు. సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు. శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు. శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు.

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు. తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు. పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి.

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు. అన్నమయ్య గ్రాంథిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు. జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు.

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు.

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి.

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది. మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది.

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి. మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి.

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి. పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి. తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి. సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది.

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి.

ఈ సంపుటాల ముద్రణకు ఆధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.కె.ఆర్.వినాయక్ I.A.S. గారికి కృతజ్ఞతాంజలి.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె. సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M.A., Ph.D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు.

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం. లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి.తి.దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి. సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు.

డా॥ మేడసాని మోహన్ M.A., Ph.D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు

తేది : 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీఠిక

* * *

మరల మూడవసారి నన్నీకీర్తనల పరిశోధన కార్యమునకు లాగుకొని తెచ్చి పెట్టి శ్రీ శ్రీనివాసుఁడు తన విచిత్ర సంకల్పమును వెలయించినాఁడు. శ్రీ తిరుమల – తిరుపతి దేవాలయ శ్రీ కార్యసభకు అధ్యక్షులైన శ్రీ కల్లూరి చంద్రమౌళి మహాశయులును, కార్యనిర్వాహకులగు శ్రీ టి. నరసింగరావు మహోదయులును, ఆ శ్రీనివాసుని రెండు దీర్ఘదృఢభుజములుగా నన్ను బంధించి పెట్టినారు. ఆ విశ్వాసపుఁగట్టునుండి తప్పించుకొనలేక తల వంచినాను. వారికి నా హార్దమైన ధన్యవాదములు.

ఈ గొప్పపనికి నాకు చేదోడువాదోడుగా వారు శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్ర - సంస్కృత - సాహిత్యోపాధ్యాయులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శిరోమణి - విద్వాన్ - గారిని ఏర్పఱచుట నా యదృష్టము. శ్రీ శర్మగారు అష్టావధానము, ఉభయ భాషలందును ఆశుకవిత, మంత్ర తంత్ర శాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలువిషయములలో పరినిష్ఠితులు: నిష్కల్మషమై నిష్పక్షపాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థమైన సదాచార సంపత్తి గలవారు: ఈ పల్లెపట్టులందలి దేసితెలుగు నుడికారములు చక్కఁగా నెఱిగినవారు. మీఁదు మిక్కిలి నా యెడ సుస్నిగ్ధమైన హృదయము గలవారు: కార్యోత్సాహపూర్ణులు. ఇఁక కావలసినదేమి? యథాశక్తిగా ప్రయత్నింతును. తక్కిన బరువు శ్రీనివాసునిది.

ఈ 'తాళ్ళపాకవారి నేయరచనల' [illegible]వ సంపుటమును సంస్కరించి ప్రకటించిన శ్రీ డాక్టరు పి. టి. జగన్నాథరావుగారే ఈ సంపుటమును గూడ ముద్రణకు సిద్ధపఱచి యుండిరి. ఇదివఱకు పెదతిరుమలాచార్యుల సంకీర్తనములు గూడ రెండు సంపుటములుగా వారే సిద్ధపఱచి యిచ్చినారు. వారి యేర్పాటుప్రకారము పెదతిరుమలాచార్యుల సంకీర్తనల పై సంపుటములు ౧౯-దవ, ౨౦-దవ సంపుటములుగాను, ఈ అన్నమాచార్య సంకీర్తనలు ౨౧-టవదిగాను ప్రకటింప

వలసినవి. కాని రాశియందును కావ్యగుణమునందును చాలా గొప్పవైనవి పదకవితాపితామహుఁడగు ఆసంకీర్తనాచార్యుని కృతులు. కనుక వానిని పూర్తిగా ప్రకటించిన తరువాత ఆయన పుత్ర - పౌత్రుల రచనలు ప్రచురింపఁదగునవి, ఈ సంకీర్తనల ప్రకాశనమునకు పితామహులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యభిప్రాయము. దాని యౌచిత్యమును గ్రహించి వారి తరువాత ఈ పని సాగించిన శ్రీ ఎ. వి. శ్రీనివాసాచార్యులును నేనును ఆ వరవడిలోనే నడిచితిమి. అట్లు అన్నమాచార్యుల అధ్యాత్మ — శృంగార సంకీర్తనలు రేకులలోని క్రమము ననుసరించి, ఈ గ్రంథమాల ౪ వ సంపుటమునుండి ౧౪ వ సంపుటము దాఁక ౧౧ సంపుటములుగా వెలువడినవి. ౧౫ వ సంపుటముగా శ్రీ శ్రీనివాసాచార్యులు చిన్న తిరుమలాచార్యుల సంకీర్తనలను పూర్తిగా ప్రకటించి, మరల ౧౬వ సంపుటముగా అన్నమాచార్యుల రచనలనే సక్రమముగా సాగించిరి. ఇప్పుడు మేము, శ్రీ జగన్నాథరావుగారు ౨౧ వదిగా నిర్దేశించిన అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల సంపుటమును ౧౭ వదిగా ప్రకటించుచు రాఁబోవు సంపుటములలో ఆ సముద్రమునే కడదాఁక నీఁదు సంకల్పము చేసితిమి. శ్రీ జగన్నాథరావుగారు సిద్ధపఱిచిన పెద తిరుమలాచార్యసంకీర్తనల రెండు సంపుటములును ఆ తరువాత పరిగ్రహింపవచ్చును. అది 'నందోరాజా భవిష్యతి' వంటి మాట.

ఈ సంపుటమున అన్నమయ్యగారి శృంగార సంకీర్తనలు ౫౩౭ గలవు. ఇవి సాధారణపురేకులలో ౫౦౧ మొదలు ౬౦౦ ల దాఁక నున్న వానిలోనివి. ఇందు ౨౧ మొదలు ౩౦ వఱకును గల పది రేకులు లేవు. రాగభేదముతో మాత్రము రేకులలో పునరుక్తములైన రెండుకీర్తనలు ఒకతూరియే ప్రకటింపఁబడినవి. ఆ విషయము అక్కడ క్రింది సూచికలో సూచింపఁబడినది.

ఈ సంపుటమందలి పాటలను జాగ్రత్తతో రేకులవ్రాఁతతో పోల్చి సరిచూచి సిద్ధపఱుచుట జరిగినది. ప్రకరణము, వాక్యసందర్భము, పాటచరణములందలి శబ్దార్థముల పొందిక, ఆ రేకులందలి లిపిపద్ధతి — మొదలగు వానిని గమనించి శ్రీ ప్రభాకరశాస్త్రిగారిపద్ధతినే పాటల పాఠములు సమకూర్పఁబడినవి. ఇట్లు చేయుటలో శ్రీ జగన్నాథరావుగారి పాఠములు అందందు కొంత సవరింపవలసివచ్చినవి. కాని శ్రీ రావుగారి పరిశ్రమమే మా కీ సంపుట పరిష్కారణమునకు మూలవస్తువుగాన వారికి మా ధన్యవాదము లిందు చెల్లించుచున్నాము.

నేను సరిచూచి ప్రకటించిన ౧౨ వ సంపుటమున, "తొల్లియును మట్టాకు తొట్టైలనె" అను అన్నమాచార్యసంకీర్తనము పొరపాటున లుప్తమై యుండినది. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు దానిని గమనించి, తాము ప్రకటించిన ౧౭ వ సంపుటపు పీఠిక (పు. ౬)లో పునరుద్ధరించి చూపినారు. నా యీ చేతప్పును చూపినందుకు, అంత మధురమైన ఆ సంకీర్తన నా మూలాన అంతరించి పోనీక మీఁదికెత్తినందుకు వారికి నేను కృతజ్ఞుఁడను.

శ్రీ శ్రీనివాసాచార్యులు ప్రకటించిన ౧౬ వ సంపుటపు పీఠికలో కొన్ని యభిప్రాయములను వెలువరిచి యున్నారు. వానిలో ముఖ్యమైన వానిని గూర్చి నాకుఁ దోఁచిన మాటలిందు సంగ్రహించుచున్నాను :

## (అ) చిన్నన్న — పదకర్త

పెదతిరుమలాచార్యుల నాల్గవ కుమారుఁడు తిరువెంగళనాథుఁడు చిన్నన్న-కూడ కొన్ని సంకీర్తనములను రచించి యుండవచ్చుననియు అవి ఇంకను లభింపవలసియున్నవనియు, నేను సస్వరముగా ప్రకటించిన 'తాళ్ళపాక పాటలు' తొలిసంపుటపుపీఠికలో వ్రాసితిని. (పు. ౦) "చిన్నన్న ద్విపద కెఱుఁగును" అను తెన్నాలి రామకృష్ణుని మాటకు ద్విపదలు రచించుటయందు చిన్నన్నకు అధికమైన మెక్కువ అని మాత్రమే అర్థము చెప్పఁదగును గాని తక్కిన రచనాభేదముల నతఁడు చేయలేడని కాని, చేయలేఁడని కాని చెప్పఁదగదు. అట్లే "పన్నుగఁ బెద తిరుమలయ్య పదములకెఱుఁగున్" అను పై కందపు రెండవ వాక్యమునకును పదములు తప్ప ఇంకేమియు అతఁడు రచింపలేడని చెప్పలేము గదా! అతని రగడ, వృత్తశతకము, నీతిసీసశతకము మొదలైన భిన్నరచనలను మన మెఱుఁగుదుము. అతని 'ద్విపద హరివంశము' వలె చిన్నన్నపదములును కాలవశమున వెలికి రాకపోయి యుండును. తాత, తండ్రి, అన్న, అందఱును పదములసంఖ్యముగా అద్భుతముగా రచించి లోకమును సమ్మోహింపఁజేయుచుండఁగా, చిన్నన్నవంటి మహాకవికి ఆ వాసన, ఆ యుత్సాహము, తాఁకకుండునా? మఱి చిన్నన్న మేనమఱఁది రేవణూరి వెంకటార్యుఁడు శ్రీపాదరేణుప్రభావము నందు (౧-౫౨) "మా తాతలపాక చిన్నన పదంబులు పాడిన నాడె సర్వరాజ్యైశ్వ విభుండు" అని సగర్వముగా చెప్పుకొన్నమాట నమ్మరానిదని శ్రీనివాసాచార్యుల

నభిప్రాయము. దానికి కారణము, వెంకటార్యుఁడు 'శకుంతలాపరిణయము' నందు పెద తిరుమలాచార్యుల కుమారులను' తార్మారుగా' చెప్పుట యని వారు సూచించినారు. (సం. ౧౬ - పీఠిక పు. ౩౪) పెదతిరుమలయ్య కుమారులలో ముగ్గురికి వేంకటనాథనామము గలదు. వ్యవహారసౌకర్యమునకై వారిని క్రమముగా పెద్ద తిరువేంగళనాథుఁడు, చిన్న తిరువేంగళనాథుఁడు, కోనేటి తిరువేంగళనాథుఁడు అని వాడినట్లున్నది. ఇంకను పెద్దన్న, చిన్నన్న, తిరువేంగళప్ప అనియు వాడియుందురు. శకుంతలాపరిణయకర్త ఇందు చేసిన 'తార్మారు' చిన్నన్నను కోనేటి తిరువెంగళనాథుఁడని, కోనేటి వెంకటనాథుని తిరువెంగళప్ప యనియు పేర్కొనుట మాత్రమే. ఇదొక్క పెద్ద లోపముగాఁ గొని, శకుంతలాపరిణయకర్త — సమకాలికుఁడైన మేనమరఁది — చెప్పిన మాటనే తిరస్కరించుట తగదు. ఇట్లే "తాళ్ళపాక చినన్న దండెమీఁటులుగావు" "అల తాళ్ళపాక చిన్నన్న రోమములైన తంబురదండెకుఁ దంతులౌనె" అను అర్వాచీనులు చెప్పిన మాటలు గూడ వట్టి బూకరింపులని త్రోసివేయరానివే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు "చిన్నన్నకు అన్న, తండ్రి, తాత, గొప్ప గాయకులు గాన, యిటీవలివారు గ్రంథములఁబట్టి చిన్నన్ననే యెఱిఁగినవారుగాన, వారి యోగ్యత నీతనికిఁ జేర్చి చెప్పియుండవచ్చును" అని భావించుటకు కారణము "చిన్నన్న గాయకుఁడనుట కిక్కడి రాగిరేకులలోఁగాని గ్రంథములలోఁగాని యాధారములు గానరావు" అనుటయే. కాని వెనువెంటనే "కాక యీతఁడును గాయకుఁడేమో!" అని వారు తమ యూహను కొంత సడలించుకొన్నారు. (అన్నమాచార్యచరిత్ర పీఠిక, పు. ౯౫) వారిది ప్రామాణికచిత్తవృత్తి. చిన్నన్నను కవిగా మాత్రమే యితరులు పొగడుట ప్రాధాన్యవ్యపదేశమంతే. అతఁడు యోగి యనియు ఎవరును పేర్కొనినట్లు గానరాదు. కాని పరమయోగివిలాసము రెండవ యాశ్వాసమున శ్రీ భక్తిసారచరిత్రమున చిన్నన్న వెలువరిచిన యోగవిజ్ఞానము అసాధారణముగా నున్నది. ఇంక నేయే విద్యలలో యెంతెంత అతని ప్రతిభ ప్రవహించెనో మనకేమెఱుక ?

చిన్నన్న సంకీర్తనరచన చేసెనాఁడని నేను భావించుటకు అతనివని గాయకసంప్రదాయమున నిలిచి నేఁటికి లభించు రెండుకృతులాధారమని వెనుక సూచించితిని. (తాళ్ళపాక పాటలు ౧ సం. పీఠిక పు. ౮) అవి యీ శతాబ్దాదిలో సుబ్బరామదీక్షితులు రచించిన 'సంగీతసంప్రదాయప్రదర్శిని' యందున్నీతము లైనవి. అవి యిట్లున్నవి :

[ 1. కీర్తనము - శంకరాభరణరాగము - అటతాళము — తాళ్ళపాక చిన్నయ్య ]

ప॥ శ్రీహరిపాద తీర్థమే - చెడని మందు

అ॥ మోహపాశమును గోసి - మోక్షమిచ్చేమందు

చ॥ ౧. గౌరమై కాయని మందు - కడు చల్లజేసేమందు
కారమై కంటగించని - కమ్మని మందు
నూరని పూయని మందు - నునుపు కనిన మందు
వేరువెల్లంకులు లేని - వెలలేని మందు. ॥శ్రీహరి॥

౨. గురుతైన రోగముల - గుణముజేసే మందు
దురితమ్ముల నెడబాపే - దొడ్డ మందు
నిరతము బ్రహ్మాదులు - నిలిచి సేవించే మందు
నరకము చొరనీయని - నయమైన మందు ॥శ్రీహరి॥

౩. పొంకముతో గుణముల - పొందజేసే మందు
మంకుబుద్ధిని నెడబాపి - మన్నించే మందు
పంకజాక్షప్రసన్న - వెంకటరాయనిమందు
శంకలెల్ల పోగొట్టి - సంరక్షించే మందు. ॥శ్రీహరి॥

(ప్రథమాభ్యాస పుస్తకము - పు. ౧౦౧)

[ 2. కీర్తనము - కాంభోజిరాగము - ఝంపతాళము — తాళ్ళపాక చిన్నయ్య ]

ప॥ నామొరాలింపవే-అయ్య వెంకటరమణా-నామీద దయలేదా

అ॥ ప్రేమతో నేటికిని-శరణాగతత్రాణ-బిరుదు పోనాడతగునా-వోస్వామి

చ॥ ౧. కరి మకరిచే జిక్కి-గాసిబడి మొరలిడగ-గాచి రక్షించలేదా
నరమృగాకృతిబూని-ప్రహ్లాదుకొరకు దా-నవపనాథు చీరలేదా
పరగ ద్రౌపదిమాన-భంగంబు గాకనే-వలువ లొసగలేదా
మరచితివో ఆనాటి-కార్య ప్రభావంబు-మరియున్న చందమేమీ-వోస్వామి ॥నా॥

౨. మున్ను రక్కసబాధచే-భయార్తులైన-మునుల కభయము లియ్యవా
వన్నుగా లాక్షాగృహాగ్నిచే బడకుండ-పాండవుల వెడలింపవా
మొన్న నీ శరణుజొచ్చిన విభీషణు లంక-కెన్న రాజుగ జేయవా
విన్నదని భాగ్యోపహీనుడని నన్నుపేక్షించి-క్రీగంట జూడరావా —
వో స్వామి ॥ నా ॥

౩. గోపకుల మేరకు పరాకుసేయక నాడు - కొండ వేలెత్తలేదా
అపత్ప్రసన్నుడని జనులు పలికిన పలుకు - లకట దబ్బర లాయెనా
నాపుణ్యమో లేక నిత్యోత్సవానంద-మహిమచే మరచినావో
యీపట్ల అలమేలుమంగ వేంకటరమణ - యెవరు వంన్నాదరించేరు
వో స్వామీ ॥ నా ॥ *

(సం. ప్రదర్శిని: భా. ౨, అనుబంధము 13, పుట ౫౨.)

ఈ రెండును చిన్నన్నవి కావని తీర్మానమగువఱకు వన్నెవరును "పెద దారి"ని పెట్టలేదని, ఇది "దురభిప్రాయము" కాదని సహృదయులు భావింప గలరు. కనుక "చిన్నన్న కేవలము కవిత్వము చెప్పినవాఁడే యనియు పదములు రచించి పాడినవాఁడు కాఁడనియు" శ్రీనివాసాచార్యుల వలె దృఢముగా నేను తెలియలేను. †

ఈ సందర్భమున 'తాళ్ళపాకవారి పదములు' మరి మూఁడు నా దృష్టి కందినవి. కర్తనిర్దేశము లేదు. చెన్నపురి వీణ రామానుజయ్య అను పండితుడు ౧౮౫౨ వ సంవత్సరమున రచించి మద్రాసులో ప్రకటించిన 'సంగీత సర్వార్థ సారసంగ్రహము' నందు ఇవి కలవు. (పు. ౧౪౨) ఆ పుస్తక మిప్పుడు దుర్లభము గనుక ఆ పాటలు నశించిపోకుండుటకై యిందుద్ధరించుచున్నాను, యథామూలముగా :

---

* సాహిత్యము మాత్రమే యథామూలముగా ఇందు చూపితిని. స్వర రచన విస్తర భీతిచే వదలితిని. 1-వ పాటలో 'శ్రీపతిపాద' అని నేను 'తాళ్ళపాక పాటలు' పీఠికలో వ్రాయుట చేతప్పు. ఈ రెండే తాళ్ళపాకవారి పాటలలో సాంప్రదాయిక. స్వరముతో నేటికి లభించునవి.

† "తాళపాకము చిన్నయ : ఇతడు తెలుగు బ్రాహ్మణుడు. వెంకటాచలపతిభక్తుడు తిరుపతిలో నుండినవాడు. వెంకటరమణవిషయమై భాగవత సంప్రదాయముగా వాడుకలో గల ఉత్సవపద్ధతి నేర్పఱచిన పుణ్యపురుషుడు. దానిలో – తోదయ మంగళము, మంగళము, శరణు, హెచ్చరిక, కీర్తనములు, ధూపదీపాలంకార నైవేద్యాద్యుపచారముల కీర్తనములు, పవ్వళింపు, దివ్యనామ సంకీర్తనము, వసంతోత్సవముల కీర్తనములు, స్వామిని మేలుకొలుపుటకై కీర్తనములు ఇవి మొదలైనవియు నణగియున్నవి. ఇది గాక విడికీర్తనములును గలవు. ఇతని భక్త్యతిశయమువలన మాటిమాటికి వెంకటరమణుడు ఇతనికి సాక్షాద్దర్శనమిచ్చి మాట్లాడినట్లు పెద్దలు చెప్పుచున్నారు. భజనపద్ధతికి యితడే మూలపురుషుడు" (సం. సం. ప్రదర్శిని, వాగ్గేయకారుల చరిత్ర, ౭వ పుట.) పైసుబ్బరామదీక్షితుల మాటలు గాయకప్రపంచమున చిన్నన్నకు గల సాంప్రదాయిక స్థానగౌరవమును స్పష్ట పరుచుచున్నవి.

[ 1. గౌళిపంతురాగం – అట చాపుతాళం — తాళ్లపాకవారి పదములు ]

ఏరీతి బొంకేవురా నాసామి ॥ ప ॥

ఏరీతి బొంకేవు ఇదుగో నీభుజమును। దేలిన పసపునిగ్గులు
నీమేనెల్ల। జారిన కుంకుమ జిగ్గులు। నీరెప్పలపై। పేరిన కా
టుక కగ్గులు। వేణంగిరాయ। రారాయేటికి సిగ్గులు నాసామీ. ॥ అ ॥

౧. ఎందుకు తక్కేవు మందగమనలతో పొందుసేయ నంటివి
పొందులు జేయక పోకుంటేమేదది నందిటగాజుల కోతలు
నీమేనెల్ల చిందినగంధపుపూతలు। నీ పెదవుపై కందిన కెంపుల
పూతలు। చెక్కుట చెలువొందిన కస్తూరి గీతలు। నాసామి. ॥ ఏ ॥

౨. నిన్ననాలోనల్ల నీరజముఖియింటి – కెన్నడు పోవంటివి।
ఎన్నడు పోకుంటే యిదిగో నీచెవినంటుకున్నది ముక్కెర నొక్కులు।
నెత్తురు గమ్ముచున్నది రొమ్మున పెక్కులు। నీనాలుకపై సున్నము మిం
చిన పొక్కులు। నీనిడువాలు కన్నుల నిద్దురసొక్కులు। నాసామి. ॥ ఏ ॥

౩. నిక్కముపేణంగి నిలయుత। ననుగూడి యెక్కడ పోవంటివీ
యెక్కడ పోకుంటే యిదుగో నీ గళమున చొక్కపుచందురు కూనలు।నీమేనెల్ల
చిక్కిన చెమట సోనలు। నీశిఖలోను సొక్కినపువ్వుల సోనలు। వన్నెంటకు
మిక్కిలి నామీదానలు। నాసామి. ॥ ఏ ॥

[ 2. కేదారగౌళరాగము – ఝంపెతాళము ]

భామ శృంగారించు భావమే యందము ॥ ప ॥

కాముని రతిపాట కాంతకీలాగు ॥ అ ॥

౧. పూవొకటి వికసించె పున్నమచంద్రునివలె పూమీద మరిరెండు పూలుబూసె
రెండుపూవులనడుమపూసెనొకపువ్వు పూవుకిందముప్పదిరెండుపూమొగ్గలెత్తె.

౨. పక్షియొక్కటిప్రాలె భద్రేభమనగాను పక్షిమీదను రెండుపక్షులాయెగా
రెండుపక్షుల నడుమనే ప్రాలెనొకపక్షి పక్షితోజోడుగా పలికెనొకపక్షి. ॥ భా ॥

౩. చిగురెత్తునే రెంటి చెందామరోయనగ చిగురుమీదను రెండుచిగురులెత్తె
చిగురుచిగురులయింటశ్రీచంద్రరేఖచిగురుపోవంతేనెచెలగిచవులూరెను. ॥ భా ॥

[ ౪. కేదారగౌళరాగము ఝంపెతాళము ]

ఎటువంటి రాజీకమే చెలియ నేఁడు ॥ప॥

కటకటా యెందైన కంటిరా మీరు ॥అ॥

౧. గోరంట్లసీమ పెనుకూటంబుమూకచే భారంబుదుర్గములు పట్టుబడెను
నారెనారెకు మధ్యదేశంబు బయలాయె చేరిమధురాపురము సూరలటుబోయెఁ.

౨. కదిసియట్టిట్టాయె కాశ్మీరమండలము నెరిచిక్కువడెను కుంతలరాజ్యము
వరువచీకాకాయె నెరికుంభకోణంబు తురుపుగాయల గోలకొండలోనాయెఁ.

౩. వింతపూర్వుల పూర్వులిదదండువిడిచిన కొండతా మెరకోలన కోలుపాయె
నంత శ్రీవెంకటేశుఁడలమేలుమంగజేరి సంతతము కల్యాణసామ్రాజ్యమేలెఁ.*

## (౨) పాటల స్వరముల లేఖన పద్ధతి

స్వరవిన్యాసముతోడ కీర్తనలు వ్రాసిపెట్టుకొనుపద్ధతి మనదేశమున ఇటీవల వ్యాప్తికి వచ్చినపని సంగీత విద్యార్థులును విద్వాంసులును ఎఱుఁగుదురు. ఆ మాటయే నా "తాళ్ళపాక పాటలు" మొదటి సంపుటమున (పు. ౬.) నేను సూచించితిని. ఆ విషయమున శ్రీనివాసాచార్యులకు కొంత సందేహము గలిగినది. దానికి కారణము వారు శ్రమించి బయటికిఁదీసిన రెండు పెద్ద శిలా ఫలకములు. అవి తిరుమల శ్రీసన్నిధి 'చంపక ప్రదక్షిణము' మొదట నుండిన వఁట. సస్వర సాహిత్యవిన్యాసమును అవి చూపుచున్నవి. తిరుపతి సంస్కృత కళాశాల యావరణములో పడియున్న ఆ ఫలకములను నేను పలుమారు చూచి నాను. వ్రాత చాలా భాగము అరిగిపోయినది. కనుక చదువుకొనలేక పోయితిని. ఈవల శ్రీనివాసాచార్యులు ప్రయత్నించి వాని ప్రతిబింబములు దీయించి యీ గ్రంథమాల ౧౬ వ సంపుటమున ప్రకటించుట శ్లాఘ్యమైన పని. ఆ ఫలకము చిన్నతిరుమలాచార్యులే చెక్కించి నిలిపినాఁడని, అతని "సంకీర్తనలక్షణము"నకు లక్ష్యములందు చెక్కినట్లున్నవని వారు వ్రాసినారు. (సం. ౧౫.III, ౧౬.౩౩-౩౫)

[* ఈ కృతులలో మొదటిది తాళ్ళపాకవారిది కాదేమో! వేంకటేశముద్ర దానికి లేదు. వేణుంగినిలయుని పేరున్నది. మరి తాళ్ళపాకవారి పాటలలో రేకులలో గౌళవంతు రాగము కానరాదు. భాష – భావములు రెండును కొంత తరువాతి కాలమును సూచించు చున్నవి. తక్కిన రెండును తాళ్ళపాక వారివి కావచ్చు.]

ల విషయములింకను నిర్ధరింపవలసినవి. ప్రతిబింబములు గూడ నా దృష్టికి చాలా అస్పష్టముగానే యున్నవి. "తరువాతి సంపుటమున నీ శిలాఫలకముల పాఠము వివరణములతో పాటు ప్రకటించుటకు యత్నింతును" (సం. ౧౬-౩౬) అన్న వారి సంకల్పము ఇంకను కొనసాఁగలేదు. ఆ వివరముల వ్యాసమును దయయుంచి వారు మాకిచ్చినచో కృతజ్ఞతతో రాఁబోవు సంపుటములందు వారి పేరనే ప్రకటింపఁగలము.

ఆదియట్లుండనిత్తము. స్వరసాహిత్యలేఖనమును గూర్చిన నా యభిప్రాయమును కొంత యిక్కడ వివరింపవలసియున్నాను. పాటస్వరములను సరిగమపధని అను సంజ్ఞలచే గుర్తుగా వ్రాసిపెట్టుకొనుట చాలా ప్రాచీనమైన సంప్రదాయమే. మరియు సహజముగా ఆవశ్యకమైన పద్ధతియే. ౧౩ వ శతాబ్ది లోని నిశ్శంక శార్ఙ్గదేవుఁడే తన సంగీత రత్నాకరమున ప్రాచీనమైన పాటలు కొన్ని సస్వరముగా నిలువచేసినాఁడు. అది నాకు పరిచితచరమైన విషయమే. కాని ఆ పద్ధతి, వేదఋక్కులవలె ప్రత్యక్షరమునకును నియతమై వ్యాకరణ నిబద్ధమైన స్వరసంయోజనము గల్గి, మార్పులకే మాత్రమును అవకాశమియ్యరావని నియమింపఁబడిన గీతముల విషయమున మాత్రమే కొంతకాలము వ్యాప్తిలోనుండినది. సంగీతరత్నాకరమున పై పాటలు బ్రహ్మచేసిన శివస్తుతులని, వానిని మార్చుట వేదస్వరములను మార్చినట్లే పాపహేతువగునని శాసింపఁబడినది. అది మార్గసంగీత విధానము. ఉపదేశమును ప్రతిష్ఠను సంగీత విద్యకు నిలఁబెట్టుటకై చేసిన పని యది. కాని సప్తస్వరములు మాత్రమే కలిగిన సామవేదముననే గానవిషయమున ఎన్నో విభేదములేర్పడినవి. ౩-౪ స్వరములు మాత్రమే కల ఋగ్యజుర్వేదములందు మాత్రము ఒకట్టుబాటు కృతకృత్యమైనను అందును విభేదములు నెలకొనక పోలేదు. ఇఁక ౨౨ శ్రుతులవరకు స్వరభేదములు పెరిగి, మూఁడు స్థాయులు గలిగి, వాద వివాద సంవాదానువాదముల స్వాభావిక సంబంధమును గమనింపవలసి, లయభేదములైన, అసంఖ్యాతాళములును గలిగి, రక్తిప్రధానముగా, రాగభేదములతో, గమక విన్యాస విలాసములతో, నిబద్ధానిబద్ధరూపములతో, విచ్చలవిడిగా పెరిగిన సంగీతమును వ్రాఁతకు లొంగఁదీయుట సాధ్యము గాకపోవుట వింతగాదు. తరువాత వివిధముగా ప్రచారములోనికి వచ్చిన 'దేశి' ప్రబంధములు ఎన్నో ఇట్టి అక్షర స్వర నియమముతో వ్రాఁతకెక్కినట్లున్నది, గాని పైకారణముచేతనే అవన్నియు ఇంచుమించు అంతరించిపోయినవి. గీతములు, స్వరజతులు, వర్ణములు, మొదలగు కొన్ని

రచనలు మాత్రమే నేఁటికి స్వరము మొదలు కంఠపాఠము చేసికొని సాధింప వలసినవిగా వ్రాఁత కెక్కినవి. మరి సాహిత్యప్రధానమై, అర్థభావోద్రేకములకు తగినట్లు స్వరములను లొంగఁదీసి పాడవలసిన కీర్తనలు - పదవర్ణములు మొదలైనవి, వినువారి నాకర్షించుటకు వివిధ రక్తిమార్గములు కల్పించి పాడవలసినవి, నోటిపాఠముగానే ఇంకను సాఁగవలసియున్నవి. ప్రబంధములంతరించి సంకీర్తనలు వ్యాప్తికి వచ్చిన ౧౫-౧౬ వ శతాబ్దులలో సాంప్రదాయికముగా తాళ్ళపాక వారును కొన్ని ప్రబంధములు రచించియుందురు. అట్టి స్వరప్రధానమైన కొన్ని రచనలే పై శిలాఫలకములతో వ్రాయించి నెలకొల్పినారని ఊహింతును. పల్లవి, చరణములు అను రెండంగములు మాత్రమే కల సంకీర్తనవలెఁ గాక, ఉద్గ్రాహము, ధ్రువము, ఆభోగము మొదలగు ప్రబంధ ధాతు 'వుల పేర్లు ఆశాసన శిలలలో కానవచ్చుట, సాహిత్యము చాల మితముగానుండి సామవేదమునందలి 'స్తోభ'ముల వంటి అయ్యం-వయ్య-తియ్య-అంవో అను నక్షరములు విస్తరముగా కంటికి తోఁచుట, ఇవి నాయూహకు కారణములు. సంకీర్తనములు గూడ సస్వరముగా ప్రకటించు తలఁపుండెనేని యీ తామ్ర శాసనములలో కొన్నింటనైనను కొన్ని సంకీర్తములనైనను అట్లు చేయలేకపోయిరా పెద్ద-చిన్న తిరుమలయ్యలు ? మరి పదములు, కీర్తనలు, సూళాదులు మొదలగు తర్వాతివారి అర్థభావప్రధానరచన లేవిగాని సస్వరముగా వ్రాసినవి తెలుగు కన్నడభాషలలో ఒకటియు నాకంటికందలేదు. నాయెఱిఁగినంతలో ౧౯ వ శతాబ్ది కడపటిభాగమందే సుమారు అట్టి ప్రయత్నము జరిగినది. నా సంగీత ప్రథమాచార్యులైన శ్రీ కరిగిరిరాయలు మైసూరిలో, సుబ్బరామ దీక్షితులు ద్రవిడదేశములో, అట్టి ప్రయత్నము చేసినవారిలో నగ్రగణ్యులు. వారి శిష్యపరంపర ఇంకను ఆపని ముందుకు సాగించుచున్నది. దానివలన ఇప్పుడు కొంత స్పష్టముగా పాటలను స్వరపఱచుట సాధ్యమైనది.

## (ఇ) సంకుసాల నరసింహకవి తాళ్ళపాకవాఁడా ?

'కవి కర్ణరసాయన' కర్తయగు సంకుసాల నరసింహకవిని గూర్చి, అన్నమాచార్యులకు పెద్దభార్యయందు జన్మించిన నరసింహకవియే అతఁడన్న శ్రీనివాసాచార్యుల నిస్సందేహమైన నిర్ణయము (సం. ౧౬-పు.౯)గూడ ఇంకను గొంత నాన్చి చేయఁబడినది. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు మొట్టమొదట అట్లు గావచ్చునని యూహించినవారు గాని నిర్ణయించినవారు కారు : (అన్నమా-చరిత్ర.

పీఠి. ౧౧-౨౪) ప్రామాణికమైన వారి చరిత్రవిజ్ఞానమునకట్లు నిశ్చయించు సాధనములు చాలవు గనుక. నరసింహకవిదిగా పై గ్రంథమొకటే మనకు లభించినది. అందతఁడు తలిదండ్రులు కులగోత్రములు మొదలగు తన విషయము లేవియు పేర్కొనలేదు. భట్టపరాశర శిష్యుడనని మాత్రమే తెలిపెను. అది అతని శ్రీవైష్ణవసంబంధమును దెలుపును గాని, ఆ శిష్యత్వమెట్టిదో తెలుపదు. విశిష్టాద్వైత సిద్ధాంతమందు భక్తిశ్రద్ధలు అతనికుండినవనవచ్చును గాని. కృత్యాది లోని శివ గణేశ స్తుతి చేయుటచే అతని మతశ్రద్ధ అన్నమయ్య, చిన్నన్న మొదలగువారి యభినివేశమువంటిదిగాక, పెద్దనామాత్యుఁడు, రామకృష్ణుఁడు మొదలైనవారి దానివలె కొంత సంకీర్ణముగానే యుండినదనక తప్పదు. అతఁడు అన్నమయ్య కుమారుఁడే యైయుండినచో ఇట్లేల జరిగినది? లక్షణగ్రంథము లందలి 'సుంకసాల.' వ్యవహారమునను ముద్రణమందును గల 'సంతుసాల' ఒకటే కావచ్చునా? ఐనను అది 'సుంకేసుల'కు రూపాంతరమే యగునా? రాయలసీమలో 'సుంకేసుల' అను గ్రామములు మరికొన్నిగలవని వినికి. అట్లుండగా కడపజిల్లా పులివెందల తాలూకాలోని 'సుంకేసుల'యే నరసింహకవి పేరుకంటినదని యెట్లు చెప్పఁగలము? మరి ఆ 'సుంకేసుల' అతని 'తాతగారిల్లు' అన్ననిర్ణయమున కాధారమేమి? నరసింగన్న సుంకేసుల నుండి అహోబలము చేరి తమ మతగురువుల ప్రోత్సాహముతో శ్రీరంగము చేరినట్లున్నాఁడు (VI-9) అని యూహింపనేల? అహోబలముననే మఠము స్థాపించుకొని నరసింహోపాసన చేయుచున్న మత గురువులు శ్రీరంగమునకు పొమ్మని శిష్యుని ప్రోత్సాహింపనేల? ఇట్టి ప్రశ్నలెన్నో ఇప్పుడు దొరకినవానికంటె ప్రబలములైన ఆధారములు దొరకనిచో తీరవు.

## (ఈ) తిరుమలలో దివ్యప్రబంధముల పారాయణము.

శ్రీనివాసాచార్యుల యూహలు ఇట్టివింకను కొన్నిగలవు. అన్నిటి కంటె ప్రబలమైనది "ఈ అన్నమయ్య కీర్తనలు తిరుమలలో స్వామిసన్నిధిని ద్రావిడవేదమునకన్న పూర్వమునుండియే గానము చేయఁబడుచుండెడివి. ఆ తర్వాతనే ద్రావిడాగమమునకు ప్రవేశము లోన లభించినట్లున్నది." అన్నది. (సం. 18-33.)

ఇది చాలా బరువైన విషయము. దివ్యప్రబంధములను పునరుద్ధరించిన శ్రీ నాథముని యోగీశ్వరుఁడు ఆ శ్రీసూక్తులను అన్ని వైష్ణవదేవాలయాలలోను

నిత్యనైమిత్తిక పూజోత్సవాల కాలమున పారాయణము చేయవలసిన కట్టడ చేసినవాఁడు. తిరుమల శ్రీనివాసులసన్నిధి శ్రీవైష్ణవులకు పరమప్రాప్యములైన దివ్యదేశములు నాల్గింటిలోనొకటి. అట్టిచోట ౧౬ వ శతాబ్దమువరకు ఆసూక్తులకు అవకాశము లేకపోవుట యెట్లు? అన్నమయ్య సూక్తులకుముందు ఏకృతులను పాడుచుండిరి? అదిగాక చిన్నన్న, పరమయోగి విలాసమున నాథమునిచరిత్రము నందు (ఆ.౪: పు.౪౭౭) ఇట్లు వ్రాసెను.

"దివిజగానమునఁ దద్దివ్యప్రబంధ - నివహంబు తాళమానితముగాఁ బాడి,
తన శిష్యవరులకందఱకు నాకృతుల - నొనరనవ్విధమున నుపదేశమొసఁగె
నటుగాన నీద్రావిడాగమాంతము - పటుగతిఁ దద్వంశపాలురచేత
వినుచుండునెపుడు శ్రీవేంకటేశ్వరుఁడు........"

నాథమునిగారి కాలము ౧౦ వ శతికపుటాది. నాఁటినుండి నేఁటిదాఁక పాంచరాత్ర వైఖానస సంప్రదాయములలో దేనిప్రకారము ఆరాధనము జరుగుచున్న యే విష్ణుదేవాలయమందైనను దివ్యప్రబంధ పారాయణము లేకుండదు.

తాళ్ళపాక కవుల చరిత్రప్రభావములు, రచనలు, ఎంతో ఆకాలమున విరివిగా ప్రబలముగా దేశమున వ్యాపించియుండి యుండవలయును. వానిని సంగ్రహించి ప్రకటించుట శ్రమసహిష్ణువులైన ఉత్సాహులు, తరుణులు చేయవలసిన పని. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఆవిషయమున చూపుచున్న ఉత్సాహప్రయత్నములు శ్లాఘనీయములు.

అన్నమాచార్యుల చరిత్రకు సంబంధించి యీవల నాదృష్టికి వచ్చిన విషయమొక్కటి ఇక్కడ ఉదాహరించుచున్నాను.

సిద్ధనంజేశుఁడను వీరశైవ కన్నడ కవి 'గురురాజచారిత్ర' అను తన గ్రంథమున లక్ష్మీభక్తుఁడను కన్నడపదకవిని గూర్చి యీ విషయములను పేర్కొన్నాఁడట.

"ఇతఁడు గారలదిన్నె అను గ్రామమునందలివాఁడు. గురులింగ జంగమారాధకుఁడు. తత్వజ్ఞాని. వేదశాస్త్రపురాణ పారంగతుఁడు. పాంచాళ(కమసాలి) వృత్తిగలవాఁడు. ఇతఁడొకతూరి శివాధిక్యమును స్థాపించుచు, క్షేత్రములను దర్శించుచు, 'రాచపట్టి'కి వచ్చి అక్కడ తనయంగడిపెట్టి, కొంతకాలముండి గంగాధరుఁడను శైవరాజును వీరశైవునిగా చేసెను. అక్కడనుండి ముందుకు వెళ్ళినపుడు, వైష్ణవాచార్యుఁడైన తాళ్ళపాకం అన్నమయ్యయనువాఁడు తన

యిష్టదైవమైన యాగంటి యీశ్వరు (వెంకటేశ్వరు)దే గొప్పవాఁడు తక్కిన దేవతలు అనిత్యులు అని పదాలు కట్టి పాడుచుండుటను చూచెను. అప్పుడు అన్నమాచార్యుఁడు లక్ష్మీభక్తుని పాటలలో శృంగారరసము లేమిని ప్రస్తావించి విమర్శింపగా, లక్ష్మీభక్తుఁడు 'తన తల్లిదండ్రుల శృంగారమును గూర్చి చెప్పెడువాఁడు సత్పుత్రుఁడు గాఁడు.' అని ప్రత్యుత్తరమిచ్చెనట. ఆ తిరుపతి తిమ్మప్పచేత శివాధిక్యమును పలికించెనట."

పై మాటలు మైసూరి విశ్వవిద్యాలయమున కన్నడ 'రీడరు'గా నున్న శ్రీ ఎల్. బసవరాజుగారు రచించిన 'శివదాస గీతాంజలి' అను చక్కని గ్రంథపు పీఠికలోని వానికి (పు. ౧౧౪) అనువాదములు. వీరశైవుల పదసారస్వతమును గూర్చిన యెన్నో ప్రామాణికములైన క్రొత్త విషయములు ఆ పీఠికలో సవిమర్శముగా సంగ్రహింపఁబడినవి. ౧౭౭ శివకీర్తనలు పరిష్కరించి అందాయన ప్రకటించినారు.

పైవాక్యములందలి 'గారలదిన్న' అనంతపురమండలమందు గుంతకల్లు రైలుమార్గమున అనంతపురము తరువాతి స్టేషనుగానున్న గ్రామము గావచ్చును. కడపజిల్లాలో నేటికిని ప్రసిద్ధమైన శైవక్షేత్రమైన 'రాచవటి' – 'రాయచోటి' – కలదు. శైవ – వైష్ణవ భక్తులకు ఆకాలమున ఇట్టివాదవివాదములు జయపరాజయములు జరిగినట్లు, వారెన్నో అద్భుతచర్యలు–పవాడములు–ప్రకటించినట్లు గ్రంథగతమైన సాక్ష్యమెంతో కలదు. అది ఆ యా భక్తుల శ్రద్ధాబలమును యోగశక్తిని తెలుపును గాని పరతత్వస్వరూప నిర్ణయమునకు ఏమాత్రమును పనికిరాదనుట వివేకశాలులందఱును గ్రహింపఁగల విషయము. చారిత్రికముగా ఇట్టిసందర్భములు అసత్యములని త్రోసిపేయనక్కరలేదు. ఇంతకన్న పై సందర్భమును గూర్చి ప్రకృతమేమియు చెప్పలేము.

ఇంతకంటె ఈ పీఠికను విస్తరింపఁబనిలేదు. ఈ సంపుటము ముద్రణమును ఎంతో చక్కఁగా ఓర్పుతో నిర్వహించి సహాయపడిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముద్రాశాలాధికారులకు హార్దమైన ధన్యవాదములు.

తిరుపతి
క్రోధి – ఫాల్గుణ బహుళ ౧౨
(2[illegible] –3 –1965)

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.
తాళ్ళపాక సంకీర్తనల పరిశోధకుఁడు.

శ్రీరస్తు

శ్రీ వేంకటేశాయ నమః

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

## ౨౧-వ సంపుటము.

[స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుఁడు ప్రత్యక్షమైతేను, అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిటుదాపకు తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నవము చేసినశృంగార సంకీర్తనలు.]

501-వ రేకు శంకరాభరణం

వరుసలు వెట్టుక వైపుగను
తరచు రతులచేఁ దనుపఁగ రాదా ॥ పల్లవి ॥

వలపుల చెమటల వానలు గురియఁగ
పలుమరుఁ దడిసెను పయ్యెదలు
కొలువులో సిగ్గునఁ గొంకేరింతులు
మలఁకొకరొకరినే మన్నించ రాదా ॥ వరుస ॥

పాయపు మదముల పదనులు దొలుకరి
చాయల కొప్పులు జారినదే
ఆయములు గరఁగి అలసేరింతులు
యీయెడ మునుముగ నెనయఁగ రాదా ॥ వరుస ॥

పగటుల పులకల పదనులు నించఁగ
సొగిసి చన్నులఁ దాసులు నెగడె
జిగిఁ గూడిరిందరు శ్రీవేంకటేశ్వర
తగిలి ఇట్లా దయ దలఁచఁగ రాదా. ॥ వరుస ॥ 1

## ఆహిరి

వట్టి చేఁతలు సేయఁగ వచ్చేదేమి
　చుట్టరికమేపొద్దు చూపుట గాక　　　॥ పల్లవి ॥

పంతమాడ నేఁటికి బలుదొరవు నీతోడ
　యెంతైనా నూరకుండేది యెక్కుడు గాక
　చెంత నొరయ నేఁటికి సిగ్గులెల్ల మెఱయఁగ
　మంతనానఁ దలఁచులే మంచిది గాక　　　॥ వట్టి ॥

నారె నవ్వనేఁటికి ఘనుఁడవు నీతోడ
　మేరలు మీఱకుండులే మెచ్చులు గాక
　ఆరీతిఁ గొసరనేల అలపులు దేరఁగాను
　తారుకాణగా మెచ్చులే తగవు గాక　　　॥ వట్టి ॥

చెనకఁగ నేఁటికి శ్రీవేంకటేశ నీతోడఁ
　జొనిపి రెండుగన్నులఁ జూచుట గాక
　యెనసితి విదే నన్ను నిన్నిటా మన్నించఁగాను
　తనువుఁ దనువు సోఁకి తనియుట గాక.　　　॥ వట్టి ॥ 2

## నాదరామక్రియ

నన్నే అట్టు సేతురు నడుమ మీరు
　కన్నుల నిద్దుర దేరీఁ గంటిరటే చెలులు　　　॥ పల్లవి ॥

చెప్పనా నే నప్పుడే చిత్తిణివాఁ డితఁడని
　చిప్పిల నెందో పొందు సేసి వచ్చెను
　దప్పి దేరీఁ గెమ్మోవి తనువెల్లాఁ జెమటలే
　చొప్పులెల్లను మీరే చూడరమ్మ చెలులు　　　॥ నన్నే ॥

చూపనా నే నపుడే జూటరివాఁ డితఁడని
　దాపుగా మైగురుతులు దాఁచుకొనెను
　యేపొద్దూ నిదేపని యెమ్మెలే నిలువెల్లా
　కోపుల నిన్నిఁ దెలుసుకోరమ్మ చెలులు　　　॥ నన్నే ॥

యెంచనా నేనపుడే యిచ్చకుఁడు యీతఁడని
పొంచి శ్రీవేంకటేశుఁడు పొందెను నన్ను
వంచనలు నేరుచును వలపులే సుద్దులెల్లా
మించె నిన్నిటా మీరు మెచ్చరమ్మ చెలులు. ॥ నన్నే ॥ 3

సాళంగం

మాతోనైతే మారు మలసేవు
ఆతలివారినే అనరాదా నీవు ॥ పల్లవి ॥

చిగురుగుత్తిఁ గొని చేత నేను వేసితేను
మొగమేమి చూచేవు మొక్కలానను
జిగి దేరే నీమేన జీరలు దీసి యెవ్వతో
అగడు సేసినందుకు అనరాదా నీవు ॥ మాతో ॥

కదిసి నే నిమ్మపంట గక్కన నిన్ను వేసితే
పెదవినేల తిట్టేవు పెచ్చు రేఁగి
గదుములు గట్ట చనుఁగవల నూఁది యెవ్వతో
అదిమినందుకు యిట్టె అనరాదా నీవు ॥ మాతో ॥

యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నే నిన్నుఁ గూడితే
సారెనేల పెనఁగేవు సరసానను
వూర సతులెల్ల నిన్ను నొకతొకతే కూడి
ఆరయ నింతేఁచినందుకనరాదా నీవు. ॥ మాతో ॥ 4

* తెలుఁగు కాంబోది

మా పంతము లీడేరె మరి నీ కోరికె చెల్ల
చూపుల నాతనినంటి చూచుకోవమ్మా ॥ పల్లవి ॥

యింతి నీరమణుఁడు నీయెదుటనే వున్నాఁడు
దొంతులుగాఁ జెలులను దూరకువమ్మ
మంతన మిద్దరికి సమ్మతిగానే వొనగూడె
చెంత నీవలసినట్టు సేయవమ్మా ॥ మా పంత ॥

* 'తెలుఁగుఁ గాంబోది' అని కొన్నిచోట్ల వ్రాఁత.

పొలసి నీకాతనికి పొందులెల్లాఁ జేసితిమి
మెలుపున నీ చెలుల మెచ్చవమ్మ
యెలమిఁ జానుపుమీఁద నిట్టే మీరపములాయ
అలమి ఆడేమాటలాడవమ్మా ॥ మా పంత ॥

శ్రీవేంకటేశ్వరుఁడిదె చెలరేఁగి నినుఁ గూడె
మావంటి నీచెలులను మన్నించవమ్మ
ఆవటించి మేడలో మీరాడినవే ఆటలాయ
తావుల రతులనెల్లఁ దనియవమ్మా. ॥ మా పంత ॥ 5

### ముఖారి

మెచ్చితి నీ సుద్దులు మేలువాఁడవౌదువు
యిచ్చకములాడేను యింటికి రావయ్యా ॥ పల్లవి ॥

నయగారిమాటలెల్ల నాతో నీవాడితివి
ప్రియములెల్లాఁ జేకొంటిఁ బెనఁగనైతి
క్రియ గూడె నిన్నిటాను కిందిమీఁది పనులెల్ల
జయమాయ మాయింటికి సరుగ రావయ్యా ॥ మెచ్చి ॥

నమ్మికలెల్లాఁ జేసి నన్నిట్టె మన్నించితివి
సమ్మతించితిని నిన్ను జరయనైతి
యెమ్మెలెల్ల దక్కె నేఁడు యేవంక చూచినాను
నెమ్మది మా యింటికి నిక్కము రావయ్యా ॥ మెచ్చి ॥

కరుణతో బుజ్జగించి కాఁగిలించి కూడితివి
యిరవైతినేమిటాను యెడయనైతి
దొరతనములీడేరె తోడనే శ్రీవేంకటేశ
సిరులాయ మాయింటికి చెలఁగి రావయ్యా ॥ మెచ్చి ॥ 6

502-వ రేకు

### మధ్యమావతి

ఇన్నాళ్ళదాఁకాను యెడమాటలు జరగె
పన్నిన నాభాగ్యము ప్రత్యక్షమాయనే ॥ పల్లవి ॥

పచ్చిదేరే మేనితోడి పాయపువిభునిఁ గంటి
దిచ్చరి పనులన్నియుఁ దేరీ(రె?) నేఁడు
రచ్చలో తగవు దిద్ద రామలందరు నున్నారు
తచ్చివేసినట్టు నాతలఁపు లీడేరెనే ॥ ఇన్నాళ్ళ

వేడుకకాఁడై వచ్చి విభుఁడిదె మాటలాడె
నీడల నేఁ గోరినట్టే నిలిచె నేఁడు
కూడిన బాసలకును గుటి మరుఁడున్నాఁడు
జాడ దప్పకుండాను నిజము లేరుపడెనే ॥ ఇన్నాళ్ళ ॥

తానె శ్రీవేంకటేశుఁడు తగ నన్నుఁ గాఁగిలించె
తానకమై మోహములు దాఁకొనె నేఁడు
వూనిన వొడఁబాటుకు వుంగరమిదె వున్నది
కానుకలై సలిగెలు కైవసములాయనే. ॥ ఇన్నాళ్ళ ॥ 7

## శ్రీరాగం

ఎన్నైనాఁ గలవు పనులెప్పుడూ నీకు
కన్నియమోహ మెఱిఁగి కరుణించవయ్యా ॥ పల్లవి ॥

మాఁటకు మాటాడితేను మాపుదాఁకాఁ బట్టి జోలి
యేఁటికి విచ్చేయవయ్యా యింతికడకు
నీటుతో వాకిటనే నిలుచున్నది య(యె?)ప్పుడు
గాఁటముగ వేగమే సింగారించుకోవయ్యా ॥ ఎన్నై ॥

నవ్వుకు నవ్వు నవ్వితే నాలితనమే నిండు
రవ్వసేయక రావయ్యా రామకడకు
దివ్వెలవెలుఁగున యీదిక్కే మొగమై యున్నది
చివ్వనఁ గైదండగా నాచెయి పట్టుకోవయ్యా ॥ ఎన్నై ॥

అడుగుకడుగిడితే నద్దమరాతిరి పట్టు
జడియక రావయ్యా సతికడకు
అడరి శ్రీవేంకటేశ ఆకె ఇందు వచ్చి కూడె
జడినే నీవు వత్తువు బాసలియ్యవయ్యా. ॥ ఎన్నై ॥ 8

## శంకరాభరణం

ఎవ్వఁ డెఱుఁగును మీయేతులు
మువ్వంక మెఱసె మీమురిపెమయ్యా ॥ పల్లవి ॥

పొలపుల నిన్నాకె చూచీని
నలుగడ నీవేల నవ్వేవు
తెలియవు మాకు మీ తెఱఁగులు
బలిమిని యెట్టయినా బ్రదుకరయ్యా ॥ ఎవ్వ ॥

విరుల నాపె నిన్ను వేసీని
కెరలి బొమ్మల జంకించేవు
సరిఁ గానము మీచందములు
పరిపరి విధముల బ్రదుకరయ్యా ॥ ఎవ్వ ॥

పెనఁగి ఆపె నిన్నుఁ బిలిచీని
యెనసితివి శ్రీవేంకటేశ్వరుఁడా
నను నేలితివిటు నయమునను
పనివడి యిటానే బ్రదుకరయ్యా. ఎవ్వ ॥౪

## భైరవి

మగఁడవన్నిటికోర్చి మన్నించరాదా
మగువలు సేసేవెల్లా మచ్చికలే కావా ॥ పల్లవి ॥

చనవు గలిగినట్టి సతి నిన్నుఁ గొసరితే
విని నవ్వవలెఁ గాక వేగిరింతురా
చెనకి యాపె నిన్నుఁ జేసిన చేఁతలెల్లా
ననుపులింతే కాక నలినెగసక్కేమా ॥ మగఁడ ॥

ఆసపడినయట్టి అంగన నిన్నంటితేను
సేసవెట్టవలెఁ గాక జీరదీతురా
వేసరక ఆపె నిన్ను వేఁడుకొమ్మనినదెల్లా
వాసులకింతేకాక వట్టి పంతమా ॥ మగఁడ ॥

కడు మోహించినయట్టికాంత నిన్నుఁ గూడితేను
వోడఁబడవలెఁ గాక వూరకుందురా
అదరి శ్రీవేంకటేశ ఆపె నిన్నుఁ బొందు చెల్ల
అడియాలాలకుఁ గాక ఆఱడిఁ బెట్టుటకా. ॥ మగఁడ ॥ 10

## కేదారగౌళ

నెలఁత చిత్తము కొద్ది నీవెఱఁగవా
కలయఁగవలెఁ గాక కాఁక సేతురా ॥ పల్లవి ॥

ప్రియములు చెప్పఁగానే బిగిసేవు చెలితోడ
నయగారితనమున నవ్వేవు
క్రియ గూడ నాకె నీకు కెరలి బాఁతి పడఁగ
దయఁ జూడవలెఁ గాక తడవులు సేతురా ॥ నెలఁత ॥

పలుసన్నలు సేయఁగా పరాకయ్యేవింతితోడ
చెలము దొరతనాన సాదించేవు
వలచి నీకు నాపె వంచి చేతుల మొక్కఁగ
నెలకొనవలెఁ గాక నీటు సేతురా ॥ నెలఁత ॥

పొగిఁ గాఁగిలించుకోఁగా వోరసేవతివతోడ
పగటు శ్రీవేంకటేశ పచ్చి సేసేవు
మొగము చూపి ఆపె ముచ్చటలు చెప్పఁగాను
చిగిరింపింతురఁ గాక జీరదీతురా. ॥ నెలఁత ॥ 11

## ఆహిరి

వేగినంతా నీరాకకే వేడుకనెదురుచూచె
చేగలెక్కేనీగుణాలు చెల్లఁబెట్టవలదా ॥ పల్లవి ॥

నీ మాఁట నీకు వచ్చె నిన్ననే బాసిచ్చితివి
రాముతో వచ్చేనని రాసైతివి
కోమల మాపెమనసు కొండవంటివాఁడవు
భూమిలోన నిజములే పోగుసేయవలదా ॥ వేగి ॥

నీకొప్పగించితి మిదె నేఁడే లేకలంపితివి
చేకొని వ్రాసినట్టే సేయవైతివి
వాకుల వాసులదాపె వారిధివంటివాఁడవు
యీకడ నీ ప్రతినలు యీడేరించవలదా ॥ వేగి ॥

యెచ్చరించితిమి నేము యిట్టే నీవు వచ్చితివి
పచ్చిగా మగువఁ గూడి పాయవైతివి
మెచ్చుల చక్కనిదాపె మేఘమువంటివాఁడవు
మచ్చిక శ్రీవేంకటేశ మన్నించవలదా. ॥ వేగి ॥ 12

503-వ రేకు సామంతం

ఔదువే తగవరివన్నిటాను
బోధించరాదా పురుషునిని ॥ పల్లవి ॥

మలసి నీవిభుఁడు మాటలాడఁగా
పలుకఁగరాదా పడఁతులకు
బలిమిఁ జెలఁగతఁడు పట్టి తియ్యఁగా
నిలువఁగరాదా నెలవులను ॥ ఔదు ॥

పాయకతఁడిపుడు పందెము వేయఁగ
చేయొగ్గరాదా చెలులకును
చాయలనప్పటి సరసములాడఁగ
సేయఁగరాదా సేవలు నేను (వలను?) ఔదు ॥

శ్రీవేంకటేశుఁడు చేకొని కూడఁగ
మోవియ్యరాదా ముదితలకు
యీవలననుఁ దానిటు మన్నించఁగ
భావించరాదా పలుమరు రతులు. ॥ ఔదు ॥ 13

శంకరాభరణం

ఇప్పుడే విన్నపించితినిన్నియు నీకు
తప్పులేమిగలిగిన దయఁ జూడుమిఁకను ॥ పల్లవి

పొంతనుండి నిచ్చా నీతో పొందులు సేసేఁగాని
యింతంతని నీ చిత్త మెఱఁగ నేను
మంతనాన నెన్నైన మాయలవాఁడవు నీవు
పంత మెఱఁగను నాభావ మెల్ల నీది ॥ ఇప్పు ॥

అలరి యెప్పుడు నీకు నాలనై వుండుదుఁ గాని
చెలఁగి యేమి సేసేవో తెలియ నేను
నెలకొని యున్నిటాను నీయిచ్చరాజవు నీవు
చల మెఱఁగను నాజవ్వనము నీది ॥ ఇప్పు ॥

సారెకుఁ గాఁగిటఁ గూడి సంతోషించుకొందుఁ గాని
నేరుపు నీ గుణా లెంచ నేరను నేను
చేరువ వరములిచ్చే శ్రీవేంకటేశుఁడవు నే
వీరము లెఱఁగను నాబిరుదెల్ల నీది. ॥ ఇప్పు ॥ 14

## నీలాంబరి

ఏల మమ్ము గరిసించేవెందాఁకాను
జాలువారే చెమటల జడివానే సాక్షి ॥ పల్లవి ॥

అండనున్న సతులను అడుగ నేమిటికి
నిండిన నీ చేఁతలకు నీవే సాక్షి
చండిసేసి నిన్ను నేము సారెఁ జొప్పులెత్తేమా
మెండుకొని వుండిన నీమేని గోరే సాక్షి ॥ ఏల ॥

ఆసలు వెట్టుక యింత అలయఁగ నేమిటికి
వూనిన నీ పొందులకు వురమే సాక్షి
మానాపతులము నీ మర్మములెత్తేమా
తానకపు నిట్టూర్పుల తఱచులే సాక్షి ॥ ఏల ॥

పంతమున మమ్ము నొడఁబరచఁగ నేమిటికి
వింత సుద్దులకు నీవేడుకే సాక్షి
యింత శ్రీవేంకటేశ మమ్మేలితి వేతులెత్తేమా
కాంతి నీమోమునఁ దేరే కళలే సాక్షి. ॥ ఏల ॥ 15

## తెలుఁగు కాంబోది

అట్టే కానీవయ్య అన్నియుఁ జక్కనయ్యీని
గట్టువాయ(యి?)వాఁడవౌత కానవచ్చెను ॥ పల్లవి ॥

కప్పురపుటింటిలో నీకతలు
చెప్పుదుమా నేఁడు నీ చెలితోను
తప్పక తెరలో నీవు దాఁచినాపెను
యిప్పుడాకె గంటే నిన్ను నేమనునో ॥ అట్టే ॥

సింగారపుఁదోఁటలో నీచేఁతలు
రంగుగఁ జూపుదుమా నీ రమణికి
అంగవించి తెచ్చుకొన్న ఆపెపాటలు
సంగతిగా వింటే నెంత జంకించునో ॥ అట్టే ॥

శ్రీవేంకటాద్రిమీఁది చిఱునవ్వులు
భావానఁ దెలుపుదుమా పడఁతికి
ఆవటించీపెఁ గూడితి వప్పటాపెను
కావున మాటాడి యెంత దయసేసునో. ॥ అట్టే ॥ 16

## రీతిగౌళ

ఆయ లేవే నీ యెతులన్నియుఁ గంటిమి నేఁడు
చాయలా సన్నలనే జరపేవు పొద్దులు ॥ పల్లవి ॥

మొనసి చూచేవారి ముందరనెల్ల నీపతి-
చనవులే నెరపేవు సారె సారెను
వినఁగలిగితేఁ జాలు వేసరకెందాఁకనైన
పనిలేని కతలెల్లఁ బచరించేవిపుడు ॥ ఆయ ॥

యిమ్ముల నీవద్దనుంటే యెవ్వరికైనా నీ-
సొమ్ములెల్లాఁ జూపేవు సోద్యాలుగాను
సమ్మతించితేఁ జాలు సవతులనిందరిని
పమ్మిన యీవులఁ గిందుపఱచేవు నీవు ॥ ఆయ ॥

చెలిమి నీతోఁ జేసితే శ్రీవేంకటేశ్వరుని
కలయికకుఁ దెచ్చేవు కమ్మటి మమ్ము
వలెనంటేఁ జాలు నీవారైన వారికెల్ల
నెలవుగ నీమహిమ నెరపేవు మిగుల. ॥ అయ ॥ 17

## సౌరాష్ట్రం

ఏలవయ్య యింతులనెందరికైనా
మేలిమివాఁడవు నీకు మేకులు జాఁతే (తా?) ॥ పల్లవి ॥

వేసాలవాఁడవు వేగిరకాఁడవు
వాసులసతులు వలవక మానేరా
వేసరక సేసేవు వినయాలెవ్వరికైనా
ఆసోదకాఁడవు నీకు నాండ్లుఁ జాతా ॥ ఏల ॥

యిచ్చకము నేరుతువు యిన్నిటాఁ బరగితివి
అచ్చపుకాంతలు బ్రమయక మానేరా
పచ్చిదేర నిచ్చేవు బాసలెవ్వరికైన
దిచ్చరివాఁడవు నీకు దేవుళ్ళు జాఁతా ॥ ఏల ॥

చేరి వరాలిత్తువు శ్రీవేంకటేశుఁడవు
గారవపు నేము మరుగక మానేమా
సారెకు నీవొసగేవు చనవులెవ్వరికైనా
బీరపువాఁడవు నీవు(కు?) పెండ్లికూఁతులు జాఁతా. ॥ ఏల ॥ 18

504-వ రేకు *కాంబోది

ఈయఁగదవే వీడెమిప్పుడే నీవిభునికి
మీయిచ్చలే గుటిగాక మేమెల్లా గుటె (జా?) ॥ పల్లవి ॥

*రేకుల వ్రాఁత ప్రకారము 'కాఁబోది' అనవలసియున్నది. కాని వాడుకలో సర్వత్ర కాంబోది - కాంభోజి అనియే రూపము. కనుక ఈ మార్పు.

మొదలనాపెకు నీకు మోహమే గుఱిగాక
మదమునఁ జిమ్మి రేఁగే మంకులు గుఱా
పొదిగొన్న లోలోని భోగములే గుఱిగాక
పెదవులమీఁదటి బీరాలు గుఱా ॥ ఈయ ॥

ననుపున మీలోని నవ్వులే గుఱిగాక
వొనరఁ బెట్టుకొనిన వొట్లు గుఱా
కనుచూపులఁ జూచిన కాంతులే గుఱిగాక
కినిసిన బొమ్మల జంకెనలు గుఱా ॥ ఈయ ॥

కూడిన కాఁగిటిలోని కూటములే గుఱుగాక
పాడితోడ నొండొరుల పంతాలు గుఱా
యీడై శ్రీవేంకటేశుకిటు నీవే గుఱిగాక
వోడక మేనిపై రేకలుంటేనే గుఱా. ॥ ఈయ ॥ 19

## శుద్ధదేశి

ఇచ్చకురాలను నేను యిన్నిటాఁ దనపట్టుకు
వచ్చి వచ్చి తనతోను వాదించేవారెవ్వరే ॥ పల్లవి ॥

మొదల సిగ్గు విడిచి మోహించినవారికి
యెదుట నెవ్వరున్నా నేమాయనే
పొదిగి యాపెకుఁ దాను పూవులు ముడిచీ నిట్టే
వదలక వొద్దనేటివారెవ్వరే ॥ ఇచ్చ ॥

వెరవుతోడుత రతివేడుకనున్నవారికి
యెరవును మొఱఁగును యేడదే మరి
అరుదుగనాపెకు నాకు మడిచిచ్చీఁ దాను
వరుస నిందుకు నవ్వేవారెవ్వరే ॥ ఇచ్చ ॥

చింతలన్నియు విడిచి సేసవెట్టేవారికి
యింతులలో నొఁగాములు యిఁక నేడవే
చెంతనుండి తానే కూడె శ్రీవేంకటేశుఁడు నన్ను
వంతుకుందుకడిగేటివారెవ్వరే. ॥ ఇచ్చ ॥ 20

## ఆహిరి

నీ విచ్చిన బాసలు నిలిపి మన్నించవయ్యా
కైవసమైనవారిఁ గరుణించరాదా ॥ పల్లవి ॥

వేసాల మాటలను వేగినంతాఁ గత చెప్పి
ఆసలఁ బెట్టితివట అవునయ్యా
బేసబెల్లితనమునఁ బిలిపించి యిందరిలో
నేసవెట్టి వచ్చిసేసి సిగ్గులువరతురా ॥ నీవి ॥

కూరిమి నవ్వులు నవ్వి కొత్తయిన చేఁతలు చేసి
ఆరితేరి జంకింతురా అవునయ్యా
గారవించి పైఁ జేయిడి కరఁగించి కొలువులో
జీరదీసి చొక్కించి సిగ్గులువరతురా ॥ నీవి ॥

చాయల సన్నలు చూపి సరసములే యాడి
ఆయితములే సేసితి వవునయ్యా
చేయిచ్చి కాఁగిటఁ గూడి శ్రీవేంకటేశ యింటిలో
సేయరానిసేవ గొని సిగ్గులువరతురా. ॥ నీవి ॥ 21

## ఆరిభి

చెలియా నాకు నీవు సేసేవుపకారమిది
వెలలేని గుణముల వేడుక కాఁడితఁడు ॥ పల్లవి ॥

వచ్చినదాఁకా నీవు వద్దనే కాచుకుండు
మెచ్చినదాఁకాఁ గొలువు మిగులాను
ఇచ్చగించినందాఁక నింపుగ సేవలు సేయు
అచ్చపుఁ బొందులు సేయుమాతనికి నాకును ॥ చెలి ॥

సమ్మతించినందాఁక సారె విన్నపాలు సేయు
నెమ్మది బత్తైనదాఁకా నేర్పులు చూపు
కొమ్మని ఇచ్చినదాఁకా గుట్టునఁ జేయెత్తి మొక్కు
యిమ్ములఁ బొందులు సేయుమిద్దరికి నీవు ॥ చెలి ॥

నవ్వినదాఁకా నీవు ననుపులెల్లాఁ జేయు-
మివ్వలిమోమైనదాఁకా నింపులు చల్లు
రవ్వగా శ్రీవేంకటరాయఁడిదే నన్నుఁ గూడె
మవ్వపుఁబొందులు సేయు మాకు నీవెప్పుడును. ॥ చెలి ॥ 22

సాళంగం

మగనితో మమ్ముఁ గొంత మాటలాడనీఁగదవే
నిగిడి పూసుక రానేర్తువు గదే ॥ పల్లవి ॥

అతని నేరములెల్ల నడఁచి చవులుసేసి
గతులు చెప్పఁగ నీవు గలవు గదే
సతమై మావంటివారు సారెసారెఁ గొసరఁగ
పతి మాఁటలాడ నీపాలు గదే ॥ మగని ॥

ఇక్కువఁ జేసిన చేఁతకెల్ల పంతమిప్పించి
గక్కన వంకలు దిద్దఁగలవు గదే
వొక్కరొక్కరే వచ్చి వొడివట్టి పెనఁగఁగ
చక్కటులు దిద్దేది నీజాడ గదే ॥ మగని ॥

విరులను వేసి వేసి విన్నపాలు సేసి సేసి
కరుణింపించఁగ నీవు గలవు గదే
అరుదై శ్రీవేంకటేశుఁడాతఁడే మమ్మిపుడేలె
నిరతపు పొందొనర్చ నీవిద్య గదే ॥ మగని ॥ 23

ఆహిరి

దొరపాటివాఁడతఁడు దొమ్మిసేతుగా
తరుణులాల మీరు తరవువెట్టుదురా ॥ పల్లవి ॥

నామీఁది బత్తి గలిగితే నన్ను మన్నించీఁగాని
దోమటినాతని మీరు దూరకురే
ప్రేమములే నిజమైతే పిలువక వచ్చీఁగాని
కోమలులార మీరు కొంగు పట్టనేఁటికే ॥ దొర ॥

జాసలు నిజమయితేఁ జైకొని కూడీఁగాని
వేసరఁ బతిపైఁ దప్పు వేయకురే
ఆస పుట్టినపుడు తానండఁ బవ్వళించీఁగాని
రాసికెక్క నిందరిలో రవ్వ సేతురటవే ॥ దొర ॥

కరుణ పుట్టినపుడు కలసి నవ్వీఁగాని
సరుస శ్రీవేంకటేశు జరయకురే
యిరవుగ నన్ను నేలె యిట్టే వుండీఁగాని
నెరసి మీరు తొల్లిటి నేరములెంచకురే. ॥ దొర ॥ 24

505-వ రేకు దేసాళం

ఇంకనేల వట్టి సిగ్గులిందరిలోన
పొంకపు రతులే కాక బూటకము వలెనా ॥ పల్లవి ॥

పడఁతి నీవును నొక్కపానుపుపైఁ బవ్వళించి
యెడమాటలాడించ నిఁకనేల
వడియుఁజెమటలతో వలపులు రేఁగఁగాను
అడపక తెలతోడి ఆలోచన వలెనా ॥ ఇంక ॥

భామయు నీవును నొక్కపచ్చడములో నుండి
ఆముకొని చేకానుకలంపనేల
ఆమని పులకలలో నాసలు పెనగొనఁగ
దోమటిని పద్దివారితో నవ్వవలెనా ॥ ఇంక ॥

కలికి నీవును నొక్కకాఁగిటనే వుండఁగాను
పలుమారు కొత్తవాడఁజాటులేల
కలసితిరిదే శ్రీవేంకటేశ కళలు మించ
అలరి యందరిచేతి అప్పణలు వలెనా. ॥ ఇంక ॥ 25

సింధురామక్రియ

తానెప్పుడు మాకు లోనే తగవై తేను
అనుకొని తానెంత అందాలు చూపీని ॥ పల్లవి ॥

చెలులందరును నీకు సేవలు సేయఁగాను
చలముల నాపె నిన్ను జంకించీని
కలకాలము మేము కాఁపిరేలు సేయఁగాను
వెలినుండి తానేల వేడుక చూపీని ॥ తానె ॥

తరుణులిందరు వసంతము నీతోనాడఁగాను
సరుగన నాపె నిన్ను సన్న చేసీని
అరుదుగ నేమిట్టే యాండ్లమై యుండఁగాను
పొరుగున తానేమి పొందులు చూపీని ॥ తానె ॥

కాంతలిందరును నీతో కలసిమెలఁగుండఁగా
చెంతఁ దానేల నవ్వీని శ్రీవేంకటేశ
సంతతము మేము నీసరి కాఁగిటఁ గూడఁగా
బంతినుండి తానెట్టు బాగాలిచ్చీని. ॥ తానె ॥ 26

### శంకరాభరణం

వేగిరించేవిదే నీకు వెంగెమాయనా
చేగదేర వలపులు చెప్పవలెనా ॥ పల్లవి ॥

మొక్కితేనే చాలదా మోనమునఁ జెలి నీకు
అక్కజముగా మాటలాడవలెనా
తొక్కితేనే చాలదా తొడరి నీపాదము
పెక్కుమారులిట్టే సేసవెట్టవలెనా ॥ వేగి ॥

నవ్వితేనే చాలదా నాతి నీయెదుటనుండి
చివ్వన నప్పటి సేవసేయవలెనా
పవ్వళించెఁ జాలదా పక్కన నీతొడమీఁద
పువ్విళ్లూరఁ గుచముల నొత్తవలెనా ॥ వేగి ॥

కూడితేనే చాలదా కొమ్మ కాఁగిట నేఁడు
మేడెపురతుల నిన్ను మెచ్చవలెనా
వేడుకతో నీవును శ్రీవేంకటేశ యేలితివి
వీడెమిచ్చే నింత వెల్లవిరి వలెనా. ॥ వేగి ॥ 27

## దేవగాంధారి

తరుణివి నీకింత తగవుగాదు
గరిమల నింతటఁ గాఁగిలించఁగదవే ॥ పల్లవి ॥

పలుకఁగదవే నీపతితోను
చలములేమిటికే సారెకును
పిలువఁగానే యేల బిగిసేవే
మొలకచన్నులనాఁడే మోహించె నతఁడు ॥ తరుణి ॥

వెస మోవి యియ్యవే విభునికి
కొసరులింకానేల కూడపెట్టేవే
వసమై యుండఁగనేల వనరేవే నీకు
పొసఁగి కన్నెనాఁడే పొందాయ నతఁడు ॥ తరుణి ॥

కనుఁగొనవే శ్రీవేంకటేశ్వరుని
మనసేమి చూచేవే మాఁటిమాఁటికి
వొనరికూడె నింకేల వా(వో?)ల వేసేవే నినుఁ
బెనఁగి చిన్ననాఁడే పెండ్లాడె నతఁడు. ॥ తరుణి ॥ 28

## తెలుఁగుఁ గాంబోది

ఇంక నీచిత్తంబెట్టయిన రక్షించు
లంకెలమాటల లాలించితివి ॥ పల్లవి ॥

వుంకువిచ్చి నను వొడఁబఱపించిటు
అంకెలఁ బెండ్లి ఆడితివి
సంకెదేరఁ గడు సరసములాడుచు
కంకణములు మరి కట్టితివి ॥ ఇంక ॥

ననుపుసేసుకొని నవ్వులు నవ్వుచు
చనవున సేసలు చల్లితివి
వనితలలోపల వాసితోడనే
పెనఁగుచు బువ్వానఁ బెట్టుకొంటివి ॥ ఇంక ॥

కలసిమెలసి నను కాఁగిట నింపుచు
తొలుతనె పాదము దొక్కితివి
యేమిని శ్రీవేంకటేశుఁడ నన్నేలి
మలసి రతులఁ గడు మన్నించితివి ॥ ఇంక ॥ 29

## శంకరాభరణం

కొంత గుండెవట్టుకొని కోరికెతో నుండుఁ గాని
చెంతనుండి వొకమాఁటు చేచాఁచరాదా ॥ పల్లవి ॥

ఆసతో నప్పటనుండి అతివ గొలువుసేసె
రాసికెక్క నింటికి రమ్మనరాదా
మోసులుగఁ జేయెత్తి మొక్కెనప్పటనుండి
సేసవెట్టేనని మాఁట చెప్పఁగరాదా ॥ కొంత ॥

బత్తితో నీమేను ముట్టి పడఁతి సింగారించి
సత్తుగా మోముచూచి మెచ్చఁగరాదా
కొత్తలైన నీపొందులుగోరి సరసములాడె
పొత్తుల బువ్వములిచ్చి పొదుగఁగరాదా ॥ కొంత ॥

వేడుకతో మోవితేనె విందులు సారెకుఁ బెట్టె
కూడి యుట్టె కాఁగిలించుకొనరాదా
యీడనే శ్రీవేంకటేశ యెనసి నిన్నుఁ బెండ్లాడె
వోడక సమరతులనూరడించరాదా. ॥ కొంత ॥ 30

506-వ రేకు

## ఆహిరి

ఏఁటికిఁ దలవంచేవు యెందాఁకను
కాటుకకన్నులను గక్కునను జూడవే ॥ పల్లవి ॥

మొయిలువంటిపయసు ముడియగట్టఁగరాదు
నయముగ బుద్ధిచెప్ప నావసమా
జయము వందిలిపెట్టి పంతములేలాడేవు
ప్రియగూడ పతితోన కెలయుచు నగవే ॥ ఏఁటి ॥

వెన్నెలవంటి వేడుక వెస గాదెఁ బోయరాదు
ఇన్నిటా జాణవు నీవే యెఱఁగవచే
చన్నుల మెఱుఁగుచూపి చవులేల కొలిపేవు
యెన్నికకెక్క నితని ఇంపులు చేకొనవే ॥ పఁటి ॥

కొండవంటిది వయసు గుదిగొని తోయరాదు
గండుమీటి యేలవొద్దు గడపేవే
అండనే శ్రీవెంకటేశుఁడాయాలంటి నిన్నుఁగూడె
నిండు యీతనివోజకు నీవు మెచ్చఁగదవే. ॥ పఁటి ॥ 31

## * ధవళి

ఈ తగవులడుగుమా యెవ్వరినైనా నీవు
చేతికి లోనై ఇంతిఁ జేకొనరాదా ॥ పల్లవి ॥

ఆకెమోము నీవుచూచి అట్టే వూరకుండితేను
రేకలుగ వలపులు రేఁగకుండునా
చేకొని యంగన నింత చేసినవాఁడవు నేఁడు
దాకొని పెండ్లాడుటకు తగులు గాదా ॥ ఈత ॥

వొంటినొకమాటు నవ్వి వొద్దికఁ బరాకైతే
అంటుకొని చుట్టరికమందకుండునా
వొంటెనంటా వెలఁదిపై నొల(నో) వేసినవాఁడవు
జంటై వావులకు నిదే సంచకరువు గాదా ॥ ఈత ॥

కందువఁ గాఁగిటఁ గూడి కడుసిగ్గులు వడితే
అందలి జీరలు మెఱయక వుండునా
పొంది శ్రీవేంకటేశ యీ పొలిఁతిపాలివాఁడవు
ఇందుఁ గట్టిన కంకణమిదియే కాదా. ॥ ఈత ॥ 32

---

* 'ధవళి' యను రూపముగూడ దీనిదే కాఁదగును.

### మధ్యమావతి

ఇద్దరితమకము నిటువలెనే
పొద్దున నేమని బొంకుదమయ్యా ॥ పల్లవి ॥

లలి నాకధరము లంచమియ్యఁగా
పలు సోఁకులయి పరగెనవే
పిలువఁగఁగాఁగా బెరసి నిందవడె
పొలఁతికి నేమని బొంకుదమయ్యా ॥ ఇద్ద ॥

అడుగుకొనుచు నిన్నంటి పెనఁగఁగా
తడయక నఖములు తాఁకె నవే
తొడుకొనిరాఁగా దూలు మీఁదఁబడె
పొడవుగ నేమని బొంకుదమయ్యా ॥ ఇద్ద ॥

పెక్కులు చెవిలోఁ బ్రియములు చెప్పఁగ
ముక్కున జవ్వాది మోచె నిదే
యిక్కడ శ్రీవేంకటేశుఁడ నడివడె
పుక్కటి నేమని బొంకుదమయ్యా. ॥ ఇద్ద ॥ 39

### * హిందోళం

నీవేల సిగ్గుపడేవు నెట్టనఁ దలవంచుక
భావించి భావించి నిన్నుఁ బైకొని మెచ్చీని ॥ పల్లవి ॥

వాడలు దిరిగి నీవు వచ్చిన రాక చూచి
వేడుకలు వెదచల్లీ వెలఁది
జాడలతో నీ మోము చంద్రకళలు చూచి
పీడెపు నోటనే వేమారుఁ బొగడీని ॥ నీవేల ॥

---

* ఈ సంకీర్తనమే 509వ రేకున 'పాడి' రాగముతో పునరుక్తము.

పుదుటుఁ దమకమున పుండే నీవునికి చూచి
కదిసి నవ్వులు నవ్వీఁ గలికి
పొదిగిన నీ శిరసు పువ్వుల దండలు చూచి
యెదుట నిలుచుండి చేయెత్తి మొక్కీని ॥ నీవేల ॥

గక్కున వస్తా వచ్చి కాఁగిటఁ గూడఁగాఁ జూచి
చెక్కులు నొక్కీ నిన్నుఁ జెలియ
నిక్కి శ్రీవేంకటేశుఁడ నీ మన్ననలెల్లాఁ జూచి
పక్కన నీమీఁదటి పదాలు వాడీని ॥ నీవేల ॥ 84

## మాళవి గౌళ

వింటివా వోయి నీ వీనులు చల్లఁగాను
నంటున మోములు చూచి నవ్వులు నవ్వేరు ॥ పల్లవి ॥

మచ్చికతో నీవు నన్ను మన్నించినసుద్దులెల్ల
అచ్చపు సవతులెల్ల నాడుకొనేరు
పచ్చిగా నీవు నాతోఁ బలికినపలుకులు
రచ్చల నందరిలోన రాఁపు సేసేరు ॥ వింటి ॥

గోరికొన నంటి నీవు కొసరి వేఁడుకొనఁగ
చేరి తమలో సన్నలు సేసుకొనేరు
సారెకు నీవు నాతో సరసములాడినవి
కోరి వెల్లావిరులుగా గురులు సేసేరు ॥ వింటి ॥

కందువ నీవు నన్నుఁ గాఁగిటఁ గూడినట్టి
పొందులు యెలుఁగులెత్తి పొగడేరు
అందరి శ్రీవేంకటేశ అంకెల నీవేలినది
విందుల వేడుకలతో వెలయించేరు. * ॥ వింటి ॥ 35

* ఈ సంకీర్తనమే నాగవరాళి రాగముతో 509 వ రేకులో గలదు.

LIBRARY TIRUPATI 42830

నాదరామక్రియ

కొంతవడి వుండవయ్యా కోరినట్టు అయ్యీఁగాని
కాంతుఁడవు ఇంత పెనఁగకువయ్యా యిపుడు ॥ పల్లవి ॥

కావించి పొగడేవు చక్కనిదాననంటాను
నీవాడేమాఁటలకు నేనా గురి
చేవదేరి యిందుకుఁగా సిగ్గువడి వున్నదాన
కావరించి నన్నుఁ జెనకకువయ్యా యిపుడు ॥ కొంత ॥

చేరి నాగుణానకు మెచ్చితినంటాఁ జేకొనేవు
నేరుపు నీకతలకు నేనా గురి
సారెకు నిందుకుఁగా వంచనతో నేనున్నదాన
ఆరీతిఁ గొంగువట్టి తియ్యకువయ్యా ఇపుడు ॥ కొంత ॥

అప్పటి నీదేవుల నే నంటాఁ గాఁగిలించేవు
చెప్పిన నీమన్ననకు నేనా గురి
యిప్పుడే శ్రీవేంకటేశ యిందుఁ జొక్కి వుందాన
దప్పిదేరి నీగోర నూఁదకువయ్యా యిపుడు ॥ కొంత ॥ 36

50-వ రేకు రామక్రియ

పాయపు మదమో యిది పట్టినట్టి చలమో
యీయెడ నింతటనైనా యెచ్చరవయ్యా ॥ పల్లవి ॥

మాటలాడ దొరకొంటే మరేమిటా ముగియదు
యీటుతో నింతికి వీడెమియ్యవయ్యా
పాటించి గోర నొత్తినా పరాకున నెరఁగవు
చోటుల్లా నిండె బుజము చూచుకోవయ్యా ॥ పాయ ॥

కేరి నవ్వఁజొచ్చితేను కిందుమీఁదు నెరఁగవు
బోరున గందమీపెకుఁ బూయవయ్యా
సారెఁ బువ్వుల వేసినా జవ్వనమదాన లోఁగ-
వీ రీతిని మేన దిష్టమెరుఁగుకో వయ్యా ॥ పాయ ॥

తప్పక చూడఁబోతే నెప్పుడూ రెప్ప మూయవు
చిప్పిలీఁ బెఁ గూడితివి శ్రీవేంకటేశ
కొప్పు వట్టినాఁ జూడవు కూడినపరవశాన
తెప్పలాయ సంతోసాలు తెలుసుకోవయ్యా ॥ పాయ ॥ 37

## శ్రీరాగం

చూతువు రావయ్యా సుదతిలాగు
చేతిమీఁదిచెక్కుతోడ సిగ్గుపడి వున్నది ॥ పల్లవి ॥
చెప్పరానిమాటలు చెలి విన్నవించరాక
వుప్పతిల్లువలపుల నూరకున్నది
ఇప్పుడు నీవే విచ్చేసి యేకతాన నన్నీ విను
దప్పిదేరే మోముతోడ తలవంచుకున్నది ॥ చూతు ॥
భావములో కోరికలు బయలుసేయఁగ రాక
సోవలచెమటతోడ ఉబ్బిలున్నది
వోవరిలోనికి వచ్చి వారసి నీవే యడుగు
కావిరి నివ్వెరఁగులఁ గమ్ముకొని వున్నది ॥ చూతు ॥
రతిలో రహస్యములు రవ్వలుసేయఁగ రాక
అతితమకముతోడ నలుకున్నది
తతి శ్రీవేంకటేశుఁడ దండనుండి కూడితివి
మతి నీవే యాసపడి మంచముపై నున్నది ॥ చూతు ॥ 38

## మంగళ కౌశిక.

ఇద్దరి సరితలు యిందరూఁ జూచేరు
ముద్దులమోముకు మొక్కేము నేము ॥ పల్లవి ॥
సళుపులమాటలు సతి నిన్నాడఁగ
కలకల నవ్వేవు కాంతుఁడవు
వెలుచుఁ దమకమునఁ బెనగఁగఁ బెనగఁగ
...లముసఁ జే...లు ...చేవు నీవు ॥ ఇద్ద ॥

మగుడి యాపె బొమ్మల జంకించఁగ
సొగయుచు మొగమే చూచేవు
బిగియుచు నందుకు పెదవుల గొణఁగఁగ
వెగటు లేక యిటు వేడుకొనేవు ॥ ఇద్ద ॥

పంతముతోఁ జెలి పవళించఁగా
ఇంతినిఁ గాఁగిట నెనసేవు
కొంత గొసరఁగాఁ గూడితివిదెవో
యింతటి శ్రీవేంకటేశుఁడవు ॥ ఇద్ద ॥ 39

## మేఁచబౌళి

చలిమీ బలిమీఁ గద్దు సలిగేఁ గద్దు
వలపుచవులుగొన్న వనితను నేను ॥ పల్లవి ॥

వేసరించనోపము వేమారు నిన్నును
వాసితోడనుండేము వాకిలి గాచి
నేసవెట్టితివి నాఁడే చేతులెత్తి నామీఁద
దోసిటిపాల పెండ్లికూఁతురను నేను ॥ చలిమి ॥

సారె దూరనోపము సాటికి బేటికి నిన్ను
బీరమున నుండేము నీపీఁటవద్దను
జార చాఁచితివి నాఁడే పక్కన నాకాఁగిటికి
కూరిమిఁ గాలుదొక్కిన కొమ్మను నేను ॥ చలిమి ॥

కక్కసించనోపము కడు శ్రీవేంకటేశ్వర
యిక్కువఁ గూడుండేము నీ ఇంటిలోనను
దిక్కై యేలితివి నాఁడే తిరమైన రతులను
వొక్కటైన పట్టపుదేవులను నేను ॥ చలిమి ॥ 40

## సాళంగనాట.

**తూఁటిపాటి** తెలియకే దొడ్డమేలు రాఁగా రాఁగా
  **ఆఁటదీ**బెట్టను నేను అంకెకత్తెఁ గాని ॥ పల్లవి ॥

చలము సాదించఁగాను సమ్మతించఁ జెప్పేనంటే
  పలుకులు చవిగావు పతితోడను
  అలిగినదాననై ఆడక వుండుట లేదు
  వొలిసి నే గుట్టుసేసుకుందానఁ గాని ॥ **తూఁటి** ॥

పోరచి పంతమాడఁగఁ బొందులు సేసేనంటే
  ఆరయ నవ్వులు చవుకలాతనితోను
  బీరపుదాననై బిగుసుకుండుట లేదు
  వూరటగా గుట్టుసేసుకుందానఁ గాని ॥ **తూఁటి** ॥

సందడిఁ గూడగాఁను సరసములాడేనంటే
  విందులనే నోరూరు శ్రీవేంకటేశుతో
  ముందెమేఁపుదాననై మఱచి వుండుట లేదు
  వొందిలి గుట్టుసేసుక వుందానఁ గాని ॥ **తూఁటి** ॥ 41

## ఆహిరి

మన్నించవయ్యా యీ మగువను నేఁ డట్టే
  సన్నల చాయల నిన్ను సాదించే(చీ?)నా పల్లవి ॥

అడ్డము చెప్పఁగరాదు అవుఁగాదనరాదు నిన్ను
  వొడ్డారపు మాటలకు నోపునా యీకె
  యెడ్డఁడవు గావు చూడ యిన్నిటాను జాణఁడవు
  దొడ్డివారివలె నిన్ను దూఱఁగలదా మన్ని ॥

కోపగించరాదు నీతో గుంపించి అలుగరాదు
  తాపపు విరహానకు తగునా యీకె
  తోపుమూకుడు సేయవు దొరవు ఇన్నిటా నీవు
  చాపలపువారివలె జరయఁగఁ గలదా ॥ మన్ని

కక్కసించరాదు నిన్ను కరకరిఁ బెట్టరాదు
నెక్కొన్న నీతో చలము నేర్చునా యీకె
చెక్కు నొక్కి కూడితివి శ్రీవేంకటేశ్వరుఁడవు
తక్కినవారివలెఁ బంతములాడఁ గలదా ॥ మన్ని ॥ 42

508 వ రేకు సామంతం

ముందెఱఁగక కడు మురిపెము చూపేవు
సందడిఁ బెనఁగిన సమ్మతి యౌనా ॥ పల్లవి ॥

వదలక పతిపై వలపులు చల్లుచు
యెదుటనె నవ్వే విది యేమే
పదరి యతఁడు నిను బలిమి సేసితే
నుదుటున నందుకు నోపఁగఁగలవా ॥ ముందె ॥

వోడక తనికే వుదుటులు చూపుచు
వేడుకఁ బువ్వుల వేసేవు
కూడేనని తాఁ గుచములంటితే
యీడనె నీకది యితవయ్యీనా ॥ ముందె ॥

యిరవుగ శ్రీవేంకటేశుఁ గలయుచును
సరసములాడేవు సరుగనను
గొరబుగా నతఁడు గోర నూఁదితే
వొరటు లేక నీవోరువఁ గలవా ॥ ముందె ॥ 43

ముఖారి

ఎంత నేరుచుకొన్నాఁడే యీతఁడు
సంతోసాలు రేఁచి మోవి చవిగొనీనితఁడు ॥ పల్లవి ॥

కందువ నేనుండఁగానే కాఁగిలించుకొనీ ముం[illegible]
[illegible]ందరిఁ [illegible]ొంది వచ్చెనో యీతఁడు
[illegible] [illegible]వారివన్నెలవా[illegible]
[illegible]బాలుగా నాకుఁ [illegible] (?) [illegible]

పవ్వళించి వుండఁగాను పచ్చడము గప్పిఁ దొల్లి
యెవ్వరికిఁ గప్పినాఁడో యీతఁడు
నివ్వటిల్లీ జవ్వనుల నిండు మేని పసపులు
నవ్వీ నేనడిగితే నయముగా నితఁడు ॥ ఎంత ॥

పానుపుపై నుండఁగాను పసలుగా నన్నుఁ గూడె
యేనెలఁతల నేలెనో యీతఁడు
మేన నిండె గురుతులు మించి శ్రీవేంకటేశుఁడు
పీనులొగ్గి నడిగితే వేమారుఁ దా నితఁడు ॥ ఎంత ॥ 44

## పాడి

ఇరవాయ నుండవయ్యా యేమి చెప్పేను
సరుసఁ గూచున్నదెల్ల చనవే కాదా ॥ పల్లవి ॥

తగులు తెలిసితిమి తమణికి నీకును
మొగము చూచుటెల్లా మోహమే కాదా
యెగసక్యాలకు నీవు యేమిటికి దాఁచేవు
నగినదెల్లా మీమీ నంటులే కావా ॥ ఇర ॥

కాయకపు మీగుట్లు కానవచ్చె నాకిట్టే
ఆయములంటినవెల్లా నాసలే కావా
చాయల మిమ్మింత యేల సారె నొడఁబరచేవు
పాయక మాటలాడేది పైకోనుటే కాదా ॥ ఇర ॥

మెరవులు లేక మీరిద్దరొక్క పచ్చడము
పారిఁ గప్పుకొనుటే పొందులు గావా
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
సరసములాడుటలే చనవులుగావా ॥ ఇర ॥ 45

## మంగళ కౌశిక

పొగడించుకొందువు బూమినిందరిచేతాను
మిగులాఁ బొరుగువారి మెప్పించరాదా ॥ పల్లవి ॥
కప్పురమే చల్లిని కన్నులనే మొక్కిని
చెప్పరానిసేవలెల్లఁ జేసీఁ జెలి
యెప్పుడు మన్నించేవు యేది నీ జాణతనము
ముప్పిరిఁ జూచేవారిని మెప్పించరాదా ॥ పొగ ॥
మాటలఁ బ్రియాలు చెప్పి మచ్చికలఁ గొసరిని
నాటుకొన సారె సారె నవ్వీఁ జెలి
కూటమెప్పు డొసగేవు గుణమెన్నఁడు చూపేవు
మేటి నీదేవుళ్ళను మెప్పించరాదా ॥ పొగ ॥
చన్నుగుత్తులఁ బూజించీ చవిచూపీ మోవితేనె
వున్నతి శ్రీవేంకటేశ వొరసీఁ జెలి
వన్నె యెప్పుడు సేసేవు వలచినగుఱుతేదీ
మిన్న కేలితివాకెనే మెప్పించరాదా ॥ పొగ ॥ 46

## సామవరాళి

అడుగరే రమణుఁడు అండనిదే వున్నవాఁడు
తడపెఁ జెమట మేను తగునటవే ॥ పల్లవి ॥
యేకతము చెప్పేనంటా నేఁటేఁటివో పలికీని
కాకుసేతురటవే కాంతలను
యీకడఁ దా మేటిదొర యిల్లాలను నేనైతి
దాకొని యిటువంటివి తగునటవే ॥ అడుగ ॥
పాదాలొత్తించుకొంటానే పచ్చిమానాలు దాఁకించీ
సోదింతురటే సిగ్గులు సుదతులను
పాదుగా ఘనుఁడు దాను పట్టపురాణి నే నైతి
దాదాత నింత సేయఁ దగునటవే ॥ అడుగ ॥

డాసి కైదండ వట్టేనంటా గోరఁ జెనకీని
రాసి నవ్వింపింతురచే రమణులను
లాసీ శ్రీవేంకటేశుఁడు సేసతోఁ గూడితి నేను
తా సుద్దులు చెప్ప నీకఁ దగునటవే ॥ అదుగ ॥ 47

పళవంజరం

ఎదురు గుదురుగాను యేల నవ్వీనే
యెదుగా తడవునుండి యేల నవ్వీనే ॥ పల్లవి ॥

వరుసలు వంతులును వనితలమాడుకోఁగా
యిరవైన విభుఁడు తానేల నవ్వీనే
తరమిడి నిద్దరము తన్నుఁ దగవడిగితే
యెరవులు సేసుకొని యేల నవ్వీనే ॥ ఎదురు ॥

వొక్కరొక్కరము సొమ్ములొనర సిరిచూడఁగ
యిక్కువైన రమణుఁడు యేల నవ్వీనే
చక్కఁగా మాలోనేమమ్ము సంతము సెయిమంటాను
యిక్కడా మామోము చూచి యేల నవ్వీనే ॥ ఎదురు ॥

మోవిమీఁదిగుఱుతులు మూసుకొనేమమ్ముఁ జూచి
యీవేళ శ్రీవేంకటేశుఁడేల నవ్వీనే
భావించి మమ్మేలితివి పాడి దిద్దుమంటేను
యేవెలఁదులతోనైన నేల నవ్వీనే ॥ ఎదురు ॥ 48

509-వ రేకు కురంజి

దండనున్న చెలులమిందరము సాఁడి
నిండుదొర యీతనికి నేరమేమీ లేదు ॥ పల్లవి ॥

వట్టి చలములు మాని వాకిలి దెరవరాదా
యిట్టె విభుడుఁ వచ్చి యీడనున్నాఁడు
వొట్టినట్టు కొలువై వుండినదొక్కటేకాని
నెట్టన నితనిపల్ల నేరమేమీ లేదు ॥ దండ ॥

దిచ్చరి కోపము మాని తెర దియ్యరాదా
చొచ్చి వచ్చి రమణుఁడు చూచీ నిదే
అచ్చముగ సరసములాడినదొక్కటే కాని
నిచ్చలు నితనివల్ల నేరమేమీ లేదు ॥ దండ ॥

పంతపు వేసాలు మాని పయ్యెదెడలించరాదా
చెంత శ్రీవేంకటేశుఁడు చేయి చాఁచీని
యింతలోన నిన్నుఁ గూడె నిది యొక్కటే గాని
నింతము సేసలితనినేరమేమీ లేదు ॥ దండ ॥ 49

## సాళంగనాట

బాపు బాపు మేలు వోఅపరివోదువు
చాపలాన నీవే కదు జాణవు గావోయీ ॥ పల్లవి ॥

నేగమికె చూడఁగానే మొనసి వేరొకతెతో
నగవులు నవ్వేవు నాలికాఁడవు
తగులఁగానే మరి తరితీపు వుట్టించేవు
జగములోపల నీవే జాణవు గావోయీ ॥ బాపు ॥

మాటలికె ఆడఁగానే మగిడి పొరుగాకెను
నీటుతోడఁ బిలిచేవు నేరుపరివి
గాటాన వలచుండఁగ కాఁకలు గదు రేఁచేవు
వాటునగా నీవే కదు జాణవు గావోయీ ॥ బాపు ॥

చేరి యీకెఁ గూడఁగానే చెలిపైఁ జేయి వేసి
గారవించేవు శ్రీవేంకటేశుఁడవు
యీరీతి నన్నే[illegible] యాపె మొదనుండఁ జొక్కించేవు
[illegible]తాను నీవే జాణవు గావోయీ ॥ బాపు ॥ 50

## శుద్ధవసంతం

నీవు మగవాఁడవు నీ వెట్టుండినాఁ జెల్లు
భావించి ఆఁటదానను పదరక వుండును ॥ పల్లవి ॥

మనలో నాడినమాట మగువలె ట్టైటిఁగిరి
పెనుపొంద నీవే చెప్పితివి గాక
యెనలేక యిటువంటియెమ్మె కాఁడవంటానే కా
వొనరి నే మోనముతో నూరకే వుండుదును ॥ నీవు ॥

పయ్యదలో గురుతులు పడఁతులె ట్టైటిఁగిరి
కొయ్యావై నీవే యీడుకొంటివి గాక
యెయ్యెడ బగ్గడివాఁడవిటు నీవంటానే కా
కుయ్యక తెరమాటున గుట్టుసేసుకుందును ॥ నీవు ॥

వొంటిఁ గాఁగిటిలో రతులువిదలె ట్టైటిఁగిరి
నంటున మచ్చికను నీ వంటివి గాక
ఇంటిలో శ్రీవేంకటేశ ఇట్టివాఁడవంటానే కా
జంటయై యే పొద్దు నీ సంగడినే వుందును ॥ నీవు ॥ 51

## గౌళ

శిరసుండ మోఁకాలికి సేసలు వెట్టఁగనేల
గరిమల నాపెనే కాఁగిలించరాదా ॥ పల్లవి ॥

నిండిన కాఁతాళము నీమీఁద నుండఁగాను
అండవారిమాటలు ఆపె విసీనా
చండిపెట్టి వొడఁబరచకువయ్య మమ్ము నింత
దండిగా నాపెఁ గాఁగిటఁ దనుపరాదా ॥ శిరసు ॥

ముప్పిరిఁ జూపులు నీపై ముంచుకొని వుండఁగాను
ఇప్పుడు నీ కానుకలు యెంచీనా ఆపె
చప్పుడు సేసి మాకెంత సన్నలెల్లాఁ జూపేవు
అప్పటి నాపెచేతికి నడపెయ్యరాదా ॥ శిరసు ॥

శ్రీవేంకటేశ కాఁగిలి చేరి నీ మైనుండఁగాను
యీ వినయాలెరుఁగునా యెంతైనానాపె
మావంటివారినెల్లా మరి యెంత మన్నించేవు
దేవులైన ఆపెనే తెలుపరాదా ॥ శిరసు ॥ 52

510-వ రేకు లలిత

ఎందరెందరినిట్లా నేలితివో వెనకకు
సందుసుడి నవ్వేవు జాణకాఁడవౌదువు ॥ పల్లవి ॥

చెలియ చెక్కులవెంట చెమటలు గారఁగాను
అలరి పాదములొత్తినప్పటనుండి
తలఁచరాదా దయ దానికేమి తప్పు గాదు
చలమెల్లనీడేరె జాణకాఁడవౌదువు ॥ ఎంద ॥

వువిదచన్నులపై నిట్టూరుపులు నిగుడఁగ
రవళిఁ బనులు సేసీ రాతిటనుండి
ఇవల మెచ్చఁగరాదా ఇందు వంక నేమి వోదు
జవళిపంతము వచ్చె జాణకాఁడవౌదువు ॥ ఎంద ॥

రమణిమోవితేనె గారఁగా ముద్దుమాటలను
సమరతిఁగూడీ నిన్ను జాముటనుండి
అమరి శ్రీవేంకటేశ అన్నిటా మన్నించరాదా
సముకాన సిగ్గులేల జాణకాఁడవౌదువు ॥ ఎంద ॥ 53

తోండి

మెచ్చితిమి నిన్నును మెలువాఁడవౌదువు
నిచ్చలు మాకన్నిటాను నీవే గుటిగాక ॥ పల్లవి ॥

చేసుకొన్న మగఁడవు చేకొనక మానేవా
వాసితోడ రక్షించేదే వైపు గాక
ఆసకొలిసినవాఁడవట్టే రాక మానేవా
బాస దప్పకుండేదే పంతము గాక ॥ మెచ్చి ॥

ప్రియమైన విభుఁడవు పెరయక మానేవా
క్రియతో మన్నించుచే కీరితి గాక
నియతమైనవాఁడవు నెట్టుకొనక మానేవా
జయముగా నేలుటే సంగతి గాక ॥ మెచ్చి ॥

శ్రీవేంకటేశుఁడవు చేరి కూడక మానేవా
కైవసమై వుండినదే ఘనత గాక
యీవల నన్నేలితివి ఇచ్చగించక మానేవా
యేవల్లాఁ జన విచ్చుటే యెక్కుడు గాక ॥ మెచ్చి ॥ 54

## హిందోళ వసంతం

కాఁగిలించుకొని యెంత కదిమేవయ్య
చేఁగ దేర గోరికొనఁ జెనకకువయ్యా ॥ పల్లవి ॥

మొనసి నీ పాదాలకు మొక్కేమయ్య
ఘనుఁడవౌదువు అన్నిఁ గంటిమయ్యా
పొనుఁగక యిట్టె నిన్నుఁ బొగడేమయ్యా
పెనఁగను నాచన్నులు పిసుకకువయ్యా ॥ కాఁగి ॥

చెప్పినట్టు నీసేవ సేసేమయ్యా
తప్పు వేసి సటలికఁ దడవనయ్యా
నుప్పిరి నీవారము మొదలే అయ్యా
చప్పుడుగాను గిలిగించకు మిప్పుడయ్యా ॥ కాఁగి ॥

భావించి పంతమిచ్చితిఁ బాయకువయ్యా
శ్రీవేంకటేశ తమ్మకుఁ జే చాఁచేనయ్యా
యీవేళ నన్నుఁ గూడితి విదే మేలయ్యా
కైవసమై పొావి గంటి గావించకువయ్యా ॥ కాఁగి ॥ 55

## ఆహిరి

ఏమీ నెఱఁగదు బాల యిఁక నీచిత్తమెట్టో
మా మాటలెల్లా విని మన్నించవయ్యా ॥ పల్లవి ॥

చనవు గలుగఁగాను సారె సారెఁ గొంగు వట్టి
పెనఁగీ నిదివో నీ ప్రియురాలు
యెనసి నీ వుండఁగాను ఇట్టే మందెమేళమున
మన సెరఁగ కెదురు మాటలాడీని ॥ ఏమీ ॥

వొడఁబాటు గలుగఁగ నొద్దికతోడుత నీ
తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి
కడు నీవు నవ్వఁగాను కన్నులఁ దప్పక చూచి
జడియక బొమ్మలను జంకించీని ॥ ఏమీ ॥

పొందులు గలుగఁగాను పొసఁగి శ్రీవేంకటేశ
అందపు రతులఁ గూడీ నలివ
కందువలు నీవంటఁగా కప్పురపుమోవి ఇచ్చి
విందులుగాఁ దమ్ములము వీడుదోడాడీని ॥ ఏమీ ॥58

## కాంబోది

ఎట్టు సేసినాఁ జేయి యెదురాడను
నెట్టుకొని చూచేవి నీ మహిమలిఁకను ॥ పల్లవి ॥

మొగము నీవు చూచితే మొక్కుచును సంతోసింతు
నగితేనే నీ మేలు నమ్ముదు నేను
జిగి వీడెమిచ్చితేనే చెప్పుకొందుఁ జెలులతో
పగటు నీచిత్తము నాభాగ్య మిఁకను ॥ ఎట్టు ॥

మాటలు నీవాడితేనే మనసు గరఁగుదును
గాటానఁ జేయి వేసితేఁ గడు మెత్తును
పాటించి గోర నంటితే పలుమారుఁ జెలఁగుదు
కోటికి నీ కరుణే కోరితి నేనిఁకను ॥ ఎట్టు ॥

పచ్చడము గప్పితేను పలుమారు నిన్ను మెత్తు
మచ్చిక నీవు చూపితే మరుఁగుదును
ఇచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
పచ్చియైన నీ మన్ననే బ్రదుకు నాకిఁకను ॥ ఎట్టు ॥ 57

రవు॰

నీకు నాకెకుఁ గలదే నేఁడు గొత్తలా సరసము
కోకొమ్మనీ నదే అందుకొనవయ్యా విడెము ॥ పల్లవి ॥

చనవు గలుగువారు సాదింతురేమైన
ననుపు గలుగువారు నవ్వుదురు
కినియఁగ నేమిటికి కేలెత్తి మొక్కుచు నింతి
వినయాన విన్నవించీ వినవయ్యా మాఁట ॥ నీకు ॥

ప్రియము గలుగువారు పెనఁగుదు రెంతైన
క్రియ యెరిఁగినవారు గిలిగింతురు
బయలు బిగియనేల బాఁతిపడి ఆపె నీకు
దయవుట్ట సేవ సేసీ తాళవయ్యా చలము ॥ నీకు ॥

బలిమి గలుగువారు పంతాలు నెరపుదురు
వలచినవారు రతి నలయింతురు
కొలమి శ్రీవేంకటేశ యెడమాఁట లిఁకనేల
మెలఁగి కలసె నిన్ను మెచ్చవయ్యా యీకెను ॥ నీకు ॥ 58

511-వ రేకు హిందోళనాట

తా నెరఁగఁడటపే యీ తారుకాణలెల్లాను
రానీవే కాదనేనా రమణుని నీడకు ॥ పల్లవి ॥

వలఁపు సమ్మతించితే తనువు సమ్మతించును
వలపు గలిగితేనే వాడికె గలుగును
చలము విడువకున్న సాదించవచ్చుఁ బనులు
[illegible] మంచివె నే [illegible] నా[illegible]దే ॥ తా నె ॥

తగులు దప్పకుండితే తమకముఁ దప్పదు
తెగువలు పుట్టితేను తెరఁకువాఁ బుట్టును
నగవులు నిండితేను నయము దోడన నిండు
తగవులు నిలిపితే తాలిములు నిలుచు ॥ తానె ॥

చెనకులు మొనపితె సగ్గులును మొనపును
ననుపులు మిగిలితే నమ్మికలు మిగులును
ఘనసి శ్రీ వేంకటేశుఁ డిడకే తా నిచ్చేసీ
చనవు సతమైతేనే సరసమూ సతము ॥ తాన ॥ 59

## దేశాక్షి

పచ్చిదేరీ నీమాటలు బతుకవయ్యా
విచ్చనవిడిని వూరపిందులాయ వలపు ॥ పల్లవి ॥

సంగడి నుండేవారు సరసములాడేవారు
యెంగిలిమోవిచ్చేవా రెందరు నీకు
అంగవించి యాసపడేవప్పటి నే బాఁతైతినా
వింగడించరాక చల్లువెదలాయ వలపు ॥ పచ్చి ॥

వూడిగాలు సేసేవారు వొరసి నవ్వేటివారు
యీడుచూపి వుండేవా రెందరు నీకు
జోడుగా మరియు నీచూపులు నాపైఁ బారెనా
నీడలనే వసంతపునీళ్లాయ వలపు ॥ పచ్చి ॥

చెలరేఁగి పాడేవారు చేసన్నలు చేసేవారు
యెలయించి పొందేవా రెందరు నీకు
ఇల శ్రీ వేంకటేశ సన్నేలితి విచ్చ గల్గెనా
పిలికించి [illegible]డుఁ దరితీపులాయ వలపు ॥ పచ్చి ॥ 60

## సామంతం

ఎంతకెంత సేసేవు ఇది యేమే
ఇంతగాఁ గొసరుదురా ఇది యేమే ॥ పల్లవి ॥

ఇచ్చకములాడేవటి నెగసక్కెములాడేవు
హెచ్చి జవ్వనమదాన నిది యేమే
మెచ్చులాతఁడు మెచ్చఁగా మేకులు పచరించేవు
యిచ్చిన చనవునను నిది యేమే ॥ ఎంత ॥

మంతనాలు చెప్పఁగాను మలయుచుఁ బెనఁగేవు
యింతులలోపలనెల్లా నిది యేమే
వింతలుగా నవ్వఁగాను వెస గుట్టు సేసేవు
యెంతయినాఁ గరఁగవు యిది యేమే ॥ ఎంత ॥

అంగవించి కూడఁగాను అలసేవు పానుపుపై
యెంగిలిమోవితోడ నిది యేమే
రంగు శ్రీవేంకటేశుఁడు రతి సేసితే మొక్కేవు
యింగిత మెఱుఁగుదువు యిది యేమే ॥ ఎంత ॥ 61

## సాళంగనాట

పాలుదాగిన సత్తువ పనికివచ్చెను నేఁడు
వోలిఁ బచ్చడములోన నొకతున్న దిదివో ॥ పల్లవి ॥

పల్లదాన నీవు రేపల్లెలోఁ బెరిగేనాఁడు
గొల్లెతల మూఁకలే కొలువెల్లాను
వొల్లనే సందడికోవ కొంకతె నీతురుమె
యిల్లుసేనుకొని వుండె నిరపై నేఁడిదిగో ॥ పాలు ॥

అంచెల వనముల నీ వావులఁ గాచేనాఁడు
చెంచులకదుపులే చెంగటెల్లాను
మించిన రొమ్ముకుఁ గాక మెలఁత వొక్కతె నేఁడు
పంచల నీబుజముపై పాదుకొనె నిదిగో ॥ పాలు

తనర శ్రీవేంకటేశ ద్వారక నుండేనాఁడు
వనితలు వేవేలు వాడలెల్లాను
పెనఁగి జంగిలిలోనఁ బేరుకొనవలె నని
వొనర నొక్కతె నీ వురమెక్కె నిదిగో ॥ పాలు ॥ 62

## రామక్రియ

చేరి ధర్మపుణ్యాము నీ చేతిది గాక
యీరసాన నిందరిలో నేమనేదిరా ॥ పల్లవి ॥

కడు మొక్కలాన నీపై కాఁకలు చల్లఁగరాదు
నడుమంతరాల నీతో నవ్వఁగరాదు
విడువ కెందుంటివని వెంగెములాడఁగ రాదు
యెడయలేని సుద్దులకేమనేదిరా ॥ చేరి ॥

నిందలు వేసి నిన్ను నేరములెంచఁగ రాదు
మందెమేళమున మారుమలయ రాదు
కందువకుఁ దీసి నీపై గాతలు చూపఁగరాదు
యెందువల్ల గెలుతు నిన్నేమనేదిరా ॥ చేరి ॥

కొప్పువట్టి తీసి నిన్నుఁ గూరాకు సేయఁగరాదు
యిప్పుడే కూడితి వలయించఁగ రాదు
ముప్పిరి శ్రీవేంకటేశ మొక్కితేఁ దిట్టఁగరాదు
యెప్పటి పంతాలు చెల్ల నేమనేదిరా ॥ చేరి ॥ 6[illegible]

## ఆహిరి

చెలులెల్లా నిందుకే సిగ్గువడేరు
పలుమారు నెట్టు వోడఁబరచేసయ్యా ॥ పల్లవి ॥

సంగడినున్న సతులు సరసములాడఁగా[illegible]
యెంగిలాయ నీమోవి ఇప్పుడిట్టే
పొంగుచు నిన్నప్పు[illegible]ని భోగించేటి [illegible]
యింగితా[illegible] [illegible]మెట్లో[illegible]గేసయ్యా [illegible]

పొందేవేళఁ జాదాలు నీబుజముపైఁ జాఁచఁగాను
కిందుపడె నీమేను కిమ్ముల నట్టే
అందముగాఁ గొత్తగాఁ బెండ్లాడేటివారికి
ఇందమని కాఁగిలెట్టు ఇంపు సేసేవయ్యా ॥ చెలు ॥

వావులను తమతమవాఁడవు నీ వనఁగాను
శ్రీవేంకటేశ అందరికేప మైతివి
యీవేళ నేలినయట్టి మావంటిసతులకెల్ల
చేవదేర నీమహిమ చెప్పేదెట్లయ్యా ॥ చెలు ॥ 64

## 512వ-రేకు నట్టనారాయణి

మన్నించు నే నిలుచుండే మఱి కొలువుసేసేను
ఇన్నేసి మాటలాడ నీయీడువారమా ॥ పల్లవి ॥

అరసి నే నలిగితినంటా వేఁడుకొనేవు
సరికి బేసికి నీతో సాటివారమా
పరగనట్టే మంచముపైకిఁ దీసుకొనేవు
సరుసఁ గూచుండ నీతో సరివారమా ॥ మన్నిం ॥

వొట్టు వెట్టుకొంటినంటా నోడివట్టి తీసేవు
అట్టే మారువెనఁగ వియ్యపువారమా
చుట్టరికములు సేసి సుద్దులెల్లఁ జెప్పేవు
నెట్టుకొని వూఁకొను(న?)నీయంతవారమా ॥ మన్నిం ॥

పంతములాడితినంటా పక్కనఁ గాఁగిలించేవు
కాంతుఁడవు నేము నీకు కడవారమా
రంతుల శ్రీవేంకటేశ రతుల మమ్మేలితివి
దొంతర మెచ్చులు మెచ్చ దొడ్డవారమా మన్నిం ॥ 65

## ముఖారి

ఆయనాయ నీకింత యాచారాల గొడవేల
　పాయపు మదము నీవు పట్టుకుండఁ గలవా ॥ పల్లవి ॥
పూచినతంగేడువలెఁ బొలఁతి సింగారించుక
　యేచి నిలుచున్నది నీయెదుటను
　చేచేత చెరఁగుమాసి వుండితే నేమాయ
　చూచిచూచి యంట కోరుచుకుండఁగలవా ॥ ఆయ ॥
పచ్చనిచిలుకవలెఁ బడఁతి చదువుకొంటా
　మచ్చికలు చూపీ నీమంచముపొంత
　మెచ్చులుగ ధడిబెముమీఁద నుంటే నేమాయ
　కిచ్చురేఁగి ముట్టి తమకించకుండఁగలవా ॥ ఆయ ॥
మూసినముత్యమువలె ముదిత కాఁగిట నిల్చి
　ఆసకొల్పీ శ్రీవేంకటాధిప నిన్ను
　సేసవెట్టి నాలునాళ్లు చేసితే నందుకేమాయ
　వాసితోడఁ బొంది వలవకుండఁగలవా ॥ ఆయ ॥ 68

## కాంబోది

వారేమి సేతురు వనితలింతే
　దూరకువే నీవు తొయ్యలుల ॥ పల్లవి ॥
చెలుల నాడకువే సేవ సేసేవారు
　బలిమిఁ బట్టఁగఁ తాయుదురా
　తలపోసి మేలు తానెఱఁగవలె
　చెలువునివే యీ చేఁతలెల్లా ॥ వారే ॥
కోపగించకువే కొలువులోవారు
　వోపమందురా వోరయఁగా
　దాపైన విభుఁడు తానెంచుకోవలె
　చూపి చెప్పవే సుద్దులెల్లా ॥ వారే ॥

యేమీ ననకువే యేలుకొన్నవారు
కామించినవేళఁ గాదందురా
యీమేర శ్రీవేంకటేశుఁడే నన్నేలె
నే మాననవే నేర్పులెల్లా ॥ వారే ॥ 67

### దేసాళం

కంటిమి నీముద్దులెల్లఁ గడపరాయ
యింటింట దారణలెక్క నేమి చెప్పేదయ్యా ॥ పల్లవి ॥
కొమ్మలచేత నెల్లాను కొలువు సేయించుకొంటా
కమ్మి వలపు కొటారుగాఁ బెట్టేవు
అమ్మరో పోఁకకుఁ బుట్టెఁడాయను సిగ్గులు నేఁడు
యెమ్మెల సతులభాగ్యా లేమి చెప్పేదయ్యా ॥ కంటి ॥
జలజలోచనలతో సరసములాడుకొంటా
మొలకనవ్వులను వాములు వేసేవు
తలఁపులోని రతులు తరగని ధాన్యమాయ
యెలజవ్వనుల ముద మేమి చెప్పేదయ్యా ॥ కంటి ॥
కందువ నింతుల నిట్టే కాఁగిటఁ బెనఁగుకొంటా
చెందుచు మోవులపై లచ్చెన వెట్టేవు
అంది శ్రీవేంకటేశ నన్నలమి మెచ్చితివిట్టే
యిందరి నుఁరిపెములు యేమి చెప్పేదయ్యా ॥ కంటి ॥ 68

### శంకరాభరణం

చుట్టమువలెనే చూడఁ
[illegible]ట్టుచుఁ బాదము మీఁద వేసిని ॥ పల్లవి ॥
[illegible]ద్దఁ గూచుండితే నొడివట్టుకొని
సుద్దులు చెప్పేఁ జూడవే
బద్దకుమం[illegible] [illegible]సలు [illegible]
[illegible]ద్దుపోనివాఁడు [illegible]దింక[illegible] ॥ చుట్ట ॥

గేదంగి పూవిచ్చి కేలెత్తి మొక్కితే
జూదమాడుమనీఁ జూడవే
సాదపు గమ్మంటే సన్నలు చూపీని
వీదియెమ్మెకాఁడు వెంటవచ్చీనే ॥ చుట్టు ॥

గక్కున నేమెచ్చి కాఁగిలించుకొంటే
చొక్కఁగ ననుఁ గూడెఁ జూడవే
యిక్కడ శ్రీవేంకటేశుఁడు మెచ్చీని
కక్కసీఁడు మోవి గంటిరేచీఁనే ॥ చుట్టు ॥ 69

## నాదరామక్రియ

ఎలయించీఁ దానిన్నిటా నేమి సేతునే
యెలుఁగెత్తి దూరరాదు ఏమి సేతునే ॥ పల్లవి ॥

వింతగా వేఁడుకొనీని వెనకటి చేఁతలకు
యెంతైనాఁ గొల్వదు మన సేమిసేతునే
కాంతుఁడు తా నిన్నిటాను కడు మీరి వున్నవాఁడు
యింతులిందరు నున్నారు యేమి సేతునే ॥ ఎల ॥

ముట్టి తా నన్నుఁ బిల్చిని మొన్ననెల్లా రానందుకు
యిట్టే కోపము మానదు యేమి సేతునే
అట్టడి తా నింతలో నాఉడీరసము చూపీని
యెట్టకేలకుఁ గంటిని యేమి సేతునే ॥ ఎల ॥

కదిసి తాఁ గాఁగిలించి కడవారిఁ బొందినందు-
కెదుట శ్రీవేంకటేశు నేమిసేతునే
అదన నన్నేలుకొనె నన్నిటాను మన్నించీ-
నిదివో నే మఱిగితి నేమి సేతునే ॥ ఎల ॥ 70

513-వ రేకు

## శ్రీరాగం

ఎఱుక చెప్పేమయ్యా యిదిగో నీకు నేఁడు
మెఱసి నీవు నాకు మేలైన వలతువు ॥ పల్లవి ॥

అలరులకొప్పు నీకు నతిమోహము పుట్టించె
తలిరుమోవి తీపు దప్పి రేఁచెను
వెలిఁజెక్కులకళలు వేడుక పురికొలిపె
కలికి సింగారాలు కన్నులాస నించెను ॥ ఎఱుక ॥

తచ్చిన గుబ్బచన్నులు తమకము రేఁచె నిన్ను
మచ్చికఁ గనుచూపులు మర్మాలు నాఁటె
మెచ్చులపేరిఁటి వొప్పు మిక్కిలిని భ్రమయించె
నెచ్చెలిచక్కఁదనము నిన్నింత చొక్కించెను ॥ ఎఱుక ॥

వాసనమోవితేనె వంతున నోరూరించె
సేసవెట్టిన చేతులు సిగ్గు దేరిచె
యీసుద్దికి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
శ్రీసతిమహిమలెల్ల చేచేత మెప్పించెను ॥ ఎఱుక ॥ 71

## భైరవి

ఇంక నేమిసేసేవయ్యా యింతేకాయను
సంకెలేని వలపులు జాజరాయను ॥ పల్లవి ॥

మగువ నీతో నేఁడు మాటలాడిన ఫలము
చిగురువంటిమోవి చిల్లులాయను
తగిలి యిందాఁకా నీదండ నుండినఫలము
వొగరుఁజేఁతల నసురుసురాయను ॥ ఇంక ॥

నలినాక్షి నీతోను నవ్వు నవ్వినఫలము
చెలఁగి కొప్పెల్ల విడి చిక్కులాయను
యెలమి నీకుఁ జేతులెత్తి మొక్కినఫలము
నిలువుకు నిలువే నివ్వెరగులాయను ॥ ఇంక ॥

సుదతి నిన్నుఁ దప్పక చూచినయట్టిఫలము
కొదలేని రతులకు గురి యాయను
పొదలి శ్రీవేంకటేశ పొందుచేసినఫలము
చదురుఁదనాలు నేర్చి జాణాయను ॥ ఇంక ॥ 72

## సామంతం

ఎటువంటిదివో మీ యిద్దరి తమకములు
మొలఁగులు నేరుతువే మున్నిటికంటెను ॥ పల్లవి ॥

చలివాసి యెదుటను సరసునిమోము చూచి
సెలవి నవ్వితివేలే చెలియా
కలువపువ్వుల వేసి కమ్మటి నప్పుడేమని
పలికితివే నీవు పంతములు మీరను ॥ ఎటువంటి ॥

చాయలకుఁ గొలువులో సతులెల్లఁ జూడఁగాను
చేయెత్తి మొక్కితివేలే చెలియా
ఆయములు కొనగోర నంటఁగా సన్నలు నీవు
సేయ నేర్చితివి యేల సేఁతలెక్కుడుగను ॥ ఎటువంటి ॥

వావిరి నోరెఁ(o?)పాటి వసంతవల్లభుఁడైన
శ్రీవేంకటేశునాలవే చెలియా
యీవేళ నిన్నేలినట్టే యెనసె నన్నితఁడును
వావి చెప్పనేలే యింక వరుసలతోడను ॥ ఎటువంటి ॥ 73

## దేసాళం

వన్నెకాఁడ వన్నిటాను వల్లభరాయ
వున్నసుద్దులేఁటికోయి వో వల్లభరాయా ॥ పల్లవి ॥
వాడికైన వలపుల వల్లభరాయ
వాదుదేరె నీమోవి వల్లభరాయా
వాడవలపుల మెచ్చు వల్లభరాయ
పోడక నన్నేలుకొమ్మి వో వల్లభరాయా ॥ వన్నె ॥

వలగొని మొక్కేము వల్లభరాయ నీ-
వలలఁ జిక్కితి మిదే వల్లభరాయా
వలెనా యింతేసి రట్టు వల్లభరాయ
పులివచ్చిమోవి యిమ్మీ వో వల్లభరాయా ॥ వన్నె ॥

వరుసనోరెఁ(ం?)పాటి వల్లభరాయా నేఁడు
వరుసకు రావోయి వల్లభరాయా
వరదుఁడ శ్రీవేంకట వల్లభరాయ మమ్ము-
నొరసికూడితి విట్టే వో వల్లభరాయా ॥ వన్నె ॥ 74

## ఆహిరి

ఎట్టైనా దయదలఁచి యేలుకోవయ్యా
జట్టిగొని నిన్ను నంత సాధించనేరను ॥ పల్లవి ॥

మన్నింతువనెడి నిండు మందెమేళమునను
యెన్నిమాటలాడితినో యెఱఁగను
కన్నియఁ గనక నీతో కందువలుచూపి మోః
విన్నపాలు చేసుకొను వివరము నేరను ॥ ఎట్టై ॥

కైవసమై నీవుండిన గబ్బితనమునను
యేవుపూడిగము గొరతో యెఱుఁగను
దేవులఁ గనక నీవు దిమ్మరివాఁడవని
భావించి కరకరించి బాసగొననేరను ॥ ఎట్టై ॥

దోమటి దొడికినట్టి దొరతనమునను
యేమి నావొళ్ళఁ దప్పులో యెఱఁగను
కామినిఁ గనక శ్రీవేంకటేశ నిన్నుఁగూడి
ఆముకొ పుందాన నిన్ను నప్పఁగాదననేరను ॥ ఎట్టై ॥ 75

## భైరవి

మావంటివా రేమన్నా మర్మాలు సోఁకి వచ్చు
వేవేలు మీలో మీరు విచారించుకోరయ్యా ॥ పల్లవి ॥

మచ్చికతోడుత నీవు మాటలాడఁగాఁ జూచి
నచ్చుకొని కొంతగొంత నవ్వీ నాపె
హెచ్చుకుందు లందులోన నేమి దెలిసెనో కాని
విచ్చనవిడిని నీవే విచారించుకోవయ్యా ॥ మావం ॥

గుట్టుతోడ నీవు పెద్దకొలువై వుండఁగఁజూచి
నట్టనడుమ నిలిచి నవ్వీ నాపె
ఇట్టె చేసిన చేఁతలేమేమున్నవో కాని
దట్టముగ మనసులోఁ దలపోసుకోవయ్యా ॥ మావం ॥

శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జెందినట్టి నిన్నుఁజూచి
నావెనక నిదివో నవ్వీ నాపె
యేవల నీకు వలపు లెన్నిగలవో కాని
ఆవటించి చెలులతో నాలోచించుకోవయ్యా ॥ మావం ॥ 76

514వ రేకు ధన్నాశి

మగువ యప్పటనుండి మనికితమున నవ్వీ
అగడేల లోపలికి నంకెల రాదా ॥ పల్లవి ॥

యిల్లాలయినదాని నిందరిలోపల నీవు
పల్లదపు మాటలాడి పచ్చిసేతురా
చెల్లఁబో ఆఁటదానికి సిగ్గు విడువఁ దగవా
కల్లరివై యింత నీవు కాకుసేయవలదు ॥ మగువ ॥

పీఁటపైఁ బెండ్లికూఁతురుఁ బేరటాండ్లలోన నెల్లా
వాఁటముగఁ బయ్యదంటి వాసిసేతురా
మేఁటి యాఁటదానికి మేరమీరఁ దగవా
గాఁటముగ నీవింత కాకుసేయవలదు ॥ మగువ ॥

పట్టుపుదెవులఁ దెచ్చి పడఁతులలోన నెల్లా
    జట్టిగొని మోవితేనె చవి చూపేవు
అట్టే కూడితివి మగనాలికి రట్టు దగవా
    గట్టిగా శ్రీవేంకటేశ ఆకుసేయవలదు ॥ మగువ ॥

శంకరాభరణం 77

నీవే యిఁకఁ గరుణించవయ్యా
    భావించి కత లేర్పరచఁగఁ గలరా ॥ పల్లవి ॥
మనసులోని నీమతకములెల్లా
    వినుఁగొనఁగలరా కామినులు
వెనుకొని నీవొల్లి వేసములింతేసి
    దినదినమును నిటు తెలియఁగఁ గలరా ॥ నీవే ॥
నలుగడ నీ విటు నవ్విన నవ్వులు
    తలఁచఁగఁ గలరా తగు సతులు
నెలకొని నీరతి నేర్పుల చేఁతలు
    కొలఁదులు వెట్టుక కొసరఁగఁ గలరా ॥ నీవే ॥
శ్రీవేంకటేశ్వర జిగి నీ మహిమలు
    సేవించఁగలరా చిన్నెకలు
వావిరి నందరి వరుస నేలితివి
    వావులు దెలుపుచు వారించఁ గలరా ॥ నీవే ॥ 78

సాళంగనాట

నీ వేల పంతాలాడేవు నేఁడు మాతోను
    భావించితే నాఁడువారి పగటులివి ॥ పల్లవి ॥
చెక్కులఁ జేతులిడుక సిగ్గులతో నుండేది
    చక్కనివ(స?)తులకెల్ల సహజమిది
జక్కవచన్నులమీఁద సారెఁ బయ్యెద మూసేది
    యెక్కడా మానినులకు యిక్కువలివి ॥ నీవే ॥

పుదుటున నవ్వుతాను వోరచూపులు చూచేవి(ది?)
చదురాండ్లైనవారి సహజమిది
పొదిగి సన్నలు చేసి బొమ్మల జంకించేది
మొదలఁ గాంతలకును మురిపేలివి ॥ నీవే ॥

పలుకుల లోపలను పచ్చి దొరల నాడేది
అలమేల్మంగనైన నాకందము లివి
చెలఁగి కూడితి విట్టే శ్రీవేంకటేశ నన్ను
వలపువనితలకు వాడికలివి ॥ నీవే ॥ 79

## దేసాళం

మెచ్చిరి గొల్లెతలెల్ల మీఁద మీఁదను
యిచ్చిరి చనవులు నీవిట్టే బతుకవయ్యా ॥ పల్లవి ॥

అంగనలై తేఁ జాలు నట్టే దయ దలఁతువు
యెంగిలి మోవులని యెంచవు
కంగులే కెప్పుడు మెడఁగట్టుకొనే వుందువు
యింగితపురతులు నీకేమి గడమయ్యా ॥ మెచ్చి ॥

వెలఁదులై తేఁ జాలు వేడుకఁ బెండ్లాడుదువు
పొలసి వారేమిచ్చినాఁ బూసుకొందువు
నెలకొని యేపొద్దు నెత్తిఁ బెట్టుకొందువు
వలపులనోము నీకు ఫలియించె నయ్యా ॥ మెచ్చి ॥

మానినులై తేఁ జాలు మర్మములు చూతువు
అనుక పీఁపున మోచు కలరుదువు
నే నలమేలుమంగను నీవు శ్రీవేంకటేశుఁడ-
వీనిజాన నిన్నుఁ గూడితింక నేలుకోవయ్యా ॥ మెచ్చి ॥ 80

## సామంతం

ఏటికిఁ బదరే పంతులతోఁదను
నేఁటనె తప్పదు నేరుపు భువిని ॥ పల్లవి ॥

వలవ నేరుతువు వడి నీ రమణుని
వలపించఁగ నేరవలెఁ గదవే
పలికినటులనే పంతము పైపై
నిలిపినదే పో నేరుపు భువిని ॥ ఏటి ॥

నవ్వ నేరుతువు ననుపున నాతని
నవ్వించవలెఁగదే నటనలను
పువ్విళ్ళవలె నోరూరించి పగటు-
నివ్వటిలుట పో నేరుపు భువిని ॥ ఏటి ॥

చిక్క నేరుతువు శ్రీవేంకటేశ్వరుఁ
జిక్కించవలెఁగదే సేవలను
మక్కువ నీ వలమేల్మంగ వెనసితివి
నిక్క మమ్మేలుట నేరుపు భువిని ॥ ఏటి ॥ 81

## దేవగాంధారి

ఏడేడఁ జూచినాను యీ సుద్దులే
కోడెకాఁడవయితివి గోవిందరాజా ॥ పల్లవి ॥

అందగారి మాటలాడి ఆయములంటి యంటి
యిందుముఖిఁ జొక్కించి యేలుకొంటివి
పొందులు మరిగి యాకెభోగములకొఱకుఁ గా
గొందిఁ బవ్వళించితివి గోవిందరాజా ॥ ఏడే ॥

సెలవి నవ్వులు నవ్వి చేతులు చాఁచి చాఁచి
కలికిని వలపించి కైకొంటివి
కలయికలకుఁగానే కందువ పానుపుమీఁదఁ
గొలువున్నాఁడ విదివో గోవిందరాజా ॥ ఏడే ॥

తమ్మలము నోర నించి తమకము రేఁచి రేఁచి
కొమ్మనుఁ గాఁగిటిలోనఁ గూడితివి
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁతరతులకే
కుమ్మరించేవు మోహము గోవిందరాజా ॥ఏడే॥ 82

515-వ రేకు

## కేదారగౌళ

విన్నపమిది యొకటి వేవేలుమారులకును
సన్నలను చాయలను సంతమౌళే మేలు ॥పల్లవి॥

చెలిమి యొకరు వచ్చి చేసి పెట్టవచ్చునా
అలరి తమయంతనే అందుఁగాక
చెలులము మాకు బుద్ధి చెప్పఁగా వసములా
వెలలేని లోలోని వేడుకింతే కాక ॥విన్న॥

కూరిమి యెవ్వరైనఁ గోన వేయ వసమా
తారుకాణైన తమ తమి గాక
సారె నూడిగపువారు చవిసేయ వచ్చునా
మేరమీర నప్పటిసమేళములు గాక ॥విన్న॥

శ్రీవేంకటేశ బలిమిసేయ మాకు వసమా
మీవలెఁ గూడినవి మెచ్చులు గాక
యీవిధాన నండవారు యెచ్చరించ నోపుదురా
కైవసమైనయట్టి గరిమెలు గాక ॥విన్న॥ 83

## ముఖారి

ఎందాఁకా మంకుఁదనమేఁటికి నీకు
చందముగా మన్నించి చనవియ్యరాదా ॥పల్లవి॥

హత్తి నిన్ను వేఁడుకొనీ నప్పటనుండియుఁ బతి
చిత్తములోపలిమాట చెప్పరాదా
కొత్త కొత్తవలపుల కొంగువట్టి నిన్నుఁదీసీ
పొత్తులఁగూచుండి అట్టే పొసఁగఁగరాదా ॥ఎందా॥

పెనఁగుచు మాఁటలాడి ప్రియములు చెప్పిని
వినయములెల్లా నీవు వినరాదా
తనివి దీరక పైపైఁ దానే సరసములాడి
చెనకుచు నీవు నట్టే చెలఁగరాదా ॥ ఎందా ॥

కప్పురము నోరికిచ్చి కాఁగిలించుకొనీ నిన్ను
యిప్పుడు నీవియ్యకొని యెనయరాదా
అప్పటి శ్రీవేంకటేశుఁ డంగవించి నిన్నుఁగూడె
దప్పిదేరి యన్నిటాను తనివందరాదా ॥ ఎందా ॥ 84

## భవుళి

తలఁకని యేల యెదతాఁకించేవు చెలులను
వెలయ మీసరితలు వింటా నుండేము ॥ పల్లవి ॥

సముకాననే నిన్ను జంకించి చూచేటి
రమణుల నేము మేరకుఁ దెచ్చేమా
తమకించి నీవె యాఁ(యే?)కతాన వేఁడుకొనవయ్య
తమితోడ నేము తెరదండ నుండేము ॥ తల ॥

బడిబడి నీతో నొడ్డాఁబట్టా మాటలాడేటి
పడఁతుల నేము వొడఁబరచేమా
తొడిఁబడ నీవే పొందులు చేసుకొనవయ్య
తడఁబడక మలఁగుదాపున నుండేము ॥ తల ॥

రతివేళ నిన్నుఁ గడురాపుగా నలయించేటి
అతివల నంతేసి కాదనఁగలమా
యితవై శ్రీవేంకటేశ యిట్టే నీవెనసితి
మతిమలవక నీమన్నన నుండేము ॥ తల ॥ 85

42830

## శ్రీరాగం

వెలయఁగఁ దెర యిఁక వేయఁగదే
నిలువునఁ బులకలు నిండఁగఁ దొడఁగె ॥ పల్లవి ॥

విరులఁగొని పతిని వేయఁగ వేయఁగ
మరునిశరములై మైకొనెను
సురతపు నటనలు చూపఁగఁ జూపఁగ
పెరరేఁపులు మదిఁ బెనగొనఁ దొడఁగె ॥ వెల ॥

చక్కఁగఁ గ్రమము చల్లఁగఁ జల్లఁగ
చొక్కుమందులై సుడిగొనెను
అక్కర మాటలు ఆడఁగ నాడఁగ
మక్కువవలపులు మలయఁగఁ దొడఁగె ॥ వెల ॥

యింపుల విడియము లియ్యఁగ నియ్యఁగ
ముంపులమదములు మునుకొనెను
అంపక శ్రీవేంకటాధిపు నేనయఁగ
సంపదతమకము జడిఁగొనఁ దొడఁగె ॥ వెల ॥ 86

## శంకరాభరణం

ఆమనిపువ్వువంటిది ఆయమైన వయసు
కామించి భోగించక యా(యే?) మరఁదగునా ॥ పల్లవి ॥

చలపాదితనమేల సణఁగులాడఁగనేల
బలిమిఁ బెనఁగేయట్టి పతితోను
పలుకరాదా కప్రపుబాగా లియ్యఁగరాదా
చెలులకు నింతేసి సిగ్గువడఁదగునా ॥ ఆమ ॥

ఒగియఁగ నింతయేల పెచ్చువెరుగఁగనేల
పగటునఁ దమకించే పతితోను
నగవులు నగరాదా నయములు చూపరాదా
చిగురుమోవితోడ సిగ్గువడఁదగునా ॥ ఆమ ॥

మరిగించ నింతయేల మనసులు చూడనేల
పరగ శ్రీవేంకటపతితోను
గరిమెల మెచ్చరాదా కాఁగిటఁగూడె నతఁడు
శిరసువంచుక యట్టె సిగ్గువడఁదగునా ॥ అమ ॥ 87

రామక్రియ

మేలు మేలు నీగుణాలు మెచ్చితిమయ్యా
మైలలేక నీమనసు మణుఁగాయఁగా ॥ పల్లవి ॥

మచ్చికతో నాపె నీకు మనవులు చెప్పినవి
యిచ్చగించి వింటివిగా ఇన్నియును
వచ్చి నీయెదుటఁ దలవంచుక వున్నందుకు
తచ్చివేసినట్టు నీకు దయవుట్టెఁగా ॥ మేలు ॥

ఆసతోడ నాపె నీకు నంపిన కానికెలివి
సేసవెట్టినచేతులఁ జేకొంటివి
పూసగుచ్చినట్టు నిన్నుఁ బొంచి చూచినయందుకు
రాసినతమకము బోరన రేఁగెఁగా ॥ మేలు ॥

సిగ్గుతోడ నీకునిట్టె సేవలు సేసినవి
అగ్గమై మెచ్చి కాఁగిట నలమితివి
నిగ్గుల శ్రీవేంకటేశ నేఁడు మమ్ము నేలితివి
యెగ్గులేని రతులెల్ల నిరవాయఁగా ॥ మేలు ॥ 88

516-వ రేకు సాళంగం

అతఁడు చెప్పినట్ల అండనే కూచుండఁగదే
రాతిరీఁ బగలు నింత రవ్వసేయఁదగునా ॥ పల్లవి ॥

వలపుగలవారికి చలము సాదించరాదు
లలిఁ జెప్పినట్టు సేయవలెఁ గాని
చెలువుఁడాతఁడు నీపైఁ జేతులు చాఁచఁగాను
వెలుచుఁదనాన నింత పెనఁగఁగఁదగునా ॥ అత ॥

తగులు గలచోటికి బిగువు చూపఁగరాదు
మొగమిచ్చలే యాడఁ దగుఁ గాని
నగుతా నాతఁడు నీకానలు గడుఁబెట్టఁగాను
జిగిమించి నీకింత సిగ్గువడఁదగునా ॥ అత ॥

గలివేళ నన్నిటా సమ్మతించక మానరాదు
మితిమీరి కూడుటకుఁ దతిగాని
ఇతవై శ్రీవేంకటేశుఁ డేలి నిన్ను మెచ్చఁగాను
సతమై నీకింతగుట్టు జరపఁగఁదగునా ॥ అత ॥ 89

## దేశాక్షి

ఎటువంటి జాణకాఁడే యీతఁడు
చిటుకలు వేసీని సెలవినవ్వులను ॥ పల్లవి ॥

సంగడినున్నయాపెను సాకిరి చెప్పుమనుచు
కొంగువట్టి తీసీని కొయ్యతనాన
అంగవించి మాటలాడ ననువుగావలె నంటా
నెంగిలితమ్ములము పైనిట్టె వుమిసీని ॥ ఎటు ॥

యెఱుకగాఁ బొరుగాపె నిట్టే పొద్దు చెప్పుమని
నెఱిఁగొప్పువట్టి తీసీ నేరుపునను
మఱియుఁ బెనఁగేవేళ మైమరువు వలెనంటా
మెఱుఁగుగోణము కొంగు మీఁదవేసీని ॥ ఎటు ॥

పోరచి వచ్చినాపెను బుద్ధులు చెప్పుమనుచు
గోరగిరి కాఁగిలించి కూడీనదే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిరవై వుండేనంటా
సారెకు మన్నించి నాకు చనవిచ్చీనే ॥ ఎటు ॥ 90

## వరాళి

మొగము చూడఁగానే మొరఁగేటికే
వెగటుగా నీవేళ వేసటేఁటికే ॥ పల్లవి ॥

సేసలు వెట్టేయప్పుడు సిగ్గులువడుట గాక
ఆసఁ గాఁపురము సేసే అప్పుడేఁటికే
వాసులు వట్టేయప్పుడే వడి జంకింతురు గాక
యీసులేక నవ్వేయప్పు డిఁకనేఁటికే ॥ మొగ ॥

యెడసి వుండినవేళ యెగ్గులు వట్టుట గాక
అదరి విడెమిచ్చే యప్పుడేఁటికే
తడవినయప్పుడే తప్పులువట్టుట గాక
వొడికమై వుండఁగాను వొరయఁగనేఁటికే ॥ మొగ ॥

కంగియుండినయప్పుడు కాఁకలు చల్లుట గాక
అంగములంటి కూడిన యప్పుడేఁటికే
సంగతిగా శ్రీవేంకటేశ్వరుఁ డేలె నిన్నిన్నిటా
సంగడి మెచ్చుటగాక చలము మరేఁటికే ॥ మొగ ॥ 91

## సాళంగనాట

దేవతలు చెలఁగిరి దిక్కులెల్లా సంతోషించె
ఆవల నసురలెల్ల నడఁగిరి యపుడే ॥ పల్లవి ॥

అందమై మధురలోన నదివో కృష్ణావతార-
మందెను శ్రావణబహుళాష్టమి నేఁడు
దిందుపడిరి దేవకీదేవి వసుదేవుఁడును
అందిరి బ్రహ్మానంద మంతరంగములను ॥ దే ॥

నడుమ రేపల్లెలోన నందగోప యశోదల
కొడుకై పెరిగెనదే గోవిందుఁడు
అదరి గోపికలును ఆవులమందలును
వుడివోనివేడుకలు నుప్పొంగఁ బెరిగెను ॥ దేవ ॥

ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిదె తిరుపతిలోన
వుప్పతిల్లి దేవుఁడై వున్నాఁడిదే
చిప్పిలి సేవకులును శ్రీసతిదేవియును
కప్పి నానాగతులఁ బొగడఁగఁ దొడఁగిరి ॥ దేవ ॥ 92

## శ్రీరాగం

కంటిమి నేఁడీభాగ్యము కన్నులతుదల నేము
నంటున సంతోషించుకొంటిమి వోవిభుఁడ ॥ పల్లవి ॥

మొలకచన్నులమీఁద మోపి నీవు కొనగోరు
వలపు కలుపుదీసేవా ఆకెకు
కిలకిల నవ్వఁగానే గిలిగించే వప్పటిసి
నలువంకఁ గూరిములు నాఁటు వేసేవా ॥ కంటి ॥

ఘనమైన పిరుఁదుపై కట్టేవు మొలనూళ్ళు
గనమెల్లు జవ్వనానకొనరించేవా
పెనఁగి సిగ్గువడఁగ బిగ్గెఁ గాఁగిలించేవు
వునికిగా రతిపంట లొడుపఁగఁ జూచేవా ॥ కంటి ॥

ముప్పిరిఁ దురుమునిండ ముడిచేవు పువ్వులు
తప్పకుండ ననుపు పాఁతరఁబెట్టేవా
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నెల్ల
అప్పటిఁ గాంతలమేలు ఆమని సేసేవా ॥ కంటి ॥ 93

## నాగవరాళి

ఇద్దరికిదె విన్నప మెంచుకోరయ్యా
సుద్దులు చెప్పఁగానే సూటి యవును ముదము ॥ పల్లవి ॥

పొరుగుపొంతలనుండే పొందులు సమకూడును
సరసములాడితేను చవిపుట్టును
నిరతిఁ గోరియుండితే నిగుడుఁ గోరికలు
యెరవులు లేకుండితే నెనయును మనసు ॥ ఇద్ద ॥

సంగడిఁ గూచుండేనే సమ్మతి తానే కలుగు
అంగవించి పెనఁగితే నాయములంటు
యెంగిలిమోవు లిచ్చితే యింపులు సొంపులు రేఁగు
జంగిలి నవ్వునవ్వితే సతమౌను పనులు ॥ ఇద్ద ॥

వొక్కపానుపున నుంటే నుడివో వంటి రతులు
మిక్కిలి జాణతనాల మించును మేలు
యెక్కువ (శ్రీ)వేంకటేశ యింతి నీవు గూడితివి
తక్కక యిట్టే వుంటే తమకము పెచ్చును ॥ ఇద్ద ॥ 94

517-వ రేకు దేశాక్షి

ఎంతయిన మమ్ము నీవు యేలినట్టివాఁడవు
పంతగత్తైనైతినంటాఁ బదరేవు సుమ్మీ ॥ పల్లవి ॥

కాతరాన నే నిన్నుఁ గడవనాడినమాట
జాతులు(?)సేసేవు సుమ్మీ సతులలోను
చేతికి లోనాయనంటా చిక్కని నాచన్నులపై
ఘాతలు నించేవు సుమ్మీ ఘనుఁడ మొక్కేను ॥ ఎంత ॥

మేరమీరి నే నీతో మేలుకు నవ్వినసవ్వు
ఆరసి చెప్పేవు సుమ్మీ ఆండ్లతోను
కూరిమి నీతోడ సీఁదఁ గూచుండనంటాఁ కిరుఁదు
పారనదిమేవు సుమ్మీ సరుగ మొక్కేను ॥ ఎంత ॥

అగ్గలమై రతివేళ సంగములు సోఁకినందు
కెగ్గులువట్టేవు సుమ్మీ యిందరిలోను
నిగ్గుల (శ్రీ)వేంకటాద్రినిలయ గోవిందరాజ
వెగ్గళించేవు సుమ్మీ వేడుక మొక్కేను ॥ ఎంత ॥ 95

## ఆహిరి

ఎవ్వరుఁ జెప్పరు నీకు నేమిసేసేది
జవ్వనపాయవుగా సటలు రేచేఁది || పల్లవి ||
పంతము నీవాడేవట పట్టరాదా యెగ్గు మేము
యెంత నేరుపరివి నిన్నేమిచెప్పేది
అంతదొరవు నీవైతే నాఁడువారు సదరమా
దొంతుల యీతగవేల తోఁచదో కాక || ఎవ్వ ||
రావాడి గోరూఁదేవట రాసి నే జంకించరాదా
యేవల్ల నేర్చితివి నిన్నేమిచెప్పేది
నీవే చదువనేర్చితే నెలఁతలు తుచ్ఛమైర (రా?)
యీవేళ నీవిచారము యేలలేదో కాని || ఎవ్వ ||
తక్కక కూడితివట తమకించరాదా నేను
యెక్కడఁ గలిగె బుద్ధు లేమిచెప్పేది
నిక్కి దేవరవైతేనే నీవారుగారా సతులు
ఇక్కువ శ్రీవేంకటేశ యేల మంకో కాక || ఎవ్వ || 96

## కాంబోది

మూసి దాఁపిరములేవి మునుకొనె వలపులు
బాస చేసినప్పుడే బదికితిమి || పల్లవి ||
మచ్చికతో నీవు నాతో మాటలాడినప్పుడే
రచ్చకెక్కెఁ బనులెల్ల రాఁపైతిమి
కుచ్చికుచ్చి నీవు పొరుగున నున్నయపుడే
విచ్చనవిడిని వెల్లవిరులైతిమి || మూసి ||
నంటుచేసి నీవు నాతో నవ్వు నవ్వినప్పుడే
అంటిన మనసులతో నారడైతిమి
జంటయి వద్దఁగూచుండి చనవిచ్చినపుడే
యింటనింట నాడికెలకిరవైతిమి || మూసి ||

కతలుగా మోవిమీఁద గంటిచేసి నపుడే
రతిచేఁతలనుఁ గడు రవ్వయితిమి
యితవై శ్రీవేంకటేశ యెనసితివిపుడే
మితిమీఱి యిన్నిటాను మేలువారమైతిమి ॥ మూసి ॥ 97

## పాడి

ఇద్దరము మీయెదుట నిదివో వున్నారము
వొద్దికతోఁ దేర్పరే వొక్కటయ్యేము ॥ పల్లవి ॥
మొగము తాఁ జూచితేనే నగితి నే నంతలోనే
తగవులు చెప్పరే తరుణులాల
వగటులవాఁడు తాను పంతగత్తెను నేను
జగమెల్ల నెఱుఁగు మాసహజములు ॥ ఇద్ద ॥
చేకొని వొడివట్టితే పక్కన గోరనొత్తితి
సాకిరులు చెప్పరే సతులాల
కాకరిమాట తనది కందువ జంకెన నాది
చేకొన్న మావొళ్లఁ గలసేఁతలివి ॥ ఇద్ద ॥
గట్టిగాఁ జెక్కునొక్కితేఁ గాఁగిటఁ గూడితి నేను
చుట్టరికాలు చెప్పరే సుదతులాల
యిట్టె తా శ్రీవేంకటేశుఁ డిందిరాదేవిని నేను
గుట్టున మాయందుఁగల గుణములివి ॥ ఇద్ద ॥ 98

## ఆహిరి

ఎట్టోరువవచ్చు యిటువంటివెల్లఁ జూచి
పట్టవగటనుండియు బడలె నీచెలియ ॥ పల్ల ॥
పంతగాఁడవైనందుకు బలిమి గలయందుకు
నింతులతోఁ జూపేవా యెగసక్కెము
యెంతదడవాకుమడిచిప్పించుకొనేవు నీవు
బంతినిట్టే నిలుచుండి బడలె నీచెలియ ॥ ఎట్టో ॥

నేరుపరివై నందుకు నిజముగల యందుకు
ఆరీతిఁ దక్కింతురా యంగనలను
కోరి తొడలపైఁ జాఁచుకొంటివి నీపాదాలు
భారము మోచుకవుండి బడలె నీచెలియ ॥ ఎట్టో ॥

యేలినందుకు శ్రీవేంకటేశుఁడవై నందుకు
జాలిఁబెట్టుదురా యింత సకియలను
వేళతోఁ గాఁగిటఁ గూడి వెలయ మన్నించితివి
ఆలరి రతులచేత నలసె నీచెలియ ॥ ఎట్టో ॥ 99

## నాగవరాళి

సుదతులకితనికి సోబనవేళ
వుదుటునఁ జెలులెల్ల నూడిగాలు సేయరే ॥ పల్లవి ॥

ఇద్దరు పెండ్లికూఁతులకితఁడు గట్టె బాసిక-
మొద్దికఁ గప్పురవీడే లొడిఁబెట్టెను
పెద్దరికాన నడుమఁ బెండ్లిపీఁటపైఁ గూచుండె
వొద్దనుండి సతులెల్ల నూడిగాలు సేయరే ॥ సుదతు ॥

రెండుచేతుల శాసలు రెట్టించి చల్లెఁ దొడఁగె
దండలిద్దరిమెడలఁ దగుల వేసె
గండుమీరి ముంజేతులఁ గంకణదారాలు గట్టె
వుండినట్టే చెలులెల్ల నూడిగాలు సేయరే ॥ సుదతు ॥

భూమి నలమేల్మంగను భూసతిఁ గాఁగిటఁ గూడె
దోమటిదొడికి ముందే తొక్కెఁ బాదాలు
యీమేటి శ్రీవేంకటేశుఁ డిన్నివిధాల మెఱసె
వోముచును చెలులెల్ల నూడిగాలు సేయరే ॥ సుదతు ॥ 100

518-వ రేకు నట్టనారాయణి

మీరైతే నెఱఁగరు మీలోని వేడుకలు
ఆరీతి సన్నలు చేసే రతివలిందరును ॥ పల్లవి ॥

చిమ్ముఁజూపులతోడుత సేస మీరు వెట్టుకోఁగా
మిమ్ముఁజూచి చెలులెల్లా మెచ్చి నవ్వేరు
వుమ్మడిఁ గొంగులు ముళ్ళు వొకరొకరు వేయఁగ
సొమ్ముల మొకమొకాలు చూచేరిందరును ॥ మీరై ॥

కడుఁ దమకముతోడ కంకణాలు గట్టుకోఁగా
నడరి ఆడుకొనేరు అంగనలెల్ల
తొడిఁబడ నిద్దరును తోడనీళ్ళాడఁ గాను
గుడిగొని లోలో సిగ్గులు వడేరిందరు ॥ మీరై ॥

పేరటాండ్లకు మీరు పేరులిద్దరుఁ జెప్పఁగా
నారసి నవ్వేరు సతు లాడనీడను
చేరెలమేలుమంగను శ్రీవేంకటేశ కూడి
గారవించి పొగడుతాఁ గదిసేరిందరును ॥ మీరై ॥ 101

ధన్నాశి

విన్నవించుమనె మమ్ము వెలఁది నీకు నీవు
వన్నెలు చూపినఁగాని వలపులేర్పడవు ॥ పల్లవి ॥

మాటలాడి తనియదు మగువ నీతో నేఁడు
తాటించి పువ్వులవేసి తనియదు
గాటపుగుబ్బలు నిండఁ గాఁగిలించుకొన్నఁ గాని
వాఁటమైన మీలోని వలపులేర్పడవు ॥ విన్న ॥

చిఱునవ్వులు నవ్వియు చిత్తములోఁ దనియదు
తఱితో మొక్కులు మొక్కి తనియదు
పిఱుదంటి తొడలపైఁ బెట్టుకవుండినఁగాని
మఱియును మెరసి నీమచ్చికలేర్పడవు ॥ విన్న ॥

పొలసి పొలసి నిన్నుఁజూచి చూచి తనియదు
తలఁగక సేవసేసీ తనియదు
అలమేల్మంగఁ గూడితివట్టే లాలించినఁగాని
చెలఁగి శ్రీవేంకటేశ వలపులేర్పడవు ॥ విన్న ॥ 102

## గౌళ

ఏమేమి మర్మములో యిద్దరికే తెలుసును
వేమారుఁ బులకలతో విఱ్ఱవీఁగేరు ॥ పల్లవి ॥

నిలువుఁగొప్పులతోడ నీవు నాకె మాటలాడి
సెలవుల నవ్వులతో చిమ్మిరేఁగేరు
కొలఁదికిఁ గలువలు కొప్పులనుండి జారఁగ
మెలుపున మిమ్ముమీరే మెచ్చుకొనేరు ॥ ఏమే ॥

సందడించేసొమ్ములతో సరసములాడుకొంటా
కందువసిగ్గులతోడఁ గడుమించేరు
గందపులప్పులు మేన గలగల పైరాలఁగ
విందులుగ నొండొరుల వేడుకల మించేరు ॥ ఏమే ॥

యెమ్మెలతో శ్రీవేంకటేశ యలమేల్మంగతో
వుమ్మడిరతుల నసురుసురనేరు
కొమ్మిచెమట మేనులఁ దొటతొట వడియఁగా
చిమ్ముచును ముత్తెలసేసలు చల్లేరు ॥ ఏమే ॥ 103

## శ్రీరాగం

కనుఁగొని మొక్కరే కాంతలాల
వొనరి యిందరితోడ నున్నాఁడు దేవుఁడు ॥ పల్లవి ॥

చిప్పిల నదివో రతిచెమటలఁ దొప్పఁదోఁగి
కప్పురధూళి మేనఁ గడుఁజాతి
దప్పిదేరి చెంగలువదండల చప్పరములో
వుప్పతిల్ల వలపుల నోలలాడీ దేవుఁడు ॥ కను ॥

గుట్టున మిక్కిలి పెనఁగులాటనే యలసి
పట్టుపుణుఁగు మేన నంతటా నలఁది
వట్టివేళ్ళ సురట్ల వాసన సేదదేరి
వొట్టుకొని వేడుకల నోలలాడీ దేవుఁడు ॥కను॥

పలుమారు నవ్వులలో పంతములనే మెరసి
మెలుపున సొమ్ములెల్ల మేన ధరించి
అలమేలుమంగ నురమందుఁ గాఁగిలించుకొని
వొలిసి శ్రీవేంకటాద్రి నోలలాడీ దేవుఁడు ॥కను॥ 104

## నాదరామక్రియ

ఆపెకు నీకు నెంత అరువడమో
రేపును మాపునుఁ దమి రేఁచీని

ప్రియమైన సేసపాల పెండ్లికూఁతురు నీతో
నయగారిమాటలాడి నవ్వించీని
రయమునఁ బానుపుపై రాతిరిఁ బగలు నుండి
క్రియగూడారతులను కెరలించీని

దోమటి గలసినట్టి దొడ్డదేవులు నీతో
కోమలపుచూపుచూచి కొసరీని
కామించి పైఁడిపీఁటపై గలకాలముఁ గూడి
చేముంచి సరసములఁ జిక్కించీని ॥ఆపె॥

అట్టే వురమెక్కినట్టి యలమేలుమంగ నీతో
రట్టడితనానఁ గూడాడీఁ బెట్టీని
గట్టిగా శ్రీవేంకటేశ కాఁగిట సదా నుండి
జట్టిగొన్నసిగ్గులను చవి వుట్టించీని ॥ఆపె॥ 105

## సింధురామక్రియ

కంటిమి మిమ్మిందరిని కన్నులతుదల నేఁడు
తొంటివినుకులకు సంతోసమాయ నయ్యా ॥ పల్లవి ॥

చూపులనే ఆకె నీకు సుద్దులెల్లాఁ జెప్పెను
ఆపనులు యింకానేమి అడిగేవయ్యా
కైపుసేయకందుకుఁగాఁ గాఁగిలించుకొంటివి
చాపలాన రెంటికిని సరియాయ నయ్యా ॥ కంటి ॥

నవ్వులనే నీకు వినయములెల్లాఁ జూపె
తవ్వుచు నప్పటి నేమి దడవేవయ్యా
చివ్వన నందుకుఁగాను చెక్కులు నొక్కితివి
యివ్వల నందుకిందుకు నీడువచ్చెనయ్యా ॥ కంటి ॥

మంతనాన నలమేలుమంగ నీకు మొక్కి కూడె
వంతుకు నన్నేలి యెంత వలచేవయ్యా
అంతలో శ్రీవేంకటేశ అందుకే లాలించితివి
కాంతుఁడవన్నిటాఁ దారుకాణ వచ్చెనయ్యా ॥ కంటి ॥ 106

519 వ-తేకు

## సాళంగనాట

వాఁడెవాఁడె వీఁడెవీఁడె వాడలలో మెరసీని
ఆఁడులనడుమనెంత అలరీని చూడరే ॥ పల్లవి ॥

కనకపు రథమెక్కి కప్పురము చల్లీని
వనితలమీఁదట శ్రీవల్లభుఁడు
వినువీధి మించినట్టి వేంకటాచలముమీఁద
నినుపుఁజందురుఁడు వెన్నెలగాసినట్లు ॥ వాఁడే ॥

దేవాసనముమీఁదఁ దిరమై పన్నీరు చల్లీ
వేవేలు సతులమీఁద విశ్వమూరితి
చేవమీరి శేషాద్రిశిఖరము మీఁదను
భావింప మేఘము జడివట్టి మించినట్లు ॥ వాఁడే ॥

పసిఁడిదండెల పీఁటపై నుండి పూవుల వేసి
వెస నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు
మిసిమి నంజనగిరిమీఁద వసంతవేళను
వెసఁ గల్పవృక్షము విరులిచ్చినట్లు ॥ వాఁడే ॥ 107

### కన్నడగౌళ

మిక్కిలి నేరుపరివి మేలెల్లా నెరుఁగుదువు
తక్కక నీగుణాలెల్లఁ దలఁచుకోరాదా ॥ పల్లవి ॥
నగితినంటా నీవు నన్ను నేల జరసేవు
మొగము చూపరాదా మొక్కేఁగాని
జిగిమోవెడిగేనంటాఁ జెక్కులేల నొక్కేవు
తగు నీబాసలెల్లాఁ దలఁచుకోరాదా ॥ మిక్కిలి ॥
చూచితినంటా నన్ను సుద్దులేఁటి కడిగేవు
చే చాఁచఁగరాదా చెలఁగేఁ గాని
కాచి పాదా లొత్తేనంటా కందువలేల యంటేవు
దాచి నీవంపిన లేక దలఁచుకోరాదా ॥ మిక్కిలి ॥
కాఁగిలించుకొంటి నంటా కడు నేమి మెచ్చేవు
చేఁగ రతి చూపరాదా శ్రీవేంకటేశ
రేఁగె లమేల్మంగ నంటా రేకలేల నించేవు
దాఁగని నీవొడఁబాటు తలఁచుకోరాదా ॥ మిక్కిలి ॥ 108

### మంగళకౌశిక

సేవ చేసే బలిమింతే చెలులకెల్ల
పూవువలె నింకా నిన్నుఁ బొగడేమయ్యా ॥ పల్లవి ॥
మొక్కఁగానే యింత యేల మొనగోర నూఁదేవు
లక్కవంటి చిత్తపు లలన నేను
యెక్కువ తక్కువ మాట లేమిననరాదు నిన్ను
పుక్కిటికోలఁది నిన్నుఁ బొగడేమయ్యా ॥ సేవ ॥

ప్రియము చెప్పఁగ నేల పిసికేవు చన్నులు
నయగారి జవ్వనపు నాతిని నేను
చెయిముట్టి యంతేసి చెనకఁగరాదు నిన్ను
ముయికి ముయిగా నిన్నుఁ బొగడేమయ్యా ॥ సేవ ॥

మట్టము ననఁగ నేల సొలసి వొడివట్టేవు
మట్టులేని యలమేలుమంగను నేను
అట్టడి శ్రీవేంకటేశ ఊయి గిలిగించరాదు
పొట్టఁబొ(పొ?)రుగున నిన్నుఁ బొగడేమయ్యా ॥ సేవ ॥ 109

## శంకరాభరణం

కైకొనవయ్యా ఘనుఁడవు
దీకొని మోహము దిగఁబోసీని ॥ పల్లవి ॥

జంకెనచూపులు సరసపుమాఁటలు
సంకె లేక సతి చల్లీని
పొంకపుఁగొసరులు భోగపుటుసురులు
వుంకువగా నీకొనరించీని ॥ కైకొన ॥

సెలవులనవ్వులు సిగ్గులమొఱఁగులు
నెలకొని యంగన నించీని
చెలువపుతెక్కులు చేతులమొక్కులు
వొలిసి కప్పముగ నొసగీని ॥ కైకొన ॥

మొగములో కళలు ముంచినరతులును
నిగిడెలమేల్మంగ నించీని
అగపడి శ్రీవేంకటాధిప కూడితి
యిగురుమోవి నీకిచ్చీని ॥ కైకొన ॥ 110

## నాదరామక్రియ

ఇటువంటివాని నిను నెట్టు గెలువఁగ వచ్చు
తటుకున నిన్నిటాను తప్పు లేదనేవు ॥ పల్లవి ॥

చేరి యెందుండో రాఁగాఁ జేయి వట్టుకొని నిన్ను
జారుకాణ చేసినాఁ దప్పు లేదనేవు
మారుముద్రలు నీమేన మచ్చములు చూపినాను
దార (రి?) దప్పకుండానుఁ దప్పులేదనేవు ॥ ఇటు ॥

పెండిలిపీఁటపై నీవు ప్రియముతోఁ గూచుండఁగా
దండములు వెట్టినాఁ దప్పు లేదనేవు
నిండు వింతవాసనలు నీవల్ల నుండఁగాను
దండి చేసుకడిగినాఁ దప్పు లేదనేవు ॥ ఇటు ॥

మిగులా నన్నుఁ గూడి మించాపెమోము చూడఁగా
తగవు నిన్నడిగినాఁ దప్పు లేదనేవు
నిగిడి శ్రీవేంకటాద్రినిలయ గోవిందరాజ
దగ యేల తోట్టెనంటేఁ దప్పు లేదనేవు ॥ ఇటు ॥ 111

## నారాయణి

వంతగాఁడ వీఁడె మమ్ముఁ బాయకువయ్యా
బంటిఁ బెట్టుకొని మమ్ముఁ బాలార్చవయ్యా ॥ పల్లవి ॥

జవ్వనపువారమో సముకపువారమో
యెవ్వరమే మన్నా నెగ్గులెంచకువయ్యా
నవ్వు నవ్వేవారమో నసుపైనవారమో
తవ్విన మోవి రసాల దప్పిదేర్చవయ్యా ॥ వంత ॥

సేవ చేసేవారమో చిత్తములోవారమో
కావరించినా మమ్ముఁ గైకొనవయ్యా
పూవువంటివారమో భోగించేవారమో
వేవేలు మన్ననల వెలయించవయ్యా ॥ వంత ॥

కడుమేనవారమో కప్రపుఁబడివారమో
యెడయక ఇట్టె వీడేలియ్యవయ్యా
కడగి శ్రీవేంకటేశ కలసిన నీవారమో
జడియక యిట్లానే చనవియ్యవయ్యా ॥ వంత ॥ 112

520-వ రేకు పాడి

అందుననే కనుఁగొనే నతని బత్తి
ఇందువదనరో నాకు నెరిఁగించఁగదవే ॥ పల్లవి ॥

చెప్పిన నావిన్నపము చేకొని విని నటవే
కప్పురమందె నటవే కానికగాను
ముప్పిరి నందుకుఁగాను మోము చెంగలించె నటే
చిప్పిలి కరఁగి యతఁ చెమరించెనటవే ॥ అందు ॥

వాలాయించి మా ఇంటకవచ్చె ననె నటవే
యేలేనని నిండుబాస లిచ్చె నటవే
మేలువాఁడై కొంత గొంత మేలమాడె నటవే
కీలెఱిఁగి మనమీఁదఁ గృపసేసె నటవే ॥ అందు ॥

ఇందాఁకా శ్రీవేంకటేశుఁ డెదుట నుండె నటవే
అందగాఁడై నాకు సతమాయ నటవే
ఇందరిలో ఁగిట నన్నేకతానఁ గూడెనటే
చందమాయఁ బనులెల్లా సరివచ్చె నటవే ॥ అందు ॥ 113

కాంబోది

నీవే యెరఁగవలె నెరజాణవు
వేవేలు నీకు విన్నవించే వారెవ్వరయ్యా ॥ పల్లవి ॥

నిరతి నిన్నటనుండి నీవికెతో నుండఁగాను
వరుసకు వచ్చి యాపె వాకిటనుండి
తరితీపు సేసేవు తరుణులిద్దరి సంది
వెరవుతో నీకు విన్నవించే వారెవ్వరయ్యా ॥ నీవే ॥

పూని నీవీకెతోను భోగించుకుండఁగాను
కానుక దెచ్చుక యాపె గాచుకున్నది
కానకమై ఇద్దరికి తమకములు రేఁచేవు
వీనులంట నీకు విన్నవించే వారెవ్వరయ్యా ॥ నీవే ॥

శ్రీవేంకటేశ నీవీకెఁ జేరి కూడుండఁగాను
సేవ సేసేనంటా నాపె చెంతనున్నది
అవరుసల నిద్దరి నందముగా నేలితివి
వేవేగ నీకు విన్నవించే వారెవరయ్యా ॥ నీవే ॥ 114

## శుద్ధవసంతం

దయ దలఁచినపుడే ధర్మము నీకు
ప్రియముతోడుత నింక బెరయఁగరాదా ॥ పల్లవి ॥

నలువంక నీతోనే నవ్వులు నవ్వీ నిదే
సొలసి సొలసి నిన్నే చూచీ నిదే
మలసి మలసి నీతో మాటలూనాడీ నిదే
కలికి నింతటనైనఁ గరుణించరాదా ॥ దయ ॥

సారె సారె నీతోనే సన్నలు చేసీ నిదే
కూరిములు పలుమారుఁ గొసరీ నిదే
నేరుపులు గలవెల్ల నీయందే నెరపీ నిదే
నారీమణికి నిట్టే నంటు చూపరాదా ॥ దయ ॥

వింతవింతలుగ నీకె వీడెము లిచ్చీ నిదే
సంతోసాన నిన్నునే జరసీ నిదే
రంతుల శ్రీవేంకటేశ రతులకు మొక్కీ నిదే
యింతిఁ గూడితి విందే యిరవుకోరాదా ॥ దయ ॥ 115

### ఆహిరి

నీవే మన్నించేవు గాక నీచిత్తము వచ్చితేను
కావరించి నే నిన్ను కాఁతాళము రేఁతునా ॥పల్లవి॥

సంగడి సతులు నిన్ను చన్నుల నొత్తిరంటాను
జంగిలిలో నే నిన్ను చండి సేతునా
అంగడివారెల్లా నిన్ను నంటఁ గాఁగిలించిరంటా
వుంగిటిగా నే నిన్ను నొత్తుకోలు సేతునా ॥నీవే॥

వుద్దండపు సతులెల్ల నొడివట్టి తీసిరంటా
కొద్దిమీర నే నీపై గోరు దీతునా
గద్దరి చెలులు నిన్ను ఘాతలెల్లాఁ జేసిరంటా
అద్దుకొని నే నిన్ను నాఁబడిగాఁ జేతునా ॥నీవే॥

ఆగడపు కాంతలు నిన్నలమి కూడిరంటా
వేగిరించి నే నిన్ను వేసరింతునా
యీగతి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
చేగ దేర నే నిన్ను చిమ్మి రేఁతునా ॥నీవే॥ 116

### ముఖారి

ఏపున నెంత వెఱతు వీయింతికి
ఆపెమాట మీర నని ఆనవెట్టుకొంటివో ॥పల్లవి॥

వేగినంతా నే నీకు విన్నపాలు చేసినవి
ఆగడాలు చేసితివి ఆపెతోడను
చేగలెక్క నీపై నేను సేసవిరులు వెట్టితే
పోగులుగా ఆకెదుటఁ బోసితివి ॥ఏపు॥

యేకతానఁ గస్తూరి నీకితవుగాఁ బూసినది
ఆకెకుఁ జూపితివి నీవంతలోననే
దాకొని నీచెవినిండాఁ దట్టుపునుఁగు వెట్టితే
పైకొని యాపెకు నెట్టు కానుకిచ్చితివి ॥ఏపు॥

చనుదోయి కాఁగిట లచ్చనగా నీకు నించితే
పెనఁగకు మనుచు నాపెకుఁ జూపేవు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి పద్దరిని
చనుమానాలిచ్చి మమ్ము సరిగాఁ బెంచేవు ॥ఏపు॥ 117

శుద్ధదేశి

ఏల గుబ్బతిల్లేరు మీరింతటిలోననే
అలికిని మగనికి నడ్డాఁకలున్నవా ॥పల్లవి॥
మాటలు సరివచ్చెనా మగువకు నీకును
యీటునఁ గనుఁగొనల నేమి నవ్వేరు
చోటు గలిగెనా మీకు సుద్దులెల్లాఁ జెప్పుకోను
అఁటదానికి మగవాని కడ్డాఁకలున్నవా ॥ఏల॥
తారుకాణలాయనా తరుణికి నీకును
యీరీతిఁ బెంగెమటతో నేమి నవ్వేరు
మేర గలిగెనా మీకు మెచ్చులెల్లా మెచ్చుకోను
ఆరయ సతికిఁ బతిక(కిన?)డ్డాఁకలున్నవా ॥ఏల॥
రతి మర్మములంటెనా రమణికి నీకును
యితవైన చొక్కులతో నేమి నవ్వేరు
పతము గలిగెనా చవులకు శ్రీవేంకటేశ
అతివకుఁ బతివైతి వడ్డాఁకలున్నవా ॥ఏల॥ 118

* 531-వ రేకు వరాళి

మీఁద మిక్కిలి సన్నలు మీరే యెఱుఁగుదురు
యీఁదా మోఁదా(?) మొక్కు మొక్కేమిదివో నేము ॥పల్లవి॥
తటుకున నందరితో తచ్చనలాడేటి నీ-
నటనలు చూచే నవ్వి నాపె
కుటిలము నెరఁగము గుంపించ నెఱఁగము
యిటువలె సేవ సేసే మిదివో నేము ॥మీఁద॥

* 521 నుండి 530 వఱకుగల పది రేకులు లేవు.

వనితలతో నెల్లా వంతులు జరపే నీ
నునుపులు చూచే నవ్వీ నాపె
పెనఁగఁగ నెరఁగము బిగియఁగ నెరఁగము
యొనసి కొలువు సేసే విదివో నేము ॥ మీఁద ॥

అలరి శ్రీవేంకటేశ అందరిఁ గాఁగిటఁ గూడె
నాలితనములు చూచే నవ్వీ నాపె
జాలిఁ బెట్ట నెరఁగము సాదించ నెరఁగము
యీలాగులఁ గలసే విదివో నేము ॥ మీఁద ॥ 119

సాళంగనాట

నీవెఱఁగవా యివి నెలఁతల నేరుపులు
వావి గలసినవారు వాసులు నెరవరా ॥ పల్లవి ॥

వంతమాడరాదు గాక వడతికిఁ సారె సారె
యెంత సేయరాదు పతి నెలయించి
వింతదానఁ గాఁ గనక వెన్నెల నవ్వునవ్వితి
జంతలైన వారైతే జంకించరా ॥ నీవె ॥

జగడించరాదు గాక సతులకు సారె సారె
పగలెంత చూపరాదు పచ్చి దోఁచను
తగినదానఁ గనక తలఁపు దాఁచనైతి
యొగసక్కెపు వారైతే నెమ్మె చూపరా ॥ నీవె ॥

వాసులెంచరాదు గాక వనితకు సారె సారె
సేసలెన్ని వెట్టరాదు చిమ్మి రేఁగి
సేసుకుండానఁ గనక శ్రీవేంకటేశ పొందితి
యీ సుద్దుల కొకరైతే నెంతయినాఁ జేయరా ॥ నీవె ॥ 120

## నాదరామక్రియ

ఉపచరించవయ్యా వువిదలను
వుపమలతోడనే వొడలు మోపీ ॥ పల్లవి ॥

జలజలఁ జెమటలు చన్నుల తుదలఁ గారఁ
అలసి గందము వూసీ నలిప నీకు
మలకల నెరివేణి మఱి వీఁపునఁ బొలయ
తలపోఁత గతులఁ బాదములొత్తీని ॥ ఉప ॥

వెడవెడ నిట్టూర్పులు విసర ముక్కునవెంట
జడిసి సురటి వీచీ సారెకు నేఁడు
తొడిఁబడఁ జెమటలు తొటతొటఁ బైఁ బడఁగ
జడిగొన మాటల సరసమాడీని ॥ ఉప ॥

కలసి వొండొంటితో కంకణా లొరయఁగాను
చెలఁగి కాఁగిటఁగూడి శ్రీవేంకటేశా
కులికి కులికి కొనగోరి గురులు సోఁకఁగ
పలురతుల చవులు పచారించీని ॥ ఉప ॥ 121

## శంకరాభరణం

ఎఱిఁగిన పనులకు నింతేలా
కఱతలు నేర్తువు కాంతుఁడ నీవు ॥ పల్లవి

పన్నినమాయలు పక్కన నుండఁగ
సన్నలు సేసినఁ జహశౌనా
వన్నెల నాతో వలపులు చల్లుచు
కన్నులార్పెదవు కడగడ(?)నీవు ॥ ఎఱిఁగి ॥

చేసిన వేరమి చేచే నుండఁగ
సేసలువెట్టిన సెలవవునా
బాసలు నాతో పలుమరుఁ జేయుచు
ఆసలు సేసే వవ్వల నీవు ॥ ఎఱిఁగి ॥

కలసిన గుఱుతులు కాఁగిట నుండఁగ
వలవని మఱఁగులు వైపౌనా
యెలమిని శ్రీవేంకటేశ నన్నేనసి
పులకించేవిదె పొరుగున నీవు ॥ ఎఱఁగి ॥ 122

సింధురామక్రియ

మేలు గలంతాను మెరసేను
తాలిమితో నిట్టే మాదండకు రావయ్యా ॥ పల్లవి ॥
మనసొక్కటాయ నింక మామాట వింటివి
ననుపై నానెలవికి నవ్వువచ్చెను
చెనకఁగానే నాకు చేయి మీఁదాయ నేఁడు
తనిసితి మింకాను మాదండకు రావయ్యా ॥ మేలు ॥
చలమెల్ల నీడేరె చనవు మాకిచ్చితివి
కళలు నా మోమునఁ గడు నిండెను
కొలువులో నుండఁగానే కూటములు దైవారె
తలకొని యిపుడు మాదండకు రావయ్యా ॥ మేలు ॥
నిండెను సంతోసము నెమ్మది నన్నేలితివి
మెండుగ శ్రీవేంకటేశ మెచ్చితి నిన్ను
పండుమోవితేనెతోనే ఫలమందె రతులెల్లా
దండిదై యున్నాఁడవు మాదండకు రావయ్యా ॥ మేలు ॥ 123

ముఖారి

నీ వెఱఁగనివున్న వా నేరుపరివి
వావులే గుటిసేసి వద్దనుండవయ్యా ॥ పల్లవి ॥
పొలసి యేమిటికైనా బొమ్మల జంకింతుము
చలపట్టి నిన్ను నట్టే సాదింతుము
యెలమిఁ బొందైనవారి కెగ్గులేవి తప్పులేవి
వలపులే గురిగావా తెలుసుకోవయ్యా ॥ నీవె

వినఁగానే నిన్నుఁ గడు వెంగెములాడుదుము
ననుపున నిట్టే కడు నాఁటఁజాతుము
చనవు గలవారికి సరియేమి చేసేమి
మనమలే గురిగావా మన్నించవయ్యా ॥ నీవె ॥

కందువ నేరతమైతే కడుఁ దమకింతుము
అందపు రతులచేత నలయింతుము
యిందునే శ్రీవేంకటేశ యేలితివి మమ్ము మోవి-
విందులివే గురిగావా వినోదించవయ్యా ॥ నీవె ॥ 124

532-వ రేకు కురంజి

చిన్నవానివలె నెంత చెప్పించుకొనేవు నీవు
యెన్నరాని రతులకు నెదురుకోవలదా ॥ పల్లవి ॥

చెంతనుండే చెలి నిన్నుఁ జెనకిన చెనకులు (లకు?)
చింతతోడఁ దలవంచి సిగ్గువడేవు
యింతవాఁడవా నీవు వేడుకకాఁడవు తొల్లె
దొంతర వలపులకు దోసిలొగ్గవలదా ॥ చిన్న ॥

ననుపున నాతి నీతో నవ్వే నవ్వులకు
వొనరఁగ నీచేతుల నొడ్డుకొనేవు
ననుచనివాఁడవా నంటుతో దొరవు నీవు
పెనఁగే తమకానకుఁ బ్రియపడవలదా ॥ చిన్న ॥

కోమలి శ్రీవేంకటేశ కూడె నీ కూటములకు
మోమ్ము చూచి యంతలోనే మొక్కు మొక్కేవు
సామాన్యపువాఁడవా సర్వేశ్వరుఁడ విదె
గోమున నెంతవడైనాఁ గొసరఁగ వలదా ॥ చిన్న ॥ 125

## సాళంగం

తలఁపు దెలియవద్దా తా నెటువంటి జాణఁడే
పిలిచే నన(గానే ప్రియపడీఁ దాను ॥ పల్లవి ॥

తెరలో నుండఁగా గుట్టు దెలుసుకొనుంటేను
వరకానివలె నేల తమకించీనే
దొరయంటాఁ దనకాలు దొక్కక వూరకే వుంటె
గొరబులు సేసి యేల కొసరీనే తాను ॥ తలఁపు ॥

తప్పక చూడఁగాను తలవంచుకొంటేను
వుప్పతించి నను నేల వొడివట్టీనే
చెప్పరాని మాట గాఁగా సిగ్గువడి వుండితేను
అప్పటి నానవెట్టేల అడిగీనే తాను ॥ తలఁపు ॥

బిగ్గెఁ గాఁగిలించుకోఁగా పెనఁగక వుంటేను
నిగ్గులఁ దానేల నాకు నేర్పవచ్చీనే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నన్ను
వొగ్గి కూడె నిఁక నేల వొరసీనే తాను ॥ తలఁపు ॥ 126

## భైరవి

ఇంకా నేఁటిసుద్దులు యెందాఁకాను
పొంకములన్నియును పొదిగున్నవి ॥ పల్లవి ॥

చెలరేఁగి నీవు తొల్లి చెప్పిన బుద్దులెల్లా
తలఁపులో నాతనికిఁ దగిలున్నవి
చలపట్టి సేసినట్టి సరసపుఁ జేఁతలెల్లా
నిలువునఁ జెక్కులెల్లా నిండి వున్నవి ॥ ఇ

నెమ్మది నీవు దొల్లి నేరిపిన నేర్పులెల్లా
సమ్మతిల్ల నాతనికి సతమైనవి
పమ్మి నీవు గరఁగించి పాడిన పాటలెల్లా
కమ్మి యాతని చెవులఁ గాఁపురములున్నవి ॥ ఇంకా ॥

నిరతి నలమేల్మంగ నీపతనిఁ గూడఁగాను
సిరులు శ్రీవేంకటేశుఁ జెంది వున్నవి
సరి నీకాఁగిటిలోని చన్నుల వొత్తులెల్లాను
వురముపై నాతనికి వుంకువైనవి ॥ ఇంకా ॥ 127

సాళంగనాట

సిగ్గువడఁ డిదివో చెలులాల
వెగ్గలపు సంతోసాన విఱ్ఱవీఁగీని ॥ పల్లవి ॥
వాఁడివో గోవిందరాజు వలపులు చల్లుతాను
పోఁడిమితోఁ బవ్వళించి భోగించీని
కోఁడి కోఁడి(?)చూపులను కొమ్మలు చూడఁగాను
నాఁడు నేఁడు వొక్కరీతి నవ్వు నవ్వీని ॥ సిగ్గు ॥
సంకుఁ జక్రములతోడ చంద్రగావి రెంటెముతో
కంకణముల చాఁచిన కరములతో
వుంకువ కానికలు వువిదలియ్యఁగాను
సంకెలేక మోవితేనె చవి చూపీని ॥ సిగ్గు ॥
బంగారు కటారమదే పానుపు శేషుఁడు వాఁడే
సింగారపు వేడుకలఁ జెలఁగీ నదే
చెంగటఁ బెండ్లాడు తాను శ్రీవేంకటేశుఁడు దానే
వుంగరపు వేలుచూపి వొద్దికయ్యీని ॥ సిగ్గు ॥ 128

శంకరాభరణం

పడఁతి నీపతికె భాగ్యములు
తొడిఁబడ దొరకెను దోమటు ॥ పల్లవి ॥
తెలియని నీ తేనెలమాటలు
తిలకింపఁగఁ దరితీపులు
చలిమి బలిమి నీ సరసపు సన్న
ల నిమ్మపండ్ల కానికలు ॥ పడఁతి ॥

ననిచిన సెలవుల నవ్వుల తేటలు
వొనరిన వలపుల వూటలు
కొనచూపుల నీ కూరిమి కొసరులు
చొనిపిన పొందుల చుట్టరికములు ॥ పదరి ॥

మిక్కిలి కాఁగిట మెరయు నీ రతులు
వొక్కటఁ బెనగొను వుంతువలు
యిక్కువ శ్రీవేంకటేశు నెనసితివి
మొక్కలములేని మోహములు ॥ పదరి ॥ 129

## మాళవిగౌళ

దేవరవు నీవు నీదేవుల నేను
వావి గద్దు గనక నీవద్దనే వుండుదును ॥ పల్లవి ॥

వేసరకుమీ నా వీరిడి మాటలకును
ఆసపడి యేమైనా నాడుదు నేను
వాసులెంచకుమీ నా వలపుల నవ్వులందు
రాసికెక్కనట్టె సరసములాడుదును ॥ దేవర ॥

తప్పులు వట్టకుమీ నా తమకపు చేఁతలకు
కొప్పు వట్టి తీసి నిన్నుఁ గొసరుదును
వుప్పటించకుమీ నా వుదుటుఁజూపులకు
చిప్పిల మర్మాలు నాఁటఁ జిమ్ముదు నేను ॥ దేవర ॥

గొరబు సేయకుమీ కూటపు నా రతులకు
అరుదులుగాఁ గూడి యలయింతును
యిరవై శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
మరిగితి నీకు నేను మఱవకు నన్నును ॥ దేవర ॥ 130

633-వ రేకు నాట

ఎందరి నెలయించితో యిట్లానే బూమిలోన
సందడిలోనే మీ(నీ?)కు సతమైతిమి ॥ పల్లవి ॥
కొచ్చి కొచ్చి నీవిట్టే కొలువుసేయించుకోఁగా
మచ్చికతోడుత నిన్ను మరిగితిమి
పచ్చిగా నీవు మాతో పగడసాలాడఁగాను
రచ్చకెక్కి యింతేసి రవ్వయితిమి ॥ ఎందరి ॥
మంతనాన మాచే నాకు మడిచి ఇప్పించుకోఁగా
ఇంతులమై నిన్ను నిట్టే యెనసితిమి
సంతతము నీవిట్టే సంగడిఁ బెట్టుకుండఁగా
నంతటా మందెమేళములై పెనఁగితిమి ॥ ఎందరి ॥
కప్పురముమోవి నంటి కాఁగిలింపించుకోఁగాను
వొప్పుగా దేవుళ్ళమై వొనరితిమి
యిప్పుడే శ్రీవేంకటేశ యిన్నిటా మమ్మేలఁగాను
యెప్పుడూ నురముమీఁద నిరవైతిమి ॥ ఎందరి ॥ 181

సామంతం

చెలి చెప్పినట్టు నీవు సేయరాదా
పెలుచుఁదనాన నేల బిగిసేవు ॥ పల్లవి ॥
సారె సారె నీతో సలిగకుఁ బెనఁగఁగా
మారుకొన నేమిటికి మగువతోను
కోరి వేఁడి నిన్నుఁ గొసరి కొంగువట్టితే
ఆరితేరి యాల అలసేవు ॥ చెలి ॥
వచ్చి వచ్చి నీతో వావులు చెప్పఁగా
కుచ్చితములేమిటికి కోమలితోను
మచ్చికసేసి నీతో మాటలాడఁగాను
వచ్చి సేసి యింత యాల పదరేవు ॥ చెలి ॥

కదిసి కదిసి నిన్నుఁ గప్పురములడుగఁగా
వుదుటు జంకెనలేల వువిదతోను
మొదల శ్రీవేంకటేశ మొగము చూడఁగాను
అది యాల పరవశమందేవు ॥ చెలి ॥ 132

## మంగళ కౌశిక

ఎక్కడౌ తా నెఱుఁగవు యేమయ్యా
దిక్కరించనోపము(ను?) తెర వేసే మ(న?)య్యా ॥ పల్లవి ॥
చెక్కులఁ జెమట నిండె చెలియ తురుము వీడె
యిక్కువలంటి పెనఁగే వెందాఁకనయ్యా
చొక్కపు నీసతులెల్లాఁ జూచి కదు నవ్వేరు
తెక్కుల నీ కూటమికిఁ దెర వేసే నయ్యా ॥ ఎక్క ॥
చన్నులు బయటఁబడె జవ్వనమదము రేంగె (రేఁగె?)
యెన్నేసి నవ్వులు నవ్వే వెందాఁకా నయ్యా
సన్న సేసుకొంటాను సతులెల్లా మూఁగేరు
తిన్నని నీ సిగ్గు మూయఁ దెర వేసే నయ్యా ॥ ఎక్క ॥
మొలనూలు జారెను ముందే పోఁకముడి వీడె
యెలమిఁ గూడితి వాసలెందాఁకా నయ్యా
వలచి శ్రీవేంకటేశ వనితలు మెచ్చేరు
తెలిసితి మీ మనసు తెర వేసే నయ్యా ॥ ఎక్క ॥ 133

## మధ్యమావతి

ఇంత సేతురటవే యిందరిలోన
కాంతుడు సిగ్గువడఁగా కాంతలెల్లా దూరిరి ॥ పల్లవి ॥
మచ్చిక నాతఁడు నిన్ను మన్నించిన మన్ననకు
పచ్చిసేతురా మోవి పడఁతి నీవు
కుచ్చి యట్టే తలవంచుకొని యాతఁడుండఁగాను
ఇచ్చకపు చెలులెల్లా నెంతో నిన్ను దూరిరి ॥ ఇంత ॥

చల్లఁగా నాతఁడు నీకు చనవిచ్చినందుకు
వెల్లిగా నలయింతురా వేగినంతాను
బల్లిదుఁడైనాతఁడిట్టే పవ్వళించి వుండఁగాను
తొల్లిటిసతులెల్లాను తొడిఁబడ దూరిరి ॥ ఇంత ॥

అట్టె శ్రీవేంకటేశుఁడంటి నిన్నేలినందుకు
నెట్టన బానగొందురా నీటుతోడను
వొట్టుక నీపంపు సేయుచుండఁగా నితనిఁ జూచి
నెట్టుకొన్న మగువలు నిన్నుఁ గదు దూరిరి ॥ ఇంత ॥ 184

## వరాళి

ఇన్నాళ్ళు తానెందుండెనో యేమని చెప్పేము నేము
సన్నలు సేయఁగఁ జూచి చలము మీరేమయ్యా ॥ పల్లవి ॥

జలజాక్షి నీతోను సారె విన్నపాలు సేసీ
యెలమి నీవెంత చనవిచ్చితో కాని
కలకల నవ్వుతాను కందువలు నీకుఁ జూపీ
వెలయ మాకు నేఁడు వెరగయ్యీనయ్యా ॥ ఇన్నా ॥

కన్నుల కలికి నీకు కానుకలందిచ్చీని
నిన్నా నేఁడే యెంత మన్నించితో కాని
చన్నుల నొరసుతాను సంగడినే కూచుండీ
వన్నెల నిందుకే మాకు వాసి పుట్టీనయ్యా ॥ ఇన్నా ॥

జవరాలు నీమోవిచవి నీకుఁ జెప్పీని
సవి నేర్పు లెంత నూరి పోసితో కాని
యివల శ్రీవేంకటేశ ఇన్నిటాను నిన్నుఁ గూడె
తవిలి నన్నేలితివి తగవాయనయ్యా ॥ ఇన్నా ॥ 185

కేదారగౌళ

అడుగరే యాతనినే అంగనలాలా
గుడిగొని తానే వట్టి గొరబాయఁ గాక ॥ పల్లవి॥
యెదురాడేదాననా యెంతటి పనికైనా
పదరి తానే మారు పలికీఁ గాక
తుద మీఱేదాననా దూరైన యంత దిరిగినా
మదమునఁ దానే మారుమలసీఁ గాక ॥ అడు॥
కక్కసించేదాననా కడలెంత దొక్కినాను
వెక్కసీఁడై తానే యిటు వెలసీఁ గాక
మొక్కలపుదాననా ముందు వెనకెంచితేను
పక్కనఁ దానె ముంచి పంతమాడీఁ గాక ॥ అడు॥
తడఁబడేదాననా తనరతివేళను
బడిబడిఁ దానే చొక్కి భ్రమసీఁగాక
అడిగేటిదాననా అందరిలో నన్నుఁ గూడి
అదరి శ్రీవేంకటేశుఁడాదరించీఁ గాక ॥ అడు ॥ 13

594-వ రేకు ఆమర సింధు

కాంతల నెన్నడుముల కఱవు దీర
దొంతిమోవిబోనాల జాతర సేయవయ్యా ॥ పల్లవి॥
చిత్తడిచెమటివాన చెక్కులవెంటాఁ గురిసె
యెత్తిన మదములను యేరులు వారె
గుత్తపు గుబ్బల పెద్దకొండలకు గండి గట్టి
బత్తితోడ వలపుల పైరుసేయవయ్యా ॥ కాంతల
పులకల ససులు గొబ్బున మైనిండా మొలచె
యెలమిఁ దమకముల యెన్నులు వెళ్ళె
కలికిజవ్వనముల కళ్ళాముసేసి నురిపె (పి?)
కొలపుల బోగాలఁ గోరు గొనవయ్యా ॥ కాంత

అంగజరాజ్యపదవి కామనికాలము వచ్చె
పొంగి రతులు పోఁకకుఁ బుట్టెఁడాయను
యింగితపు శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
సంగతిగా మోహనరాజ్యము ఏలవయ్యా ॥ కాంతల ॥ 137

## భైరవి

ఇంక నైనా వేఁడుకో నీ ఇంతిని నీవు
సంకె దేరుతురు గాక సాము సేతురా ॥ పల్లవి ॥

చేరి చన్నులంటఁగాను సిగ్గువడ్డ యాఁటదాని
గారవించవలెఁ గాక గద్దింతురా
తెరకొనఁ జూడఁగాను తెరవేసుకొన్నదాని
సారె బుజ్జగింతు (తురు?) గాక సాదింతురా ॥ ఇంక ॥

కొప్పు వట్టి తియ్యఁగాను కొంకినట్టి యాఁటదాని
దప్పి దేరుతురు గాక తమకింతురా
ముప్పిరిఁ బెనకఁగాను మొక్కుచున్నయట్టిదాని
దుప్పటి గప్పుటగాక దొమ్మి సేతురా ॥ ఇంక ॥

కైవసమై కూడఁగాను కడుఁ జొక్కినాఁటదాని
మోవి యానుదురుగాక మొక్కింతురా
శ్రీవేంకటేశుఁడ వదే చెలి యలమేల్మంగ
దేవులౌఁ బెంచేది కాక కావరింతురా ॥ ఇంక ॥ 138

## పాడి

అతనిచెలిని నాకేమనరాదు
కాతరించ నేఁటికి నుంగరమందుకొనవే ॥ పల్లవి ॥

సిగ్గువడ నేమిటికి చెలువుఁడు కాఁగిలించె
వొగ్గి యింక నాతనితో నొనగూడవే
నిగ్గుల నామోము చూచి నీవేల నవ్వేవే
వెగ్గళించ కాతఁడిచ్చే విడెమందుకొనవే ॥ అతని ॥

పల్లదము లేమిటికే పచ్చడము గప్పెఁ బతి
చల్లఁగాఁ జెప్పినట్ల సమ్మతించవే
వొల్లనె నాకొంగువట్టి వొద్దికేల తీసేవు
ఇల్లిగుఁడాతని నిమ్మపండందుకొనవే || ఆతని ||

శిరసు వంచనేఁటికి శ్రీవేంకటేశుఁడు గూడె
తెరవేసుకొనె (ని?) లోలోఁ దిరముగావే
గరిమ నలమేలుమంగవు నన్నెంత మెచ్చేవు
పొరిఁబొరి నాతని పువ్వులందుకొనవే || ఆతని || 139

### తెలుఁగుఁగాంబోది

విరహతాపము మాన్పవే నీవు
సిరులతోడుత సేవసేసే నేను || పల్లవి ||

తలపోసి తనలోనే తమకమందిఁ జెలి
పిలిచి తేఁగదవే ప్రియుని నీవు
చెలపచెమటలివే చెక్కులనే వడిసీని
వెలయ సురటిఁ గొని విసరే నేను || విరహ ||

యెదురుచూపులనే యింతి పరాకై వున్నది
కదియించఁ గదవే కాంతునిని
పొదలుఁ దాపపువేఁడి పొరిఁబొరి ముంచీని
సదరానఁ బన్నీరు చల్లే నేను || విరహ ||

కూడేటి రతివేడుక కొమ్మ పులకించె నిదే
యీడనే శ్రీవేంకటేశు నెచ్చరించవే
వోడక యీగోవిందుఁడే వొడయఁడై యీకె నేలె
జోడై నీవలెనే కాచుకవుండే నేను || విరహ || 140

## పూర్వగౌళ

నలువంక సతులెల్ల నవ్వేరాతని
యెలమి నింతేసి బాయిట వేయఁదగునా ॥ పల్లవి ॥

ఘనుఁడైన మగవానిఁ గొంతలెంత వలచిన
చెనకి కడుఁ బచ్చిగఁ జేయఁదగునా
పెనఁగుచు నాతఁడు తప్పించుకొనఁగానే నీవు
కనుపట్ట మోవిమీఁద గంటి సేయఁదగునా ॥ నలు ॥

దొరతనపు విభునిఁ దొయ్యాలులెంత మీటిన
సిరులఁ గొల్వునఁ గాకుసేయఁదగునా
పొరసి యాతఁడు నిన్ను బొమ్మల జంకించఁగానే
తొరలించి సంగడిపొందులు చూపఁదగునా ॥ నలు ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జెలులెంతాసోదమైన
సేవ సేసి సిగ్గువడఁ జేయఁదగునా
యీవల నాతఁడు నిన్ను నెనసి మెప్పించఁగానే
ఆవటపు రతులను అలయించఁదగునా ॥ నలు ॥ 141

## బౌళి

సిగ్గువడి మూల నేమిసేసేవు నీవు
అగ్గమైన నాయకుని అండకు రాఁగదవే ॥ పల్లవి ॥

తలపోసి తలపోసి తమకించి నినుఁ బిల్చు
చెలి వూడిగముదని చింతింపఁడు
చిలుకవలికితే నీయెలుగంటా మాటాడఁ
వలచిన రమణునివద్దికి రాఁగదవే ॥ సిగ్గు ॥

వుమ్మడి నీనిట్టూర్పుని వూరకే దిక్కులు చూచు
యుమ్ములఁ జల్లగాలెని యెరఁగఁడు
నెమ్మి వెన్నెలగాయఁగ నీనవ్వుని తానూ నవ్వీ
రమ్మనవలెనా పతి రతికి రాఁగదవే ॥ సిగ్గు ॥

పదరుచు లేచి నీపంజని యెదురేఁగు
ఉదయచంద్రుఁడని వూహించఁడు
యిదివో శ్రీవేంకటేశుఁ డింత సేసి నిన్నుఁ గూడె
యెద వెట్టుకోవలెనా యెప్పుడు రాఁగదవే ॥ సిగ్గు ॥ 142

535-వ రేకు శుద్ధవసంతం

ఏల కైకొనేవు నీవు యెవ్వరినిఁ దలఁచేవు
జాలిఁబెట్టే యీపాపెపొందు చవులాయను ॥ పల్లవి ॥

వాలు(లి?)కచూపులు నీపై వంచెఁ జెలి యవి నీకు
గాలములై నీ చిత్తము కడుఁ దగిలె
నాలిమాటలెల్ల నీతో నానవేసి యాడఁగాను
ఆలరి నామములై నీకు నన్ను వట్టెను ॥ ఏల ॥

పరగ సిగ్గులు నీపై నిట్టే వేయఁగాను
సిరుల వలపులెల్లఁ జిమ్మి రేఁగెను
పురికొలిపే నవ్వులు పొంచిపొంచి నవ్వఁగాను
తరితీపులై నిన్ను మరిగించెను ॥ ఏల ॥

నందుసుడి నీకాపె సన్నలటు చూపఁగాను
విందులై నోరూరఁజేసె వేడుక నీకు
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నిన్నుఁ గూడఁగ
అంది నన్ను నేలించి ఆసలు వుట్టించెను ॥ ఏల ॥ 143

పాడి

కానీవే యెందు పొయ్యేము కందము తననేమము
తానే పంతములు పాఁతరఁబెట్టకుండీనా ॥ పల్లవి ॥

పిలిచితే రాఁ డట్టె బిగిసీ నీపాటి వాఁడు
చెలఁగి మనసు రాయి సేయకుండీనా
సెలవుల నగినాను చేరి అది యేలనఁడు
తెలిసి పూవుటమ్ములు తెగఁ గోయకుండీనా ॥ కానీ ॥

కానుకిచ్చితే నొల్లఁడు కపటమంత గలితే
దీనకాన (దీనుకొన?) వలపు ముద్రించకుండినా
వీనులలర నే విన్నవించినాను వూఁకొనఁడు
మానినుల జవ్వనాలు మాన్పకుండినా ॥ కాని ॥

కదిసితేఁ బైకొనఁడు కాఁకలింత సేసేవాఁడు
కదలించి మరు నుట్టిఁగట్టకుండినా
ఇదివో శ్రీవేంకటేశుఁ డెనసితే మన్నించె
పెదవితేనె చక్కెరబిల్ల సేయకుండినా ॥ కాని ॥ 144

## దేసాళం

ఏమిచేసినాఁ జెల్లు నీకాలము
నాములువార సెలవి నవ్వు నవ్వవే ॥ పల్లవి ॥

సందడిలోపల నీవు సన్న చేసేవు పతికి
కుందనేల నీవూ నండఁ గూచుండవే
యెందరికైనా నోపు నితఁడు నీకోపఁడా
విందువలె చేతికి నీ విడెమియ్యవే ॥ ఏమి ॥

పొలసి యెచ్చరికెగా పూవుల వేసేవాతని
చలపట్టి నీవు సరసములాడవే
నెలకొన్నా సోదకాఁడు నిన్ను మానీనా యాతఁడు
[illegible]కితనాల నట్టే కాఁగిలించవే ॥ ఏమి ॥

కమ్మటిఁ గమ్మటి వచ్చి కానుకిచ్చే వితనికి
వుమ్మడి నీ చన్నులను వొరయఁగదే
యెమ్మె నితఁడే శ్రీ వేంకటేశుఁడు నన్నూ నిన్నేలె
సమ్మతించి మోవి యట్టే చవిగొనవే ॥ ఏమి ॥ 145

### కాంభోది

పొంచి మొకమిచ్చులఁ బొద్దు గడపేవు గాక
వంచల చిత్తాన నీకుఁ బట్టఁబోయీనా ॥ పల్లవి ॥
కూరిమొకచో నుండఁగ కొచ్చి యెంత మాటాడిన
సారెకుఁ బరాకే కాక చవి వుట్టీనా
గారవించెప్పటనుండి కతలెల్లఁ జెప్పె నీకు
వేరి(రు?) కుచ్చంబొకమైనా బెరయఁ జెప్పేవా ॥ పొంచి ॥
చూపులొకచో నుండఁగ సొలసెంత పెనఁగిన
దాపులఁ బోరచే కాక తమి వుట్టీనా
యేపున నింతవడాకె యెదుటనే వుండె నీకు
రూపించి యీ సింగారమేరుపఱచి చెప్పేవా ॥ పొంచి ॥
మాటలొకచో నుండఁగ మర్మములెంత యంటిన
పాటపాడే కాక బత్తి పాదుకొనీనా
యీటున శ్రీవేంకటేశ యేలితివాకెను నన్ను
కూటములు తడఁబడకుండాఁ జెప్పేవా ॥ పొంచి ॥ 146

### శంకరాభరణం

విన్నపము లింక నేల వేమారును
అన్నిటాఁ దొల్లే తనకు నాలనైతి ననవే ॥ పల్లవి ॥
మొదలనే తనకును మొక్కితి నేననవే
వదలి తురుమందుకే వంగె ననవే
నుదురెల్లఁ జెమరించి పదనాయ ననవే
యెదిటికి వచ్చి నన్ను నిట్టేయేలుమనవే ॥ విన్నప ॥
యిన్నిటాఁ దనకుఁ బంత మిచ్చితి నేననవే
చన్నులపై పయ్యదట్టే జారె ననవే
వున్నవి తనముద్రలు వురముపై ననవే
నన్నలనే తనమోవి చవిచూపు మనవే ॥ విన్నప ॥

తనమాఁటలకు లోనై దక్కితి నేననవే
వానరేఁ బులకలు సావాళ్ళ ననవే
యెనసె శ్రీవేంకటేశుఁ డిదె తానే యనవే
నను నిట్టే మన్నించె నవ్వుమింక ననవే ॥విన్నప॥ 147

శ్రీరాగం

ఎంత భాగ్యవంతుఁడవో యిదివో నీవు
వింత వింత సుద్దులెల్ల వినిపించీ నాపె పల్లవి

పొలసి పొలసి చూచి చొక్కించీ నిన్ననదే
కలువరేకులవంటి కన్నులయాకె
పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు చెప్పీనదే
మొలకనవ్వులతోడి మోవియాకె ॥ ఎంత ॥

తగిలి తగిలి నీతోఁ దప్పక మాఁటాడీ నదే
జిగినద్దములవంటి చెక్కులయాపె
పొగడి పొగడి నీతో పొందులు సేసీ నదే
వెగటుఁ జంద్రకళల మొగముదాపె ॥ ఎంత ॥

కమ్మరఁ గమ్మర నిన్నుఁ గాఁగిటఁ గూడీ నదే
కుమ్మరింపుఁ గులుకుల కుచములాపె
యిమ్ముల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
సమ్మతించె జవ్వనపు చక్కనియాపె ॥ ఎంత ॥ 148

536-వ రేకు గౌళ

ఏల సిగ్గువడేవు నీ విందరుఁ జూచేరంటా
మేలు నీకు గలిగితే మెకొనఁగ రాదా ॥ పల్లవి ॥

పొలసి పొలసి యాకె చుట్టరికేలు చెప్పఁగ
చెలరేఁగి విని నీవు చెమరించేవు
కలయ వేడుక నీకుఁ గలిగితేఁ గన కట్టే
బులియక లోనికేఁగి భోగించరాదా ॥ ఏల ॥

వద్దనుండి యప్పటి నీవావులెల్లఁ దెలుపఁగ
కద్దనుచు సమ్మతించి కళ రేఁగేవు
పొద్దున నీకింతేసి పొందు సేయ వలసితే
పెద్దరికా లెందాఁకాను బెరయఁగ రాదా ॥ ఏల ॥

కూడినట్టి పొంతనాలు కొంకక తాఁ జెప్పఁగాను
యీడనే కాఁగిట నించి యిటు మెచ్చేవు
వోడక శ్రీవేంకటేశ వొనగూడితివి నన్ను
వీడరాదా పెను యిట్టే వెలయించ రాదా ॥ ఏల ॥ 149

## ముఖారి

ఎఱఁగవా ఆఁడుఁదగ వింతిరో నీవు
తఱవాతి పనులకుఁ దమకించవే ॥ పల్లవి ॥

కొనగోర నూఁదితేనే కోపగించుకొనకువే
చనవులు చేసుకొని సమ్మతించవే
మనసు చూచీనింతే మచ్చరించవలదే
ననుపున సెలవుల నవ్వు నవ్వవే ॥ ఎఱఁగ ॥

గుబ్బచన్నులంటితేను గొణఁగి తిట్టకువే
అబ్బురము చేసుకొని ఆదరించవే
వుబ్బులు రేఁచీనింతే వోరటు చూపకువే
నిబ్బరాన వీడెమిచ్చి నేరుపు మెఱయవే ॥ ఎఱఁగ ॥

చెక్కు నొక్కి కూడితేను సిగ్గులు వడకువే
మిక్కిలి నీ తల యెత్తి మెచ్చు మెచ్చవే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డేలె నింత వీఁగకువే
చొక్కించి దప్పులు దేర్చి జోడు వాయకువే ॥ ఎఱఁగ ॥ 150

### ఆహిరి

ఐతివే యేలికెసాని వందరికిని
నీతితో నవతులెల్ల నీకు లోనే యిఁకను ॥ పల్లవి ॥
ఆరసి నీ కాతఁడు అరవడమచ్చునే
పేరురాన నేపొద్దూఁ బెట్టుకున్నాఁడు
సారెకు నీవు మంచి సకినాన వచ్చితివే
యీరాని చనవులెల్లా నిచ్చినాఁడు నీకు ॥ ఐతివే ॥
పొందుల నీకాతనికి పొంతనాలు గూడునే
మందలించి నీవాడినమాట దోయఁడు
యెందును నీమొకమాయ మందు యెటువంటిదే
కందువ నీ మోవికే కాచుకున్నాఁ డిపుడు ॥ ఐతివే ॥
చెలఁగి మంచివేళనే సేస నీవు వెట్టితివే
కలసి పాయఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
అలరి మమ్మేలెనాతఁ డప్పణ నీవిచ్చితివే
వలపించ నేరుతువే వసమాయ నతఁడు ॥ ఐతివే ॥ 151

### ముఖారి

ఎంత చెప్పినా మానఁడు యెగ్గులు వట్టీఁ దాను
వింతలు సేయక మీరు విన్నవించరే ॥ పల్లవి ॥
కొప్పు వట్టి తియ్యఁగాను కొసరి తిట్టఁగరాదా
అప్పటి నవ్వఁగఁ జేత నంటరాదా
కుప్పించి పెనఁగఁగాను కొనగోరు మోపరాదా
చెప్పరే యీతగవులు చెలులాల మాకు ॥ ఎంత ॥
వొక్కటొక్కటే యాడఁగ వొట్టు వెట్టఁగరాదా
తొక్కరాఁగా మారుకొని దొబ్బరాదా
వెక్కసాన నడవఁగా విరుల వేయఁగరాదా
నిక్క మేది కల్ల యేది నెలఁతలు చెప్పరే ॥ ఎంత ॥

గుంపించి వొరయరాఁగా కుచముల వొత్తరాదా
సొంపున నెమ్మొ సేయఁగా పొలయరాదా
యింపుల శ్రీవేంకటేశుఁడింత సేసి నన్నుఁగూడె
జంపుసేయక చెప్పరే సతులు మాకిపుడు ॥ ఎంత ॥ 152

## నీలాంబరి

నవ్వవే యెక్కడిసుద్ది నయముగా నతనితో
రవ్వలు చేసుకొంటేను రాఁపు కెక్కదా ॥ పల్లవి ॥

సరసములాడఁగానే చనవులెల్లఁ బుట్టుఁ గాక
యెరవులు చేసుకొంటే నెనసుండునా
మరిగి వుండఁగానే మనసులెనసుఁ గాక
వొరటులు చూపితేను వొడఁబాటు గలదా ॥ నవ్వవే ॥

ఇచ్చకాలు సేయఁగానే ఇంపులు రేఁగుఁగాక
మచ్చరానఁ బెనఁగితే మట్టుపడునా
మచ్చికలు చూపఁగానే మర్మములు సోఁకుఁగాక
వచ్చిగాఁ గాఁతాళించితే భావాలు గరఁగునా ॥ నవ్వవే ॥

చుట్టరికాన మించితే సులభమౌఁగాక మేలు
అట్టులు చేసుకొంటే మఱఁగు సేయవచ్చునా
ఇట్టె శ్రీవేంకటేశుఁ డెనసెఁ దానే నిన్ను
గుట్టులు చూపకుండితే కొంకు దేరునా ॥ నవ్వవే ॥ 153

## పాడి

కల్లరి వౌననరాదు కాదనరాదు
చెల్లు నీవు సేసినట్టి చేఁతలెల్లా నిపుడు ॥ పల్లవి ॥

తలఁపులో నొకటియు తనువుపై నొకటియు
కలదెల్ల నీ వల్లఁ గంటిమి నేఁడు
నలువంక సన్నలును నామీఁది మన్ననలు
పలుమారు నిందరిలోఁ బచ్చిదేరె నిపుడు ॥ కల్లరి ॥

చెప్పేటి దొకటియు సేసేటిదొకటియు
దెప్పరాన నీ సుద్దులు తెలిసితిమి
తప్పఁజేరి పిలుపులు తగ నాపై వలపులు
విప్పుగా నీవోజ వెల్లావిరులాయ నిపుడు ॥ కల్లరి ॥

కొలువులో నొకటియుఁ గూటమిలో నొకటియు
యెలమి నీగుణమెల్లా నెరిఁగితిమి
అలమేలుమంగను నేనని శ్రీవేంకటేశుఁడ
కలసితి నీవలపు గట్టియాయ నిపుడు ॥ కల్లరి ॥ 154

537-వ రేకు రామక్రియ

ఎవ్వరినైనా మన్నించి యింత సేసుకొంటివి
జవ్వనపాయ మింత సడిఁ బెట్టీని ॥ పల్లవి ॥

చెంగట నీవు నాపై చేతులు చాఁచితి వంటా
అంగడిఁ బెట్టి నావలపులాడీ నాకె
వుంగరాలు నాకు నిచ్చి వొడఁబరచితివంటా
జంగిలిసవతులకు సరి నెచ్చరించీని ॥ ఎవ్వ ॥

ముచ్చటలాడి నాకు మోవి చూపితివంటా
పచ్చిసేసి నన్ను సిగ్గువఱచీ నాపె
మెచ్చి నీకంటసరి నామెడఁ బెట్టితివంటా
చెచ్చెరఁ దోడి వారికిఁ జెప్పి చూపీని ॥ ఎవ్వ ॥

లాలించి నన్నుఁ గూడి పల్లకి యెక్కితివంటా
పాలుపడి నన్నునే వుప్పతించీ నాపె
యేలితి నన్ను శ్రీవేంకటేశ యలమేల్మంగను
పోలిమి నందరెరఁగఁ బొగడి చూపీని ॥ ఎవ ॥ 155

### నారాయణి

సతికినిఁ బతికిని చలములేల
రతివేడుకలనే రమించుట గాక ॥ పల్లవి ॥
బింకములే తలచైతే ప్రియములేరీతి మించు
జంకెనలెక్కుడైతేను శాంతములేవి
మంకులే మెరసితే మర్మములెట్టు గరఁగు
లంకెలై వొకరొకరు లాలించుట గాక ॥ సతికి ॥
నాలితనము నేర్చితే ననుపులెక్కడ నుండు
తూలపోవ నాడితే సంతోసమేదది
కేలనే వొడ్డు కొంచేను క్రియలెట్టు సమకూరు
తాలిమితో నవ్వులను దైవారుటగాక ॥ సతికి ॥
యెమ్మెలే మిక్కుటమైతే యియ్యకోలెట్ల నౌను
దొమ్ములే నెరపితే పొందులెట్లు గల్గు
కొమ్మ నిన్నలమేల్మంగ కూడె శ్రీవేంకటేశుఁడ
వుమ్మడి సరసముల నోలాడుట గాక ॥ సతికి ॥ 156

### భవుళి

అడుగరే యీమాట ఆతనిని
తడవఁడు కాఁకఁడు తనునెట్టు నమ్మేదే ॥ పల్లవి ॥
వలపే కలిగితే వాడికెకు రావలదా
తలఁపునఁ దగిలితే తమకించఁడా
కలపుకోలైతేను కరుణించఁ దగదా
పిలిపించుకొనీఁ దాను ప్రియమెట్టు నమ్మేదే ॥ అడుగ ॥
చేతికి లోనైతేను చెప్పించుకొనునా
కాతరమే కలిగితే కైకొనఁడా
యీతల వేడుకైతే నింట నిట్టే వుండఁడా
భీతి యించుకంతా లేదు ప్రియమెట్టు నమ్మేదే ॥ అడుగ ॥

చెప్పినట్టు సేసితేను సెలవుల నవ్వునా
చిప్పిలఁ గరఁగితేను సిగ్గువడునా
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
పిప్పిగా నింతగాకున్న ప్రియమెట్టు నమ్మెదే ॥ అడుగ ॥ 157

## దేవగాంధారి

ఇంతులెల్లా విని యింక నేమందురు
కాంతుఁడవు ఇటువంటి కాకు గలదా ॥ పల్లవి ॥

అగ్గమై నీవు నావొద్ద నాపెచన్ను లంటఁగాను
సిగ్గువడి వున్నదాన చెక్కుచేతితో
యెగ్గెరఁగకొక్కపాటే యిద్దరిఁ గూడవచ్చేవు
కగ్గుదేర నిటువంటి కాకుగలదా ॥ ఇంతు ॥

పోరి నేఁ జూడఁగా నాపె పోఁకముడి జారించఁగా
శిరసు వంచుకుందాన చెక్కుచేతితో
సరుస నిబ్బితి లేక జంట రతి సేసేవు
గరిమెల నిటువంటి కాకు గలదా ॥ ఇంతు ॥

వుమ్మడి నాకె నీవు నావొద్దనే కూడఁగాను
చిమ్మిరేఁగి వున్నదాన చెక్కుచేతితో
యెమ్మెతో శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కమ్మరఁ గమ్మర నింత కాకు గలదా ॥ ఇంతు ॥ 158

## దేశాక్షి

రమ్మనవే యింకనేల రతికెక్కఁ దానిట్టె
దొమ్మిచేసి నేనిందుకు దూరవచ్చేనా ॥ పల్లవి ॥

పంతమాడి నిజములు పచరించ వచ్చీని
యెంత లేదు తనసుద్ది లెఱుఁగమ లే
వింతదాననా నేను విభుఁడు తా నెట్టుండినా
రంతుచేసి నేనిప్పుడే రచ్చఁ బెట్టేనా ॥ రమ్మన ॥

పలుమారు వూరకైనా జాసలు సేయ వచ్చీని
చలపట్టి తనునింక సాదించేనా
వెలయాలనా యేమి విటుఁడు దానెట్టుండినా
బలిమిచేసి భంగపఱచ వచ్చేనా ॥ రమ్మన ॥

వోడక కాఁగిటఁ గూడి వొరఁబరచ వచ్చీని
యేడ నుంటివని తప్పులెంచ వచ్చేనా
వేడుక కత్తెనా శ్రీవేంకటేశుఁ డెట్టుండినా
వీడెమందుకొంటి నింక విరసమాడేనా ॥ రమ్మన ॥ 159

## సామంతం

చెలుల మెఱుంగము చెప్పరయా
నెలకొని తమకము నిండెనో మీకు ॥ పల్లవి ॥

నెలవుల నగవులు చిమ్మిరేఁగెనవె
తలఁపులెపుడు సరిదాఁకునొకో
చెలవల చెమటలు చెక్కుల వడిసీ
కలగొని వలపులు కరఁగెనో మీకు ॥ చెలుల ॥

సంపదపులకలు జడిసీ మేనుల
యింపులు లోలో నెనగెనొకో
ముంపుల వూర్పులు ముక్కుల విసరీ
పెంపుల మేనులు పెరిగెనో మీకు ॥ చెలుల ॥

నిరతపుఁ గళలవె నిగిడీ మొగముల
గరిమఁ గూటములు గలసెనొకో
యిరవుగ శ్రీవేంకటేశ యలసితివి
సురతముల మతులు చొక్కెనో మీకు ॥ చెలుల ॥ 160

538-వ రేకు సామంతం

తేవయ్యా విడెమిఁక తెగువేఁటికి
వోవరిలోపలనే వొడఁబాటులాయను ॥ పల్లవి ॥

బింకములాడినవెల్ల ప్రియము చెప్పినపుడే
సంకెలేక అన్నియును( జక్కనాయను
మంకున నలిగినది మాటాడినంతలోనే
వుంకువతోడ మనసు వొక్కటాయను ॥ తేవయ్యా ॥

చేతులు చాఁచినవెల్ల చేరి మొక్కినపుడే
నీతితోడఁ గోరికలు నెరవాయను
ఘాతల జంకించినవి కన్నుల నవ్వినపుడే
పోతరించి పాయరాని పొందులాయను ॥ తేవయ్యా ॥

కరికరించినవెల్ల కాఁగిలించినపుడే
సరికి జేసికి లోలో జంటలాయను
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
విరసములెల్లఁ బాసి వేడుకాయను ॥ తేవయ్యా ॥ 161

సాళంగనాట

ఔదువయ్యా జాణవు అన్నిటా నీవు
పొదితోఁ దమి రేఁగిన పొలుపా ఇది ॥ పల్లవి ॥

వచ్చి మాటలాడేవు పైకొని కొలువులోన
మెచ్చుసతులఁ బొందిన పెరిమా యిది
చ్చునలు వెట్టేవు లావుగా సతులమీఁద
వచ్చి రట్టడివయిన తగవా యిది ॥ ఔదు ॥

యేడనుండో వచ్చి నేఁడు యిందరితోడ నవ్వేవు
వేడుకకాఁడవైన విధమా యిది
వోడక చాఁచేవు చేతు...రకే శిరములపై
కీడెపు చొక్కులతోడి వింతా యిది ॥ ఔదు ॥

పొలసి నిలువుననే పోఁకముడి జారించేవు
వలపులు సందడించే వరుసా యిది
యిలలో శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టే
మెలుపుకాఁతాళపు మేకా యిది ॥ ఔదు ॥ 162

దేవగాంధారి

ధర్మముఁ బుణ్యము తనచేతిదే యిఁక
మర్మములవి తనమనసే యెఱుఁగు ॥ పల్లవి ॥
శిరసునఁ బెట్టిన సేసలుండఁగా
పరిపరి విధముల బాసలునా
సరిగా నేమని జరసే నే నింక
ధర మీఁదిపనులు తానే యెఱుఁగు ॥ ధర్మ ॥
వొడఁబడి యిచ్చిన వుంగరమిదిగో
బెడిదముగా యిఁకఁ బిలుపులునా
బడిబడి నిటు చలపట్టనేల యిఁక
తడవేటిసుద్దులు తానే యెఱుఁగు ॥ ధర్మ ॥
కలసిన కాఁగిటి కందువలున్నవి
పలుమారుఁ బెనఁగు బలములునా
చెలి ననుఁగూడెను శ్రీవేంకటేశుఁడు
తలపించవె యిటు తానే యెఱుఁగు ॥ ధర్మ ॥ 163

రామక్రియ

కంటిరా యీతనిజాడ కాంతలాల
యింటిలోననే వుండి యెంతసేసీ నితఁడు ॥ పల్లవి ॥
వీరాన నాసవతితో బెట్టిమాటలాడి నేఁడు
కారించీని వరుస గాదంటాను
తారుకాణఁ జెలులను తగవు నే నడిగితే
సారె నెరిఁదేల (?)వచ్చి సాక్షిచెప్పీ నితఁడు ॥ కంటిరా ॥

అట్టడి యాపెకోఁ బతి యీకట్టువుంగరము
యెట్టు దీసితని తప్పులెంచుకొంటాను
గట్టిగా మాలో నేమోఁగాములు దెలుసుకొంటే
బట్టబయలు తానేల బాసనేసీ నితఁడు ॥ కంటిరా ॥

అడరి దయదలఁచి యాపెనుఁ గాఁగిటఁ గూర్చి
వొడఁబడఁ దను నేఁ గూడొద్దికై తేను
చిడుముడితో నవ్వి శ్రీవేంకటేశ్వరుఁడు
నడుమఁ దా నేమిటికి నన్ను మెచ్చీ నితఁడు ॥ కంటిరా ॥ 164

## నట్టనారాయణి

కల్లగాదు నీవు మాకుఁ గలితేఁ జాలు
తొల్లిటి ఇంతినే యింకాఁ దోడుక వచ్చేను ॥ పల్లవి ॥

తగిలి నీవెదుటను తలవంచుకుండఁగాను
నగితేను మొగమెత్తి నన్నుఁ జూచేవు
మగువ నెవ్వతె నీవు మనసునఁ దలఁచేవో
జెగడకానతీవయ్య పిలిచి తెచ్చేను ॥ కల్ల ॥

యెక్కడికో నీ విప్పుడెదురులు చూడఁగాను
మొక్కితే వేఁడుకొని నా చెక్కునొక్కేవు
అక్కడ నెవ్వతెమీఁది ఆస నీకు నున్నదో
తక్కకానతీవయ్య దండకుఁ దెచ్చేను ॥ కల్ల ॥

యెందుకో నీపాయము మీఁదెత్తుకొని వుండఁగాను
అంది నిన్నుఁగూడితే నన్నాదరించేవు
ముందు శ్రీవేంకటేశ నీ మోహమెందు నుందునో
యిందే ఆనతీవయ్యా యింటికిఁ దెచ్చేను॥ ॥ కల్ల ॥ 165

## సామంతం

కడుఁ గోమలమగు కాంత యిది
అడియాలపు ముద మందించరాదా ॥ పల్లవి ॥

మొక్కులు మొక్కుచు మోము చూడఁగా
వుక్కుగోర నటు వూఁదితివి
యిక్కడ సతి మతి నేమని వున్నదో
చక్కఁగ నూరడించఁగరాదా ॥ కడు ॥

కలకల నవ్వుచు కానుకియ్యఁగా
బలిమిఁ బెనఁగి యటు వదరితివి
అలసి యెంత తురుమదవద లాయనో
మలసి లాలింపుచు మన్నించరాదా ॥ కడు ॥

సేవలు సేయుచు చిదుముడి పడఁగా
కావిరిఁ గాఁగిటఁ గలసితివి
శ్రీవేంకటేశ్వర సిగ్గెటులుండెనో
యీ విధముల నిటు యీడేర్చరాదా ॥ కడు ॥ 166

539-వ రేకు సాళంగనాట

పట్టరాని వయసుల పంతగాఁడవు
బట్టబయలు సిగ్గులు పండేలా యేమి ॥ పల్లవి ॥

నవ్విదమాటలకే నొద్దుకొనే వింతలోనే
అవి చెఱకుసింగిణి యంపగములా
తవిలి నవ్వితే నేల తల దీసుకొనేవు
వివరింప వెన్నెలల వేఁడులా యేమి ॥ పట్ట ॥

వెలఁది చూపులకేల వీఁగేవంతటిలోనే
మెలుపున నవే తుమ్మిదపౌఁజులా
కొలఁదిసరసముల గోరులకేల లోఁగేవు
ములువాఁడి చేకత్తుల మొనలా యేమి ॥ పట్ట ॥

అంగనరతులకేల అలసే వింతటిలోనే
సంగతి మరుగరిడిసాములా యవి
రంగుగ శ్రీవేంకటేశ రమణిఁ గూడితివిట్టే
పంగించని సంసార ఫలమా యేమి ॥ పట్టి ॥ 167

## శంకరాభరణం

కొలువై వున్నాఁడు వీఁడె గోవిందరాజు
కొలకొలనేఁగి వచ్చె గోవిందరాజు ॥ పల్లవి ॥

గొడుగుల నీడల గోవిందరాజు
గుడిగొన్న పడగెల గోవిందరాజు
కుడియడమ కాంతల గోవిందరాజు
కొడిసాగే పవ్వఁజుల గోవిందరాజు ॥ కొలువై ॥

గొప్పగొప్ప పూదండల గోవిందరాజు
గుప్పేటి వింజామరల గోవిందరాజు
కొప్పుపై చుంగులతోడి గోవిందరాజు
కుప్పికటారముతోడి గోవిందరాజు ॥ కొలువై ॥

గొరబుసింగారాల గోవిందరాజు
కురులు దువ్వించుకొని గోవిందరాజు
తిరుపతిలోనను తిరమై శ్రీవేంకటాద్రిఁ
గురిసీ వరములెల్ల గోవిందరాజు ॥ కొలువై ॥ 168

## నాదరామక్రియ

చిత్తమురా నాతనికి చేత మొక్కవే
బత్తిసేయఁగా పంతము పచరించఁ దగునా ॥ పల్లవి ॥

చెలువుఁడు మాటలాడీ చెక్కుచేయి దియ్యఁగదే
యెలమి నీతలపోఁతలిఁక నేఁటికే
కలదెల్లా నీవితనిఁ గన్నదాఁకానే కాక
తొలుతటి సుద్దులిఁకఁ దొరలించఁ దగునా ॥ చిత్తము ॥

తానే యాతఁడు నవ్వీని తప్పక చూడఁగదవే
మానవే వట్టిచింతలు మరి యేఁటికే
పూనిక లివన్నియును పొందినదాఁకా నే కాక
కేనములు తొల్లిటవి కెరలించఁ దగునా ॥ చిత్తము ॥

శ్రీవేంకటేశుఁడు గూడె సేవలు సేయఁగదవే
యేవియుఁ దడవనేల యెట్టయెదుట
భావములోపలి గుట్టు పైకొన్నదాఁకానే కాక
కైవసమైతివి యిఁకఁ గాదనఁగఁ దగునా ॥ చిత్తము ॥ 169

## దేవగాంధారం

నాతో నేఁటికి నాటకము
ఘాతలనే నినుఁ గాదనేనా ॥ పల్లవి ॥

లలనకు నీమోవి లంచమియ్యఁగా
పలికీ నిచ్చలు పలుమారు
పలు నీసుద్దులు పరుల నడుగుమా
తెలిపేరందరు తెల్లమిగాను ॥ నాతో ॥

మగువచన్నుఁగవ మరి నీవంటఁగ
మొగమోటములే ముంచీనిదే
అగు నీసేతలు అందరి నడుగుమా
తగవైనట్లనె తలఁపించేరు ॥ నాతో ॥

యింతిఁ గాఁగిటను యిటు నీవెనయఁగ
అంతయు నీదిక్కాడీని
యింతలో శ్రీవేంకటేశ నన్నేలితి
వింతటఁ బొగడే రిఁకనందరును ॥ నాతో ॥ 170

## శంకరాభరణం

ఇంతవాఁడవు గాకున్న యేది దూరతనము
వింతకు తలలూఁచేరు వీదికట్టువారలు ॥ పల్లవి ॥

ఒద్ద నొకతెఁ బెట్టుక వారివీరితో మాటాడే
సుద్దులకే నవ్వేరు సుదతులెల్లా
వుద్దండాలు సేసివచ్చి వొగి సాదువలెనుండే
బుద్దులకే మెచ్చేరు పొరుగులవారలు ॥ ఇంత ॥

వొక్కతెపై నొరగుక వువిదలఁ బిలిచేటి
అక్కరకే వెరగందేరంగడివారు
తక్కరితనాల నుండే తగ నానలు వెట్టేటి
చిక్కులకే బ్రమసేరు సీమసీమవారలు ॥ ఇంత ॥

మెడ నొకతెఁ గట్టుక మొలఁతలఁ జూచేటి
కడఁకలకే మొక్కేరు కడలవారు
విడువక నన్నేలి శ్రీవేంకటేశ నీవుండేటి
వొడికానకే చెలఁగే రూగూరి వారలు ॥ ఇంత ॥ 171

## సాళంగనాట

కందువ నప్పటనుండి కాచుకున్నాఁడు
విందువలెఁ గాంతునికి విడెమియ్యవే ॥ పల్లవి ॥

మనసులెనసితేను మఱఁగులేమిటికి
చనవులు గలితేను సాదింపులేలా
వొనరి యాతఁడు నిన్ను నొడివట్టి తీసీని
అనుమానమేల యిఁక నట్టే సేయవే ॥ కందువ ॥

మాటలు సమ్మతమైతే మరి జాగులేమిటికే
కూటములోనగూడితే గుట్టులవేల
యీటుతోడ నాతఁడు నిన్నింపులతోఁ జెనకీని
చాటువగాఁ బెనఁగక సమ్మతించవే ॥ కందువ ॥

రతులు సరివచ్చితే రవ్వసేయ నేమిటికే
తరి నొక్కచో నుండితే తమక మేలా
యితవై శ్రీవేంకటేశుఁడేలి నీతో నవ్వీని
కతల జోలిఁ బెట్టక కాఁగిలించవే ॥ కందువ ॥ 172

540-వ రేకు మనోహరి

ఎఱఁగమి చేసుకొనే విదేమోయి నే-
మెఱిఁగినపనులే యిన్నియును నోయీ ॥ పల్లవి ॥
చిగురుమోవిమీఁదఁ జిప్పిలేటిమాటలు
వెగటు లేకా పెచేత వింటివా వోయి
మొగముచూచి తేను మొక్కేటిమొక్కులు
అగడుగాఁ గంటివా అదియును నోయి ॥ ఎఱఁగ ॥
కందువతో నీకుఁ జేసే కనుఁగొనసన్నలు
చెంది నీవిప్పుడే చూచితివా వోయి
అందమై నెలవుల నానుకొన్న నవ్వులు
చిందినవే నీవు తెలిసితివా వోయీ ॥ ఎఱఁగ ॥
పొలుపైన రతులలో బొమ్మల జంకెనలవి
కొలఁది మీరఁగ నియ్యకొంటివా వోయి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
కలసి యాపెగుట్టులు కంటివా వోయీ ॥ ఎఱఁగ ॥ 173

వరాళి

రమ్మని పిలువఁగదె రమణునిని
కుమ్మరింపువలపులు గూటఁ బెట్టేవా ॥ పల్లవి ॥
పొంతనే యాతఁడు నిన్ను పొదిగి లాలించఁగాను
పంతములాడుకొనేవు పైపై నీవు
యింత గలదానవు యిందరుఁ జూడఁగ నీవు
కంతుని యమ్ములమీఁద గాఁత చూపేవా ॥ రమ్మని ॥

కాయమంటి నిన్నాతఁడు కలయఁగ రాఁగాను
చేయివట్టి దొబ్బేవు చెలఁగి నీవు
నీయంత రాజవై తే నిండుకొన్న మతిలోని
పాయపు మదములనుఁ బాయఁ దోలేవా ॥ రమ్మని ॥

శ్రీవేంకటేశుఁడు నీకుఁ జెంది మోవియ్యఁగ నందు
కావిగురుతులు నించి కాఁతాళించేవు
దేవులవై తే నీవు ద్రిష్టముగఁ గూడిన
కోవరపు రతులతో గుప్పించేవా ॥ రమ్మని ॥ 174

బౌళి

ఇటువలె నుండవద్దా ఇంతుల మన్నించితేను
తటుకన మెచ్చిరి యూతరుణులు నిన్నును ॥ పల్లవి ॥

కమ్మరఁ గమ్మర నాపె కతలే చెప్పేవు
బొమ్మల చిత్తరువాపెఁ బోలె ననేవు
పిమ్మటిచెలుల నాపె పేరంటి లాలించేవు
యిమ్ముల నాకెమీఁద నేఁడెంత గద్దో వలపు ॥ ఇటు ॥

నెలకొన్న యాపె మెడ నీవే సింగారించేవు
అలరులాకె కింపైనవే కోరేవు
మలసి యాపెయాడేటి మాటలే నేర్చుకొనేవు
యెలమి నాకెమీఁద నెంతగద్దో వలపు ॥ ఇటు ॥

అడుగులకు మడుగులాపెకిట్టే పరచేవు
యెడయకాపె కాఁగిట నెనసుండేవు
అడరి శ్రీవేంకటేశ అందుకే మమ్మేలితివి
యిడుపుల నాకెమీఁద నెంతగద్దో వలపు ॥ ఇటు ॥ 175

## సౌరాష్ట్రం

విభుఁడవు నీవందుకు వేసరుదురా
సభలోన వలపులు చల్లక విడుతురా ॥ పల్లవి ॥
మగవారి యఱుతను మారుసతిఁ గంటేను
వెగటుగా సవతులు వెంగెమాడరా
చిగురుఁ జెదవిమీఁద చేఁతలేమైనా నుంటే
అగడుసేసి పెనఁగి అలయించకుందురా ॥ విభు ॥
వొంటిఁ బొరుగులవారు వూడిగేలు సేయఁగాను
జంటలైన మగువలు సమ్మతింతురా
వెంట వెంట నీమేన వింతసొమ్ములుండితేను
సొంటులు సోదించి మరి చూడకుందురా ॥ విభు ॥
అట్టడి వారకాంతలుఅక నిన్ను మెప్పించఁగ
పట్టపుదేవుళ్ళు కడుఁ బంతమాడరా
యిట్టే శ్రీవేంకటేశ యేలితివందరి నేఁడు
దిట్టలైనవారు నిన్నుఁ దెలిసి పొగడరా ॥ విభు ॥ 176

## దేసాళం

కొత్తపెండ్లికూఁతురవు కోమలివి కడుఁగడు
పొత్తులకు రమ్మంటేను బులియఁగఁ దగునా ॥ పల్లవి ॥
అలరి పతికి నిచ్చలాడనేవలెఁ గాక
చలపాదితనమేల జవరాలికి
పిలిచినప్పుడే వచ్చి పెనఁగఁగవలెఁ గాక
నిలువున గుట్టుతోడ నీటు చూపఁ దగునా ॥ కొత్త ॥
మగనికి వేడుకతో మనసియ్యవలెఁ గాక
జిగురుమంకులవేల చెలియకును
నగినప్పుడే మరి ననుపుఁ గావలెఁ గాక
యెగసక్కెములకును యింత సేయఁ దగునా ॥ కొత్త ॥

శ్రీవేంకటేశు నిట్టే చేరి కూడవలెఁ గాక
కావిరి పంతములేల దేవులకును
యీవేళ నేలె నితఁడు యిది మెచ్చవలెఁ గాక
కోవరముగా నింకాఁ గొసరఁగఁ దగునా ॥ కొత్త ॥ 177

శంకరాభరణం

సిగ్గువడుదురా చెవుల వినేమిదె
బగ్గన నూరక పలుకవయ్యా ॥ పల్లవి ॥
కలికి నీతోనిదె కతలు చెప్పఁగా
కొలకొలమని వూఁకొనరాదా
తొలఁకి నీ సుద్దులు తొరలివచ్చెనో
సెలవుల నవ్వేవు చెప్పవయ్యా ॥ సిగ్గు ॥
తరుణి మరియు నదె తగవులు చెప్పఁగ
సరసతతో మెచ్చఁగరాదా
సొరిది నీపై నవి సోఁకి వచ్చెనో
యెరవర మేలానతియ్యవయ్యా ॥ సిగ్గు ॥
సతి నీకు నిదే చదువులు చెప్పఁగ
మతి నేర్చుక యలమఁగరాదా
యితవుగ శ్రీవేంకటేశ కూడితివి
మతకము నిదో(?)మాఁటాడవయ్యా ॥ సిగ్గు ॥ 178

541-వ రేకు శంకరాభరణం

ఎట్టు దెలుసు మా కింతేసి
దిట్టలు మీరే తెలుసుకోరాదా ॥ పల్లవి ॥
పలుకుల నీనేర్పు పచరించఁగా
కలకల నవ్వెఁ గామిని
అలరుచు మమ్మేమడిగేవు పతివి
తలఁపున నీవే తలఁచుకోరాదా ॥ ఎట్టు ॥

కప్పుచు నీవు సింగారించుకొనఁగాఁ
దప్పక చూచీఁ దరుణి
వొప్పుగ మమ్మేలొరసేవిటు నీ
చొప్పు నీవె తలఁచుకొనఁగ రాదా ॥ ఎట్టు ॥

యెనసి నీవు రతియింపులు చల్లఁగ
ఘనముగ మెచ్చీఁ గలికి
చెనకేవు మమ్మేల శ్రీవేంకటేశ్వర
తనియుచు నీవే తలఁచుకోరాదా ॥ ఎట్టు ॥ 179

కన్నడగౌళ

ఏమనఁగవచ్చు నిన్ను నిటువంటివానిని
చేముట్టి చెనకుతానే సిగ్గులువడేవు ॥ పల్లవి ॥

సెసవెట్టుకున్నాపె చెంగటనే వుండఁగానే
ఆస చేసేవు నాకే పతినంటాను
ఆసతో నింటికివచ్చినాపె మోముచూడఁగాను
వోసరించి నినిజము పొగడుకొనేవు ॥ ఏమ ॥

వుంకువ గొనినయాకె వూడిగాలు సేయఁగాను
లంకెఁ గాఁగలించేవు పలతుసంటాను
అంకె నీచేత నుంగరమందుకొన్నాపె నవ్వఁగ
బొంకుచు నీ యాచారము పొగడుకొనేవు ॥ ఏమ

వోరచి వచ్చినయాపె పొత్తులఁ గుడువఁగాను
వారించి మోవిచ్చేవు నావాఁడనంటాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
బోరన నీగుణములు పొగడుకొనేవు ॥ ఏమ ॥ 180

## రామక్రియ

మాకేల అంతలేసి మందెమేళాలు
మేకుసేయనీ నీతో నేమేలుతైనను ॥ పల్లవి ॥

చెలఁగి నీకు నేను సేవలు సేసేదాన
యెలమి మీఁటు చూపనీ యెవ్వరైనాను
వలచి నీయంకెకెల్ల వచ్చి యిట్టే వుండేదాన
చలము సాదించనీ యేసతియైనను ॥ మాకే ॥

మొదలనే పంతమిచ్చి మొక్కులు మొక్కేదాన
యెదుటను బిగియనీ యెవ్వరైనాను
యిదివో నేనెప్పుడును యిచ్చకమాడేదాన
మదించి తిట్టనీ యేమగువైనను ॥ మాకే ॥

సిగ్గుదేరఁ గూడి నీ చేతికి లోనైనదాన
యెగ్గులువట్టనీ మరి యెవ్వరైనాను
అగ్గమై శ్రీవేంకటేశ ఆలనై వుండేదాన
వొగ్గి వురమెక్కనీ యేవువిదైనను ॥ మాకే ॥ 181

## శుద్ధదేశి

ఇచ్చకములాడరాదా యేమాయను
యిచ్చినబాసలెల్లా నేమాయను ॥ పల్లవి ॥

కాకిరి మాఁటలకే రాము యెగ్గులువట్టెను
యీతలఁ బంతమీరాదా యేమాయను
యేతులఁ జూపినందుకే యెదుటఁ దలవంచీని
చేతఁ జెక్కు నొక్కరాదా చెలఁగి యేమాయను ॥ ఇచ్చ ॥

యేకతపునవ్వులకే ఇంతి సిగ్గులనలసె
యేకమై వేఁడుకోరాదా యేమాయను
కాకరిచేఁతలకే కన్నుల జంకించీని
జోకఁ గాఁగిలించరాదా సొంపులనేమాయను ॥ ఇచ్చ ॥

రతులమచ్చికలకే రమణి నివ్వెరఁగందె
యితవులు సేయరాదా యేమాయను
తతితో శ్రీవేంకటేశ తమకించి నన్నుఁ గూడి
చతురత చూపరాదా చల్లఁగా నేమాయను ॥ ఇచ్చ ॥ 182

## కాంబోది

ఏల మఱఁగుననుండే విటు రారాదా
మేలిమి విభుఁడవని మెత్తు నిన్నును ॥ పల్లవి ॥

జిగి నీమోవిమీఁదటి చిల్లరచేఁతలు చూచి
నగుదుఁగాని నిన్నెన్నఁడు దూరను
నిగిడిన నీమేనినిండుఁ జెమటలు చూచి
తగునందుఁగాని మరి తమకించను ॥ ఏల ॥

చెక్కులపై నిండుకొన్న చిన్నిపులకలు చూచి
మొక్కుదుఁగాని కోపమునఁ దిట్టను
అక్కడనుండి వచ్చిన అసురుసురులు చూచి
చొక్కుదుఁగాని నిన్ను సొలశాడను ॥ ఏల ॥

గుట్టుతో నాకెఁగూడిన గురుతులన్నియుఁ జూచి
యిట్టె పొగడుదుఁగాని యేమీ నన
అట్టె శ్రీవేంకటేశ మీఱఁగ నన్నునేలితివి
పట్టి పొలారుతుఁగాని పచ్చిసేయను ॥ ఏల ॥ 183

## భైరవి.

పట్టిన చలములేల పతితోడను
అట్టు సేసుకొంటే నాఅడి గాకుండునా ॥ పల్లవి ॥

వంచనతో మొక్కితేనే వాడికెలిదేరుఁ గాక
పొంచి బింకాలు చూపితేఁ బొందుగూడునా
కంచము పొత్తు గాఁగానే కలసుఁగాక మనసు
పెంచిన యెరవులను ప్రియము గలుగునా ॥ పట్టిన ॥

సరసములాడఁగానే చనవులెల్ల నిండుఁగాక
 తెరమఱఁగైతే తరితీపు వుట్టునా
 శిరసెత్తి నవ్వఁగానే చింతలెల్ల మానుఁగాక
 కరికరి సేసుకొంటే కైవసములౌనా ॥ పట్టిన ॥

తప్పక చూడఁగానే తగులాయమౌఁ గాక
 రెప్పలు మూసుకొంటే రేఁగునా తమి
 యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసితి విటువలె
 మెప్పించకున్న నేర్పులు మిక్కిలి మెరసునా ॥ పట్టిన ॥ 184

542-వ రేకు భైరవి

చందమయ్యా నన్నియు జాజరకాఁడ
 విందులుగా మోవి యిచ్చి వేఁడుకోరాదా ॥ పల్లవి ॥

అచ్చముగ చెలి నిన్ను నానవెట్టుమనఁగానే
 పచ్చిదేరె నీమాటలు పంతగాఁడా
 నిచ్చలు నీవు చేసిన నేరములన్నియుఁ బాయ
 కొచ్చి కొచ్చి యిట్టే వేఁడుకొనరాదా ॥ చంద ॥

తనమోముప్పటి నిన్నుఁ దప్పక చూడు మంటేనే
 కొనకెక్కె నీ చేఁతలు కోడెకాఁడా
 తనివొంది నీవలని తప్పులివి వొప్పులుగ
 ననుపుగ వేఁడుకొనఁగరాదా ॥ చంద ॥

గక్కనను తన్ను ముట్టి కాఁగిలించ మనఁగానే
 చిక్కెను నీసుద్దులెల్ల శ్రీవేంకటేశ
 చెక్కు నొక్కి కూడితివి చింతలెల్లఁ దీరఁగ
 వెక్కసముగా నింక వేఁడుకోరాదా ॥ చంద ॥ 185

ముఖారి

ఇప్పుడే తెలుసుకో నీకెఱుఁగ విన్నవించితి
కొప్పువట్టుకె దీసితే గుంపించఁ గలవా ॥ పల్లవి ॥

పుత్తడిబొమ్మవలె పూచిన లతికవలె
చిత్తరుపతిమెవలెఁ జెలి యున్నది
మత్తిల్లి యప్పటి నేఁడు మాతో నేమినవ్వేవు
వొత్తుకాపె విలిచితేఁ బోకుండఁగలవా ॥ ఇప్పు ॥

కొసరుఁగోయిలవలె కొలనితుమ్మిదవలె
పసని చిలుకవలెఁ బలికీనాపె
నసలు సేయుచు నిట్టె నాతో మాటలాడేవు
వొసగితే విడెమాకె వొల్లననఁగలవా ॥ ఇప్పు ॥

మెత్తినగంధమువలె మెడకంటసరివలె
ముత్తెమువలెనే వురమున నుండాకె
హత్తి శ్రీవేంకటేశుఁడ అట్టె నన్నుఁగూడితివి
వొత్తి సేసితివాపెతోఁ బంతమాడఁగలవా ॥ ఇప్పు ॥ 188

వరాళి

ఏల సిగ్గులువడేరు యిందరుఁ జూచేరంటా
వోలిఁ దెరవేతునా మీకొనగూడె వలపు ॥ పల్లవి ॥

శిరసుపై తలఁబాలు చెంపలవెంట జారఁగ
సారసీఁ జన్నుల నిన్నొద్దికె చెలి
అరమోడ్పుఁగన్నులతో నాకెమీఁద నొరగేవు
తెరవేతునా మీకు తేటపడె వలపు ॥ ఏల ॥

కట్టినట్టి ముంజేతికంకణము బిగియఁగ
ముట్టి నీతోడఁ బిరుదుమోపీఁ జెలి
అట్టెమతిఁ గరఁగుతా నాకెచెక్కు నొక్కేవు
గుట్టుతో తెరవేతునా గురుతాయ వలపు ॥ ఏల ॥

తొక్కినట్టి నీపాదము తోడఁదొడఁ బెనఁగఁగ
గక్కన నిన్నుఁ గాఁగిట గదిమీఁ జెలి
అక్కున శ్రీవేంకటేశ అదిమేవాకెను నీవు
చక్కఁగాఁ దెరవేతునా సతమాయ వలపు ॥ పల ॥ 187

## *ద్రావిడభైరవి

చెప్పిన నాబుద్ధి నీకుఁ జెవిఁబట్టదా
వుప్పతించ నంతవద్దు వూరకైనా నతని ॥ పల్లవి ॥
పిలిచితే రాఁగదవే ప్రియునికి నీవు
చలము సాదించవద్దు సారెసారెకు
వలెనంటే నియ్యరాదా వరుసతో విడెము
మలకలఁ బెట్టవద్దు మాపుదాఁకా సొలసి ॥ చెప్పి ॥
నగితే నవ్వఁగదవే ననుపు చేసుకతని
వెగటున మీరవద్దు వేసాలకు
తగిలితేఁ గూడరాదా తమకించి కాఁగిటను
ఆగడులు సేయవద్దు ఆటడితో నిపుడు ॥ చెప్పి ॥
చెప్పినట్లు సేయఁగదే శ్రీ వేంకటేశుఁడితఁడు
తప్పులు మోపవద్దు తచ్చనతోడ
యిప్పుడే యితఁడు నిన్ను నెనసె నిందరిలోన
చొప్పులు వెదకవద్దు సొరిది బింకానను ॥ చెప్పి ॥ 188

## శుద్ధవసంతము

ఔనయ్యా మంచివాఁడవు ఆటడి యింత సేతురా
పూనినట్టి తమకము బుద్దెఱుంగునా ॥ పల్లవి ॥
మంతనములాడఁగానే మర్మములంటేవు నీవు
యింత కాకు గలదా యిదేమయ్యా
వింతవారు నవ్వఁగాను వేళ లేదా నీకు మరి
యెంతైనా వలపు సిగ్గులెరుఁగునా భువిని ॥ ఔన ॥

---

* 'ద్రావిళ' అని 521 కీర్తనకు గలదు.

ఆకు మడిచియ్యఁగానే అట్టే సరసాలాడేవు
మేకులెన్ని నేర్చితివి మేలయ్యా
జోకఁ గాతరించేవు చోటు లేదా నీకు మరి
యేకడ మదము యెగ్గులెరుఁగునా భువిని ॥ ఔన ॥

గందము నీకుఁ బూయఁగ కాఁగిటఁ గూడితివిట్టే
మందెమేళము సేతురా మమ్ము నీవయ్యా
విందుల శ్రీవేంకటేశ వేరె మాటు లేదా మరి
యెందును వేడుకాడికెలెయుఁగునా భువిని ॥ ఔన ॥ 189

## పాడి

నీతో నేఁ బంత మాడేనా నీదాననే
యేతులు చెల్లించుకొంటి వెదురేది నీకు ॥ పల్లవి ॥

ఱెబ్బయింపుమాటలనే యెక్కుడుగా వలపించి
కొలఁదిఁ బెండ్లాడితివి గొల్లెతలను
బలిమి రుక్మిణిఁ దెచ్చి పట్టపుదేవులఁ జేసి
చలమీడేర్చుకొంటివి సరి లేదు నీకు ॥ నీతో ॥

పైకొని మేనిమీఁది పాయపుమదము చూపి
కైకొంటివి మధురలో గందమూపెను
ఆకడఁ బదారువేల నందరిపైఁ దెచ్చుకొని
మేకులు మెరసితివి మితి లేదు నీకు ॥ నీతో ॥

దిక్కులెల్లా సాదించి దీమసముతో గెలిచి
యెక్కువ రాచకూఁతులనేలితివి
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అక్కర దీరుచుకొంటి వడ్డమేది నీకు ॥ నీతో ॥ 190

543-వ రేకు దేసాళం

ఆయనాయ మమ్మునేల ఆఱడిఁబెట్టేవు నీవు
చాయల నీవిచ్చినట్టి చనవులే చాలవా ॥ పల్లవి ॥
పొగడేవు నన్ను సారెఁ బొందుసేయ నేర్తు నంటా
యెగసక్కేలచేసే వింతేసి మమ్ము
మగువనింతే నేను మగవాఁడవు నీవు
నిగుడి నీవు నేర్చిన నేర్పులే చాలవా ॥ ఆయ ॥
మెచ్చేవప్పటి నన్ను మేలుగల దాన నంటా
ఇచ్చకము లేలాడే వింతేసి మాతో
రచ్చకెక్కితివి నీవు రాణివాసమైతి నేను
నిచ్చలుఁ జేసేటి యట్టి నీమేలే చాలదా ॥ ఆయ ॥
కూడితివిచ్చట నన్ను గురియైనదాన నంటా
యీడు వెట్టుకొంటిరా (వా?) మమ్మొనసి నేఁడు
తోడనే శ్రీవేంకటేశ దొరసినవారము
కోడెకాఁడ నీవొళ్ళ గురుతులే చాలవా ॥ ఆయ ॥ 191

నారాయణి

అంగన వీడెమిచ్చీని అందుకోవయ్యా
ముంగిటి అడియాసలు మోపుగట్ట వసమా ॥ పల్లవి ॥
యెలమి నెఱిఁగియును నెఱఁగనట్టే వుంటే
తెలుపఁగ వసమా తేటలుగాను
వెలయఁ గపటానకు విరహానఁ బొరలితే
చలిమందులు సేయఁగ సతులకు వసమా ॥ అంగ ॥
నేరిచి వుండియును నేరనని యంటేను
నేరుపంగ వసమా నెరవుగాను
పొరితెంచి వేసాలకు బడలికె దెచ్చుకొంటే
ఆరీతి విసరుచు నలపార్చ వసమా ॥ అంగ ॥

యెపున గురుతు గని యేది యని యడిగితే
చూపి చెప్పవచ్చునా సూట్లు గాను
చేపట్టెల మేల్మంగను శ్రీవేంకటేశ కూడితి
తీపుగా వలచితివి తియ్యనిఁక వసమా ॥ అంగ ॥ 192

## మాళవిగౌళ

కాదని సాదించి నిన్ను కన్నుల జంకించేనా
అది గొని యిటువలె నెతిఁబో పెకొసరు ॥ పల్లవి ॥

సుద్దులొక్కటె తోడుత చూపులొక్కతెపొఁదట
వుద్దండపు చేఁతలు వేరొకతెమేన
పెద్దరికేలకు నీవు బెరయించేవు వలపు
అద్దివో యిందరిలోన నైఁతిబో పైకొసరు ॥ కాద ॥

నవ్వులొక్కతె ముందర నమ్మికలొకతెవద్ద
వువ్విళ్ళూర నడియాస లొక్కతెకును
గవ్వలకు నిట్లా నేరము కుప్పవేసేవు
అవ్వలివ్వలివారిలో నైతిఁబో పైకొసరు ॥ కాద ॥

సిగ్గులొకతె పొంతను శిరసొకతె తొడపై
వొగ్గినచేతులు వేరొకతెపై
నిగ్గుల శ్రీవేంకటేశ నేనల మేలుమంగను
అగ్గమె కూడితివిందు నెతిఁబో పెకొసరు ॥ కాద ॥ 193

## దేవగాంధారి

సరసుఁడ వన్నిటాను సర్వజాణవు
గరిమ నన్నిఁ దెలియఁ గదవయ్యా నీవు ॥ పల్లవి ॥

సన్నలు సేసీ నీకు జవరాలు
యిన్నిటాను నీకిప్పుడేడ పరాకు
కిన్నెర వాయించీ నదె కెరలుచును
విన్నపాలందే వున్నవి వినవయ్యా నీవు ॥ సరసు ॥

తప్పక చూచీ నదె తరుణి
యిప్పుడు నీతమకములేడ నున్నవి
చిప్పిలుఁజెమట గోరఁ జిమ్మి నీపై
వొప్పగించి వలపిట్టే వుండపయ్య నీవు ॥ సరసు ॥

మిక్కిలిఁ గొసరీ నలమేలుమంగ
యెక్కడెక్కడ నీగుండె యెటువంటిది
వొక్కటై శ్రీవేంకటేశ వొనరె నీకె
పిక్కటిల్లఁ దమ్ములము పెట్టవయ్య నీవు ॥ సరసు ॥ 194

## నాదరామక్రియ

వేడుకలెటువంటివో వెలఁదిఁ జూడఁగరాదా
జాడతోడ వలపులు సందడించఁ జొచ్చెను ॥ పల్లవి ॥

సెలవుల నగవులు శిరసుపై తలఁబాలు
వొలుకుచు నున్నవొక్కమాఁటే
మొలకచన్నుల కాంతి మొక్కుల వినయములు
వులివచ్చిగాఁ జూపె నొక్కమాఁటే ॥ వేడుక ॥

చిప్పిలు మోవిముద్దులు చెక్కులచెమటలును
ఉప్పతిల్లఁ గురియించీ నొక్కమాటే
ముప్పిరిగొన్న సిగ్గులు ముయ్యాడు పులకలతో
వొప్పులెల్లా నెరపీని వొక్కమాఁటే ॥ వేడుక ॥

తొరలింపు మాటలును దొంతుల సరసములు
వొరిమతోఁ బచరించీ నొక్కమాఁటే
యిరవై శ్రీవేంకటేశ యింతి నిట్టే కలసితి
పురవడి నొరసేవు వొక్కమాఁటే ॥ వేడుక ॥ 195

## ముఖారి

చిత్తానఁ బెట్టుక వుండు చెలఁగి నావిన్నపము
పొత్తు విడువఁగఁ జాల పొసఁగుదుఁ గాని ॥ పల్లవి ॥

కేరి యొక్కటెవలె వెంగెములు నిన్నాడఁజాల
ఆరితేరి యిచ్చకము లాడుదుఁ గాని
సారెసారె నప్పటిని చలము సాదించఁ జాల
చేరి నీకు నూడిగాలు సేతుఁగాని ॥ చిత్తా ॥

కడదానివలె నిన్నుఁ గాకు సేయఁగాఁ జాల
వొడికేన నవ్వుతానే వుండుదుఁ గాని
యెడనెడఁ గొసరుతా నెలయించఁగాఁ జాల
బడిబడి తమకాన బత్తిసేతుఁగాని ॥ చిత్తా ॥

కన్నెపడుచువలెను కాఁకలు సేయఁగఁ జాల
యెన్న నలమేల్మంగనై యెనతుఁ గాని
వున్నతి శ్రీవేంకటేశ వొనగూడితివి నన్ను
నన్నల నీ మోవి యిట్టే చవిగొందుఁ గాని ॥ చిత్తా ॥ 196

544-వ రేకు ధన్నాశి

ఇన్నాళ్ళు నెఱఁగమైతి మింతటివాఁడవౌత
తిన్నగా నిప్పుడు చూచితిమిగా యీభాగ్యము ॥ పల్లవి ॥

వేడుకతో నాపె నీకు విన్నపాలు సేయఁగాను
నూడిదెగా సారెసారె సొలయఁగాను
వాడికెతో నీమీఁద వలపులు చల్లఁగాను
నీడనుండే ఇన్నియుఁ గంటిమిగా యీభాగ్యము ॥ ఇన్నా ॥

కన్నులఁ దప్పక చూచి కానుక నీకియ్యఁగాను
సన్నలు సేసి యిట్టే జరయఁగాను
చన్నులు మోవఁగ నీసంగడిఁ  చుండఁగాను
నిన్నాపె మెచ్చఁగాను కంటిమి  యీభాగ్యము ॥ ఇన్నా ॥

చేరి కూడి నీతో నాపె సిగ్గునఁ దలవంచఁగా (ను?)
కోరి నన్నంతలో నీవు చూడఁగాను
గారావు శ్రీవేంకటేశ కడపలో నిద్దరికి
నేరిపేవు రతులు కంటిమిగా యీభాగ్యము ॥ ఇన్నా ॥ 197

## లలిత

ఇద్దరికి మీకే చెల్లు నిటువంటివి
చద్ది వేఁడి సరసాలే జవళిభోగములు ॥ పల్లవి ॥

భావము లెనసినట్టి పడఁతికి విభునకు
వేవేలు వెంగెములు వినయములే
తావుకొన్న వలపులు తారుకాణలైనచోట
కావరపు గోరొత్తులు కప్పుఁబూవుటాఁకులే ॥ ఇద్ద ॥

కనుచూపులు సోఁకిన కందువైనచుట్టాలకు
పెనఁగులాటలెన్నైనా ప్రేమపు చౌ(చవు)లే
మనివోని తమకపు తగులాటమైతేను
ననుపు బొమ్మజంకెలు నయగారాలే ॥ ఇద్ద ॥

నెలవుల నవ్వుదేరఁ జేరి కూడినవారికి
అలయిక రతులెల్ల నలవాటులే
యెలమి శ్రీవేంకటేశ యింతి నీవు గలసితి
చలవోక మీ చేఁతలన్నియుఁ దప్పనటే ॥ ఇద్ద ॥ 198

## మంగళకౌశిక

నిన్ను నేము గాదనేమా నిండుదొరవు
నన్నుతో మెలఁగేటి యిచ్చకురాల నేను ॥ పల్లవి ॥

మొగము చూచితేనే మోము వంచేవు
నగితే నీకు నీవే నానలు వెట్టేవు
మగవారికేఁటికి మరి వెరపు
[illegible]గపడ సతులను [illegible]మఁగరాదా ॥ నిన్ను ॥

పనివడి మెచ్చితేనే బ్రమసేవు
తనువుపైఁ జేయి వేసితే తత్తరించేవు
యెనసి పాయపువానికేల నేమాలు
కనుఁగొన్న చెలులఁ గలయఁగరాదా ॥ నిన్ను ॥

వూరకే మోవి యానితే నులికేవు
అరసి నిన్నుఁ గూడఁగ నలసేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి
పోరచి కాంతలనెల్లభోగించరాదా ॥ నిన్ను ॥ 199

## ఆహిరి

ఏమి గట్టుకొంటివి నీవిటువంటివెల్లాఁ జేసి
చేముట్టి కాఁకలు దేర్చి చెలఁగించరాదా ॥ పల్లవి ॥

చెంతనే చెలియ నీతో సెలవుల నగెనంటా
వింతగాఁ బూబంతిఁ గొని వేసితివి
దొంతర పులకలట్టే తోడఁదోడఁ జిమ్మిరేఁగె
చింతదేరఁ గాఁగిలించి చెక్కు నొక్కరాదా ॥ ఏమి ॥

పొలుపొండ నాకె నిన్ను బొమ్మల జంకించెనంటా
చలమున పన్నీరు పైఁ జల్లితివి
చెలప చెమటలెల్లఁ జెక్కులవడియఁ జొచ్చె
జెళకక మోవి యిచ్చి ప్రేమ నించరాదా ॥ ఏమి ॥

గునియుచు నవ్వుటని కొనగోరఁ జిమ్మెనంటా
వెనుకొని పుప్పొడి పైవేసితివి
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి పికనిట్టే
ననుపున నాదరించి నమ్మించరాదా ॥ ఏమి ॥ 200

## శ్రీరాగం

ఎవ్వరు చెప్పిన వినకింత చేసుకొనె నింతి
పువ్వువలె మన్ననలఁ బోదిసేయవయ్యా ॥ పల్లవి ॥
అచ్చలాన చెలి నీయండ నుండి పొందు చేసి
పచ్చిచేసుకొనె మేను పడఁతి
విచ్చనవిడి తోడనే విడెము నీచేతికిచ్చి
మెచ్చులుగా వలపులు మెడఁ గట్టుకొనెను ॥ ఎవ్వ ॥
మొగమోటములనే మోవి నీకు విందు చెప్పి
తగిలించుకొనె మేలు తరుణి
నగుతానే నీరూపు నాఁటుకొనఁ జూచి చూచి
తగినంత ఁదనుఁ దానే తమి రేఁచుకొనెను ॥ ఎవ్వ ॥
అందపుఁ జన్నులనొత్తి అంటఁ గాఁగిలించి కూడి
కందువతోఁ బెండ్లాడెఁ గలికి
సందడి శ్రీవేంకటేశ సారె నీకు మొక్కి మొక్కి
అందెంది పట్టపుదేవు లనిపించుకొనెను ॥ ఎవ్వ ॥ 201

## వరాళి

ఎప్పుడూ మీరొక్కటే యెలమినెంచి చూచితే
ముప్పిరి మీవూడిగాన కప్పణియ్యరయ్యా ॥ పల్లవి ॥
చెంగట నీసుద్దులెల్లఁ జెలితో విన్నవింతుము
అంగనమాటలు నీతో నాడుదుము
యెంగిలిపొత్తువారము యిద్దరియెడకు నేము
వుంగిట నేమేమనినా నోరుచుకోరయ్యా ॥ ఎప్ప ॥
అలరి నీవిచ్చినట్టి ఆనవాలాకెకిత్తుము
నెలఁతచే కానికెలు నీకిత్తుము
పొలిసి మీకిద్దరికి నూడిగపు చుట్టాలము
తలఁచి మాచేఁతలు తాళుకొనరయ్యా ॥ ఎప్ప ॥

శ్రీవేంకటేశ్వర నీకు సేస చేతికందిత్తుము
దేవులికె చెప్పితేను తెర వేతుము
యీవల మిమ్మిద్దరి నెనయించినవారము
వోవరిలో మీసేవలు వొప్పుగొనరయ్యా ॥ ఎప్పు ॥ 202

545-వ తేకు కురంజి

వేడుకలింతేకొని వెంగెము గాదు
జోడుగూడ నందులోని సొంపులు సుమ్మీ ॥ పల్లవి ॥
నెలవులనే నవ్వఁగా చిత్తము నీకెట్టుండెనో
వలపులలోపలి వాడికె సుమ్మీ
కల చెప్పఁగాఁ దారుకాణలెందు మోచెనో
తలఁపులలోపలి తమకము సుమ్మీ ॥ వేడుక ॥
నెట్టుకొని చూడఁగాను నీవేమని యంటివో
అట్టె పాయఁగరాని ఆసలు సుమ్మీ
పట్టి పెనఁగఁగా నీపంతములేడ వీఁగెనో
చిట్టకపు చేఁతలలో సిగ్గులు సుమ్మీ ॥ వేడుక ॥
చన్నుల నేనొత్తఁగాను చలములెంత రేఁగెనో
కన్నెపాయములోపలి గాతలు సుమ్మీ
మిన్నక శ్రీవేంకటేశ మెచ్చితేఁ జేఁగలమట్టి
చెన్నుఁడవై యేలితివి సేవ నాది సుమ్మీ ॥ వేడుక ॥ 203

నాట

నంటు చేసీ సిరితోడ నరసింహుఁడు
జంట సరసములాడీ సారె [1]నరసింహుఁడు ॥ పల్లవి ॥
జవ్వనిఁ దనతొడపై సంతసాన నిడుకొని
నవ్వులు నవ్వీనిదె నరసింహుఁడు
నివ్వటిల్లుఁ జూపులు [illegible]ఁతచన్నులమీఁద
కువ్వనిపేరులవలెఁ గుచ్చీ నరసింహుఁడు ॥ నంటు ॥

[1] నరసింహ్వుడు అనియే అంతటను రేకులలో.

ఆయంగనఁ గాఁగిట నలమి మోవి యొసగి
నాయములు నడపీ నరసింహుఁడు
కాయముపైఁ దొరిగేటి కస్తూరి చెమటలు
పుంయని స్రాఁతలువలెఁ బూసీ నరసింహుఁడు ॥ సంటు ॥

కూరిమి పట్టపుదేవిఁ గూడి శ్రీవేంకటేశుఁడై
నారు పోసీఁ బులకలు నరసింహుఁడు
వారకానఁ బ్రహ్లాద వరదుఁడు మరుముద్ర-
లూరట సొమ్ములుగాఁగ నుంచీ నరసింహుఁడు ॥ సంటు ॥ 204

## పాడి

మావలె నోర్వదు మంకు యీవనిత
కైవసమై పొదుగఁగవలెఁ జుమ్మీ ॥ పల్లవి ॥

సుదతి యాసతోఁ జోటడిగీ నదె
యెదురెదురనె యెడమియ్యవయ్యా
పదరుచు నెగ్గులు వట్టిన యీపెకు
కదిసి నీవు మొక్కఁగవలెఁ జుమ్మీ ॥ మావలె ॥

కలికి పచ్చడము గప్పుమనీ నదె
విలసిల్ల ముసుఁగు వేయవయ్యా
చెలఁత నిన్నుఁ గడు నేరములెంచిన
నలువున వేఁడుకోనఁగవలెఁ జుమ్మీ ॥ మావలె ॥

నాతి యేకతమునకు లాసీ నదె
ఆతెర దిగవేయఁగదయ్యా
యేతున శ్రీవేంకటేశ మమ్మేలితి-
పీతతిఁ బంతములివలెఁ జుమ్మీ ॥ మావలె ॥ 205

## కాంబోది

ఇద్దరు జాణలే మీరు యిందరు మెచ్చేరు మిమ్ము
సుద్దులు దడవుకొంటాఁ జొక్కేరు మీరు ॥ పల్లవి ॥

యెదురుగాఁ గూచుండి యేలాటాలాడి నీపై
చదురుల వలపులు చల్లీ నాకె
వెదచల్లు నవ్వులతో వెస గద్దెమీఁద నుండి
సవరానఁ బాదములు చాఁచేవాపెమీఁదను ॥ ఇద్దరు ॥

సరికి పేసికినుండి సాటివెట్టుకొని నిన్ను
విరులఁ బూఁచి పూఁచి వేసీ నాపె
దొరతనమున నీవు మూఁగుమంచమూఁచి వుఁచి
అరిది చన్నులు దాఁక నంటించేవు గోరను ॥ ఇద్దరు ॥

వేదాద్రిమీఁదనుండి విందు వెట్టి లకిమమ్మ
ఆదిగొని కూడె నిన్ను నౌభళేశ
పాదుకొని గరుడాద్రిపై శ్రీవేంకటేశుఁడవై
పేదదేరఁ గెంగ్లాడ చెలఁగేవు నీవు ॥ ఇద్దరు ॥ 206

## నాగవరాళి

మేలము లమరఁగా మీకు మీకును
కోలుముందుగా పొందు గూడె వినవయ్యా ॥ పల్లవి ॥

పేరడిగా సొళగపు పెద్ద యెలుఁగులతోడ
కోరికెఁ జల్లులమ్మేరు గొల్లెతలు
మీరానఁ జెక్కురాగాలు పిల్లఁగోవిఁ గురిసెవు
కూరిమి రెంటికి సతి గూడె వినవయ్యా ॥ మేల ॥

మించిన బంగారపుమెట్టెల మోఁతలతోడ
కొంచక నడచేరదే గొల్లెతలు
పంచాంగ గతి(?)గతుల నూదేవు తుత్తురుఁగొమ్ము
అంచెలఁ దాళను గూడె నదె వినవయ్యా ॥ మేల ॥

వొత్తి పెరుగు దచ్చేటి వూరుపు మోఁతలతోడ
కొత్తగాఁ జేరుకొనేరు గొల్లెతలు
హత్తుకొంటివి శ్రీవేంకటాద్రి చెన్నుఁడవై
గుత్తపు గొబ్బిళ్ళపాట గూడె వినవయ్యా ॥ మేల ॥ 207

## శంకరాభరణం

నేమెఱుఁగమా నీ పనులు
నేమములిటువలె నించెదు గాక ॥ పల్లవి ॥

చనవరితనమున సతి నినుఁ గదిసిన
ననుపుల నొల్లననఁగఁ గలవా
మనసారసేసిన మగువల వంచిన
నినుపుల చేతలు నెరపెదు గాక ॥ నేమె ॥

చుట్టరికంబుల సోఁకఁగఁ జనకిన
అట్టుసేసి మీఱఁగఁ గలవా
కట్టుమట్టుగా కానికలంపిన
గుట్టున నూరకె గుసిసగు గాక ॥ నేమె ॥

మేనరికంబున మేకొని కూఁపెను (డిన?)
నానినతమి మానఁగఁ గలవా
ఆసుక శ్రీవేంకటాధిప పెక్కువ
నానావిధముల నవ్వెదు గాక ॥ నేమె ॥ 208

546-వ రేకు అమరసింధు

చెలులము నేమైనాఁ జెప్పక పోదు
తలఁపులోపలి యాస దాఁచఁ దగునటవే ॥ పల్లవి ॥

ఇతవుగఁ జెనకఁగా నింపులెల్లాఁ జల్లఁగాను
సతిగొని పెనఁగఁగఁ దగునటవే
హితవై యుండనుండఁగా సారె సారె నవ్వఁగా
మతకాన వేగెమాడ నని నగునటవే

కప్పురములియ్యఁగాను కన్నులను మొక్కఁగాను
తప్పులు వట్టఁగ నీకుఁ దగునటవే
దప్పిదేర విసరఁగా దయవుట్టఁ బలుకఁగా
నప్పటిఁ గాఁతాళించుటది దగునటవే ॥ చెలు ॥

బత్తులు సేయఁగాను పైకొని కూడఁగాను
తత్తరాన గోరఁ జిమ్మఁ దగునటవే
హత్తి శ్రీవేంకటేశుఁ డన్నిటా మన్నించె నిన్ను
నో తరతుఁ బంతము గొనఁ దగునటవే ॥ చెలు ॥ 209

## బలహంస

వింతలేల సేసేవే విభుఁడు నీకు నితఁడు
చెంత నీమతి యాతనిచిత్తము గాదా ॥ పల్లవి ॥

చిప్పిలమోవి ఇమ్మంటే సిగ్గువడ నేఁటికే
చొప్పున నిది యాతనిసొమ్ము గాదా
కొప్పు నీకుఁ బెట్టేనంటే గొణఁగఁగ నేఁటికే
యెప్పుడూ నితనిసేస కిరవు గాదా ॥ వింత ॥

చన్నులు చూపుమంటేను జంకించ నేఁటికే
పన్ని యీతనికి చేపట్లు గావా
పన్నిట నోలార్చేనంటే పలునవ్వు లేఁటికే
అన్నిటా నీమేనితని కరడుతీగె గాదా ॥ వింత ॥

మొలనూలు వెట్టరాఁగా మొక్కేవి దేఁటికే
పొలుపు శ్రీవేంకటేశు పొలముగాదా
అలరి నిన్నురమెక్కు మనఁగాఁ గొంకనేఁటికే
నెంత నీవే యతని నిండుసొమ్ముగాదా ॥ వింత ॥ 210

## శంకరాభరణం

చలములు మానవె సరసునితో
    అలుకలకంటెఁ బ్రియంబులె మేలు ॥ పల్లవి ॥

బింకపుమాటలు పెక్కులాడఁగా
    మంకులు మిగులును మగువలకు
    లంకెలపొందులు లావుగఁ జేసిన
    పొంకపు వలపులు పొదిగొనును ॥ చల ॥

బలిమి సరసములు పైపైనాడఁగ
    తలఁపులు గరివడుఁ దరుణులకు
    సెలవుల నగవులు చిమ్ముచుఁ బొదిగిన
    తలకొనుఁ బైపైఁ దమకములు ॥ చల ॥

సటలకుఁ బలుమరు జంకెన చూపిన
    కుటిలత లడరును కొమ్మలకు
    యిటువలె శ్రీవేంకటేశుఁ గూడితివి
    తటుకున నీడేరుఁ దగుఁగోరికలు ॥ చల ॥ 211

## భైరవి.

ఒకతె చెనకఁగా నొకతెనుఁ దడవేవు
    యెకసక్కెపువాఁడవు యేమనేది నిన్నును ॥ పల్లవి ॥

కందువైనమాటలూ కనుచూపుఁదేటలూ
    సందడించి నీమీఁదఁ జల్లీనాపె
    అందుకోలు మంతనాలు అడిగేటి పొంతనాలు
    చందములుగా మాతోడ జరపేవు నీవు ॥ [illegible] ॥

సెలవులనవ్వులూ చెట్లపై పువ్వులూ
    చలపట్టి నీమీఁదఁ జల్లీనాపె
    చెలుముల ప్రియములు చిమ్మీరేఁగే నయములు
    తలపెట్టి మమ్ము నిట్టే తగిలేవు నీవు ॥ ఒకతె

నెట్టుకొన్న వలపులు నిండురతి యలపులు
జట్టిగొని నీమీఁదఁ జల్లీనాపె
ఱట్టగు మోవి విందులాఱడి మాతో పొందుల(లు?)
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితివి నీవు ॥ ఒకతె ॥ 212

కాంబోది

ఇప్పుడే మచ్చికలతో నిద్దరు నుండరే మీరు
చెప్పరానిచేఁత చేసి సిగ్గువడ వలెనా ॥ పల్లవి ॥
నంటున నాతఁడు నీతో నగఁగానే వేగవేగ
గెంటసాలాడేవేలే వెంగెములుగాను
వొంటక యాతనిఁ బాసి యొక్కింత యోరువలేక
వెంటవెంటఁ దిరిగాడి వేఁడుకోనవలెనా ॥ ఇప్పు ॥
ఆదరించి యాతఁడు మాటాడఁగాను కమ్మటిని
తోదోపులాడి పెనఁగి దూరఁగనేలే
కాదని యిప్పటికి నీకాఁ తాళాలు పెడ వేఁచి
పాదుకొని పిదపను పంతమియ్యవలెనా ॥ ఇప్పు ॥
ఆసలో శ్రీవేంకటేశుఁడట్టె నిన్నుఁ గూడఁగాను
[illegible]సాలకేల విఱ్ఱవీఁగేవు నీవు
మోసపెట్టి యిప్పటికి మోవిగంటిసేసి నీవు
వోసరించి చన్నుల గోరూఁదించు కొనవలెనా ॥ ఇప్పు ॥ 213

దేసాళం

కనకగిరిరాయ యేగతి నోడఁబరచేవో
వినవయ్యా సతినీకు విన్నవించుమనెను ॥ పల్లవి ॥
చెలియకు నీవిచ్చిన చెంగలువపూవుదండ
కలికి యెవ్వతె నీకుఁగానుకిచ్చెనో
పలచఁగా నిందుమీఁదఁ బసపంటి వున్నదిదె
నెలఁత యీ గురుతులు నీకుఁ జూపుమనెను ॥ కనక ॥

కాంతకు నీవు మెడఁ గప్పినట్టి కంటసరి
చెంతల నీకెవ్వతె వుచితమిచ్చెనో
పంతాన నొకదిక్కునఁ బసిఁడిపూస వున్నది
అంతయుఁ దెలియ నిన్ను నడిగి రమ్మనెను ॥ కనక ॥

కామఁగూడి నీవిచ్చిన పైఁడిప్రాఁతచీర యిది
కామించి యెవ్వతె నీకుఁ గట్నమిచ్చెనో
ఆమీఁద శ్రీవేంకటేశ అదె విలాసమున్నది
యేమతకమో యిది యెరిఁగించుమనెను ॥ కనక ॥ 214

547-వ రేకు భూపాళం

ఎవ్వరు విన్నవించేరు ఇట్టైతే నీకు
నివ్వటిల్ల నీవే కరుణించవలెఁ గాక ॥ పల్లవి ॥

చిగురుమోవిమీఁది చిప్పిలుతేనెలతోడ
మగువ నీతోనదే మాటలాడీని
తెగటుగ నీవైతే వేరొక్కతెమోము చూచి
అగపడి యందే పరాకై వున్నాఁడవు ॥ ఎవ్వ ॥

చిక్కనిచూపులతోడ నెలవినవ్వులతోడ
వెక్కువగా నీకుఁ జెయ్యెత్తి మొక్కీని
చెక్కునొక్కి నీవైతే సిగ్గులువడుచు వే-
రొక్కతెచన్నులు గోర నూఁదుచునున్నాఁడవు ॥ ఎవ్వ ॥

బొమ్మల జంకెనతోడ పోరచి ముద్దులతోడ
కొమ్మ శ్రీవేంకటేశ్వర కూడె నిన్నును
పమ్మడి నీవైతే నాపె నొనగూడి యీసతికి
పమ్మిన వాసలతోడ బత్తిరయై వున్నాఁడవు ॥ ఎవ్వ ॥ 215

## దేశాక్షి

చూడఁ జిన్నవాఁడు గాని సుగుణ(ణి?)వీఁడు
యేడఁ జూచినాఁ దానే యేమిచెప్పేదమ్మా ॥ పల్లవి ॥

సంగతిగా గొల్లెతల చన్నులంటి చూచుకొంటా
కొంగిలిని పోరచిపొందుల కృష్ణుఁడు
ముంగిటి కన్నెల మోవి ముద్దులు వెట్టుకొంటాను
యెంగిలికి రోయఁడు యేమి చెప్పేదమ్మా ॥ చూడ ॥

అప్పలప్పలనే వారి నట్టే కాఁగిలించుకొంటా
తప్పటడుగులు వెట్టీఁదానే కృష్ణుఁడు
చిప్పిల మాటలాడి సిగ్గులు వరచుకొంటా
యిప్పుడే యింత సేసీని యేమి చెప్పేదమ్మా ॥ చూడ ॥

లలిఁ బోంకముడి వట్టి లాసుకొంటా నందరిని
గిలిగించీ శ్రీవేంకటగిరి కృష్ణుఁడు
తొలుత నుద్దగిరిఁ గందువ విజనగరాన
యెలమి రతులు చూపీ నేమి చెప్పేదమ్మా ॥ చూడ ॥ 216

## ధన్నాశి

కాఁగిలించవే యిట్టే కనకగిరిరాయని
మాఁగినమోవి యిచ్చీని మచ్చికదై వారఁగా ॥ పల్లవి ॥

యెగ్గులేక పొందితేనే యింపెరఁగవచ్చుఁ గాక
సిగ్గుతోడ నుండితేను చెప్పేదేమి
దగ్గరఁ గూచుండితేను తమకము రేఁగుఁ గాక
వొగ్గి దవ్వుల నుండితే వొద్దిక చేకూరునా ॥ కాఁగి ॥

సరసములాడితేనే చవులెల్లాఁ బుట్టుఁ గాక
తెరవేసుకుండితేను తెలిపేదేమి
నిరతి నీవు నవ్వితే నిక్కుఁగాక మోహములు
పరవశమై వుండితే పంతాలొనగూడునా ॥ కాఁగి ॥

శ్రీవేంకటేశుఁ డితనిసేవే తగులు గాక
కావిరి నూరకుండితే కదిమేదేమి
యీవేళ నితని నిట్టే యెనసితి విదిగాక
రావాడి బింకాన నుండే రతి సమకొనునా ॥ కాఁగి ॥ 217

## ముఖారి

తప్పక యేమి చూచేవు తగిలి నన్ను
తెప్పలుగా నీ విన్నియుఁ దెలియనివున్న వా ॥ పల్లవి ॥

నీవు సుద్దులు చెప్పఁగా నివ్వెరగుండుట గాక
ఆవేళ నేవిననోప ననవచ్చునా
కైవసమై వున్నదానఁ గాకుసేతునా నిన్ను
దేవరవు నీవిన్నియుఁ దెలియనివున్న వా ॥ తప్పక ॥

చిట్టకపు చేఁతల కచ్చెరువు నొందుట గాక
వుట్టిపడి అవి యోర్వకుండవచ్చునా
పట్టపుదేవుల నేను పచ్చిసేతునా నిన్ను
దిట్టవు నీవిన్నియును దెలియనివున్న వా ॥ తప్పక ॥

కగ్గుచు నీరతులకేఁకటతో నుండుట గాక
సిగ్గుతోడఁ గొంకుచు వంచించవచ్చునా
యెగ్గుల శ్రీవేంకటేశ యెరవు సేతునా నిన్ను
దిగ్గజము విన్నియును దెలియనివున్న వా ॥ తప్పక ॥ 218

## సాళంగనాట

ఉండవయ్య యెఱుఁగుదు నూరకే నీవు
దుండగపు సేఁతలను దొమ్మిసేసే వారమా ॥ పల్లవి ॥

నిన్న నీవు చేసినట్టి నెరజాణ తనములు
కన్నులతుదల మాకుఁ గానవచ్చెను
నిన్నె నీ వప్పటి మాటల బాసలేల చేసేవు
కన్నెలము నేము నిన్నుఁ గల్లలెంచే వారమా ॥ ఉండ ॥

వోడక రేపకాడ నీ వుండినట్టి వునికులు
వేడుకతోఁ జెవులార వింటిమి నేము
జాడతోఁ దారుకాణించవలెనా మాకింతేసి
వూడిగపువారము నిన్నొరసేటి వారమా ॥ ఉండ ॥

ఇప్పుడు నీవు మమ్ము నెనసిన రతులెల్ల
చిప్పిలఁ మనసులోనఁ జేకొంటిమి
ముప్పిరి శ్రీవేంకటేశ ముదులకించ వలెనా
అప్పసము నేము నిన్ను నలయించే వారమా ॥ ఉండ ॥ 219

## సామంతం

ఎంత నీయామోదము యేమి చెప్పేది
చెంతలనే వేడుకలు చిమ్మిరేఁచవలెనా ॥ పల్లవి ॥

కలువలఁ బోలేటి కన్నులను నినుఁ జూచి
వలపులు వెంచీని వద్ద నీకాపె
అలయుమనుచు నన్నుఁ గాఁగిలించ వచ్చేవు
నలువంక వలపులు నారువోయవలెనా ॥ ఎంత ॥

పెనఁగులాటల నీతోఁ బ్రేమములు చూపి మోపి
ననుపులు సేసీని నంటున నాకె
చెనకులనే నాపైఁ జేతులు చాఁచే వప్పటి
మొనసి తమకములు మోపు గట్టవలెనా ॥ ఎంత ॥

మించిన రతుల నిట్టే మేలములాడి యాఁడి
పంచనతోఁ గూడీవి వైపుగా నాపె
అంచల శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
పెంచేవుఁ గోరికలింత పేరఁబెట్టవలెనా ॥ ఇంత ॥ 220

518-వ రేకు సాళంగనాట

ఎవ్వరు నేమి చెప్పేరు యిద్దరముఁ గూడితిమి
ఇవ్వల నీవే నాకు నియ్యవయ్య విడెము ॥ పల్లవి ॥

మాపుదాఁకా నీతోడ మాటకు మాటాడఁ బోతే
యేపు మీఱ యిఁకనవి యెన్ని లేవు
కోపమెల్లాఁ దీరె నాకు కొప్పు నీవు దువ్వితేనే
రాపులఁ బెట్టక ఇఁక రావయ్య లోనికి ॥ ఎవ్వ ॥

[illegible]గియుచు నీతోను పెనఁగులాడఁ జూచితే
యెగసక్కేములు మరి యెన్ని లేవు
చిగిరించె నామనసు చేయి నీవు చాఁచితేనే
అగడు సేయక వేయవయ్య తెర యిఁకను ॥ ఎవ్వ ॥

రాతిరిఁ బగలు నీతో రతులు తోడుచూపితే
యేతుల యెన్నికలకు నెన్ని లేవు
యీతల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
కాతరానఁ బచ్చడము గప్పవయ్య ఇప్పుడు ॥ ఎవ్వ ॥ 221

పాడి

తలఁచుకొమ్మనవె తానే నా గుణములు
వెలినేల లోనికిట్టే విచ్చేయు మనవె ॥ పల్లవి ॥

సముకానఁ దానిచ్చిన చనవులోదానఁ గాని
తమకించే కక్కసపుదానఁ గాను
రమణ్ణికై వినోదాన రాసికెక్కేదానఁ గాని
అమరని వొడ్డారములాడేదానఁ గాను ॥ తలఁచు ॥

నవ్వుతోఁ దానవ్వే నవ్వులలోదానఁ గాని
తను నలయించే మంకుదానఁ గాను
[illegible]నరి వుండ నేర్చిన వూడిగపుదానఁ గాని
[illegible]నఁగి [illegible]నఁగి [illegible]టేదానఁ గాను ॥ తలఁచు ॥

కలసి యిటులనుండే కాఁగిటిలోదానఁ గాని
తలుపువాటున నుండేదానఁ గాను
యెలమి శ్రీవేంకటేశుఁడేలె నన్ను నింతలోనే
కలిమిలోదానఁ గాని కడదానఁ గాను ॥ తలఁచు ॥ 222

దేసాళం

అప్పుడాతని కిల్లాల వైతివి గదే
దప్పిదేరె నీఁకను మాదండనే వుండఁగదే ॥ పల్లవి ॥

పెచ్చురేఁగి నిన్నాతఁడు పేరునఁ బిలిచె నీఁక
విచ్చనవిడేయఁ గదె వెలఁది నీకు
కచ్చుపెట్టి యప్పటిని కన్నులఁ జూచె నిన్ను
యిచ్చటనే నీకోరికె లీడేరెఁ గదవే ॥ అప్పు ॥

చిత్తగించి యింతలోనే సెలవుల నవ్వెఁ బతి
అత్తుగడలాయఁ గదే యంగన నీకు
పొత్తులకు రమ్మని పొందులు చూపె నిట్టే
ఒత్తిగలదానవు నీభాగ్యములాయఁ గదే ॥ అప్పు ॥

శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జేరి కూడి నిన్ను నేలె
వావులు గలసెఁ గదే వనిత నీకు
భావించి నాకు నీచేఁ బంతములెల్లా నిప్పించె
చేవమీఱ నిందరిలోఁ జెప్పఁగవిగెఁ గదే ॥ అప్పు ॥ 223

సౌరాష్ట్రం

ఎన్నఁడు నెఱఁగము మీకిటువంటివి
మన్ననలు నించేవు మరి యేలో కాని ॥ పల్లవి ॥

చెలియ చెక్కిటిచేయి చేత నీవు పట్టితీసి
యెలమి నేఁడుకొంటివి యేఁటికో కాని
పలుకకుండఁగ నీవు బలిమిఁ జెక్కులు నొక్కి
అలుకలు దేరిచేవు అదియేమో కాని ॥ ఎన్న ॥

ముసుగు వెట్టుకుండఁగ మొగమిట్టే తొంగిచూచి
  యెసఁగి యాసలు వెట్టేవేఁటికో కాని
వుసురంటా మలఁగుపై నొరగి యుండినదాని
  పిసికేవు చన్నులు నీప్రియమెంతో కాని ॥ ఎన్న ॥

కన్నులు మూసుకుండఁగాఁ గాఁగిలించి తెరపించి
  యెన్నికగా నవ్వించితి వేఁటికో కాని
సన్నల శ్రీవేంకటేశ సరసములాడఁగాను
  యెన్నేసి మెచ్చులు మెచ్చేవింపులెట్టో కాని ॥ ఎన్న ॥ 224

## కొండమలహరి

ఎక్కడ పరాకు నీకు నేమయ్యా
  గక్కన నాకెనిట్టే కరుణించవయ్యా ॥ పల్లవి ॥

మక్కువ నీరూపు చూచి మనసులోఁ దలపోసి
  చెక్కులునిండా నట్టే చెమరించి
పుక్కిటి వూరుపులతోఁ బొద్దులు చూచీఁ జెలి
  యిక్కడఁ గొలువులు నీవేమి సేసేవయ్యా ॥ ఎక్కడ ॥

కానుక నీకునంపి కాయమెల్లాఁ బులకించి
  పానుపుమీఁద నట్టే పవ్వళించి
ఆనుకొన్న తమితోడ నట్టే నిన్నుఁబాడీ నదే
  వీనులతుదల నీవే విందువు రావయ్యా ॥ ఎక్కడ ॥

కలయఁ దానే వచ్చి కప్పురవిడెమిచ్చి
  వెలలేని వెరగుల విట్టపీఁగి
యెలమి శ్రీవేంకటేశ యింతి నిన్నుఁ గూడె నిదే
  తలిరుఁబోఁడి రతులు దలఁచుకోవయ్యా ॥ ఎక్కడ ॥ 225

## పాడి

ఏల జాసలు చేసేవు ఇప్పుడు నాతో
లాలించేటి యీ జవ్వనులను మీఱఁగలవా ॥ పల్లవి ॥

పంతపుమాటలు నీతోఁ బలుమారు నాడియాడి
కాంతలిందరు మదనకళ రేఁచేరు
యెంతటివాఁడవైనా నెప్పుడూ నీవొక్కఁడవే
కాంతుఁడ వారికి లోను గాకుండఁ గలవా ॥ ఏల ॥

నసువు చేసుక నీతో నయముగ నవ్వినవ్వి
వనితలు వలపులు వడివెట్టేరు
ఘనుఁడవైనాఁ గాని కలవాఁడవు నీవే
మనసిచ్చి వీరితోడ మారాడఁ గలవా ॥ ఏల ॥

చెంగలించి కాఁగిలించి సేవలెల్లా నీకుఁ జేసి
అంగనలు రతులను ఆసచూపేరు
రెంగట నన్నేలితివి శ్రీవేంకటేశుఁడవైన
సంగడి నందరితోడ సాము సేయఁగలవా ॥ ఏల ॥ 226

549-వ రేకు రామక్రియ

సందడించీ వలపు నీసముకానను
యిందరికూరిములు నీవియ్యకోనవయ్యా ॥ పల్లవి ॥

యెలమిఁ గొలువుసేసీ నీకెఁ జిత్తగించవయ్యా
పొలసి నవ్వీ నీకెఁ జూడవయ్యా
కలయఁ గానుకిచ్చీని కాంతచే నందుకోవయ్యా
అలమి మొక్కీ నీకె నాదరించవయ్యా ॥ సంద ॥

యెదుట నున్నది చెలి యెలుక చేసుకోవయ్యా
అదె వీడెమిచ్చీ నాకె నందవయ్యా
పొదిగి విన్నవించీని పొలఁతిచే వినవయ్యా
కదిసినదీకె వూడిగము గొనవయ్యా ॥ సంద ॥

అతివ చన్నులనొత్తి నవధరించవయ్యా
రతులు నేరిపి నాపె రమ్మనవయ్యా
సతమై శ్రీవేంకటేశ సరి నన్ను నేలితివి
యితవరి యీకె చేత లెంచుకొనవయ్యా ॥ సంద ॥ 227

## సాళంగం

కంటిమి మీభాగ్యము కన్నులతుదల నేము
జంటల మీసొబగులు సందడించఁ జొచ్చెను ॥ పల్లవి ॥
తప్పక నీవు చూచితే తరుణి మేననెల్ల
ముప్పిరి గాఁ జెమటలు ముంచఁ జొచ్చెను
చిప్పిల మాటాడితేనే చెలి మారుమాటలలో
వుప్పతిల్లు మోవితేనెలూరఁ జొచ్చెను ॥ కంటిమి ॥
ననుపుగా నవ్వితేనే నలినాక్షి చెక్కులను
నినుపులై పులకలు నిండఁ జొచ్చెను
చెనకుచు నీవంతలో చేతులు చాఁచఁగాను
పనితపోఁకముడి వదలఁగఁ జొచ్చెను ॥ కంటిమి ॥
తొడపై నిడుకొంటేనే తొయ్యలికుచగిరులు
తడఁబడ మేలుకు నదరఁ జొచ్చెను
అదరి శ్రీవేంకటేశ అంగన నిట్టె కూడితే
జడిగొన్న కళలు మించఁగఁ జొచ్చెను ॥ కంటిమి ॥ 228

## పాడి

ఘాతలు నీపైఁ జూపదు కన్నెపడుచు గనక
చూతము నీనేరుపులు చూపరాదా మేలు ॥ పల్లవి ॥
చిలుకచే మాటాడించి సిగ్గుతోడ నున్నదిదే
పలికించరాదా నీపంతమీడేర
కలువపువ్వుల వేసి కాంత నిలుచున్నదిదే
మొలకచన్నులమీఁద మోపరాదా చెయ్యి ॥ ఘాత ॥

యెదురుగా హంస నంపి ఇంటిలోన నున్న దిదే
కదిసి మన్నించరాదా ఘనత మీర
గుదిగొన సేసచల్లి గుట్టుతోడ నున్నదిదే
పొదిగి మేననెల్లాఁ బూయరాదా గంధము ॥ ఘాత ॥

పావురాలఁ గానుకిచ్చి పడఁతి కాఁగిటఁ గూడె
సేవలు మెచ్చి కలికిఁ జేయరాదా
శ్రీవేంకటేశ్వర యీకె చెలరేఁగి యున్నదిదే
యీవేళ నలపుదేర నియ్యరాదా విడెము ॥ ఘాత ॥ 229

## సింధురామక్రియ

ఇందరు నెఱిఁగినవే యీసుద్దులు
యెందాకా జరపేవు యీవెడమాయలు ॥ పల్లవి ॥

చలములేమిటికి సతితోను నిన్నుఁ
బిలువ నంపినందుకుఁ బెనఁగేదా
సెలవుల నవ్వేరు చెలులెల్లా, యీ
కలికిఁ బాసి వుండఁగలవా నీవు ॥ ఇంద ॥

పంతములేమిటికి పతితోను నీకు
నింతియై వుండినందుకు నిది పాటా
చెంతల జాతులఁ బెట్టేఁ జిలుకలెల్లా
పొంత నాపెను మీఱ నోపుదువా యిఁకను ॥ ఇంద ॥

వొరయ నేమిటికి నీవువిదతోను నీ
పరపుపై యాడుటకు ఫలమా యిది
నిరతి శ్రీవేంకటేశ నీమేని గుఱుతులు
సురతవేళల యీచొప్పు మాపఁగలవా ॥ ఇంద ॥ 230

## తెలుఁగుఁగాంబోది

దోసము లేదనవయ్యా తొక్కితి నీ పాదము
వేసారక నింద నీపై వేసితి నేను ॥ పల్లవి ॥

వేడుకతోడి నావిరహా వేదనకుఁ గా
నాడరాని కల్లలెల్ల నాడితి నిన్ను
వాడలోన నీవురాఁగా వలపుల చింతనొంది
వోడక మంచముమీఁద నుండితి నేను ॥ దోస ॥

పాయపు మదముతోడ పక్కన రాకుండఁగాను
సేయరాని సేతలెల్లఁ జేసితి నిన్ను
చేయి నీవు వేయఁగాను చిమ్మిరేఁగి వేసటతో
తోయరాని అనవెట్టి దూరితి నేను ॥ దోస ॥

తగులైన తమకాన దప్పిదేరుచ కుండఁగా
నగరాని నవ్వులెల్ల నవ్వితి నిన్ను
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
మొగము చూచిచూచి మొక్కితి నేను ॥ దోస ॥ 231

## ధన్నాశి

చెప్పరే మీరైనా బుద్ధి చెలులాల
తప్పులేని నాగుణము తానే యెఱుఁగునే ॥ పల్లవి ॥

చలము సాదించరాదు చప్పఁగా మాటాడరాదు
నలువంకాఁ జూచి లోలో నవ్వరాదు
కొలువులోపల నన్నుఁ గొచ్చి కొచ్చి యేలడిగీ
తలఁపులోపలిమాట తానె యెఱుఁగునే ॥ చెప్ప ॥

మేరలు మీఱఁగరాదు మేకులు సేయఁగరాదు
కేరడములాడి తన్ను గెలువరాదు
ఆరసి నన్ను నేఁడు అంతయేల వోరసీని
తారుకాణించని(నీ?)మాట తానే యెఱుఁగునే ॥ చెప్ప ॥

పగటు చూపఁగరాదు పాటిసేయ కుంతరాదు
మొగసక్కెలకు వేరాలెంచఁగరాదు
నగి శ్రీవేంకటేశుఁడు నన్నుఁగూడి కాఁగిటిలో
తగులాయ నిన్నియును తానే యెఱుఁగునే ॥ చెప్ప ॥ 232

550 వ రేకు గౌళ

ఎన్ని సేఁతలు సేసేవే యిప్పుడే నీవు
కన్నెపడుచ వప్పుడే కప్పుర మిచ్చేవు ॥ పల్లవి ॥
కొలువులో రమణుఁడు కోరి నీతో నవ్వెనంటా
చెలరేఁగి చెలరేఁగి చేయి చాఁచేవు
వెలయఁ జెవిలో వచ్చి విన్నపాలు చేసేవు
కలికితనాలు చూపి కానుక లిచ్చేవు ॥ ఎన్ని ॥
దండనుండి నిన్నాతఁడు తప్పక చూచెనంటా
బెండుపడఁ గాతానఁ బెనఁగేవు
మెండుకొన వీడెమిచ్చి మేకులెల్లాఁ జేసేవు
కొండవంటిదొర నిట్టే కుచాల నొత్తేవు ॥ ఎన్ని ॥
పానుపుపై శ్రీవేంకటపతి నిన్నుఁ గూడెనంటా
నానఁబెట్టి యిటులానే నంటు సేసేవు
తానకమై యాతఁడిట్టే తగనన్ను నేలినాఁడు
మోనాన నితనిమెచ్చి మొక్కులు మొక్కేవు ॥ ఎన్ని ॥ 233

* ధవళరామక్రియ

పంతమాడుదువు పలుమారు
కొంత గొంకితే కొఱతే సుమ్మీ ॥ పల్లవి ॥
కొమ్మ యీఁదుచును కొలనికి నిను దిగి
రమ్మనుచుఁ దామెరను వేసె
యెమ్మెతోడ నీవిటు దరినుండఁగ
వుమ్మడి నదియే వోటమి సుమ్మీ ॥ పంత ॥

* ఇదియేఁ "బౌళిరామక్రియ" యుకాఁగలదు.

కోపుమాఁకుడుగ తొలఁగఁ జూచితే
నీపైఁ బుక్కిటి నీరుమిసె
యీపాటిపనికె యిఁకఁ బిరితీసిన
పైపైనే నగుఁబాటులు సుమ్మీ ॥ వంత ॥

చొరక లోఁగితే సుదతిచే దొబ్బించి (?)
కెరలి నిన్నుఁ గాఁగిటఁ గలసె
యిరవై శ్రీవేంకటేశ యేమరిన
అరయ సతికి కిందగుటవుఁ జుమ్మీ ॥ వంత ॥ 284

## నాదరామక్రియ

పడ సుద్దు లేడ మాటలెందాఁకాను
వేడుక పడేవు నీకు వేగిరమేలయ్యా ॥ పల్లవి ॥

చెప్పరాని మాటలెల్లాఁ జెప్పుమంటాఁ జెవులొగ్గే-
వప్పటినానలు వెట్టే వందుమీఁద
యిప్పుడు చెలులు నేము నేకతమాడితిమని
విప్పుచు నెవ్వరు నీకు విన్నవించిరయ్యా ॥ పద ॥

మాలోని ముచ్చటలెల్లా మగుడఁ జెప్పుమనేవు
చేలకొంగు వట్టేవు చెక్కునొక్కేవు
ఆలోచించి గుజగుజలాడుకొంటిమనుచును
సోలించేవు నీవేడ పొంచువింటివయ్యా ॥ పద ॥

మరిగి మేమాడుకొన్న మదనరహస్యములు
వొరసి చెప్పుమనేవు వొడివట్టేవు
గరిమ శ్రీవేంకటేశ కలిసితివిటు నన్ను
యిరవుగా నీవెట్టు యెఱిఁగితివయ్యా ॥ పద ॥ 285

## లలిత

వీరట నీవట యిఁక విచ్చనవిడి
కూరిములతో నిండాఁక గుట్టుతోడ నుంటివి ॥ పల్లవి ॥

దొరవై యుండియు నీవు తొయ్యలులతో నెల్ల
సరసములాడఁగాను చలి వాసెను
వరుసఁ జన్నులమీఁద వాడికెతో నప్పటిని
విరులఁగొని వేయఁగ వెరపెల్లఁ దీరెను ॥ వీరట ॥

బలు రాజసాననుండి పైపైఁ బేరుకొనుచు
చెలులఁ బిలువఁగాను సిగ్గు వాసెను
తలకొని బుజ్జగించి దండఁ గూచుండఁబెట్టుక
కులికి నవ్వఁగ కొంకుగొపరెల్ల మానెను ॥ వీరట ॥

శ్రీవేంకటేశుఁడవై చేరి కాంతలఁ గూడఁగ
భావములో నందరికిఁ బచ్చిదేరెను
యీవేళనే నన్నుఁ గూడి యిందరికిఁ జెప్పఁగాను
వేవేలకు నాలోని వేడుకెల్లా మీరెను ॥ వీరట ॥ 236

## కాంబోది

నీవే యాతఁడు గావా నేరమేడది
కావిరి వెరగులేల కాఁగిటిలోను ॥ పల్లవి ॥

చెలువుఁడు మాటాడఁగాఁ జెవి యొగ్గి వినరాదా
చలపాదితనమేల సముకానను
సెలవులఁజింది నవ్వు చేతులనే పట్టరాదా
పెలుచు వొడ్డారాలేల ప్రియముల లోనను ॥ నీవే ॥

ఇంత వొడఁబరచఁగ నియ్యకొని కూడరాదా
పంతము లింతేసి యేల పానుపుమీఁద
దొంతిఁబెట్టి మోవిపండు తొలఁగ కందుకోరాదా
సంతజాణతనాలేల సరసములోనను ॥ నీవే ॥

గుట్టుతోడఁ గలయఁగ గుణము మెచ్చఁగరాదా
అట్టడితనమేల మఱఁగైనవేళ
ముట్టి శ్రీవేంకటేశుఁడు మొగిఁ జన్నులొగ్గరాదా
గుట్టు చూప నీకనేల కూరిములలోనను ॥ నీవే ॥ 237

## శ్రీరాగం

చిడుముడి సిగ్గునఁ జెలఁగిని
విడువక చేకొను విభుఁడవు నీవు ॥ పల్లవి ॥

మలయుచు సొలయుచు మాటలాడఁగా
చెలిని గోరికొనఁ జెనకేవు
నిలిచె రేకలై నిండుఁ జెక్కులను
పిలిచి వేఁడుకో ప్రియుఁడవు నీవు ॥ చిడు ॥

పలుమరు నెదుటను పనులు సేయఁగా
బలిమిఁ బెనంగుచుఁ బదరేవు
అలపుల చెమటలు అలరెను తనువున
కలసి మన్నించుము ఘనుఁడవు నీవు ॥ చిడు ॥

గుఱుతుగఁ గాఁగిటఁ గూడి మెచ్చఁగా
నెఱిఁ బలుసోఁకులు నించేవు
మెఱసెను మోవిని మించి వురమునను
యెఱుకతో శ్రీవేంకటేశ్వర నీవు (?) ॥ చిడు ॥ 238

## 551-వ రేకు దేశాక్షి

ఎంతటిది నీ యాసోదమేమి చెప్పేది
వింతలుగా నవ్వేవు వెలఁదులతోడను ॥ పల్లవి ॥

రాచిలుకపలుకుల రవళితోడి కొమ్మ
పూచినతంగేడువంటి పుత్తడిబొమ్మ
యేచి నీవురముమీఁద నిట్లానే వుండఁగాను
చాఁచేవు చేతులప్పటి జవరాండ్లమీఁదను ॥ ఎంతటి ॥

కదలుఁజూపుల తేఁటిగతి కన్నుల కలికి
పొదలిన రతిరాజు పూవుములికి
మెదలుచు నేపొద్దు నీమెడదఁడై (ండై?) వుండఁగాను
గుదిగొన నంటేవు గొల్లెతల చన్నులు ॥ ఎంతటి ॥

కారుమెఱుఁగులవంటి కళల చంద్రవదన
గారాపు సింగారాల పంకజసదన
యీరీతి శ్రీవేంకటేశ యీ నీకాఁగిటఁ గూడఁగా
చేరి యేలేవు మావంటి చెలుల నందరిని ॥ ఎంతటి ॥ 239

### ఆహిరి

కనుకొనవయ్యా ఘనుఁడవన్నిటా నీవు
వినుకొనవయ్యా విభుఁడవు నీవు ॥ పల్లవి ॥

సుదతి నిన్నుఁ జూచే చూపులలో నున్నది
మదిలోని నీపై తమకమెల్లాను
కొదలేని కొసరుఁబల్కులలోన నున్నవి
అదన మనసులోని యాసలెల్లాను ॥ కను ॥

నలినాక్షి నీతో నవ్వే నవ్వులలో నున్నది
మొలకలెత్తిన తన మోహమెల్లాను
చెలరేఁగి తాఁజేసే సేవలలో నున్నది
బెళకులేని తన ప్రియమెల్లాను ॥ కను ॥

కామిని నిన్నుఁ గూడిన కాఁగిటిలో నున్నది
నేమపు రతులలోని నేరుపెల్లాను
దీమసాన నిన్నుఁబొందే దేహమందే వున్నది
యీమేర శ్రీవేంకటేశ యిచ్చకమెల్లాను ॥ కను ॥ 240

## శుద్ధవసంతం

ఏల సిగ్గులు వడేవు యెన్నటికి నీపొందులు
ఆలనయ్యేనంటా నున్న దాదరించ రాదా ॥ పల్లవి ॥
కొనచూపులనుఁ జూచి కొలువు చేసీ నీకు
పనులు చెప్పఁగరాదా పడఁతికిని
చొనిపి మాటలాడి చుట్టరికాలు చూపీని
వెనుకొని నీవు నట్టే వియ్యమందరాదా ॥ ఏల ॥
వూడిగాలు చేసేనంటా నొద్దఁ గాచుకున్నది
వీడె మందుకొనరాదా వెలఁదిచేత
వాడిక నవ్వులునవ్వి వలపులు చల్లీని
కూడేనని యాసయిచ్చి కొప్పు దువ్వరాదా ॥ ఏల ॥
పచ్చిమోవి విందువెట్టి బదికే నంటానున్నది
మెచ్చి కాఁగిలించరాదా మెలుఁత నీక
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
తచ్చి యీపెతో నేకాంతము చెప్పరాదా ॥ ఏల ॥ 241

## కన్నడగౌళ

వెన్నెలలు గడు వేఁడి విరులు వాఁడి
యెన్న రావు తలపోఁత లెట్లోరిచేనే ॥ పల్లవి ॥
కాతరాన సన్న చేసి కప్పురాన నన్ను వేసి
చేతికి లోనై తి నంటాఁ జేరి నవ్వీనే
ఘాతిగుండెతోఁ దనకు అట్టొకటే దక్కఁగాక
యీతల నేనాఁటదాన నెట్టోరిచేనే ॥ వెన్నెల ॥
సందడిలోఁ గాలుదొక్కి సగము మాటలు గుక్కి
పొందులెల్లా దక్కెనంటాఁ బూఁచి తిట్టీనే
అందగాఁడు గన తనకాడినదీడేరెఁ గాక
యిందరిలోఁ బిన్నదాన నెట్టోరిచేనే ॥ వెన్నెల ॥

కతలనే వావిచెప్పి కదుఁ బచ్చడము గప్పి
సతమైతినంటా నన్నుసారెఁ గూడినే
తతి శ్రీవేంకటేశుఁడు తన యిచ్చలాయఁ గాక
యితవరి గోలదాన నెట్టోరిచేనే ॥ వెన్నెల ॥ 242

## మాళవిశ్రీ

ఇంకా నెల మంకుఁదన మింతితోడను
కంకణాలచేత నీపైఁ గప్పురము చల్లదా ॥ పల్లవి ॥
తలగుచ్చి కాఁగిలించి తమిరేఁచి వేఁడుకోఁగా
చెలి చెప్పినట్టు యింకాఁ జేయవద్దా
తొలుత నిన్నెంతేసి తుటారములాడినాను
బలిమి వెనక నీకుఁ బంతమియ్యదా ॥ ఇంకా ॥
చెక్కునొక్కి బుజ్జగించి శిరసు వంచి మొక్కఁగా
మక్కువతో నియ్యకొని మన్నించవద్దా
యెక్కువతో నిన్నప్పు డెంతచేఁత చేసినాను
నొక్కపై యిప్పుడు ప్రియమొనరించదా ॥ ఇంకా ॥
మోవిచూపి నవ్వించి మునుకొని కూడఁగాను
పూవువలె నిట్లానే భోగించవద్దా
శ్రీవేంకటేశ యెక్కడఁ జెంది నిన్నెలయించినా
వేవేలుగా నిక్కడను వెల్లవిరిసేయదా ॥ ఇంకా ॥ 243

## దేసాళం

ఇంతకంటే నింకనేమి ఇద్దరాండ్ల మగఁడవు
వింతలాయ నీమహిమ విఠలేశ్వరా ॥ పల్లవి ॥
సరసము లాడీని సత్యభామ వొకవంక
వొరసీ రుకుమిణి నిన్నొకవంక
సిరుల రొండ్ల నీవు చేతులువెట్టుక యుట్టే
వెరవు విచారించేవు విఠలేశ్వరా ॥ ఇంత ॥

చెలరేఁగి యీపె నిన్ను నెలవుల నవ్వఁగాను
సొలసి సొలసి యీకె చూడఁగాను
నిలువుదండలిద్దరు నెలఁతల మేనులంట
వెలయ నుబ్బేవు మేలు విట్ఠలేశ్వరా ॥ ఇంత ॥

కుడిభుజమానించీ గుబ్బల నీకోమలి
యెడమచెక్కనుఁ జెక్కు నింతి మోపీని
తొడఁదొడ మోపేవు దొరవు నడుమ నీవు
విడువకు శ్రీవేంకట విట్ఠలేశ్వరా ॥ ఇంత ॥ 244

552-వ రేకు శ్రీరాగం

ఏఁకారే యీపె నేల యేఁచేవు నీవు
వాఁకపు వలపులెల్లా వంచీని నీకు ॥ పల్లవి ॥

పయ్యదలోపలి గుబ్బపాలిండ్లు దనివారఁ
నెయ్యపుఁ జెలిఁ గాఁగిట నించఁగరాదా
వుయ్యాల మంచముమీఁద వొద్దనే కూచున్నది
చెయ్యరాదా చేఁతలు చెక్కులనిండాను ॥ ఏఁకా ॥

ముసిముసి నవ్వుల మోమునిండా జొబ్బిల
కొసరు నీమోవితేనె కులుకరాదా
పసలుగా నీకు నిట్టే పాదాలొత్తుచున్నది
పొసఁగరాదా రతుల పొందులకోలఁదిని ॥ ఏఁకా ॥

మదములు దొలఁకేటి మర్మములు సోఁకఁగ
మదిమదిఁ గూడితివి మన్నించరాదా
వుదుటై శ్రీవేంకటేశ వురముపైనున్నది
పొదుగరాదా నేర్పుల పూఁచినటువలెను ॥ ఏఁకా ॥ 245

గౌళ

ఏమిటికి వట్టి నేరాలెంచేవు నీవు
దామెనరతులవేళ తప్పించుకొనేవా ॥ పల్లవి ॥
వుబ్బరితనాల నట్టే వూరకేల తిట్టేవు
గుబ్బచన్ను దాఁకితేనే కుమ్మోవోయీనా
గొబ్బునఁ గాఁగిట నీవు కూడేవేళ నిఁక మరి
తబ్బిబ్బు సేసుకొని తప్పించుకొనేవా ॥ ఏమి ॥
యీవల తిరిగిచూచి యేల పంతములాడేవు
మోవి మోవి సోఁకితేనే మోదుకట్టీనా
పూవువలె నిద్దరము పొందులు సేసేటివేళ
తావుదావులు మోవక తప్పించుకొనేవా ॥ ఏమి ॥
అట్టుగా నావలపాఱడి సేసే వింతలోనే
గట్టిగాఁ గాఁగిలించితే కళ దాఁకీనా
యిట్టే శ్రీవేంకటేశ యేలితి విప్పటివేళ
దట్టించి యింకా నీవు తప్పించుకొనేవా ॥ ఏమి ॥ 246

భైరవి

ఊరకే వుండఁగరాదు వోరువరాదు చూచి
నేరుపరి నీసుద్దులు నీకే తెలుసును ॥ పల్లవి ॥
పచ్చిమాటలాడఁగాను పడఁతితో నవ్వేవు
పెచ్చురేఁగి నీకివి ప్రియమాయనా
రచ్చల నివి వింటేను రమణులు నవ్వరా
నిచ్చలు నీసుద్దులివి నీకే తెలుసును ॥ ఊర ॥
కోరి మర్మాలంటఁగాను కూరిమిఁ జెంగలించేవు
పేరడిగా నీకిది ప్రియమాయనా
యీరీతి చూచినవారు యెంత లోలుఁడనరా
నీరాఁపుసుద్దులు నీకే తెలుసును ॥ ఊర ॥

గట్టి చన్నుల నొత్తితే కళదాఁకి బ్రమసేవు
పెట్టువలపులు నీకుఁ బ్రియమాయనా
యిట్టె శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
నెట్టుకొన్న నీసుద్దులు నీకే తెలుసును ॥ ఊర ॥ 247

## ఆహిరి

పిలువరే యీ కాంత ప్రియునిని
కలయికలనే మేలు గలిగీఁగాక ॥ పల్లవి ॥

తలపోఁతలచేతఁ దతిగొన్న విరహము
చలిమందులచేత జడిసీనా
పలుకుఁదేనెలచేతఁ బ్రబలిన తరితీపు
తలిరుల మూసితే దాఁగీనా ॥ పిలువ ॥

యెదురుచూపులనే యెసగిన తమకము
పొదిగిన విరులచేఁ బోయీనా
పొదిగొన్న యాసలఁ బొడమిన యలపులు
వుదుటు సురటులచే నుడిగీనా ॥ పిలువ ॥

దండనే వినుకలిఁ దగిలిన చెలుములు
పండువెన్నెలచేతఁ బరసీ(చీ?)నా
నిండార శ్రీవేంకటనిలయుఁ డీచెలిఁ గూడె
వొండొక తావుననుంటే వొద్దిక వాసీనా ॥ పిలువ ॥ 248

## నాదరామక్రియ

ఎవ్వరి వూడిగములు యేల నీకు
వువ్విళ్ళూర నాపెతోడ నోలలాడరాదా ॥ పల్లవి ॥

చెక్కులనిండాఁ గారు చెమటలతోడనే
వెక్కసముగా నీకు విడెమిచ్చీని
ముక్కున నూరుపులెల్లా ముంచఁగానే నీకు
అక్కరపడి విసరీ నది గదవయ్యా ॥ ఎవ్వ ॥

జల్లన విరులురాల జారిన తురుముతోనే
తెల్లమిగా నీనెరులు తిద్దీ నదివో
ఎల్లెవాటు వేసుకొన్న వదలు(బయ్యదతోడ
చల్లువెద నీసరులు చక్క(బెట్టీని ॥ ఎవ్వ ॥

బలిమి నీసమరతి బడలికతోడనే
లలిమీరి యిట్టే నీయలపు దీర్చీని
కలసి శ్రీవేంకటేశ కడు(బులకలతోనే
చలపట్టి నిన్ను జంటలు సేసీని ॥ ఎవ్వ ॥ 249

## దేవగాంధారి

మఱి యే(టి విన్నపాలు మాపుదా(కాను
నెఱవాదు లిన్నిటాను నేరరా మీరు ॥ పల్లవి ॥

చెలులచే మా(టలు సిగ్గులు దేరినదా(కా
సొలపులు తనువులు సో(కినదా(కా
తలపో(తలన్నియును దండకు వచ్చినదా(కా
చెలుములు చనవులు చేకొన్నదా(కానే ॥ మఱి ॥

కడలేని సరసాలు కందువలబ్బినదా(కా
వెడ మాయకోపము నవ్వినదా(కాను
తడబాటు తమకము తనివి దీరినదా(కా
కడివోని యాస లేకతమౌదా(కానే ॥ మఱి ॥

వింతముచ్చటలు వెల్లవిరిగా నాడినదా(కా
పంతములన్నియు నొడ(బడినదా(కా
ఇంతయు శ్రీవేంకటేశ యీపెతో(గూడినదా(కా
సంతమైతిరి మాకోర్కె సమకూరుదా(కా ॥ మఱి ॥ 250

553-వ రేకు    మధ్యమావతి

నిజమరి నంటా వచ్చి నిలుచున్నాఁ డాతఁడు
గుజగుజ లేలాతని గుణము చూచుకోవే ॥ పల్లవి ॥
తప్పక యేమి చూచేవే తరుణీ యాతనిమోము
కప్పిన గుఱుతేమైనాఁ గంటివా నీవు
నెప్పున నాతనినెల(?) నిలిచి రమ్మనవే
అప్పుడే యతఁడెందైనా నంటువడి వచ్చెనా ॥ నిజ ॥
నవ్వులేమి నవ్వేవే నాయకుని మాటలకు
రవ్వలుగా నందేమైనా రాగిదేరెనా
పువ్వులాతఁడిచ్చినవి పుచ్చుకొన వదియేమే
అవ్వల నొకరిచేతి వందుకొని వచ్చెనా ॥ నిజ ॥
చెక్కులేమి నొక్కేవే శ్రీవేంకటేశ్వరుని
మిక్కుటపు రతులను మించి వచ్చెనా
యిక్కువగాఁ గూడినందు కేల వెరగువడేవే
నిక్కముగా నందునుండి నేర్చుకొని వచ్చెనా ॥ నిజ ॥ 251

దేసాళం

వింటిఁ దనసుద్దులెల్ల వింతలా నాకు
దంటతనాలకు గురి తానే కాఁడా ॥ పల్లవి ॥
చొప్పు మాయఁ దొల్లియును సుదతులయెడలను
తప్పని బొంకని వాఁడు తానే కాఁడా
వుప్పతిల్లుఁ జెమటల యుదధిలో నుండినాను
దప్పి దేరిచేవాఁడు తానే కాఁడా ॥ వింటి ॥
గొరబుగా నింతులకు కోరిన కోరికలియ్యఁ
దరమెరిఁగినవాఁడు తానే కాఁడా
విరహపుటేటిలోన వేఁడుల నీఁదించి
దరినుండి నవ్వేవాఁడు తానే కాఁడా ॥ వింటి ॥

అగపడి యందరికి నన్నిరూపులై తనిపి
తగవు దేర్చినవాఁడు తానే కాఁడా
నగి శ్రీవేంకటేశుఁడు నాకాఁగిటి కౌఁగిలినిలోఁ
దగ నోలలాడువాఁడు తానే కాఁడా ॥ వింటి ॥ 252 ॥

### భూపాళ

నాకేల వెఱచేవు నడుమ నీవు
జోకతో నీయంకెకు రాఁ జూచుకోవయ్యా ॥ పల్లవి ॥

తేటలుగా ముక్కరముత్తె మించుక గదలఁగ
మాటలాడీ వినవయ్యా మగువ నీతో
కాటుక కన్నులారిచి గక్కునఁ జూచీ నదే
నేఁటికి యాపెయాస నెరవేర్చవయ్యా ॥ నాకే ॥

గల్లుమని తనచేతి కంకణాలు మొఱయఁగ
నల్లదే కానుకయిచ్చీ నందుకోవయ్యా
మొల్లలతురుముతోడ మొక్కులు మొక్కీ నదే
చల్లఁగా నందుకేమాయ సమ్మతించవయ్యా ॥ నాకే ॥

తళుకుఁగమ్మలు సందిదండలును మెరువఁగ
కలికి గాఁగిలించీఁ గలయవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటునన్ను నేలితివి
బలిమి నిద్దరి నిట్టే పాయకుండవయ్యా ॥ నాకే ॥ 253

### కాంబోది

అన్నిటా నే గురిగాక అవి యేమి చేసె నీకు
మన్నించరాదా వట్టి మచ్చికలు చూపక ॥ పల్లవి ॥

వొక్కటఁ జంద్రోదయాన నుదుకెత్తి వున్నవవి
జక్కవచన్నుల నేల సారెఁ బట్టేవు
ముక్కుసంపెంగతావికి ముందే భ్రమసి వున్నవి
నిక్కి తుమ్మెదకురుల నీవేల రేఁచేవు ॥ అన్ని ॥

ఘనవిరహపుటెండఁ గాఁక రేఁగి వున్నవవి
కనుచకోరాల నేల గాసి చేసేవు
చినుకుఁజెమటలచే చీకాకు పడినవవి
చననీక నడపుటంచల నేల(లల?)యించేవు ॥ అన్ని ॥

బలిమి రామా యను పిలుపుల లోఁగినవి
యెలుఁగుఁగోయిలల నేలలయించేవు
కలసితి నన్ను శ్రీవేంకటేశ పాఁపసెజ్జను
వెలుచుఁ గొప్పునెమలి పెంచె మేలంటేవు ॥ అన్ని ॥ 254

## నాగవరాళి

విడువు వేసాలు పదివేలు వచ్చెను
తడవకువయ్యా నీ తలఁపెల్లాఁ గంటిమి ॥ పల్లవి ॥

వెక్కసపు విరహాన వేఁగినచెలి విభుఁడు
చెక్కునొక్కినంతలోనె చెంగలించును
ఇక్కువ ఇదెరిఁగే కాయేమిటికి వెరవవు
చక్కనుండవయ్యా నీ జాడలెల్లఁ గంటిమి ॥ విడు ॥

మదనబాణాలచేత మాఁగినట్టి చెలిఁ బతి
కదిసి చన్నులంటితేఁ గళ రేఁగును
యిది నేర్చుకొని కానీవింత తక్కరించేవు
వుదుటు చూపకువయ్యా వోజలెల్లాఁ గంటిమి ॥ విడు ॥

అడియాసచేతను అలసినాకె రమణుఁ
డొడఁబరచి కూడితే నొద్దికాను
గదుసవై కా శ్రీవేంకటేశ నన్నేలితివి
విడువకువయ్యా నీవిధమెల్లాఁ గంటిమి ॥ విడు ॥ 255

శంకరాభరణం

జమళి వలపులివి సరి ‒ ‒ ౬
సముకంబుననే చందములాయ ॥ పల్లవి ॥
యింతితో నేకాంత మేమాడితివో
చెంతల చెమటలు చిందీని
వింతగ నీవాపె విన్నపంబులకు
కాంతుఁడ పులకలఁ గడు మించితివి ॥ జమళి ॥
జలజాక్షికి నేసన్న చేసితివో
సెలవుల నగవులు జిగి మించె
పొలయుచు నీవాకె బొమ్మజంకెనల
వెలయఁగ గడు నివ్వెరగందితివి ॥ జమళి ॥
యీవనితను నీవెపుడు గలసితివో
లావుగ మోముకళలు నిండె
వోవరి నాపె నీవుర మెక్కఁగా
శ్రీవేంకటేశ్వర సిరులందితివి ॥ జమళి ॥ 256

554-వ రేకు రీతిగౌళ

తరుణి నీవెఱుఁగని తగవున్నదా
గరిమ శృంగార మంగడిఁబెట్ట నేఁటికే ॥ పల్లవి ॥
మోవితేనెకు మదనముద్రలు వెట్టె విభుఁడు
యీవల నీముద్దుమాటలేల చిందేవే
కావించి నెరిదేఁటుల కరపద్మమున దాఁచె
కావరాన ముఖచంద్రుఁ గదలించ నేఁటికే ॥ తరుణి ॥
చెక్కుల కళలరాశిఁ జేగోరి లచ్చెనవెట్టె
వెక్కసపు చూపులేల పెదచల్లేవే
జక్కవచన్నుల కంటసరుల దాఁపెనఁ గట్టె
పెక్కువ పులకలచే బెదరించ నేఁటికే ॥ తరుణి ॥

కందువైన రతులెల్లా కాఁగిట బండారించె
అందెంది పూర్పులేల బయటవేసేవే
పొంది (శ్రీ)వేంకటేశుఁడు పుక్కిట పీడెము నించె
చెందిన చొక్కుఁజెమట చిలుకఁగ నేఁటికే ॥ తరుణి ॥ 257

## దేవగాంధారి

ఇందరి నేలేటివాఁడు యేమి సేసునే
పొందులు మరిగితివి పొసఁగవే నీవు ॥ పల్లవి ॥

సన్నలిట్టే యాతఁడు నీ సవతితోఁ జేసె నంటా
యెన్ని మాటలాడేవే యిప్పుడు నీవు
విన్నపము చెవులొగ్గి వినెనంటా నప్పటిని
యెన్నికగా రొమ్ముదట్టే విదియేలే నీవు ॥ ఇందరి ॥

గక్కన నాపె నితఁడు కప్పురాన వేసె నంటా
మొక్కలాన బొమ్మలేల ముడివెట్టేవే
పక్కనఁ గానుక నిమ్మపండు చేతనందె నంటా
పెక్కువగా నేలవొట్టు వెట్టేవే నీవు ॥ ఇందరి ॥

(శ్రీ)వేంకటేశుఁ డాపెపైఁ జేతులు చాఁచె నంటా
రావాడి యెంత కాఁగిట రాయిడించేవే
మోవ నీపాదాలకాకె మొక్కఁగఁ జేసె నంటా
పోవులుగా నింతయేల పొగడేవు నీవు ॥ ఇందరి ॥ 258

## సాళంగనాట

అందుకేమి దోసమా అన్నిటా దొరవు నీవు
సందడి నీవేఁటికి నిజాలు నెరపేవు ॥ పల్లవి ॥

నెలకొన్న మాటలకు నీవే గురిగాక
చెలులకేమివోదు చెప్పి(ప్పు?)వారింతే
వెలయ నీవననివి పీరాడఁ గలరా
యెలమి నీ వానలెల్ల యేల పెట్టుకొనేవు ॥ అందు ॥

దినము నీ చేఁతలకు దేహమె గురి గాక
వనితలెఱుఁగుదురా వద్దివా రింతే
మును నీవు సేయనివి మ్రుట్టి సేయించేరా వీరు
ఘనముగ నేల తారుకాణించి వచ్చేవు ॥ అందు ॥

మంతనవుఁ గూటమికి మనసే గురి గాక
యింతులేమిటివారు నీ యిచ్చవారింతే
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
వంతగాఁడ యాల వొడఁబరచ వచ్చేవు ॥ అందు ॥ 259

## సామంతం

అలుకలేఁటికి రావే యాతనివద్దికి నీవు
బలిమైతే వలపులు పదనుకు వచ్చునా ॥ పల్లవి ॥

సంగడినున్న సతికి చనవులు గలుగుఁ గాక
కంగి కడనుండితేను కలదా పొందు
చెంగటనున్న రుచులు చేరి నోరూరించుఁ గాక
అంగడినున్న సొమ్ములు ఆసలు పుట్టించునా ॥ అలుక ॥

వినయపుటింతికిని వేడుకలీడేరుఁ గాక
పెనఁగుచు బిగిసితే ప్రేమ పుట్టునా
తనువునఁ బూసినగందము చల్లనౌఁగాక
వనములో తరువులు వడదేర్చ నోపునా ॥ అలుక ॥

సేవ చేసేమగువకు చేఁతలెల్లాఁ జెల్లుఁ గాక
యీవల నొడ్డారించితే నింపు వుట్టునా
శ్రీవేంకటేశుఁ డిందు విచ్చేసి తా నిన్నుఁ గూడెను
పూవులు పిందెలౌఁగాక పొల్లు వెలవెట్టునా ॥ అలుక ॥ 260

## ముఖారి

చేచేత నీకుపాయాలు చెప్పవలెనా నేము
  యేచి నీకు నింతేసి యెచ్చరించవలెనా ॥ పల్లవి ॥
సంతము నీతో నాడి పవ్వళించినది చెలి
  చెంత వేఁడుకోరాదా చెక్కునొక్కి
  వింత లేక నీవే ముందు వీడెము చేతికీరాదా
  మంతనాన మాటదీసి మచ్చిక చూపరాదా ॥ చేచే ॥
మొక్కలము నీకుఁజూపి ముసుఁగు వెట్టుకున్నది
  గక్కున మోవియ్యరాదా కాఁగిలించి
  పక్కన నవ్వటి నీవు పచ్చడము గప్పరాదా
  చిక్కని నవ్వులు నవ్వి చెంగలించరాదా ॥ చేచే ॥
తప్పకిట్టే నిన్నుఁ జూచి తలవంచుకున్నది
  గొప్పచన్నులంటి యిట్టే కూడఁగరాదా
  యిప్పుడే శ్రీవేంకటేశ యీకాంత నేలితివి
  దప్పిదేర రతుల వింతలు సేయరాదా ॥ చేచే ॥ 261

## పాడి

ఎవ్వతె యెక్కుడు నీకు నిద్దరిలోన
  యివ్వల నవ్వలఁ దాము ఇద్దరు నున్నారు ॥ పల్లవి ॥
మనసు రంజిలఁజేసి మాటలు నీతో నాడి
  చనవు చేసుకో(కొనె?) నాపె చదురాలు
  వెనక నొక్కతి వచ్చి వేడుకలు నీకు నించి
  పెనఁగులాటల మోవి పిప్పిసేసె నిపుడు ॥ ఎవ్వ ॥
యిచ్చకములెల్లఁ జూపి యెదుటనే నిలుచుండి
  వచ్చిచేసె నిన్ను నాకె వంతగత్తె
  హెచ్చి నిన్నుఁ దఱవాత నీపె వచ్చి బుజ్జగించి
  తచ్చితచ్చి కమ్మటినిఁ దమకించె నిపుడు ॥ ఎవ్వ ॥

సేవలెల్లా నీకుఁ జేసి శ్రీవేంకటేశ్వర కూడ
నీవద్దనే వున్నదాకె నెరవాది
యీవల నన్నేలితివి యిదెటెఁగి తోడియాపె
తావులనే నెలకొని తనిపెఁ దానిపుడు ॥ ఎవ్వ ॥ 262

555-వ రేకు

## భూపాళం

పంతగాఁడవౌదువు భళిభళి మెచ్చితిమి
సంతమైతి విన్నిటాను చనవియ్యరాదా ॥ పల్లవి ॥
విన్నవించఁ జెలినంపి వేవేలు కానుకలిచ్చి
సన్నలు సారెకుఁ జేసీ సకియ నీకు
యెన్ని పరాకులు సేసే వెవ్వరితో మాటాడేవు
మన్నించి లోనికి వచ్చి మగువఁ జూడరాదా ॥ పంత ॥
యెదురుగా విచ్చేసి యింటికిఁ దోడుకవచ్చి
పదములు నీమీఁదివి పాడి చూపీని
పెదవి నేల నవ్వేవు ప్రియములెందు దాఁచేవు
కదిసి మోవి యొసఁగి కైకొనఁగరాదా ॥ పంత ॥
వూడిగాలు నీకుఁ జేసి వొద్దనే కూచుండి
వేడుకతో నిట్టె వీణె వినిపించీని
కూడితివి యిఁకనైనా కొంకక శ్రీవేంకటేశ
మేడెపురతుల నింకా మెప్పించరాదా ॥ పంత ॥ 263

## ఆహిరి

నీమనసుకోలఁదింతే నేమేమి విన్నవించేము
దీమసాన నీకు నీవే తెలుసుకో నేఁడు ॥ పల్లవి ॥
చిప్పిల నాపె నీతో సెలవుల నవ్వితేను
కప్పురము చల్లెనంటాఁ గాఁతాళించేవు
వుప్పతిల్లు మనసు వేరొకచోట నుండితేను
వుప్పనున్నాఁ జప్పనౌను వున్న సుద్దులేఁటికి ॥ నీమ ॥

తళుకుఁజూపుల నాకె తప్పక చూచితేను
కలువల వేసెనంటాఁ గాఁతాళించేవు
వలపు వేరొకచోట వాడికె గలిగితేను
చలువైనా వేడాను సాదించ నేటికి ॥ నీమ ॥

కుమ్మరించి కుమ్మరించి కొసరి మాటాడితేను
కమ్మఁదేనె చిమ్మెనంటాఁ గాఁతాళించేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యెనసితివి చెలిని
నెమ్మిఁ దిట్టే దీవనౌను నేరమెంచ నేఁటికి ॥ నీమ ॥ 264

## శోకవరాళి

మగువను దయఁజూడు మగపాడి
యిగురుమోవి యిచ్చుటిది మగపాడి ॥ పల్లవి ॥

చెక్కిటి చేతితోడి చెలి సిగ్గుదేరిచి
మక్కువ సేయించుకుంటే మగపాడి
అక్కజపు విరహాన నసురుసురై యుండఁగ
ఇక్కువలంటి మన్నించుటిది మగపాడి ॥ మగువ ॥

చినుకుఁజెమటమేని చింతతోడ నున్నదాని
మనసు రంజిలించుటే మగపాడి
తనివోని కోరికతో తలవంచుకుండఁగాను
యెనసి నవ్వు నవ్వించుటిది మగపాడి ॥ మగువ ॥

చాటుచు నీకుఁ బ్రియాలు సారెసారెఁ జెప్పఁగాను
మాటలాలించి వినుటే మగపాడి
ఆఁటదని చిత్తగించి అట్టె యీకెఁ గూడితివి
యీటున శ్రీవేంకటేశ యిది మగపాడి ॥ మగువ ॥ 265

ముఖారి

ఎందునుఁ బోరాదు ఆతఁడేమి సేసునే
యిందునే విట్ఠలుని నీవెంత సేసేవే ॥ పల్లవి ॥

అంగన నీమాటలెల్ల నాదరించి వినఁగానే
పంగించి యాతనికేదో పరాకనేవే
ముంగిటి నీమొక్కులెల్ల మొగి నెంచుకొనఁగానే
అంగవించి యెందో మాటలాడీ ననేవే ॥ ఎందు ॥

నమ్మిక నీచేఁతలకు నవ్వులాతఁడు నవ్వఁగ
చిమ్మిరేఁగి అవి యేదో సిగ్గులనేవే
తమ్మిరేకుఁ గన్నులను తప్పకిట్టే చూడఁగాను
యిమ్ములనవి గొన్ని యెమ్మెలనేవే ॥ ఎందు ॥

గక్కన నాతఁడు నిన్నుఁ గాఁగిలించి కూడఁగాను
తక్కకెవ్వతెపైదో కాతరమనేవే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్ను మెచ్చఁగ
చక్కఁగా నితఁడింతటి జాణఁడనేవే ॥ ఎందు ॥ 266

రామక్రియ

అందుకేమి దోసమా అవుఁగాదనే వారెవ్వరు
చెందిమాతో బాసలేల సేసేవు నీవు ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చెలి నీతో నవ్వఁగాను
మెలుపున నంతలోనే మెచ్చవా నీవు
చలపట్టి యప్పటిని సరసములాడఁగాను
వెలయఁ జేయూఁపెమీఁద వేయవా నీవు ॥ అందు ॥

సారెకును సారెకును చన్నుల నిన్నొరయఁగా
నేరుపుతో వలపులు నించవా నీవు
ఆరీతినే కొనగోర నాయములు ముట్టఁగాను
కోరి పచ్చడము గప్పి కూడవా నీవు ॥ అందు ॥

తతిగొని తతిగొని తగనాకె మొక్కఁగాను
ఇతవుగా దీవెనలియ్యవా నీవు
సతమై శ్రీవేంకటేశ సరి నన్ను నేలితివి
మతకములెల్ల మాని మన్నించవా నీవు ॥ అందు ॥ 267

## పాడి

ఊడిగెపువారమై నేముండుట గాక
జాడెలిఁగి నిన్ను నింత జరయఁగ గలమా ॥ పల్లవి ॥
మదము దొలఁకేయట్టి మగువల నేలితివి
సదరమా నీతోడి సంగాతాలు
వుదుటుఁ గుచగిరుల నొరసి సాము చేసితి -
విదే నీతోఁ బెనఁగఁగ నింతేసికిఁ గలమా ॥ ఊడి ॥
చిలుకుఁ జూపులలోనే సిగ్గులు దేరితివి
సులభమా నీతోడి చుట్టరికము
తలిరుఁబెదవులను దప్పులు దేరితివి
తలపెట్టి రతి సేసి తనుపఁగఁ గలమా ॥ ఊడి ॥
గామిడి బాహులతల కాఁగిళ్ళఁ బొదలితివి
సామాన్యమా నీతోడి చయ్యాటాలు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
దోమటి దొడికి నిన్ను కొమ్మి సేయఁ గలమా ॥ ఊడి ॥ 268

## 556-వ రేకు రామక్రియ

పాయపువాఁడు దానే పసిబాలుఁడు దానే
చాయల సన్నలచేత చనవిచ్చీ నిపుడు ॥ పల్లవి ॥
వేడుకకాఁడై యిదివో విఠలుఁడు వీధులను
వాడికవలపు చల్లి వనితలపై
కోడెల నావులఁ గాచే గొల్లెతల యిండ్లను
వోడక వెన్నలఁ బాల నోలలాడీ నిపుడు ॥ పాయ ॥

సంగడి తేరులమీఁద సత్యభామ రుక్మిణుల
చెంగట సేసలు వెట్టె శ్రీకృష్ణుఁడు
ముంగిటి వ్రేపల్లెలోన ముద్దులు గురియుచును
సింగారపుటుట్లకు చేయి చాఁచీ నిపుదు ॥ పాయ ॥

అందపుమేడలెక్కి అష్టమహిషులతోడ
విందుల మోవియిచ్చి శ్రీవేంకటేశుఁడు
యెందునుఁ దుంగభద్రయేటిదరిఁ గూడి యాడి
సందడి రతులచేత సమకూడీ నిపుదు ॥ పాయ ॥ 269

శ్రీరాగం

తెలుసుకో యిఁక నీవే తేటతెల్లమిగ నివి
అలయించే కోరకా పొందయ్యే కోరకుఁ గాక ॥ పల్లవి ॥

నే మోహించినది యెల్ల నిన్ను దూరే కోరకా
గోమునఁ గూడి చొక్కించే కోరకుఁ గాక
చేముట్టి నీమేన గోర జీరదీసే కోరకా
ప్రేమాన సేసవెట్టి మెప్పించే కోరకుఁ గాక ॥ తెలుసు ॥

ఆలనై వుండుట నే నిన్నారడిఁ బెట్టే కోరకా
గోలనై వేడుక సేసే కోరకుఁ గాక
వేళగాచి పిలిచేది వేసరించే కోరకా
కేళాకూళిఁగి నిన్ను మరిగించే కోరకుఁ గాక ॥ తెలుసు ॥

చుట్టరికము చెప్పేది సొలసేటి కోరకా
గుట్టుతోడఁ బాయకుండే కోరకుఁ గాక
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
వెట్టిసేవకోరకా నవ్వించే కోరకుఁ గాక ॥ తెలుసు ॥ 270

## సామంతం

కలసినచోటను కడమేల
పలుకుల నిటు వొడఁబరచఁగరాదా ॥ పల్లవి ॥
యెరవుల మాటలు యెందాఁక నాడేవు
కరుణించవయ్యా కామినిని
తెరమఱఁగేఁటికి తెలిసె నీ మనసు
యిరవగు నీచనవియ్యఁగ రాదా ॥ కలసి ॥
యెలయింపులుగా నెందాఁక నవ్వేవు
అలరించవయ్యా అంగనను
పలుసిగ్గులేల పైకొనెఁ దమకము
నిలిచిన నీమేలు నెరపఁగ రాదా ॥ కలసి ॥
యిక్కువలు చేత నెందాఁక నంటేవు
చొక్కించవయ్యా యీసుదతి నిటు
గక్కన శ్రీవేంకటేశ కూడితి
వొక్కట మన్ననలొసగఁగ రాదా ॥ కలసి ॥ 271

## ఆహిరి

కందువలన్నియు నందే కానవచ్చీని
అందముగ నేఁడాకె యంకెకు రారాదా ॥ పల్లవి ॥
చిగురు నీపెదవాపెచే గంటి సేయించుకున్న
నగరాదా నీవిప్పుడు నన్నుఁజూచి
యెగసక్కెములు నీతోనేల యిప్పటనుంటిని (?)
మగపాడి నాపెతోను మాటలాడరాదా ॥ కందు ॥
కొనబు నీచెక్కులాకె గోర గీరించకున్న
అనరాదా నీవప్పుడు అందరితోను
పెనఁగ నేటికి నీతో పెద్దరికములు చెప్పి
కనుఁగొనేవాకెతో నేకతమాడరాదా ॥ కందు ॥

కోమలపు నీమేనాపెగుబ్బల నొత్తించకున్న
ఏమన్నాఁ బంగించరాదా యింతలోనే
కామించి శ్రీవేంకటేశ కలసితివీకె నిట్టే
ప్రేమతో నురముమీఁదఁ బెట్టుకొనరాదా ॥ కందు ॥ 272

## శుద్ధదేశి

ఎంతటి నేరుపరివి యేమి చెప్పేది
వింత నీచేఁతలు చూచి వేడుకవుట్టీని ॥ పల్లవి ॥

ప్రియములు చెప్పేవు పెనఁగవచ్చేవు నీ
నయగారి చేఁతలకు నవ్వువచ్చీని
దయలు వుట్టించేవు తగవులు నడపేవు
నియతి నీసుద్దులకు నిండుకొనీ మోహము ॥ ఎంత ॥

తొడపైఁ దొడ వేసేవు తోడనే బుజ్జగించేవు
వెడమాయ విద్యలకు వెరగయ్యీని
పెడరేఁచేవు చిత్తము బిగువుచన్నులంటేవు
బడి నీవినయానకు బాఁతిపడీ మనసు ॥ ఎంత ॥

కందువ మోవియిచ్చేవు కాఁగిటఁ గూడేవు నీ
చెందిన రతులు చూచి సిగ్గయ్యీని
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సందడి నీగుణాలకు చవులు వుట్టీని ॥ ఎంత ॥ 273

## * దేవగాంధారి

విన్నపములేమి సేసే వేగినంతాను
మన్నించి రక్షించే నీమహిమలే ఘనము ॥ పల్లవి ॥

నీవంక నేరమిగద్దా నేనే యపరాధిని
దేవ నే జడుఁడఁగాన తెలుసుకోను
వావాత మాగురుఁడాడే వాక్యము నీయాధీనము
పావనమైన నీపలుకెల్లా సత్యము ॥ విన్న ॥

* ఇది అధ్యాత్మ సంకీర్తన. ఎట్లో ఇందు చేరినది. అన్నమయ్యరచనకూడ కాదేమో.

మంచితనమెల్లా నీదే మాయదారివాఁడ నేను
చంచలుఁడఁ గనక విచారించుకోను
అంచల నీదాసుని ఆనతి యమోఘము
యెంచ నీవిచ్చిన వరమెందుకంటే బలువు ॥ విన్న ॥

కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది
నరుఁడఁ గనక అట్టె అరసుకోను
పరగ మాజనకుని ప్రతిజ్ఞయు నీపంపు
నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము ॥ విన్న ॥ 274

557-వ రేకు తెలుఁగుఁగాంబోది

ఎక్కడి పరాకులేఁటికయా
గక్కునఁ గాఁగిటఁ గలయఁగరాదా ॥ పల్లవి ॥

ననుపునఁ జెలి యదె నవ్వులు నవ్వీ
వెనకటి పొందులు వెసఁ దలఁచి
చెనకుచు నీపైఁ జేఁతలు సేసీ
మనసులోన నీ మర్మము దలఁచి ॥ ఎక్క ॥

తగిలిన యాసలఁ దప్పక చూచీ
పొగరుమోవి తీపులు దలఁచి
మిగులఁ దఱచుగా మేలము లాడీ
వెగటులేని రతివేడుక దలఁచి ॥ ఎక్క ॥

ఘనమగు చన్నులఁ గడు నిను నొరసీ
వొనరిన నీ చనవులు దలఁచి
యెనసెను శ్రీవేంకటేశ్వర నిన్నికె
గొనకొను నీమంచిగుణములు దలఁచి ॥ ఎక్క ॥ 275

## గుండక్రియ

ఆపే నేను నొక్కేటే అందుకేమయ్యా
చేపట్టి యింతలో నేల సిగ్గులు వడేవు ॥ పల్లవి ॥

విన్నపములు వింటివా వెలఁది చెప్పించినవి
సన్నల నీకవి యెల్లా సరివచ్చెనా
నిన్నటి మీసుద్దులెల్లా నేఁదెలిసితి ననుచు
నన్నుఁ జూచి నీవేల నడుమఁ గొంకేవు ॥ ఆపే ॥

కానుక లందుకొంటివా కామిని నీకంపినవి
తానకమై యవి నీచిత్తానఁ బట్టెనా
నానాటి మీసరితలు నాకు దిష్ట మాయనని
నే నిప్పుడేమనఁగాను నీవింత లోఁగేవు ॥ ఆపే ॥

యేకతములాడితివా యింతిని రప్పించుకొని
కైకొని శ్రీవేంకటేశ కలసితివా
యీకడ నన్నేలితివి యిన్నియు నేఁగంటినని
నాకొరకు నెంతేసి నవ్వులు నవ్వేవు ॥ ఆపే ॥ 270

## సౌరాష్ట్రం

అన్నిటా జాణవు నీవు అటువంటివాఁడవా
కన్నపనులకుఁ దారుకాణలేలయ్యా ॥ పల్లవి ॥

తెలిసె నీమాటలు తేటతెల్లమిగాను
చెలులెల్ల నాతోనుఁ జెప్పినప్పుడే
అలుకలన్నియుఁ దేరె నన్నిటా సంతోసమాయ
యెలమి నింతేసియాస లేల పెట్టేవయ్యా ॥ అన్ని ॥

కంటిమి నీగుణములు కన్నుల పండుగగాను
యింటికి నీవే వచ్చి యెచ్చరించఁగా
జంటలైతి మిద్దరము చక్కనాయఁ బనులెల్ల
నంటుచేసి నన్ను నెంత నమ్మించేవయ్యా ॥ అన్ని ॥

మెచ్చితి నీనేరుపులు మేనఁ బులకలు నిండ
కచ్చువెట్టి నన్నుఁగూడి కాఁగిలించఁగా
మచ్చిక శ్రీవేంకటేశ మనసు లొక్కటులాయ
యిచ్చగించ నీ నిజాలు యెంతచెప్పేవయ్యా ॥ అన్ని ॥ 277

## శంకరాభరణం

పొందు లిద్దరివి పొత్తున నున్నవి
కందువ లడుగరే కాంతలిటు ॥ పల్లవి ॥

తలఁపులెనసితే తగులమి గలుగును
పలుకులొనరితేఁ బనులౌను
చెలిమి గలిగితే చెనకులు ననుచును
తెలియరె వలపుల తేటలివి ॥ పొందు ॥

నయములుండితే నగవులు గలుగును
ప్రియములఁ జనువులు పెనఁగొనును
క్రియలు దెలిసితే కెరలుఁ దమకములు
నియతిఁ జూడరే నేర్పులివి ॥ పొందు ॥

కూడినయపుడే గురుతులు నిలుచును
యీడుగఁ బెనఁగిన నింపౌను
యీడనే శ్రీవేంకటేశుఁడు గలసెను
వేడుక సేయరె వెలసె నివి ॥ పొందు ॥ 278

## నాదరామక్రియ

సరకు గొనేవా నీవు సవతులను
దొరతనపు గర్వము తొట్టీని నీకు ॥ పల్లవి ॥

మంతనాన నాతఁడాడే మాటలవల్లనే కాదా
యింత పెచ్చుపెరిగితి వేమే నీవు
చెంతలఁ గొలువులోని సెలవినవ్వులఁ గాదా
దొంతి జవ్వనమదము దొలఁగీని నీకు ॥ సరకు ॥

పొందుల నాతఁడు సేసే పోదులవల్లనే కాదా
మందెమేళమునఁ గడు మట్టు మీరేవు
కందువ నప్పటప్పటి కనుసన్నలనే కాదా
యిందరిలోఁ బగటులు హెచ్చీని నీకు ॥ సరకు ॥

గుట్టున శ్రీవేంకటేశు కూటమివల్లనే కాదా
పట్టపు దేవులవై పరగితివి
యిట్టే నన్నేలినట్టి యీతనివల్లనే కాదా
చుట్టరికములకెల్ల చోటాయ నీకు ॥ సరకు ॥ 279

కేదారగౌళ

నేమెఱఁగమా నీ నెరజాణతనములు
సాములేల సేసేవు చక్కనుండవయ్యా ॥ పల్లవి ॥

పగటున నిందరిలోఁ బలుమారు నీవు నవ్వే
నగవులే కావా నమ్మరానివి
మిగులా నిచ్చకముతో మేకొని సరసమాడే
మొగమిచ్చులే కావా మోసపుచ్చేవి ॥ నేమె ॥

సేదదేర నాలిచేసి చెక్కునొక్కి బుజ్జగించే
ఆదరింపులే కావా అలయించేవి
పోదిసేసి వలపులఁ బొరలించి వేఁడుకొనే
సాదుమాటలే కావా జాలిఁబెట్టేవి ॥ నేమె ॥

మతకాన నీవు నన్ను మన్నించే పానుపుమీఁది
రతిచెనకులే కావా రాఁపుసేసేవి
యితవై శ్రీవేంకటేశ యింపుతో నీవొసగిన
తతిమోవితేనెలే (కావా?)తమి రేఁచేవి ॥ నేమె ॥ 280

558-వ రేకు లలిత

ఎవ్వరిని మెప్పించేవే యింతిరో నీవు
నివ్వటిల్లని వెల్లాను నిలువఁబెట్టేవా ॥ పల్లవి ॥
యేమనేవే చెలియా యెదిరించి నీవు నాతో
నేమపు వానిమాటలు నిజమనేవా
కోమలియుఁ దాను రతిఁ గూడి యుండఁగాఁ గంటి
గామిడిసేఁతలు యింకాఁ గల్లలనేవా ॥ ఎవ్వ ॥
వింటిలేవే మగువా వీరిడి నీవిన్న పాలు
అంటిముట్టి వానికిఁగా నానవెట్టేవా
వొంటి నిప్పుడద్దరును వుప్పరిగెలో నున్నారు
బంట నిది లేదని సాదించేవా ॥ ఎవ్వ ॥
నీవిదేమె వనితా నేఁడు శ్రీవేంకటేశుఁడు
కావించి నన్నేలెనంటా గతి గూడేవా
దేవులుఁ దాను నిందాఁకా దిష్టము జూజమాడిరి
సేవసేసే యాపె యని చెల్లఁబెట్టేవా ॥ ఎవ్వ ॥ 281

దేసాళం

వేసరింతురా చెలిని విట్ఠలేశ్వరా
నీసుద్దుల కోపునా నేఁడు విట్ఠలేశ్వరా ॥ పల్లవి ॥
కామిని నీతో నవ్వదా కపటమించుకా లేక
వేమారు నిందాఁకాను విట్ఠలేశ్వరా
గోమునసుండి యలసి కోరి తెరవేసుకొంటే
గామిడిసేఁత సేసేవు కడు విట్ఠలేశ్వరా ॥ వేస ॥
వీడు జోడై చెనకదా విరసాలు నెరపక
వీడెము చేతికొసఁగి విట్ఠలేశ్వరా
వూడిగేలు చేసి వోవరిలో నుండి తేను
ఆడుకొనే వెంతగబ్బియని విట్ఠలేశ్వరా ॥ వేస ॥

చెంత నిన్నిట్టే కూడదా శ్రీవేంకటాద్రిమీఁద
వింతలేని చనవుతో విట్ఠలేశ్వరా
బంతిరతులను జొక్కి పచ్చడము చొచ్చుకొంటే
పంతాన మరిఁ గూడేవు బాపు విట్ఠలేశ్వరా ॥ వేస ॥ 282

## హిజ్జిజి

వాసికే బతికేవారు వనితలెల్లా
గోస(సున?)నాససేతురా కొండవంటి దొరవు ॥ పల్లవి ॥
చెలి నీమాటలువిని సిగ్గులువడీ నదే
పలుమారు నింతయేల పచ్చిసేసేవు
యెలమి యేకతమైతే నేమిసేసినాఁ జెల్లు
కొలువులో నింతగద్దా కొండవంటి దొరవు ॥ వాసి ॥
భామిని నీసేఁతలకు పయ్యద మూసుకొనీని
వేమారు నింతేల వెల్లవిరి సేసేవు
గోమతెరలోన నెంత తుదమీరినాఁ జెల్లు
కోమల మెఱుఁగవద్దా కొండవంటిదొరవు ॥ వాసి ॥
కొమ్మ నీనవ్వులకు గొబ్బునఁ దలవంచీని
కమ్మర నింతేల తమకము రేఁచేవు
యిమ్ముల శ్రీవేంకటేశ యిద్దరికూటమీఁ జెల్లు
కుమ్మరింతురా వేసాలు కొండవంటి దొరవు ॥ వాసి ॥ 283

## ఆహిరి

ఏల దూరేవయ్యా యెడగలటుంటి నంటా
వోలివెట్టి పెండ్లాడఁగ నోరయఁగ వచ్చునా ॥ పల్లవి ॥
ఇద్దరును మీరిట్టే యేకతములాడఁగాను
వొద్దికి రావచ్చునా వూరకే నేను
పెద్దరికములకును పెనగుఁలాటాడఁగాను
అడ్డలించి మీకు నేను నడ్డమురాఁదగునా ॥ ఏల ॥

తెగని యాసతో మీరు తెరవేసుకుండఁగాను
సొగిసి నేనిటు తొంగి చూడవచ్చునా
పగటున మీలోన పచ్చిమాటలాడఁగాను
వెగటుగా నిట్టే పొంచు విన నాకు వచ్చునా ॥ ఏల ॥

కామించి మీరిద్దరును కాఁగిలించుకుండఁగాను
ఆముకొని నే వీడెమియ్యఁగ వచ్చునా
యీమేరనే శ్రీవేంకటేశ నన్నుఁగూడితివి
మీమీఁదటఁ బంతాలు మెరయఁగ వచ్చునా ॥ ఏల ॥ 284

## రామక్రియ

సతులకు నిటువంటి చండితనము గలదా
మతకాన నీవు సేసేమహిమలు గాక ॥ పల్లవి ॥

కంచము పొత్తునను ఆ కాంత నీవు నుండఁగాను
కొంచక తానేల వచ్చి కూచుండీ నీకె
లంచముగా మోవితేనె లాలించి యాపెకియ్యఁగ
ఇంచుకించుక నోరూర నీపెకేల యిపుడు ॥ సతు ॥

కనుసన్న నాపె నీకు కతలు సారెఁ జెప్పఁగ
వొనర నడుమనేల వూఁకొనీ నీకె
గునియుచు నీవాయింతికొంగు వట్టి తీయఁగాను
తనువెల్లఁ జెమరించఁ దనకేల యిపుడు ॥ సతు ॥

రవ్వఁగాఁ జానుపుమీఁద రమణి నిన్నుఁ గూడఁగ
ఇవ్వలిపక్కఁ దానేల యెనసీ నీకె
నవ్వుతా శ్రీవేంకటేశ నన్ను నిట్టే యేలితివి
చివ్వన సేఁకరనేల చెలియకు నిపుడు ॥ సతు ॥ 285

### పాడి

ఎందాఁకా సిగ్గులువడే వేమయ్యా
ఇందుముఖి కేకతాన నియ్యవయ్యా చనవు ॥ పల్లవి ॥
సొలసి సొలసి నిన్ను సుదతి గొసరఁగాను
పలుమారు నీకెక్కడ పరాకయ్యా
కలువపువ్వుల వేసి కందువలు చూపఁగాను
వలవంత నీవిట్టే యెవ్వరిఁ జూచేవయ్యా ॥ ఎందా ॥
తగిలి తగిలి నీతో తతిగొని నవ్వఁగాను
వొగి నీచిత్తమెక్కడ నున్నదయ్యా
మొగము చూచి నీకు మొక్కులెల్లా మొక్కఁగాను
జిగిమీర నీవేల శిరసెత్తవయ్యా ॥ ఎందా ॥
చెనకి చెనకి యీకె చేరి నిన్నుఁ గూడఁగాను
యెనలేని నివ్వెరఁగు లిఁకనేలయ్యా
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిలించె నీదేవులు
గొనగొన్నరతి నెంత గుట్టుచూపేవయ్యా ॥ ఎందా ॥ 286

559-వ రేకు

### పాడి

ఎంత దడవు వట్టునే యీడేరునటే-వోరి
పంతమాడి చెప్పేను ఆపని ఇట్టే అయ్యీరా ॥ పల్లవి ॥
యెఱుక చెప్పఁగదవే యింతిరో నీవు-వోరి
చిఱుసేఁతొకటి దలఁచితివిట్టే-రా
గుఱిగా నాతలఁపొనగూడు నటవే-వోరి
కొఱత లేదు కోరిన కోర్కులయ్యీరా ॥ ఎంత ॥
మనసులోఁగల యట్టె మరియౌనటే-వోరి
పనివడి అది నీకు పైపై నుందిరా
ననుపున అదినేను నమ్ముదునటే-వోరి
అనుమానించకు నీవు అన్నట్టే అయ్యీరా ॥ ఎంత ॥

చేయి వట్టుక చెప్పవే సిగ్గులేఁటికి - వోరి
ఆయములు సోఁకె నీఁక ననువాయరా
యీయెడ నేకతమాయ నేలే మఱుఁగు - వోరి
పాయపు శ్రీవేంకటేశ పలికినట్టయ్యీరా ॥ ఎంత ॥ 287

## శంకరాభరణం

ఇద్దరు జాణలే మీరు యెంచి చూచితే
పొద్దులు గడపుదురా పొరుగునను ॥ పల్లవి ॥

దిగ్గన సరసమునఁ దిట్టులెన్ని దిట్టినాను
యెగ్గులు వట్టుదుర యింతలోననే
వెగ్గళించి చనవున వెస మర్మములంటితే
సిగ్గులు వడుదురా జిగిమించను ॥ ఇద్దరు ॥

జవ్వనపాయముతోడ సారె సారెఁ జెనకితే
నవ్వులు నవ్వుదురా నట్టనడుమ
నివ్వటిల్లు సన్నలెల్లా నెట్టుకొనఁ జేసితేను
రవ్వలు సేయుదురా రచ్చలోనను ॥ ఇద్దరు ॥

సమ్మతించి కాఁగిళ్ళను సమరతిఁ బెనఁగితే
బొమ్మల జంకింతురా పూఁచిపట్టుక
యిమ్మల శ్రీవేంకటేశ యిట్టె మీరు గూడితిరి
దొమ్ములు సేయుదురా తోడఁదోడను ॥ ఇద్దరు ॥ 288

## బౌళి

ఎక్కడఁ జిత్తమున్నది యెవ్వరితో మాటాడేవు
చొక్కపు మాచేతిది చూడవయ్యా కానికె ॥ పల్లవి ॥

నెలఁత వోరువలేదు నిన్నుఁ గొసరక పోదు
చెలరేఁగె విరహము చెప్పరాదు
వెలలేని విన్నపాలు వేవేలుఁ జేసితిమి
సొలసి మాచేత నిదె చూడవయ్యా కానికె ॥ ఎక్క ॥

చెమటలే ముంచీని చింతలెల్లఁ బెంచీని
జమళి తమకములు సారె నించీని
సముకాన నీతోను చనవులు చూపితిమి
సుముకుఁడ మాచేతులఁ జూడవయ్యా కానికె ॥ ఎక్క ॥

మేడెపు రతులఁ జొక్కె మెలుఁత నీకాలు దొక్కె
కూడితి శ్రీవేంకటేశ కోరికె దక్కె
వేడుకచెలులమెల్లా వింతలుగా మొక్కితిమి
జోడగుమాచేతులందుఁ జూడవయ్యా కానికె ॥ ఎక్క ॥ 289

దేశాక్షి

ఇరవాయ నయ్యా మీయిద్దరి వేడుకలును
సరసములాడెఁగా సారె నీతో నాపె ॥ పల్లవి ॥

తూఁగుమంచ మెక్కించుక తొడమీఁదఁ దొడ వేసి
మాఁగినమోవి యిచ్చెఁగా మగువ నీకు
వేఁగైన చన్నులు నీవీఁపుమీఁద వేసుకొని
కాఁగిలించుకొనెఁగా కలికి నిన్ను ॥ ఇర ।

మలగుపై నొరగించి మంతనములాడుకొంటా
కలకల నవ్వెఁగా కాంత నీతోను
చెలరేఁగి చెక్కులు నీచెక్కులతోఁ బెనగొన
వలపులు రేఁచెఁగా వనిత నీకు ॥ ఇర ॥

పచ్చడముపైఁ గప్పి పలుకులఁ జొక్కించి
యిచ్చకానఁ గూడెఁగా ఇంతి నీతోను
ముచ్చట శ్రీవేంకటేశ ముందు నన్నుఁ గూడితివి
లచ్చనలు నించెఁగా లలన నీపైని ॥ ఇర ॥ 290

## నారాయణి

సందడి పెండ్లి నీకు సమకూడెను
కందువ నీవెవ్వతెనుఁ గలసేవో కాని ॥ పల్లవి ॥

కప్పుర మొకతె యిచ్చె కస్తూరి వూసె నొకతె
చిప్పిల గందము మెత్తెఁ జేరి యొకతె
చొప్పులొత్తి వేరొకతె సురటిగొని విసరె
నెప్పున నెవ్వతెను మన్నించేవో కాని ॥ సంద ॥

పీడెమొకతె యొసఁగె విరులొకతె ముడిచె
జాడతోడ వేరొకతె చల్లెఁ బన్నీరు
వూడిగము సేసి గోరనూఁదె నిన్ను వేరొకతె
వాడికగా నెవ్వతెకు వలచేవో కాని ॥ సంద ॥

పాదములొకతె యొత్తె పచ్చడమొకతె గప్పె
ఆదిగొని తెరవేసెనట్టె యొకతె
యీడెస శ్రీవేంకటేశ యిందరి మమ్మేలితివి
నీదయ యెవ్వరిమీఁద నెరపేవో కాని ॥ సంద ॥ 291

## మేఁచబౌళి

బుద్ధు లాతనికెందాఁకా బోదించేవే
తిద్దరాని వారిమతి తిప్పనెట్టు వచ్చునే ॥ పల్లవి ॥

ననుపుగాని వారికి నవ్వులేల వచ్చునే
చనవులేని వారికి సరసమేలే
మనసొగ్గని వారికి మంతనములేడవే
తనియని వారికి కాతరమెట్టు మానునే ॥ బుద్ధు ॥

తగులులేని వారికి తరితీపులేలుండునే
పొగియని వారికి సొంపులేడవే
మొగమోడనివారికి ముచ్చట లెటువంటివే
ఐగిసేటి వారికి ప్రియములెక్కడివే ॥ బుద్ధు ॥

నంటులేని వారికి నమ్మికెట్టు పుట్టునే
జంటగాని వారికి చనవులేడ నున్న వే
యింటిలో శ్రీవేంకటేశుఁ డితఁడిట్టే నన్నుఁగూడె
అంటువాయనివారికి నాసలేల తీసునే ॥ బుద్ధు ॥ 292

560-వ రేకు రీతిగౌళ

ఎంత గయ్యాళివనరా యిరుగుపొరుగువారు
పంతముతో నీవేల బలిమి సేసేవే ॥ పల్లవి ॥

గుట్టుతో మెల్లనే పతి కొసరి మాటలాడఁగ
అట్టుగా దూరనేలే యాఱడిగా నీవు
చెట్టవట్టి యాతఁడు చేతికి లోనై యుండఁగ
వొట్టువెట్టి నీవేల వొడివట్టేవే ॥ ఎంత ॥

రమణుఁడాతఁడు నిన్ను రతికిఁ బిలువఁగాను
తమకించి నీవేల కాఁతాళించేవే
సముకానఁ దానే మరి సరసములాడఁగాను
నెమకుచు నీవేల నేరమెంచేవే ॥ ఎంత ॥

శ్రీవేంకటేశుఁడే చేరి నిన్నుఁ గూడఁగాను
వావులేల చెప్పేవే వరుసతోను
వోవరిలోఁదా నిన్ను వురమెక్కించుకోనఁగ
యీవేళ నీవేల మోవి యెంగిలిసేసేవే ॥ ఎంత ॥ 293

ధన్నాశి

ఊడిగేలవారమట వొద్దనే వుండఁగరాదా
యీడనేల సిగ్గువడే వియ్యకొనరాదా ॥ పల్లవి ॥

సారె సారె నాపె నీతో జాణతనాలాడఁగాను
నారుకొన నేమందుకు నవ్వఁగరాదా
కూరిమిఁ గొసరి నిన్నుఁ గొంగువట్టి తియ్యఁగాను
గారవించి నేమందుకు గతి గూడరాదా ॥ ఊడి ॥

తనివోక ఆపె నిన్నుఁ దప్పకిట్టే చూడఁగాను
మనసిచ్చి నేమును సమ్మతించరాదా
చెనకుచుఁ గమ్మటి నీచెక్కు నొక్కి వేఁడుకోఁగా
చనవున నందరము సంతోసించరాదా ॥ ఊడి ॥

గక్కన నాపె నిన్ను కాఁగిలించుకొనఁగాను
మిక్కిలి మాకు నేఁడు మెచ్చఁగరాదా
ఇక్కువతో శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
చిక్కని మోవితేనెలు చేకొనఁగరాదా ॥ ఊడి ॥ 294

## బౌళి

మానవయ్య ఇటువంటి మతకము లాకేమీఁద
సానఁబట్టి చూపు నీవేజాడఁ బెనఁగితివో ॥ పల్లవి ॥

యీయెడఁ దెరవేసుక యింటిలో నున్నది చెలి
సేయరాని సేఁతలేమి సేసితివో
చాయల సన్నల నీపై చలపట్టుకున్నది
పాయపుమదాన నెంత పంతాలు చూపితివో ॥ మాన ॥

పీడెము చేతఁబట్టుక వేసుకోక వున్నదిట్టే
ఆడరాని మాఁటలేమి యాడితివో
నీడనుండి యలయుచు నివ్వెరఁగుతో నున్నది
జోడుగూడేనంటా నెంత చొక్కులఁ బెట్టితివో ॥ మాన ॥

చివ్వనఁ దలవంచుక సిగ్గుతోడ నున్నది
నవ్వరాని నవ్వులేమి నవ్వితివో
రవ్వగా శ్రీవేంకటేశ రమణి మొక్కుచున్నది
కువ్వలుగా రతినెట్లు గూడితివో ॥ మాన ॥ 295

## దేసాళం

ఎఱఁగ విన్నవించితి మిప్పుడే నీకు
జఱయుచు నాఁడువారు సాహసులు సుమ్మీ ॥ పల్లవి ॥

చెంతల నీవాకతితో చేరి మాఁటలాడఁగాను
వంతుకు మాఁటలాఁడీని వాసికి నీకె
యింతట నీవు గనక యిట్టె ఆదరించకున్నా (న్న?)
యెంత సిగ్గువడునో యెఱఁగము సుమ్మీ ॥ ఎఱ ॥

మరిగిన యాకెవద్ద మరి నీవు గూచుండఁగ
వరుసకుఁ గూచుండె వద్దనే యీకె
యిరవుగా నీవీవేళ నిట్టె మన్నించకున్నా (న్న?)
తరవాతి పనులెట్టో తలఁపించే(చీ?)సుమ్మీ ॥ ఎఱ ॥

వేడుకకు నీవాకెను వెసఁ గాఁగిలించుకొంటే
యీడుగాఁ దా నిన్నుఁగూడె యిప్పుడే యీకె
జాడతో శ్రీవేంకటేశ సతి నిట్టే పొందకున్న
పాడివంతాలెట్టుండునో పచ్చిదేరఁ జుమ్మీ ॥ ఎఱ ॥ 296

## గుజ్జరి

రమణుఁడు నాకుఁ దాను రమణి నేను
అమరఁగ నెందాఁకా నాసవెట్టీఁ దాను ॥ పల్లవి ॥

సెలవికి నవ్వువొచ్చె చెక్కుటికిఁ జేయి వచ్చె
యెలమి నమ్మికలిచ్చీ నెందాఁకాఁ దాను
పులకలు మేన నిక్కె బుసకొట్టులివె దక్కె
పొలుపు మిగుల నెంత బుజ్జగించీఁ దాను ॥ రమ ॥

చిత్తములోఁ జింత నిండె సిగ్గులు మోమునఁ బండె
యిత్తల నొడఁబరచీ నెందాఁకాఁ దాను
బత్తి కోరికెలఁ దొట్టె పలుకులు మోవిఁ బుట్టె
కొత్తలుగా వలపెంత గురిసేసీఁ దాను ॥ రమ ॥

కన్నులఁ దేటలు వారె కాఁగిటఁ దగవు దేరె
  యెన్నేసి వేసాలు నేసీ నెందాఁకాఁ దాను
  అన్నిటా శ్రీవేంకటేశుఁ డట్టే తానె నన్ను నేలె
  మన్ననల నన్ను నెంత మరగించీఁ దాను ॥ రమ ॥ 297

శ్రీరాగం

నీవెఱఁగని తగవు నేమెరిఁగేమా
  కైవసమై యిటులైతే కాఁతాళము వుట్టదా ॥ పల్లవి ॥
ప్రియముతో వలపించి పెడవాడ వేయనేల
  దయతోడ మన్నించఁ దగుఁ గాక
  నయమునఁ బొందు లేనినాఁడోర్వవచ్చుఁ గాక
  క్రియఁచూపి పొనిఁగితే కేలిఁ గాఁక రేఁగదా ॥ నీవె ॥
బత్తితోడఁ బిలిపించి పరాకులు చూపనేల
  చిత్తగించి యాదరించఁ జెల్లుఁ గాక
  హత్తి మాటలాడనినాఁ డైనట్లాయఁ గాక
  పొత్తుకు వచ్చి లోఁగితే బూటకమై వుండదా ॥ నీవె ॥
చెలిమితోఁ గాఁగిలించి సిగ్గులువడఁగ నేల
  వలసిన చనవియ్యవలెఁ గాక
  యెలమి శ్రీవేంకటేశ యిందాఁకా గుట్టు గాక
  తలకొని కొసరితే తమకము నిండదా ॥ నీవె ॥ 298

561-వ రేకు భూపాళం

వెన్నతోఁ బెట్టిరి నీకు వేసాలెల్లాను
  పిన్ననాఁడే గొల్లెతలు పెక్కుచందములను ॥ పల్లవి ॥
వన్నెగా సతులనెల్ల వలపించ నేరుతువు
  విన్నపములు చేసితే విన నేర్తువు
  సన్నల మోవితేనెలు చవిచూప నేరుతువు
  మిన్నక మమ్మెల్లను నమ్మించ నేరవా ॥ వెన్న ॥

చుట్టరికములు చేసి చొక్కించ నోపుదువు
గట్టిగా రతులఁ బెనఁగ నోపుదువు
జట్టిగొని నవ్వు నవ్వి చనవియ్య నోపుదువు
మట్టుమీరి మమ్ము నిన్ను మరిగించ నోపవా ॥ వెన్న ॥

ప్రియముతోడుతను కాఁపిరము సేయఁగలవు
భయమెల్లఁ దీరిచి చేపట్టఁ గలవు
నియతి శ్రీవేంకటేశ నీవు మమ్ము నేలితివి
జయమాయ మాపట్టుకు జవదాఁటఁగలవా ॥ వెన్న ॥ 299

## ధన్నాశి

ఈరీతి దయవుట్టెనా ఇన్నియుఁ జూచి
కూరిమి నిండెనా మేలుగురుతులు చూచి ॥ పల్లవి ॥

చెప్పిన నామాటలు చెవిఁ బట్టెనా నీకు
ఇప్పుడైనా విరహపుటింతిఁ జూచి
తప్పులేని నీఆసలు తలఁచుకొంటివా నేఁడు
అప్పటి పానుపుమీఁది యలపులు చూచి ॥ ఈరీ ॥

అందిచ్చిన కానుకలన్నియుఁ గనుపట్టెనా
పొందులకు నేఁకారేటి పొలఁతిఁ జూచి
సందడించే వలపులు సరి వచ్చెనా నీకు
డిందువడని యాసల దిష్టములు చూచి ॥ ఈరీ ॥

మచ్చిక నామొక్కులెల్ల మతికెక్కెనా నీకు
పచ్చిగా నిన్నుఁ గూడిన పడఁతిఁ జూచి
తచ్చి శ్రీవేంకటేశుఁడ తారుకాణాయనా నీకు
విచ్చనవిడి రతుల వేడుకలు చూచి ॥ ఈరీ ॥ 300

## ఆహిరి

ఇట్టే కరుణించవయ్యా యింతినిఁ జూచి
దట్టమాయ వలపులు తమకమువల్లను ॥ పల్లవి ॥

నొసలి కస్తూరిబొట్టు నునుఁ జెమటఁ దడిసి
యసలాయ నిన్నుఁ బాసినందువల్లను
వుసురు నూరుపులచే నూఁగఁ జొచ్చెఁ బయ్యెద
వెస నలయించినట్టి విరహమువల్లను ॥ ఇట్టే ॥

పూసిన గందపుఁబూఁత పులకలచేఁ జిటిలి
రాసివడెఁ బాసిన రారాఁపువల్లను
వేసటతోఁ బొరలఁగా వీడి వున్నది తురుము
పోసరించినట్టి తలపోఁతలవల్లను ॥ ఇట్టే ॥

తట్టువునుఁగు చెక్కులఁ దటి కాఁకలఁ గరఁగి
వుట్టిపడీ నిన్నుఁ బాసి వున్నవల్లను
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి వింతలోనే
వెట్టదీరిన రతుల వేడుకలవల్లను ॥ ఇట్టే ॥ 801

## శంకరాభరణం

కప్పురమందుకొంటిఁ గడపరాయ నీకుఁ
గప్పము మాజవ్వనము కడపరాయ ॥ పల్లవి ॥

కన్నుల మొక్కేనోయి కడపరాయ నా
కన్నె చన్ను లేలంటేవు కడపరాయ
కన్నవారెల్లా నవ్వేరు కడపరాయ నాతో
సన్న లేల సేసేవు సారెఁ గడపరాయ ॥ కప్పు ॥

కలఁగంటిఁ గదవోయి కడపరాయ యింకఁ
గలఁచకు మాసిగ్గు కడపరాయ
కలువల వేసేవేల కడపరాయ నీకు
మొలకనవ్వులతోడ మొక్కేఁ గడపరాయ ॥ కప్పు ॥

కరుణించి నన్నేలితి కడపరాయ నీ
గరిమలెల్లాఁ గంటి కడపరాయ
గరిడిసాములతులఁ గడపరాయ నీకు
యిరవు శ్రీవేంకటాద్రి యిట్టే కడపరాయ ॥ కప్పు ॥ 302

### శ్రీరాగం

ఏమని యానతిచ్చెనే యెదురుమాఁట
వేమారుఁ దనివి దీర వినుపించవే ॥ పల్లవి ॥
కన్నుల మొక్కితి నని కానుకలంపితి నని
విన్నవించితివటవే విభునితోను
తన్ను నే పాడినది తమకముతో నున్నది
తిన్ననై తన మనసు తెలిసెనటే ॥ ఏమ ॥
కడు వలచితినని కాచుకవుందాన నని
తడవితివటవే యాతనితోను
జడిగొనఁ గోరినది జాగరము సేసినది
అడరి తనకే సెలవాయనటవే ॥ ఏమ ॥
యెదురు చూచితినని యేఁకట నుందాన నని
ముదులకించితివాలు ముందె తనతో
యిదే శ్రీవేంకటేశుఁడు యింతలోఁ దా నన్నుఁగూడె
అదన నీవొడఁబాటు లాయనటవే ॥ ఏమ ॥ 303

### సింధురామక్రియ

ఏకతానకు రారాదా యీడనేల కెరలేవు
చేకొని వీడెమిచ్చితే సేసలు వెట్టేవు ॥ పల్లవి ॥
నవ్వుతా నీపై నేను నంటున గోరు మోపితే
రవ్వలు సేసేవింతలో రమణుఁడవు
పువ్వున వేసినవేటు బుజము నాఁటె నంటా
చివ్వన నేఁటికి వద్దిచెలితోఁ జెప్పేవు ॥ ఏక ॥

చుట్టరికానకు నీతో సొలసి వొడివట్టితే
పట్టి పెనఁగుచు నన్నుఁ బచ్చి సేసేవు
తిట్టిన తిట్టులు నీపై తిగెలువారె నంటా
వొట్టులు వెట్టుచు నేల వొలలు వేసేవు ॥ ఏక ॥

కడు వేడుకతో నిన్నుఁ గాఁగిలించుకొంటేను
జడిగొని నా మోవి చవి చూచేవు
అడరి శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
విడువక నన్ను నెంత వేఁడుకొనేవు ॥ ఏక ॥ 304

562-వ రేకు మలహరి

ఇప్పుడు విచ్చేసితివి యింటికాడకు
కుప్పలుగా వలపులు కురిసితిమయ్యా ॥ పల్లవి ॥

నెలఁతల నెదురంపి నీకెదురులు చూచి
పెలుచన నిన్ను నిట్టె పేరఁ బిలిచి
పలు సగినాలు చూచి పలుకులాలకించి
చెలరేఁగి జాగరాలు సేసితిమయ్యా ॥ ఇప్పు ॥

పాటలు నీపైఁ బాడి పక్కన నీవేళ గాచి
కూటువ మనోరథాలు గోరి కోరి
గాటమున మొక్కుకొంటా కానికె చేతఁ బూని
నీటున నిందాఁకాను నిలుచుంటిమయ్యా ॥ ఇప్పు ॥

నీరూపు దలపోసి నిద్దుర కలలు గని
నేరుపుతో నీవు రాఁగా నిన్నుఁ జేరి
యీరీతి శ్రీవేంకటేశ యింతలో నిన్నుఁ గూడితి(మి?)
మేరతో నిట్టే నిన్ను మెచ్చితిమయ్యా ॥ ఇప్పు ॥ 305

## దేశాక్షి

వింటివో వినవో కాని వేడుకతో నున్నదాన
జంటయై యుండఁగా నిన్ను జరయుచుందాన ॥ పల్లవి ॥

మలసి యెప్పుడు నీతో మాటలాడుదునో యని
మొలచినట్టి తమకమున నుందాన
యెలమి నీ వూడిగెములెన్నఁడు సేతునో యని
చెలరేఁగి తపములు సేయుచుందాన ॥ వింటి ॥

ననిచి యేవేళ నీతో నవ్వులు నవ్వేనో యని
కొనసాగే కోరికలు కోరుచుందాన
చనవుతో నీరూపు యెచ్చటఁ జూతునో యని
దినదినము యాసల దివురుచుందాన ॥ వింటి ॥

కందువ నెచ్చోట నిన్నుఁ గాఁగిలింతునో యని
విందుల వలపు విన్నవింపుచుందాన ,
చెంది నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ
యిందుకే నీపై భక్తి నిట్లుందాన ॥ వింటి ॥ 306

## వరాళి

వేడుక మీవలపులు వెల్లవిరాయ
యీడు జోడైన పొందులు యిట్లుండవలదా ॥ పల్లవి ॥

సెలవుల నవ్వుతాను చిప్పిలి సిగ్గులతోడ
కలువపువ్వులాకె కానుకిచ్చెను
కొలువులోపల నీవు(నీ?) కుందణపుటుంగరము
తలకొని నీవు వుచితముగా నిచ్చితివి ॥ వేడు ॥

కన్నులను మొక్కుతాను కడలేని యాసతోడ
కన్నె సూడిదె వట్టె టెంకాయ నీకు
సన్నల మేడలోనుండి చనవునఁ గంటసరి
యెన్నికతోడ నీవు యీవిగా నిచ్చితివి ॥ వేడు ॥

సరసములాడుతాను చల్లని పానుపుమీఁద
గరిమె నద్దము చూపి కలసె నిన్ను
యిరవై శ్రీవేంకటేశ యేలితివా కెను నన్ను
యెరవుతో మోవిలంచ మిద్దరికిచ్చితివి ॥ వేడు ॥ 307

సాళంగనాట

నీవెఱఁగవా యిది నెఱజాణవు
వోవరిలో మమ్మేల వోరసేవు నీవు ॥ పల్లవి ॥

ఆఁడుదానికి సిగ్గులే అందపు సింగారాలు
నీటుతోడ నుండేగుట్టు నిండుసొమ్ము
కూటమిలో వొడికము గురియైన సంపద
గాటమైన వినయము ఘనరాజ్యపదవి ॥ నీవె ॥

నేరుపుతో యడఁకువ నిచ్చకల్యాణము
మేరమీర నీగుణము మించైన మేలు
గారవపుటిచ్చకము కందువ నిధానము
సైరణతోడి నడక సతమైన లాభము ॥ నీవె ॥

కడలేనియట్టి వాసి కమ్మిన తంగేటిజున్ను
గుడిగొన్న శీలము కొంగుపసిఁడి
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కడఁకతో మెలఁకువ కలిమిలో కలిమి ॥ నీవె ॥ 308

బాయానాట

ఎల రట్టుసేసితి వింతేసి నన్ను
లోలోనే చెప్పేఁగాని లోనికి రారాదా ॥ పల్లవి ॥

సారెకు నీవు నాతో జాణతనాలాడఁగ గా
చేరి చేరి నవ్వేరు చెలియలెల్లా
గారవాన నాసరుసఁ గమ్మటిఁ గూచుండఁగాను
తారుకాణలివి యని తమలో నెంచేరు ॥ ఎల ॥

చన్నులమీఁది పయ్యద జార నీవు దియ్యఁగాను
సన్నలు సేసుకొనేరు సభలోనెల్లా
పన్ని నాచేతికి సూవుబంతి యిట్టె యొసగఁగా
యిన్నిటాఁ బొందుకు గురుతిది యనేరు ॥ పల ॥

కప్పురపు వీడెమిచ్చి కాఁగిలించుకొనఁగాను
చొప్పులెత్తి మొగములు చూచుకొనేరు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
చిప్పిలఁ గళలు రేఁగి సిగ్గులువడేరు ॥ పల ॥ 309

## దేసాళం

ఏమి సేసితివో కాని యింతికి నీవు
గామిడినేఁతల నీపె గాత సేసీనోయీ ॥ పల్లవి ॥

పలచగా నవ్వి నీతో పంతములాడుకొంటాను
చెలి యున్నభావము చూచితివా వోయి
తలకొన్న చెలులను తగవులు చెప్పుమని
సొలసీని పలుమారు చూచితివా వోయీ ॥ ఏమి ॥

వోరచూపులు చూచి వొట్టువెట్టుకొంటాను
జీరలు దీసినది చూచితివా వోయి
కేరడపు సేఁతలను కేకరించి నవ్వులు
జోరునఁ జెమట గారీఁ జూచితివా వోయి ॥ ఏమి ॥

చిక్కని చన్నులనొత్తి చేరి కాఁగిలించుకొంటా
చెక్కునొక్కి నిన్నిట్టే చూచితివా వోయి
యిక్కువతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చొక్కించి నిన్నాకె మెచ్చీఁ జూచితివా వోయీ ॥ ఏమి ॥ 310

563-వ రేకు    మధ్యమావతి

కంటిమయ్యా యీ భాగ్యము కతలుగ నిట్టె నేఁడు
జంటలాయ వేడుకలు సరికి బేసికిని ॥ పల్లవి ॥
చెలువుఁడ నీవిట్టె చేతికి లోనై యుండఁగ
వలపులు చవులాయ వాడలోనెల్లా
యెలమి నీవు కన్నులయెదుటనే వుండఁగాను
తలపోఁతలివే రేఁ దారుకాణలుగను ॥ కంటి ॥
అమరఁ గాఁపురము నీవట్టె మాతోఁ జేయఁగాను
తమకమగ్గువాయ చెంతలనెల్లాను
మమకారమున నీవే మాటలట్టే యాడఁగాను
ప్రమదపుటాస హెచ్చె భావించినట్టెల్లాను ॥ కంటి ॥
గతిగూడి నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగాను
రతులెంతే వెలవెట్టె రాతిరెల్లాను
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
సతమాయఁ బులకలు చల్లువెదలుగను ॥ కంటి ॥ 311

కాంబోది

ఈడకుఁ బిలువవయ్యా యిన్నియు నడుగుదము
జోడుగూడినట్టి తనసుద్దులెల్లాఁ గంటిమి ॥ పల్లవి ॥
సెలవుల నవ్వీ నాపె సిగ్గులువడీ నాపె
పొలఁతికి నీకుఁ దొల్లి పొందుగలదో
తలపించీ మాటలు తప్పక నీ మోము చూచీ
యెలమిఁ గలికితనా లెంత నేరిచినది ॥ ఈడ ॥
కనుసన్న సేసీ నాపె కానుకలిచ్చీ నాపె
చనవిచ్చితివో యింత సతికి నీవు
వొనరించీఁ బ్రియములు వూడిగేలు సేయవచ్చీ
తనలోనె యెంతేసి కతలఁ గఱచినది ॥ ఈడ ॥

చేతులు చాఁచీ నాపె చేరి కాఁగిలించీ నాపె
యీతరుణి నిల్లాలిఁగా నేలుకొంటివో
యేతుల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
గాతలఁ దానెంత నీతోఁ గడు జాణైనది ॥ ఈడ ॥ 312

సౌరాష్ట్రం

విన్నవించ నేమిటికి వేగినంతాను
నిన్న నేఁటి సేఁతలెల్లా నీకే సెలవు ॥ పల్లవి ॥

సిగ్గువడ్డదానఁ గాన చెక్కునఁ జెయివెట్టితే
యెగ్గుపట్ట నేమిటికి నింతలోనే
అగ్గమైన విరహాన నలసి వుండినదాన
నిగ్గున నేనెట్టుండినా నీకే సెలవు ॥ విన్న ॥

పాయపుదానఁ గనక పానుపుపై నేనుండితే
ఆయాలంటి నవ్వనేల అందుకుఁగాను
వేయిటికి నేను నీవేళ గాచుకున్నదాన
నీ యిచ్చకొలఁది యిఁక నీకే సెలవు ॥ విన్న ॥

నీ మేలుదానఁ గాన నే నిన్నుఁ గాఁగిలించితే
చేముట్టి పెనఁగనేల చిమ్మిరేఁగుచు
ఆముక శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
నేమెంత గొసరినాను నీకే సెలవు ॥ విన్న ॥ 313

ఆహిరి

ఎప్పుడయ్యా నీకరుణ యింతిమీఁదను
చిప్పిలు చెక్కులునిండాఁ జెమటలు నించెను ॥ పల్లవి ॥

వెక్కసపు వలపులు విన్నవించరాక చెలి
లెక్కించి తమ్మిరేకుల లేకలంపెను
జక్కవ చన్నులనొత్త సారె సారె సిగ్గువడి
ముక్కరగదల ముసిముసినవ్వు నవ్వెను ॥ ఎప్పు ॥

అంతరంగములో నాస లడ్డపెట్టరాక సతి
కాంతాళమున చెలికత్తె నంపెను
పంతపుమాటల మోవిఁ బల్లుమోప సిగ్గువడి
చెంతలఁ గొప్పు వీడఁగ సేస నీపైఁ బెట్టెను ॥ ఎప్పు ॥

వేడుక కాఁగిటిరతి వెలవెట్టలేక యింతి
నీడచూచే యద్దము కానికె యంపెను
యీడుగా శ్రీవేంకటేశ యీకె నిట్టే కూడితి
జాడతోఁ బయ్యెద జార సన్న నీకుఁ జేసెను ॥ ఎప్పు ॥ 314

## కురంజి

చేకాచుక రావయ్య చెలిని నీవు
దాకొని గోరఁ జిమ్మకు తమ్మిపువ్వువంటిది ॥ పల్లవి ॥

చెక్కులవెంట వడిసీ సింగారరసములు
చుక్కలు గాసీ మోవిపై సుదతికిని
చిక్కించుక పానుపుపై సేఁతలేమి సేసితివో
మిక్కిలి యలసె నీకె మించుఁదీగెవంటిది ॥ చేకా ॥

పొదిగొనీ మేననెల్లా పులకల జొంపములు
కదిమీఁ గన్నుల చెంగావితేటలు
యిదివో సరసముల నెంత పెనఁగితివో
సదమదమాయ నీకె జాజిమొగ్గవంటిది ॥ చేకా ॥

చెలరేఁగీ నుదుటిపై చికురపుఁ దుమ్మిదలు
[illegible]కళలు మోమున నట్టే కారుకమ్మిని
యెలమి శ్రీవేంకటేశ యీకె నెంత గూడితివో
నిలువున జడిసీ వెన్నెలబొమ్మవంటిది ॥ చేకా ॥ 315

శుద్ధదేశి

ఇంతుల మంచిగుణాలు యెఱఁగవింతే కాక
కాంతుఁడవా కెమనసు గనుకొనరాదా ॥ పల్లవి ॥

పిమ్మట దొరైన(?)చెలి ప్రియములు చెప్పఁగాక
యెమ్మెలాడుకొనునా యెడనైనాను
కమ్మి వలపు గలితే కానుకలంపుఁగాక
దొమ్మిమాట లాడియాడి దూరవచ్చునా ॥ ఇంతు ॥

పాయలేనిసతి యిట్టే బాఁతిపడి నవ్వఁగాక
చాయల సన్నలట్టే సాదించునా
చేయి నమ్మితే నిట్టే సేవలు సేసుఁగాక
కాయకపు సుద్దులకు కాఁతాళించఁ జూచునా ॥ ఇంతు ॥

రతికి లోనైనయాకె రమ్మని పిలుచుఁగాక
తతిగొని పెనఁగునా తన్నుఁదానే
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
సతమైన పనులకు జాడలు వేరౌనా ॥ ఇంతు ॥ 316

564-వ రేకు రామక్రియ

ఊడిగపువారినేల వొంటి నాసలు రేఁచేవు
తాడుపడి లోలోనే తమకించి రతికి ॥ పల్లవి ॥

పట్టిన కాళాఁజియాపె పైఁ జేయి వేసుకొని
వొట్టుచుఁ దమ్ములమట్టే వుమిసేవు
గుట్టున నందుకు నింతి గుబగుబఁ జెమరించి
నెట్టుకొని మోహించి నివ్వెరఁగు నొందెను ॥ ఊడి ॥

అడపము చెలిమీఁదనట్టే పాదాలు చాఁచుక
అడరుచు నిక్కి యాకులందుకొనేవు
తడఁబడి యాచెలి తనువెల్లాఁ బులకించి
నిడువాలుఁగన్నులను నీమోముచూచెను ॥ ఊడి ॥

గిండివట్టే యాపె కుచగిరులపై నొరుగుక
అండనే చల్లని పన్నీరారగించేవు
దండిగా శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
మెండుగా తానూఁ గూడి మెచ్చులెల్లా మెచ్చెను ॥ ఊడి ॥ 317

సామంతం

ఏల దాఁచుకొనేవు నీవెరిఁగినదానవు
వేళ గాచుకొని వెల్లవిరి సేయరాదా ॥ పల్లవి ॥

నెలఁత నీమోముతేట నిండుమోవి తేనెలూట
పొలసి నీరమణుఁడు పొగడీనదే
చిలికి నీవేల యిఁక సిగ్గులు వడేవింత
పలుమారు నింకాఁ గొంత పచారించరాదా ॥ ఏల ॥

నెఱుల నీపెనుఁగొప్పు నిచ్చలువ్వనపుఁ జొప్పు
తఱి నీవిభుఁడు ప్రాసీ తమితోనదే
మఱఁగేల సేసేవు మర్మములుగా నింత
గుఱిగా నింకా నీవే కుప్పళించరాదా ॥ ఏల ॥

భావపు నీలోకరఁగు పయ్యద జారుఁజెరఁగు
శ్రీవేంకటేశుఁడు వెల సేసీనదే
మోవనాడి మాటలేల మూటలు గట్టేవింత
యీవిధానఁ గూడితివి యేర్పరచరాదా ॥ ఏల ॥ 318

హిందోళం

ఎఱగని యాఁటదాని నెంత సేసేవు
వెఱగయ్యీ మాకు నీవిధములు చూచి ॥ పల్లవి ॥

మట్టుమీఱ నవ్వునవ్వి మానముపైఁ జేయి వేసి
అట్టులు సేసేవుగా మెఱయ నింతిని
దిట్టమాటలాడి మోవితేనెల చవులు చూపి
ఘొటు భ్రమయించేవు యింతలో నీవు ॥ ఎఱ ॥

పారెపారె గోరనూఁది జవ్వనము పెదరేఁచి
అరితేరి నవ్వేవుగా అంగనను
నేరుపులు వచరించి నెట్టుకొని కొంగువట్టి
యీరీతినేల పఱచే విదివో నీవు ॥ ఎఱ ॥

చన్నులంటఁ గాఁగిలించి సరసములాడి యాడి
యెన్నిరతులఁ గూడేవు యీకన్నె నీవు
నన్ను శ్రీవేంకటేశుఁడ నమ్మించి యేలితివి
మన్నించి యెంత మెచ్చేవు మమ్మునిట్టే నీవు ॥ ఎఱ ॥ 319

భైరవి

ఏరీతి వేఁడుకొనేవే యిటు నీవు
నీరతికిఁ గాచుకొని నిలుచున్నవాఁడు ॥ పల్లవి ॥

చేయివట్టుకొని నీచెక్కునొక్కే రమణుని
ఆయములు సోఁక వెంగేలాడితివి
చాయలు సన్నలుఁ జూపి సంగడినున్న యతని
సోయగపుఁ గన్నులను(జూచి?)సొలసితివి ॥ ఏరీతి ॥

తమ్ముల మిడుచు నీదప్పి దేరిచే విభుని
బొమ్మల జంకించి సొలపులఁ దిట్టితి
పొమ్ములు నింపుచు నిన్నుఁ జొక్కించే యాతని
దొమ్మితోఁ బాదము దొక్కి తొడపై నెక్కితివి ॥ ఏరీతి ॥

చెనకి కాఁగిటఁగూడి శ్రీవేంకటేశ్వరుని
ననుపున నలయించి నవ్వితివి
మనసు మర్మమెరిఁగి మన్నించే యీతని
తనివార మోవియిచ్చి దక్కఁగొంటివి ॥ ఏరీతి ॥ 320

## సాళంగం

మొక్కితి నవవే తన మొక్కలపు చేతలకు
దిక్కుల నెంతేసి తరితీపులఁ బెట్టిని ॥ పల్లవి ॥

తగవులన్నియునుఁ దనచేతనే వింటి
యెగసక్కెలెల్లా నిఁక నేలాడీనే
నగిన తన నవ్వులు నాఁటె నా మనసులోన
పగటునఁ దనచేత పంతము గొనేనా ॥ మొక్కితి ॥

అందికలుఁ బొందికలు నప్పుడే నేఁ గనుఁగొంటి
యిందులో తనపై నింద లేల మోపీనే
అందవుఁ దన సరసా లలవాటే నాకుఁ దొల్లి
మందెమేలమున నిఁక మంకులు చూపేనా ॥ మొక్కితి ॥

ననుపులు మన్ననలు నాకు నేఁడే తానొసఁగె
యెనలేక వలచితి నేల దూరేనే
ఘన శ్రీవేంకటేశుఁడు కాఁగిలించి నన్నుఁ గూడె
పనివడి యిఁక వేరే పట్టి పెనఁగేనా ॥ మొక్కితి ॥ 321

## ముఖారి

ఎరవుల దానివలె నేమి మమ్ము నడిగేవు
సరసమాడి విభుని చనవు చేకోరాదా ॥ పల్లవి ॥

అంకెల నాతనిమీఁద నప్పుడు నీవు చల్లిన
జంకెన చూపులే కావా చవి సేసెను
పొంకమై మారుకు మారు పూఁచి కుమ్మరించినట్టి
వంకలమాటలే కావా వలపు పుట్టించెను ॥ ఎరవు ॥

వెలలేక పతితోను వేడుకలు పుట్టించిన
సెలవినవ్వులే కావా చిమ్మి రేఁచెను
చలపట్టి యొండొరుల సరికి బేసికిఁ జేసే
పెలుచు సన్నలే కావా ప్రియాలు వుట్టించెను ॥ ఎరవు ॥

శ్రీవేంకటేశ్వరుని సిగ్గుదేరఁ గూడినట్టి
నీ వాఁడి చన్నులే కావా నెరవేర్చెను
తావుకొని లోలోని తమకములొనరించే
భావపు రతులే కావా పంతములందించెను ॥ ఎరవు ॥ 322

565-వ రేకు అమరసింధు

ఏమి చూచే వింతిదిక్కు యెందాఁకాను
సాములనే చెనకుచు చనవియ్యరాదా ॥ పల్లవి ॥
కొప్పు నీవు ముట్టితేనే కుప్పవడీ వెంట్రుకలు
చిప్పిల నంతలోఁ జెలి సిగ్గువడెను
వొప్పుగ జవ్వాది చేత నొక్కింత చమురుకొని
కప్పి నీవైనా కీలుగంటు వేయరాదా ॥ ఏమి ॥
పొలసి పయ్యెదంటితే పోఁకముడి జారెను
వెలయ నంతలో నింతి వెరగందెను
బలిమిఁ బన్నీటను పదనుగాఁ జిలికించి
చెలరేఁగి యిప్పుడే కుచ్చెల వోయరాదా ॥ ఏమి ॥
కడఁగి కాఁగిలించితే గందపుఁ బేంట్లు రాలెను
నడుమ నందుకుఁ గాంత నవ్వు నవ్వెను
అడరి శ్రీవేంకటేశ అంగపుఁజెమట నించి
తడిపి కమ్మటి వసంతము చల్లరాదా ॥ ఏమి ॥ 323

నారాయణి

చిత్తగించి వినవయ్య చెలికత్తియను నేను
పొత్తుల మీఇద్దరికిఁ బోరుగు మానెలవు ॥ పల్లవి ॥
వింతలేక మాయింటికి వేగనే విచ్చేయవయ్య
కాంత నీకెదురువచ్చి కాచుకున్నది
మంతనాన వేడుకతో మన్నింతువు రావయ్య
పంతానఁ బానుపుమీఁదఁ బవ్వళించి వున్నది ॥ చిత్త ॥

ఇరవై మావాకిటికి నిట్టే చనుదేవయ్యా
తరుణి తొంగిచూపులఁ దతిగొన్నది
సరసములాడుటకు చయ్యన నరుదేవయ్యా
తరమిది నుద్యోగము దలపోయుచున్నది ॥ చిత్త ॥

వొద్దిక మాలోఁగిటికి నొనగూడ రావయ్యా
సుద్దులాలకించి ఇంతి చొక్కుచున్నది
గద్దరి శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితివిట్టే
ముద్దుల మాటల నీకు మొక్కుచున్నది ॥ చిత్త ॥ 324

లలిత

ఇరవాయ వలపులు యిద్దరికీ నీడనే
సరవితో నేలితివి చనవిమ్మీ యిపుడు ॥ పల్లవి ॥

వొడి వట్టుకొంటి వాకె వోపనంటాఁ బెనఁగీని
వొడఁబరచేవు చన్నులొరసుకొంటా
బడలి వున్నది యాకె బ్రమలఁ బెట్టక యిఁక
తొడపై నిడుకోరాదా తొడిఁబడును ॥ ఇర ॥

చేయి వట్టుకొంటి వాపె చేరి యానలు వెట్టీని
నాయము వెట్టేవు మోవి నవ్వుకొంటాను
యీయకొని వున్నదాకె యేపులఁ బెట్టక యిఁక
పోయరాదా తలఁబాలు పొద్దులు గడపక ॥ ఇర ॥

కొప్పు వట్టుకొంట వాకె గుచ్చి కాఁగిలించుకొనీ
చొప్పులంటించేవు రతిఁ జొక్కించుకొంటా
ఇప్పుడే శ్రీవేంకటేశ యెలయించకిఁక నాకె
దప్పిదేరిచితి వాకెదండ నుండరాదా ॥ ఇర ॥ 325

### ముఖారి

ఏల వొడఁబరచేవే యిప్పుడు నన్ను
మేలిమి పతి వచ్చితే మెఱయించే వలపు ॥ పల్లవి ॥

చనవు గలవేళను సరసములాడవచ్చు
ననుచని వేళను నవ్వులేడనే
మనసులేకములైతే మర్మములు సమకూడు
పెనఁగేటి వేళను బెరయునా పొందులు ॥ ఏల ॥

మొక్కేటి వేళను ముందుముందే దయగల్గు
తక్కించే వేళను తనివేదదే
వొక్కటైన వేళను వొడఁబడు మాటలు
కక్కసించే వేళను కతలు చాలౌనా ॥ ఏల ॥

కూడిన యీవేళను గురుతులెల్లా నిండు
మేడెపు రతివేళను మేరగలదా
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్ను నేలె
వేడుకయిన వేళను వేసటలు పుట్టునా ॥ ఏల ॥ 326

### నాదరామక్రియ

ఏడ నేరుచుకొంటివి యిటువంటి కొత్తలు
వేడుకలివెల్లా నీకు వెల్లావిరులాయనా ॥ పల్లవి ॥

సమ్మతించఁ జెప్పి నాచంటిపై గోరుదీసేవు
వుమ్మడి నేమి సేసినా నొద్దంటినా
యెమ్మెల నెవ్వతైనాను యిటువలెనే నీకు
చిమ్ముచుఁ జేసే సేఁతలు చెప్పిచెప్పి చేసునా ॥ ఏడ ॥

గడ్డమువట్టి వేఁడుక గంటి సేసేవు మోవి
వొడ్డి వూరకే సేయఁగా నొద్దంటినా
వొడ్డారాన నెవ్వతైనా నొద్దనుండి నీ కిట్ల
జిడ్డుదేర ననుపులు చెప్పిచెప్పి చేసునా ॥ ఏడ ॥

యెలమి శ్రీవేంకటేశ యెవ్వతైనా నీకిట్ల
చెలరేఁగిన పెండ్లిండ్లు చెప్పిచెప్పి చేసునా
కలసి కాఁగిటఁ గూడి కంకణము గట్టేవు
వొలసి ముందే కట్టఁగా నొద్దంటినా ॥ పద ॥ 327

## హిందోళవసంతం

నీకేల కొంకను నిన్ను నాదేవా రెవ్వరు
దాకొని వొరసితేనే తల వంచేవు ॥ పల్లవి ॥
కొనచూపులను నీకుఁ గొచ్చి కొచ్చి మొక్కఁగాను
వనితతో నింతయేల వంతులాడేవు
ననుపున సెలవుల నవ్వు నీతో నవ్వఁగాను
వొనరి యంతేసి యాల వొడ్డుకొనేవు ॥ నీకేల ॥
సెలవుల నవ్వి నవ్వి చిత్తము గరఁగించఁగా
చెలియకు నింతేశాల సిగ్గు రేఁచేవు
మొలకచన్నుల నొత్తి ముద్దు నీకుఁ జూపఁగాను
తలపోసి నీ వేలింత తడఁబడేవు ॥ నీకేల ॥
కప్పురము మోవి నిచ్చి కాఁగిలించుకొనఁగాను
వుప్పతిల్లి యేఁటి కసురుసురనేవు
ఇప్పుడే శ్రీవేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
చొప్పులెత్తి యింకనేల సోద్య మనేవు ॥ నీకేల ॥ 328

566-వ రేకు దేవగాంధారి

భావ మెఱిఁగిన నల్లఁబల్లి చెన్నుఁడా
నావద్దనే వుండుమీ నల్లఁబల్లి చెన్నుఁడా ॥ పల్లవి ॥
వేసరక నీవు నాతో వేమారుఁ జేసినట్టి
బాసలు నమ్మితి నల్లఁబల్లి చెన్నుఁడా
వాసికి వన్నెకు నీకు వలచి చొక్కితి నేను
నా సూటికే మన్నించు నల్లఁబల్లి చెన్నుఁడా ॥ భావ ॥

క్రియ గూడ నేను నీ కేలువట్టి పెండ్లాడితి
బయలీఁదించకు నల్లఁబల్లి చెన్నుఁడా
ప్రియములు రెట్టింపఁ బెనఁగితి నిందాఁకా
నయములు చూపుమీ నల్లఁబల్లి చెన్నుఁడా ॥ భావ ॥

యెసఁగితి విటు నన్ను నియ్యకోలు సేసుకొని
పఱపడె రతి నల్లఁబల్లి చెన్నుఁడా
ఘనశ్రీవేంకటాద్రిపై కందువ నేలుకొంటివి
నను నిందరిలోపల నల్లఁబల్లి చెన్నుఁడా ॥ భావ ॥ 329

## దేశాక్షి

నీ నేరమెంచుకోక నెలఁతను దూరేవు
మేను మేనుఁ బెనఁగితే మించు గోరంటించదా ॥ పల్లవి ॥

సిగ్గువడ్డ చెలిమీఁద జేయి నీవు వేసితేను
దిగ్గన లేచి గొప్పతిట్టు దిట్టదా
వొగ్గి ముసుఁగు వెట్టుక వుండఁగా విడెమిచ్చితే
బగ్గనఁ జేతిపూవుబంతిఁ గొని వేయదా ॥ నీనేర ॥

తలవంచుకొన్నయాపెఁ దడవి కొంగు వట్టితే
చలముతోఁ గొసరుచు జంకించదా
వొలిసి కంబము వట్టుకున్నయాపెఁ జెనకితే
బలిమిఁ జన్నుల నొత్తి పంతములు గొనదా ॥ నీనేర ॥

పాదాలొత్తే యాపెను పట్టి కాఁగిలించుకొంటే
కాదనక నీమోవి గంటి సేయదా
యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
పోదిసేసి అట్టె నిన్నుఁ బొగడఁగ వలదా ॥ నీనేర ॥ 330

## సామంతం

చూడ నిన్నిటా జాణఁడు చొక్కనాథుఁడు
 వీడెమిచ్చె నాకు నిదె వెసఁ జొక్కనాథుఁడు ॥ పల్లవి ॥
అట్టె నీతోమాటలాడి ఆకెతోడా మాటలాడీఁ
 జుట్టమిందరికిఁ గదె చొక్కనాథుఁడు
 పట్టి నీకొంగప్పటిని పరాకులా పైపై నించీ
 దిట్ట యిన్నిటానుఁ గదె చొక్కనాథుఁడు ॥ చూడ ॥
సెలవుల నీతో నవ్వి సిగ్గున నాకెతో నవ్వీ
 సులభుఁడే యిన్నిటాను చొక్కనాథుఁడు
 వలపు నీపైఁ జల్లి వంతుకా పెకునుఁ జల్లి
 అలరి సందడిఁ బెండ్లాడీఁ జొక్కనాథుఁడు ॥ చూడ ॥
తగ నిన్నుఁ గూడి యాకెఁ దమకించి కూడెను
 సుగుడ యిన్నిటాఁ గదె చొక్కనాథుఁడు
 అగపడి శ్రీవేంకటాద్రిపై నన్ను నేలెను
 తగవరి దానే కదె తతిఁ జొక్కనాథుఁడు ॥ చూడ ॥ 331

## శ్రీరాగం

ఏఁటి చక్కఁదనము యేమి జాఁతి నేము
 చాటువ జవ్వనమున సడిఁబడ్డ వారము ॥ పల్లవి ॥
పుక్కట చకోరములఁ బోలేటి మాకన్నులు
 జక్కవ పిట్టలవంటి చన్నులు మావి
 పిక్కటిల్లు చందమామబిల్లవంటి మొగము
 ముక్కు నవ్వుఁబువ్వుఁ బోలే మురిపెపువారము ॥ ఏఁటి ॥
గుంపుఁ దుమ్మిదరెక్కల కొలము మాకురులు
 సొంపు దొండపండువంటి చొక్కపుమోవి
 సంపద లేఁత చిగురుజాతి మాపాదములు
 ఇంపులఁ దీగెలవంటి విపీవో మాచేతులు ॥ ఏఁటి ॥

సరిలేని సింహపు చందము మానడుము
పరగ చక్రమువంటి బటువు మాపిరుఁదు
గరిమ శ్రీవేంకటేశ కలిసితి మమ్మునిట్టె
పురిగొను బంగారుఁబొమ్మవంటి మేను ॥ ఘఁటి ॥ 332

## లలిత

అరయ శ్రావణ బహుళాష్టమి చంద్రోదయాన
సిరులతోనుదయించె శ్రీకృష్ణుఁ డిదివో ॥ పల్లవి ॥

వసుదేవునిపాలిటి వరతపోధనము
యెసగి దేవకీదేవి యెదపై సొమ్ము
సుసరాన గొల్లెతల సొంపు మంగళసూత్రము
శిసువై వుదయించె శ్రీకృష్ణుఁ డిదివో ॥ అరయ ॥

నందగోపుఁడు గన్న నమ్మిన నిధానము
పొందగు యశోదకు పూజదైవము
మందల యావులకును మంచి వజ్రపంజరము
చెంది యుదయించినాఁడు శ్రీకృష్ణుఁ డిదివో ॥ అరయ ॥

సేవ సేసే దాసుల చేతిలోని మాణికము
శ్రీవేంకటాద్రి నేచిన బ్రహ్మము
వోవరి నలమేల్మంగ నురముపైఁ బెట్టుకొని
చేపదేర నుదయించె శ్రీకృష్ణుఁ డిదివో ॥ అరయ ॥ 333

## శంకరాభరణం

తేటతెల్లమాయ తిల్లగోవిందుఁడా
నీటు రాజసము నిండెను నీకు ॥ పల్లవి ॥

చేరి నిన్నొకతె చేయి వట్టుకొనె
కూరిములు సారెఁ గొసరె నొకతె
యేరీతిఁ దనిపే విద్దరిని నీవు
ఆరీతి వలపులిచ్చెను మీకు ॥ తేట ॥

చిమ్ముచు నొకతె సిగ్గులువడెను
బొమ్మల జంకించెఁ బోరచి నొకతె
యిమ్మెలకిద్దరి నెట్టు లాలించేవు
దొమ్ముల యాసలు దొరకె మీకు ॥ తేట ॥

కందువ నొకతె కాఁగిలించి కూడె
చెంది వేరొక్కతె సేసవెట్టి కూడె
యిందరు శ్రీవేంకటేశ(య?)లమేల్మంగ
పొందులన్నిటాను పొసఁగె మీకు ॥ తేట ॥ 884

567-వ రేకు నాగవరాళి

మగవాని కింతయేల మరి కొంకను
అగడు సేయకు మమ్ము నందరిలో నీఁకను ॥ పల్లవి ॥

అంగనతో నీవేకత మాడేవేళ వచ్చితేను
చెంగట నేఁడెంతేసి సిగ్గువడేవు
సంగతి నీవూడిగపు సతులలో దానఁ గానా
వెంగెము సేసుక యెంత వేరుసేసేవు ॥ మగ ॥

సరసిజాక్షితో నవ్వే సమయాన నే మొక్కితే
శిరసు వంచుక యేల సిగ్గువడేవు
అరిది నీరాణివాసమైనట్టిదానఁ గానా
విరులమాఁటున నేల వెరగువడేవు ॥ మగ ॥

యీవేళ నింతిఁ గూడితి విట్టె నేనుఁ గూడితేను
శ్రీవేంకటేశుఁడ యేల సిగ్గువడేవు
గోవిందరాజ నిన్నుఁ గొలిచినదానఁ గానా
వేవేలు రతుల నేల వింతలు సేసేవు ॥ మగ ॥ 885

సాళంగనాట

ఏమి జూజాలాడేవు యెక్కడ చూచేవు నీవు
కామినిఁ జేకొనవయ్య కప్పురమీవయ్య ॥ పల్లవి ॥

సేస కొప్పు వంచుకొని చెక్కునఁ జెయ్యిడుకొని
ఆసపాటుఁజూపు నీపై నట్టే చల్లీని
వాసులకుఁ బెనఁగుచు వంతుకుఁ గాచుకున్నది
యీసుద్దులు వినవయ్య ఇంతి మన్నించవయ్యా ॥ ఏమి ॥

అండనిట్టే నిలుచుండి ఆయముల మాటలాడి
కొండలవంటి చన్నుల గుచ్చీ నిన్ను
నిండుకొన నవ్వుచును నీకె లాచుకున్నది
దండిగాఁ జూడవయ్య తరుణిఁ గావవయ్యా ॥ ఏమి ॥

పానుపుపైఁ గూచుండి పంతమునఁ గాఁగిలించి
పూనిన రతుల నిట్టే పొదిగీ నిదే
శేనగాఁ గూడీ నిదె శ్రీవేంకటేశ్వర
నానాగతి నేలవయ్య నమ్మికలీవయ్యా ॥ఏమి ॥ 336

పాడి

ఆతఁడు బత్తిగలఁడు అన్నిటా నీపై నిదే
నీతితోడ నుండవే నీకే మేలు ॥ పల్లవి ॥

వేసరుకొనకువే విభుఁడు దానే వచ్చీ
ఆసపడి వుండవే అన్నియు లెస్సయ్యీని
వాసిఁ బంతాలాడకువే వలపులు చవులయ్యీ
బాసలు దలఁచుకోవే పట్టమేలేవు ॥ ఆతఁడు ॥

యెగ్గులు పట్టకువే యీతఁడే నిన్ను మన్నించీ
సిగ్గులు వడకువే చింత దీరీని
వెగ్గళపు జంకెలేలే వేడుక దానే పుట్టీ
వొగ్గి కాచుకుండవే వురమెక్కేవు ॥ ఆతఁడు ॥

సేవలింకాఁ జేయవే శ్రీవేంకటేశుఁడు గూడీ
వావులు చెప్పితి వానే వన్నెలుగాను
భావములోఁ గొంకకువే వచ్చితేరీఁ దమకము
దేవులవై మెరయవే దిష్టమయ్యీ భోగము ॥ అతఁడు ॥ 337

ఆహిరి

ఏమి సేతు నీచిత్తమెటువలె నుండునో
ఆమాటకే లోఁగితి నన్నాదరించవయ్యా ॥ పల్లవి ॥

చాలుకొని నీతోను సరసములాడఁగాను
ఆలించి మందెమేళ మనవుగదా
నాలి సేయకప్పటిని నవ్వులెల్ల నవ్వఁగాను
ఆలరి యాఁటది యని ఆడికెలు సేతువో ॥ ఏమి ॥

వాడిగట్టుకొని నీకు వూడిగేలు సేయఁగాను
అడరి యిచ్చకురాల ననవు గదా
వడఁబడ వీడేలు దండనుండి ఇయ్యఁగాను
కొడిమలు గట్టి కొంత కొసరుదువో ॥ ఏమి ॥

పానుపుమీఁద నుండి భావములు గరఁచఁగా
అనుకొని గయ్యాళి ననవు గదా
వూనుక శ్రీవేంకటేశ పొంచి నన్నుఁ గూడితివి
యీ నెపాన నన్ను నిట్టె యేలుదువో ॥ ఏమి ॥ 338

గౌళ

ఎంతని పొగడేమే నీయిటువంటి సుద్దులు
వంతులకు సవతులవంటిదానవా ॥ పల్లవి ॥

తేనెలువంటి మాటలు తేటలుగా విభునికి
కానికె వట్టితివానే కలికి
మోనమునసనుండి కొంత ముగుదతనాననే
సోన గురియించితివే జోరున వలపులు ॥ ఎంత ॥

కప్పురమువంటి నవ్వు కందువగా నప్పటిని
కప్పము లిచ్చితివౌనే కాంతునికి
చప్పుడుసేయక కొంత సాదు(దనాననే
లప్పలు రాలించితివే లావుగాఁ బ్రియములు ॥ ఎంత ॥

కుంకుమవంటి చూపు గురుతుగా నిప్పుడే
వుంకువ లిచ్చితివే నీ వొయడ(డయ?)నికి
అంకెల శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నిటు గూడె
పొంకాన మెప్పించితివే భోగపు నీమేకులు ॥ ఎంత ॥ 339

## భైరవి

కందువ మాతోడిపొందు గలదే నీకు
విందులెన్నిచోట్ల వెదకేవు నీవు ॥ పల్లవి ॥

వాసులకే పెనఁగీని వంతులకే వచ్చీని
ఆసలకే లాచీని అదివో యాపె
సేసలు వెట్టఁగరాదా చెక్కులు నొక్కఁగరాదా
రాసికెక్క నెక్కడ పరాకు సేసేవు ॥ కందువ ॥

యెమ్మెలకే మలసీని యింపులకే సొలసీని
సొమ్ములకే కొసరీని చొక్కుచు నాపె
తమ్ముల మిడఁగరాదా దప్పులు దేర్చఁగరాదా
పుమ్మడి నెందాఁకా నీవు వూరకుండేవు ॥ కందువ ॥

పంతానకే కూడీని బంతికే నోరూరీని
యింతటా శ్రీవేంకటేశ యిప్పుడే యాకె
మంతన మాడఁగరాదా మమ్మునిట్టే యేలితివి
వింతగా నేమిటికి నివ్వెరఁగందేవు ॥ కందువ ॥ 340

588-వ రేకు

## సావేరి

వేవేలకు నీకు నీవే విచారించి మన్నించు
భావించి యెన్నఁడునుఁ బాయకుమీ నన్నును ॥ పల్లవి ॥

చిగురుమోవిమాటలు చిత్తానఁ బట్టినా
నగుతానాడినవల్లా నమ్మికయ్యీనా
మొగి విచ్చని నాలోని మోహము చూతువు గాని
తగవులఁ బెట్టకు మీ తరుణి నే నీకు ॥ వేవేల ॥

మునుకొన్న వినయాలు ముచ్చటలు దెలిపీనా
చనవరి వూడిగాలు చవి రేఁచీనా
అనువైన నాతగులాయములెంతువు గాని
పెనఁగించుకొనకుమీ ప్రియురాల నేను ॥ వేవేల ॥

జవ్వనపుమదములు సందిమాటలాడీనా
కువ్వలైన గుణములు కొంగువట్టీనా
యివ్వల శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
మవ్వమైన అలమేలుమంగఁ జుమీ నేను ॥ వేవేల ॥ 341

## లలిత

ఏమి గావలెనో యీకె ఇంతేసి నిన్నుఁజేసీని
చేముట్టి అట్టె యామేలు చేకొనవయ్యా ॥ పల్లవి ॥

మురిపెముతో నవ్వీని ముసిముసి నవ్వులు
సొరిది తేటచూపులఁ జూచీని
కొరతనాల వలపు తోడిఁబడఁ జల్లీని
విరులఁ గొని వేసీని విడెమిచ్చీని ॥ ఏమి ॥

మచ్చిక మర్మాలు సోఁక మాటలు నిన్నాడీని
పచ్చిమోవి చూపి నీతోఁ బంతమాడీని
రచ్చలోన ముద్దుటుంగరము నీకుఁ జూపీని
ముచ్చట సన్నలుసేసి మొక్కు మొక్కీని ॥ ఏమి ॥

కూరిమి గొసరుతాను కొంగువట్టి తీసీని
అరితిఁ గాఁగిటఁగూడి అలయించీని
సారెకు శ్రీవేంకటేశ సమ్మటూరిలో నిన్నుఁ
బేరుకొని పిలిచీని ప్రియమందీని ॥ ఏమి ॥ 342

## రామక్రియ

తొల్లే అన్నిటా బుద్ధిమంతురాలవమ్మా
చల్లఁగా నితనికి నొజ్జలవై తివమ్మా ॥ పల్లవి ॥

తొడమీఁదఁ గూచుండి దోసిలించి తలఁబాలు
విడువక చల్లేవమ్మా వేమారు నీవు
పడఁతి నీవిభుని కోపము మానుమని అవే
జడియక పెట్టే మంత్రాతుతలాయనమ్మా ॥ తొల్లే ॥

ముసిముసి నవ్వులతో మొగము చూచి చూచి
యెసగి ఆకుమడిచి యిచ్చేవమ్మా
వెస నీమోవి తేనెల విందులారగించుటకు
ఇసుమంత దేగపదనిచ్చినట్లమ్మా ॥ తొల్లే ॥

ఆరయ శ్రీవేంకటాద్రి అహోబలేశ్వరునిఁ
గూరిమితోఁ గాఁగిలించి కూడితివమ్మా
నేరుపుతో నితని నీసొమ్ముగాఁ జేసుకొని
ధారుణి పెట్టెఁ బెట్టి దాఁచినట్లమ్మా ॥ తొల్లే ॥ 343

## శంకరాభరణం

ఔదువయ్యా జాణవు ప్రహ్లాదవరద
ఆదిగొని మొక్కేని ప్రహ్లాదవరదా ॥ పల్లవి ॥

యెదురుఁగొండలెక్కిన యిందిరఁ బెండ్లాడితివి
అది జాణతనము ప్రహ్లాదవరద
వుడుకుఁ గోపముమాని వూరకే నవ్వు నవ్వితి-
[illegible] నాపెఁబూని ప్రహ్లాదవరదా ॥ [illegible] ॥

మొగము చూచి తేనే మోహముపైఁ జల్లితివి
అగడాయఁ బనులు ప్రహ్లాదవరద
తగిలి కొంగువట్టితే తమకించేవింతలో
అగవుదగవుల ప్రహ్లాదవరదా ॥ ఔదు ॥

చేయి చాఁచగా నాపెను సిగ్గువీడఁ గూడితివి
అయమెఱుఁగుదువు ప్రహ్లాదవరదా
యీయెడ నహోబలాన నిట్టే శ్రీవేంకటాద్రిని
ఆయిత్తము పెండ్లిండ్లు ప్రహ్లాదవరదా ॥ ఔదు ॥ 344

## ముఖారి

కోమలపు మేని సతిఁ గోరకు మంతేసి
మోముచూచి కూరిమితో మొక్కీ నీకును ॥ పల్లవి ॥

వుప్పతిల్ల మాటలాడి వూరడించి బాసలిచ్చి
అప్పుడు పెండ్లాడితి వందరిలోన
కొప్పువట్టి తీసి యట్టే కొంగుచుట్టి పట్టుకొని
పిపిసేసితివి యింత పిసుకకు మీపెను ॥ కోమ ॥

ఆసలెల్లాఁ బుట్టించి ఆయములు చేతనంటి
సేస వెట్టితి వప్పుడు చేచేతను
గాసిగాఁ జన్నులు వట్టి కడుఁ జెమటలు రేఁచి
వేసారఁ బెనఁగితివి మోసపుచ్చకిఁకను ॥ కోమ ॥

వావులెల్లాఁ జెప్పిచెప్పి వాఁటముగాఁ గాఁగిలించి
చేవదీరఁ గూడితివి శ్రీవేంకటేశ
వేవేలు మన్ననలిచ్చి వింతలెల్లా నేరిపి
కైవసమైతివి యిట్టే కరుణించుమిఁకను ॥ కోమ ॥ 345

ధవళ

ఇందుకే యీపాటి ఆయ నెక్కుడైతే నీఁక నెంతో
సందడి మేను సోఁకితే చనవెంత ఇత్తువో ॥ పల్లవి ॥

కలికి యీజవరాలు కన్నుల నీకు మొక్కితే
సెలవుల నవ్వితివి చెలరేఁగి
బలిమిసేసి నీపాదాలు వట్టుకొంటే
కలసిమెలసి యెంత కాఁగిలింతువో ॥ ఇందు ॥

పలుకుఁదేనెలు నీకు పైపైఁ జవులు చూపితే
కళలు మోమున నించి కరఁగితివి
వెలయ మోవిరసాల విందులు నీకుఁ బెట్టితే
పిలిచి యీపెకెంత ప్రియము చెప్పుదువో ॥ ఇందు ॥

తొక్కక నీతొడమీఁదఁ దొయ్యలి గూచుండితేను
యిక్కువ శ్రీవేంకటేశ యెనసితివి
మిక్కిలి నీవురముపై మేడగట్టింపించుకొనె
అక్కరతో నిందుకెంత అలరుదువో ॥ ఇందు ॥ 346

169-వ రేకు నాగగాంధారి

ఎఱఁగవా నాచేత నింతేశాడించుకోనేల
మఱచిన పనులకు మగిడి చూడనేలా ॥ పల్లవి ॥

పైకొని నాతో నీవు బాసలు సేయఁగనేల
నీకు నిజమే కలితే నిష్ఠూరమేల
యేకమైన పొందులకు యెడమాటలాడనేల
సాకిరిలేని పనికి సాదించనేల ॥ ఎఱఁగ ॥

కొన్నది కోలై నందుకు కొలఁది వెట్టఁగనేల
చిన్ననాటి సుద్దులకు సిగ్గులేల
అన్నిటా నేర్పరి వైతే నంతనీకు లోఁగనేల
నిన్నటి చీఁకటికి నేఁడు దీపమేలా ॥ ఎఱఁగ ॥

వేడుకకాఁడవు నీవు వెఱపులు మరి యేల
కూడితివి నన్ను నిఁకఁ గొసర నేల
పాడితో నడచే నీకు పంతములు మరి యాల
వాడికె శ్రీవేంకటేశ వంకలొత్తనేలా ॥ ఎఱఁగ ॥ 847

## పూర్వగౌళ

ఏమి సేయుమనేవయ్య యిఁక నన్నును
చేముట్టి పీడెమీవయ్య సిగ్గయ్యీని ॥ పల్లవి ॥
ఆతీల నాపె నీతో నట్టే మాటలాడఁగా
నాతో నీవు నవ్వఁగా నవ్వు వచ్చీని
రాతిరిఁ బగలు నీవు రచ్చలలో నుండి వచ్చి
చేత నా చెక్కు నొక్కఁగ సిగ్గయ్యీని ॥ ఏమి ॥
వున్నతి నాపె నీవొడివట్టి తియ్యఁగాను
నన్ను నీవు చేపట్టఁగానవ్వు వచ్చీని
కన్నవారినెల్లా నీవు కాఁగిలించుకొని వచ్చి
చిన్ని నా చన్నులంటఁగా సిగ్గయ్యీని ॥ ఏమి ॥
భావించి యాపె నీకుఁ బానుపు వరచఁగాను
నావద్ద నీవు పండఁగా నవ్వు వచ్చీని
శ్రీవేంకటేశ్వరుఁడ చేఁతలెల్లాఁ జేసి వచ్చి
చేపట్టి నన్నుఁ గూడఁగా సిగ్గయ్యీని ॥ ఏమి ॥ 348

## మాళవిగౌళ

అల్లాడఁ బడి వున్నదా ఆఁడుఁదనము
పల్లదాన బదికితే పచ్చిగాదా తనువు ॥ పల్లవి ॥
వొగ్గిన వలపులెంత వొడిఁగట్టుకొనినాను
యెగ్గు సిగ్గు లేకుండితే నేఁటి వనిత
నిగ్గుల రమణుఁడెంత నెరవుగా మన్నించినా
వెగ్గళించి మాటాడిన విరుగదా మనసు ॥ అల్లా ॥

నెచ్చెలికి వయసెంత నిలువున వడిసినా-
నిచ్చకము లేకుండితే నేఁటివేడుక
మచ్చిక నాతఁడెంత మంతనాన నవ్వినాను
రచ్చల నాడుకొంటే రవ్వగావా రతులు ॥ అల్లా ॥

ఘనముగ నెంత సింగారించుకుండినాను
మొనయక వుండితేను యేఁటి నేరుపు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసి నిన్నిటు నేఁడు
పెనగించుకొంటేను పెరుగదా చలము ॥ అల్లా ॥ 349

దేసాళం

అందుకేమి దోసమా అట్టే కానిమ్మనవయ్యా
చెంది మామొగము చూచి సిగ్గువడ నేఁటికి ॥ పల్లవి ॥

నెలకొని నీవెంతేసి నేమస్తుఁడ వైనాను
వలచి వచ్చినదాని వద్దనఁగవచ్చునా
తొలుత నీవెంత గుట్టుతోడివాఁడ వైనాను
కలకల నవ్వేదానిఁ గడపఁగఁగలవా ॥ అందు ॥

పట్టపుదొరవై యెంతపంతగాఁడ వైనాను
చుట్టమై వచ్చినదానిఁ దట్టితోయవచ్చునా
గట్టిగా పెక్కుచెలులు గలవాఁడ వైనాను
వెట్టికి వచ్చినదాని విడువఁగఁగలవా ॥ అందు ॥

వుడివోని శ్రీసతి వురమెంత యెక్కినాను
తొడపై నెక్కినదానిఁ దోయఁగ వచ్చునా
కడఁగి శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
వొడివట్టిన సతి [illegible] ననఁగలవా ॥ అందు ॥ 350

## రామక్రియ

జడిసేవు గనక నీ సమరతి నుండి నేను
వొడివట్టుకున్నదాన వొద్దికలు మీరఁగా ॥ పల్లవి ॥
వలపులు రేఁచితే వడిగొనీఁ దమకము
తలఁచుకొంటేఁ గడుఁ దమి యెక్కీని
మొలకచన్నులురము మోవ నిన్నుఁ గాఁగిలించి
బలిమి నుండాన నిదే పట్టరాక పాయము ॥ జడి ॥
తప్పక చూచితేను తడఁబడీఁ జిత్తము
ముప్పిరిగా నవ్వితేను ముంచీ వేడుక
నెప్పుగాఁగా నామోవి నీమోవి గదియించి
చిప్పిలి వుండాన నిట్టే చెలరేఁగీఁ దనువు ॥ జడి ॥
నెఱి సరస మాడితే నిండుకొనీఁ బులకలు
చెఱఁగు గప్పితే నట్టే చెమరించీని
యెఱఁగి శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
వొఱగుకుండాన నీపై నొనరె నా నోములు ॥ జడి ॥ 351

## సామంతం

అవునయ్య మంచివాఁడ వందుకు దొరకొంటివి
కవగూడే మగువలు గాతల కోపుదురా ॥ పల్లవి ॥
చేరిచేరి నీతోను సిగ్గులు వడఁగానే
గోర గీరేవేమయ్య కోమలిని
ఆరితేరినవాఁడవు అన్నిటికి నోపుదువు
వూరివారి కన్నెక లోపుదురా ఇందుకు ॥ అవు ॥
తడఁబడి చేతులను తప్పించుకొనఁగానే
యెడయక చన్నులంటే విదేమయ్య
కడు సాములు సేతువు కలదు సత్తువ నీకు
వొడికపు జవ్వనులు వోపుదురా ఇందుకు ॥ అవు ॥

పొందులు చూపి దయలు వుట్ట మాటలాడఁగానే
కిందుపడ రతులఁ జొక్కించితివయ్యా
విందుల శ్రీవేంకటేశ వేడుకతోఁ గూడితివి
వొందిలి మానినులెల్లా నోపుదురా ఇందుకు ॥ అవు ॥ 852

570-వ తేకు శుద్ధవసంతం

ఏల సేసేవు మాతో నిన్నిమాయలు
పోలించితే గురుతులు బూమెల్ల నిండవా ॥ పల్లవి ॥
మలసి నీవెంత నాతో మఱఁగులు వెట్టినాను
కలికి నీతో నవ్వఁగాఁ గానరాదా
పొలుపుగ మరిఁగొన్ని బొంకులు ఒంకినాను
పలు నీచేఁతలు బట్టబయటనే పడవా ॥ ఏల ॥
అందరిలో నీవు నాపై నానలెన్ని వెట్టినాను
యిందుముఖి మొక్కఁగాను యెఱఁగరాదా
గొందినెంత తలవంచుకొని నీవు వుండినాను
విందులాపె చెప్పరాఁగా వెల్లవిరి గాదా ॥ ఏల ॥
పెనఁగి నాకెంత నీవు ప్రియములు చెప్పినాను
పనులాపె సేయఁగాను పచ్చిగాదా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
ననుపులాపె చూపఁగా పెనురట్టు గాదా ॥ ఏల ॥ 858

సాళంగం

దిట్టవన్నిటాఁ దొల్లే తేరినవాఁడవు నీవు
గట్టిగా నిన్నుఁ జేపట్టుట గాక ॥ పల్లవి ॥
అలరి నీవు రావని అలుగఁగఁ దగునా
నలుగడ సెలవుల నవ్వుట గాక
కలయవనుచు నిన్నుఁ గసరఁగఁ దగునా
మొలకసిగ్గుతోడ మొక్కుట గాక ॥ దిట్ట ॥

కడలు దొక్కితివని కాఁతాళించఁ దగునా
మెడయెత్తి సారె నిన్ను మెచ్చుట గాక
అడియాలాలెల్లాఁ జూచి అట్టె తిట్టఁదగునా
గొడవలేక నిన్నుఁ గొలుచుట గాక ॥ దిట్ట ॥

పాసి వుంటివని నీతోఁ బదరఁగఁ దగునా
రేసులకు నిన్నుఁ గాఁగిలించుట గాక
యీసు దీరె శ్రీవేంకటేశ నన్నేనసితివి
సేసవెట్టి యిఁకనిట్టె చెలఁగుటగాక ॥ దిట్ట ॥ 354

## కన్నడగౌళ

భయమెల్లాఁ బాసె యిఁకఁ బనిలేదు
జయమై నీకాతఁడు సమ్మతించుండఁగను ॥ పల్లవి ॥

ననుపై నీవతనితో నవ్వు నవ్వవలదా
చనవు నీకిచ్చినది చాలాఁ గద్దు
గునిసి నీవప్పటిని కొసరఁగ వలదా
పెనఁగి నీకాతఁడు ప్రియము చెప్పఁగను ॥ భయ ॥

బెట్టుగా నీవతనితో బిగియఁగవలదా
పట్టిపట్టి నిన్నిట్లాఁ బాలార్చఁగను
చుట్టమవై కమ్మటిని సూడువట్ట వలదా
అట్టుగా నీకాతఁడు గుట్టు సేయఁగాను ॥ భయ ॥

చలపట్టి నీవాతని సాదించ వలదా
యెలమిఁ దప్పని బాసలియ్యఁగాను
అలరి శ్రీవేంకటేశుఁడతఁడే నిన్నిదె కూడె
యిల నిన్నురముమీఁద నెక్కించుకుండఁగాను ॥ భయ ॥ 355

### సాళంగనాట

నీకే తెలుసునయ్యా నేరుపరివౌదువు
వాకున నిద్దరికిని వంతువెట్టేవా ॥ పల్లవి ॥

చాయలకు నాపెతోడ సరసములాడేవు
యీయెడ నాతోనైతే నిటు నవ్వేవు
యేయెడఁ గూరిమి నీకు యెవ్వరివాఁడవు నీవు
పాయము ఇద్దరికిని పంచిపెట్టేవా ॥ నీకే ॥

మచ్చికె నాకెదిక్కు మొగిడి చూచేవిట్టే
యిచ్చలు నాతోనైతే యిటులాడేవు
కచ్చుపెట్టేదెందు నీకు కాఁగిలి యెవ్వరిసొమ్ము
రిచ్చల నీమనసిద్దరికిఁ దూఁచిచ్చేవా ॥ నీకే ॥

వెంటవెంట నాపెను వేమారుఁ గూడేవు
ఇంటికి వచ్చి నన్ను నిటు గూడేవు
జంట యెందు శ్రీవేంకటేశ్వర నీకుఁ బ్రియమేది
రెంటెము నేఁడు యిద్దరిపయిఁ గప్పేవా ॥ నీకే ॥ 356

### మంగళకౌశిక

ఇందరు నున్నారు మీతో నేమంటినే
దిందుపడి తానేల తిట్టు దిట్టీనే ॥ పల్లవి ॥

తగవరితన మెల్లా తనదున్నదంటిఁ గాక
యెగసక్కేలకు మరి యేమంటినే
చిగురుమోవిమీఁద చిల్లులున్నవంటిఁ గాక
వెగటుగా నేనేమి వెంగెము లాడితినే ॥ ఇంద ॥

మొక్కలపుఁ గళలెల్ల మోము నిండె నంటిఁ గాక
యెక్కడా లేని నేరాలేమంటినే
మిక్కిలి వాసనలు నీమేన మించె నంటిఁ గాక
నిక్కమూఁ(ము?) గొంతలమీఁద నిందలేమాడితినే ॥ ఇంద ॥

చీటికి మాటికిని మై చెమరించె నంటేఁ గాక
యేఁటికి నలసేవని యేమంటివే
గాఁటపు శ్రీవేంకటేశ కడపలో నన్నుఁగూడి
యేఁట వెట్టేవంటేఁ గాక యేతులేమాడితినే ॥ ఇంద ॥ 357

శ్రీరాగం

బుజ్జగించ రాదా పొలఁతి నిట్టె
అజ్జకాఁడనంటా నుంటివౌనయ్యా నీవు ॥ పల్లవి ॥

సోయగపు చూపులను చూచి యాపె దిట్టఁగానే
రాయడించి తీసేవు రతికి నీవు
నాయమా వేఁడిపాలకు నాలుక చాఁచ నీకు
యీయెడ నీకే తెలుసు నెటువంటి సుఖము ॥ బుజ్జ ॥

గుట్టున నాపె నిన్ను గోరికొన నూఁదఁగానే
బెట్టుగ మోవితేనెకుఁ బెనఁగేవు
పట్టి తీసేవు మాఁగనివంట నేది రసము
యెట్టి జాణవై తివిది యెటువంటి సుఖము ॥ బుజ్జ ॥

పొలసి యాపె నిన్ను బొమ్మల జంకించఁగాను
కులికి చన్నులువట్టి కూడితివి
కలికి శ్రీవేంకటేశ కారము తీపుసేసితి
వెలమి నీమాయలివి యెటువంటి సుఖము ॥ బుజ్జ ॥ 358

571-వ రేకు కాంబోది

ఆనతీయవయ్య నాకు నట్టే వొక్కమనసుగా
మోనముతోడుత నీకు మొక్కేఁగాని ॥ పల్లవి ॥

చెంతల మాటాడుమంటా చేవట్టి వేఁడుకొనేవు
పంతము నీకు వచ్చెనా పలికేఁ గాని
సంతతపు నీచేఁతలు సమ్మతించఁ జేసేవు
యింత నీకుఁ బ్రియమా ఇయ్యకొనేఁ గాని ॥ ఆన ॥

వొంటి నన్ను గిలిగించి వూరకైనాఁ బెనఁగేవు
నంటున నీకు సెలవా నవ్వేఁ గాని
గొంటరితనాన మేని గురుతులు చూపేవు
సొంటులు నీకు నింపా చూచేఁ గాని ॥ అవ ॥

పయి జేయివేసి నన్ను బలిమిసేయ వచ్చేవు
ప్రియమా నీపై సేసవెట్టేఁ గాని
దయతో శ్రీవేంకటేశ తగిలి నన్నేలితివి
నియతాన నీకు మెచ్చా నెలకొనేఁ గాని ॥ అవ ॥ 359

దేవగాంధారి

మగువమాటలే గురుమంత్రము నీకు
వెగటుదీర నివి విన్నవించదాయనా ॥ పల్లవి ॥

కాంతలు గోపగించితే కడుఁ బచ్చిసేతురని
చెంతల నాకె బుద్ది చెప్పదాయనా
మంతనమైనప్పుడే మనసు గరఁతురని
వింత నీమంకుఁదనము విడిపించదాయనా ॥ మగువ ॥

సరసమాడేటివేళ చలము సాదింతురని
సిరతితో నీకు నీతి నేర్పదాయనా
మరిగితేఁ దమకము మరియును రేఁతురని
పరగ నీకితవుగాఁ బట్టించదాయనా ॥ మగువ ॥

కూడినట్టి రతివేళ కొప్పువట్టి తీతురని
వాడికైన నీగుణము వంచదాయనా
యీడనే శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వోడక నీకు వంకలొత్తదాయనా ॥ మగువ ॥ 360

## శుద్ధవసంతం

మంచితనము సేయఁగ మారుమలతు రటవే
కంచువంటి చిత్తములో కపటాలేమిటికే ॥ పల్లవి ॥
అక్కరతో రమణుఁడు అట్టె నీపై బత్తిని
చెక్కు నొక్కఁగానే చేయి దీసేవు
మొక్కలాన వీడెమిచ్చి మొదల నాకు మడిచి
గక్కన నియ్యఁగానే కారమనేవు ॥ మంచి ॥
మేలుగలవాఁడు గాన మేనదానవంటా నిన్ను
కాలు దొక్కఁగా నేల గాతలాడేవే
మేలిమి పన్నీరుచల్లి మేదించిన గందము
వేల నీపైఁ జమరఁగ వేఁడి యనేవు ॥ మంచి ॥
చనవుతో శ్రీవేంకటేశ్వరుఁడు కాఁగిటఁ గూడి
చెనకఁగ నప్పటిని సిగ్గువడేవే
నమపునఁ దురుమున నానా విరులు ముడిచి
మొనగోరు నాఁటించితే మొగచాటనేవు ॥ మంచి ॥ 361

## మంగళకౌశిక

నీకేల వెరపు నలఁతకిది సమ్మతే
చేకొన్న నీయిచ్చలను చెందఁగరాదా ॥ పల్లవి ॥
సిగ్గువడి వుంటేనేమి చెయివట్టి తియ్యరాదా
యెగ్గులు తప్పులు నాపై యెంచీనా
అగ్గలపు వలపులు ఆసల విడిచుండునా
బగ్గనఁ బువ్వు తోడమెఁ బాసి వుండునా ॥ నీకే ॥
నవ్వుతా నుంటేనేమి నలిఁ గాఁగిలించరాదా
రవ్వలుసేసి కీరము చూపీనా
మవ్వపు జవ్వనమది మదము విడిచుండునా
దివ్వెవెలుఁగు చీఁకటిఁ దెగి పాసి వుండునా ॥ నీకే ॥

గుట్టుతో నుంచేనేమి కూచుండఁ బెట్టుకోరాదా
యెట్టైనా నలమేల్మంగ యెదురాడినా
నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁగూడి వున్నదీకె
వొట్టిన కొండలు రాళ్ళనాగెఁ దాని వుండునా ॥నీకే॥ 362

### శంకరాభరణం

ఊడిగపు వారెల్లా నొద్దమండరో
వేడుక నేకాంతమున వెలసీని దేవుఁడు ॥పల్లవి॥

నిలువుగోణము గట్టి నిలుచుండి పన్నీట
జలకమాడీ నదే సర్వేశుఁడు
తలపాగ చుట్టు చుట్టి తడిపూళ్ళు మేన వొత్తి
తొలఁగ కుత్తరీయముతో నున్నాఁడు దేవుఁడు ॥ఊడి॥

కప్పురకాపు మేనఁ గలయ మెత్తించుకొంటా
చిప్పిలఁగఁ జెమరించీ శ్రీవిభుఁడు
ముప్పిరిఁ బాటలు వింటా మునులు నుతించఁగాను
దప్పిదేరి సింగారానఁ దానున్నాఁడు దేవుఁడు ॥ఊడి॥

తట్టుపుణుఁగలఁదుక తరి సొమ్ములు నించుక
యిట్టే యలమేల్మంగ నెదఁ గట్టుక
పట్టి యారగించుకొంటా పలులోకా లేలుకొంటా
మెట్టి శ్రీవేంకటాద్రిని మెఱసీని దేవుఁడు ॥ఊడి॥ 363

### పాడి

చనవు గలుగుచోట చలమేఁటికి
పెనఁగఁబోతేఁ బ్రియము బెండుపడదా ॥పల్లవి॥

చెక్కునొక్కి వేఁడుకొనే చెలువునివంక చూచి
మొక్కవద్దా యేమే నీవు మోము వంచేవు
తక్కుల నాతఁడు మరి తప్పులెన్ని సేసినాను
´క్కసించితే వలపు గరివడదా ॥చనవు॥

కొసరి మాటాడి పతిఁ గొంగువట్టి తీసుకొని
యెసఁగి నవ్వఁగవద్దా యెమ్మెలాడేవు
మసరముగాక పతి సూటికెంత రాకుండినా
పిసికితే మనసైనాఁ బిప్పిగట్టదా ॥ చనవు ॥

కూడేటి శ్రీవేంకటేశు గొబ్బువనుఁ గాఁగిలించి
యీడై యిట్టే వుండవద్దా యేల మీరేవు
వోడ కలమేల్మంగవు వూరకాతఁ డుండినాను
వాడుకొంటే వయసు కాపరమెచ్చదా ॥ చనవు ॥ 364

572-వ రేకు లలిత

చెప్పకురే బుద్ధులిఁకఁ జెలులాల
చిప్పిల నాతనికే సెలవు నావయసు ॥ పల్లవి ॥

చెప్పరాని మాటలకు చెవులొగ్గి విననేల
తప్పులెంచే పనులైతే తాఁ జేయనేల
వొప్పుగా నెప్పుడూఁ బతివొద్ద నిట్టే వుండఁగాను
అప్పటికప్పటి భోగమైనంతే చాలును ॥ చెప్ప ॥

వోపలేని భారము వొడిఁగట్టుకోనేల
కైపైన వేడుకలు గైకొననేల
చేపట్టినాతనికి సేవ సేసుకుండఁగాను
చూపుల నాతఁడు దయఁ జూచినదే చాలును ॥ చెప్ప ॥

చప్పని మాటలు మరి సారెసారె నాడనేల
వుప్పతించి పంతముల నొరయనేల
యిప్పుడు శ్రీవేంకటేశుఁ డిట్టె కూడి వుండఁగాను
కప్పి సంతోసించిన యీకందువిదే చాలును ॥ చెప్ప ॥ 365

ముఖారి

ఇద్దరికిఁ జనవు నీవిచ్చితివి తొలుత
వొద్దనుండి బుద్ధిచెప్పి వొనగూర్చవయ్యా ॥ పల్లవి ॥
నీయింతితో జగడించి నీవేమందువో యని
చేయెత్తి మొక్కె నిదె సెలవు నీకు
పాయపుదానఁ గాన పంతానకే పెనఁగుదు
మాయిద్దరి సంది చేర్చి మన్నించవయ్యా ॥ ఇద్ద ॥
అప్పటి నాపెతో నేను అన్ని యెమ్మెలాడుకొంటి
చెప్పినట్టెల్లాఁ జేసే సెలవు నీకు
తప్పరాని విరహపుదానఁ గాన కొసరితి
ఇప్పుడిద్దరి రక్షించి యేలుకొనవయ్యా ॥ ఇద్ద ॥
గరిమ బింకములాడి కడు నిన్ను వేఁడుకొంటి
సిరుల శ్రీవేంకటేశ సెలవు నీకు
వరుసదానఁ గనక వనితచేఁ జెప్పించితి
ఇరవై నన్నుఁగూడితి విద్దరిఁ గావవయ్యా ॥ ఇద్ద ॥ ౩౬౮

ఆహిరి

నేరని జీవులము నేమేమెఱుఁగుదుము
నేరిచిన నీవే మన్నించుటింతే కాక ॥ పల్లవి ॥
చలపట్టి నిన్నును సాధించ వసమా
బలిమి చేసి చేతఁబట్ట వసమా
తలఁపులో నిన్ను నిట్టే తలఁచఁగ వసమా
సులభమై నీవే వొడచూపుటింతే కాక ॥ నేర ॥
మిక్కిలి సేవసేసి మెప్పించ వసమా
అక్కర నీపై భక్తి నంద వసమా
గక్కన నిన్ను మతించి కడగాన వసమా
దక్కి మాకు నిట్టే ప్రత్యక్షమవుట గాక ॥ నేర ॥

పొంటులు సోదించి నిన్నుఁ జూడఁగ వసమా
అంటి ముట్టి పూజించ నది వసమా
బంటనై తి నీమనసు పట్టనైనా వసమా
యింట శ్రీవేంకటేశ నీ విరవౌట గాక ॥ నేర ॥ 367

## నారాయణి

రావయ్య యెక్కడి సుద్ది రవ్వ సేయక
ఈ వరపు సతులెట్టు గద్దించేరు నన్ను ॥ పల్లవి ॥

వలచిన నీవు నాకు వసమై వుండితేఁ జాలు
సళుపు లేమాడేరు సవతు లిఁక
అలరి నీవిచ్చిన ఆస గలితేఁ జాలు
చెలుల వెంగెము లేమి సేసీ నన్ను ॥ రావ ॥

మగఁడవు నీవు నాతో మాటలాడితేఁ జాలు
యెగసక్కె లేమాడేరు యెవ్వరూ నిఁక
మొగమిచ్చి నీవు నాతో మొనసి నవ్వితేఁ జాలు
తెగి యేకాంతలు వచ్చి తేర్చేరు నన్ను ॥ రావ ॥

శ్రీవేంకటేశ నీవు చేకొని కూడితేఁ జాలు
ఆవల నేమాడేరు ఆఁడువారిఁక
సేవ యిచ్చి యేలితివి నీవు మన్నించితేఁ జాలు
సోవల నే రమణులు సొలసేరు నన్ను ॥ రావ ॥ 368

## నాదరామక్రియ

బుద్ది చెప్పేవారమా పొలఁతుల మింతే నేము
నిద్దిరించ వెప్పుడును నీకే తెలుసునే ॥ పల్లవి ॥

సిగ్గులు వడేవారిపైఁ జేతులెట్టు చాఁచేది (దే?)
యెగ్గులువట్టేవారి నేమనేది (దే?)
వొగ్గుచు నీ నాయకుఁడు వొడివట్టి తియ్యఁగాను
నిగ్గుల విట్టువీఁ గేవు నీకే తెలుసునే ॥ బుద్ది ॥

తిట్టులు దిట్టేవారి తెరువెట్టు వచ్చేదే
వొట్టువెట్టేవారి నొరసే దేమే
జట్టిగొని రమణుఁడు సారెసారె వేఁడుకోఁగా
నెట్టన నానవెట్టేవు నీకే తెలుసునే ॥ బుద్ది ॥

తప్పులెంచేవారికిఁ దగవులెట్టు చెప్పేదే
తిప్పరానివారి నెట్టు తెలిపేదే
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసి మన్నించఁగాను
నెప్పున నవ్వు నవ్వేవు నీకే తెలుసునే ॥ బుద్ది ॥ 369

## శంకరాభరణం

అంగన లెల్లా నవ్వేరు అదివో నేఁడు
అంగములు పులకించె నదివో నేఁడు ॥ పల్లవి ॥

చేరి నీవు విలువఁగా సిగ్గున నాపె లోఁగఁగా
ఆరితేరె వలపులు అదివో నేఁడు
గారవించఁగా నీవు కాంత నీకు మొక్కఁగాను
ఆరగించ వేళలేదు అదివో నేఁడు ॥ అంగన ॥

అంది నీవు చెనకఁగా నాపె యిల్లు చొచ్చుకోఁగా
అందరు నెఱిఁగి రీపనదివో నేఁడు
చెంది నీవు వెనగఁగా చెలి సరసమాడఁగా
అందమాయ గోరితాఁకులదివో నేఁడు ॥ అంగన ॥

సేస నీవు వెట్టఁగాను సెలవి నాపె నవ్వఁగా-
నా సుదులింతటా నిండె నదివో నేఁడు
శ్రీసతినిఁ గూడితివి శ్రీవేంకటేశ నేఁడు
ఆస లిద్దరికెక్కుడు అదివో నేఁడు ॥ అంగన ॥ 370

573-వ రేకు వరాళి

ఊరకుండితే నెఱఁగ(?)వొత్తుక వచ్చేవు నీవు
యేరా యింతటిలోనే యెమ్మెలాడేవు ॥ పల్లవి ॥
సిగ్గువడరాదా నీవు చేయి మీఁద వేయఁగాను
యెగ్గుపట్టరాదా నేను యేమైనా నాడఁగాను
అగ్గలము నవ్వరాదా అయము లిట్టే యంటఁగా
కగ్గి యిందరిలో నేల కాకుసేసేవు ॥ ఊర ॥
తలవంచుకొనరాదా తమకించి పైకొనఁగా
పులకించరాదా నీవు పొందులెల్లాఁ జూపఁగాను
కళలతో మించరాదా కప్పురము పైఁజల్లఁగా
చెలులకింతలో నన్నుఁ జేతఁ జూపేవు ॥ ఊర ॥
నివ్వెరఁగు నొందరాదా నీవు కాఁగిలించఁగాను
జవ్వనాన వీఁగరాదా సమరతులఁ గూడఁగా
వువ్విళ్లూర మొక్కరాదా వొక్కటై బుజ్జగించఁగా
రవ్వగా శ్రీవేంకటేశ రాఁపేల సేసేవు ॥ ఊర ॥ 371

బౌళి

ఇద్దరికిఁ బోరువెట్టి యేమి చూచి నవ్వేవయ్య
గుద్దులాట వెలిగాను కోపగించీ నీపె ॥ పల్లవి ॥
మొగము తప్పక చూచి మూతులు విరుచుకొని
జగడించి ఇట్టే పగచాటీ నీపె
పగటుఁ జేతులు చాఁచి పైపై వేళ్ళు మడిచి
తగవులకు రమ్మంటా దట్టించీ నాపె ॥ ఇద్ద ॥
ఆడరాని మాటలాడి అట్టె వొట్లు వెట్టి
జాడతోడ సణఁగులు చల్లీ నీపె
వాడలో సాకిరివెట్టి వనితలకెల్లాఁ జెప్పి
తోడనే నీమీఁదఁ బెట్టి తొర్లఁదిట్టీ నాపె ॥ ఇద్ద ॥

పిరిచుట్టు చుట్టుకొని బిగువుతో నిల్లురికి
సరుస వాదులడిచి జంకించీ నీపె
యురవై శ్రీవేంకటేశ యెడచొచ్చి నీవిద్దరి
సరిసేసి కూడఁగాను సాదులై రీపెనాపె ॥ ఇద్ద ॥ 372

నాట

ఏమే యిందరిలోన నెంతగర్వమే
నీమగఁడు మన్నించితే నీకొద్దా వినయము ॥ పల్లవి ॥
మొక్కలానఁ బతివద్ద ముందర ముందర వచ్చి
కక్కసించి కూచుండేవు గద్దెమీఁదను
చక్కని కొలువులోని సతులిందరునుఁ జూచి
వొక్కరొక్కరి మొగాలు వొగిఁ జూచేరదివో ॥ ఏమే ॥
చెమటలు వెట్టఁగాను చెలువుని తొడమీఁద
నమరంగఁ బవళించే వప్పటి నీవు
కొమరె సవతులెల్లా గుజగుజ లాడుకొంటా
తమకానఁ జిన్నఁబోయి తలవంచే రదివో ॥ ఏమే ॥
సెలవుల నవ్వుకొంటా శ్రీవేంకటేశ్వరుని
తిలకించి కూడితివి తెరవేసుక
చెలులెల్లా నిద్దరికి సేవలెల్లాఁ జేసి చేసి
పొలసి మిమ్ము మెప్పించి చుట్టాలైరిదివో ॥ ఏమే ॥ 373

మాళవిగౌళ

తానెంత నేనెంత తరుణులాల
పూని యాతఁడెంత సేసీ పొసగఁగ వినరే ॥ పల్లవి ॥
పలికి బొంకనివాఁడు పంతగాఁడు తానన్నిటా
నిలువు నూరు వండేటి నెరజాణఁడు
పిలిచి పీడెము వెట్టెఁ బ్రియములెల్లాఁ జెప్పె
కలసినాఁడు నేనంత ఘనురాలనా ॥ తానెంత ॥

కడుఁ బ్రతాపపువాఁడు కాఁకలు దేరినవాఁడు
విడువని చలముల వేడుకకాఁడు
వాఁడివట్టి తీసి నాకు నుంగరము వేలఁ బెట్టి
అదరి మన్నించె నేనంత నేరుపరినా ॥ తానెంత ॥

చక్కఁదనములవాఁడు చల్లని మాటలవాఁడు
వెక్కసపు నవ్వుల శ్రీవేంకటేశుఁడు
అక్కరతో నను నేలె నలమేలుమంగను
మిక్కిలిఁ జొక్కించె నింత మేలుదాననా ॥ తానెంత ॥ 374

కుంతలవరాళి

ఇంతేసి సేవలు సేయ నెందాఁకా నోపుఁ జెలి
కాంతుఁడవు మెచ్చి మెచ్చి కాఁగిలించవయ్యా ॥ పల్లవి ॥

పయ్యెదకొంగు జారఁగ పాలిండ్లు గదలఁగ
చయ్యనఁ గుంచ(చె?)వేసీని సతి నీకు
చెయ్యెల్ల బడలంగఁ జెక్కులు చెమరించఁగ
వొయ్యనే పాదాలొత్తీ నుల్లసాన నీకు ॥ ఇంతే ॥

గరిమఁ దురుము వీడఁ గస్తూరి బొట్టు రాల
పరగఁగఁ గాళాంజి పట్టీ నీకు
సరులు చిక్కువడఁగ సందడి నూర్పులు రేఁగ
సిరుల గందము పూసీఁ జెలరేఁగి నీకు ॥ ఇంతే ॥

తనువు పులకించఁగ తమకములు ముంచఁగ
యెనసి యాకు మడిచి యిచ్చీ నీకు
అనుగు శ్రీవేంకటేశ అలమేలుమంగ యాకె
చనవునఁ గెమ్మోవి చవిచూపీ నీకు ॥ ఇంతే ॥ 375

దేసాళం

తమలోనఁ దామే వొయితే తగిలి కోపము దీరు
క్రమముగఁ దిట్లాడి కలతురు లోననే ॥ పల్లవి ॥

యేకతమైతేఁ జాలు యిద్దరి మంకులుఁ దేరి
చేకొని మనబుద్దికిఁ జెవులొగ్గరు
వాకిట నుండుద మిట్టే వరుసతో నిందరము
యీకడికి రాఁగదరే యింతులాలా ॥ తమ ॥

తనువులంటితేఁ జాలు తక్కిన యలుక మాని
మనమెంత వేఁడుకొన్నా మాటలాడరు
మునుపే యిద్దరికొక్క ముసుఁగుగాఁ బెట్టుదము
వెనవెనకకే రారె వేడుకతోఁ జెలులు ॥ తను ॥

చాటుతెర వేసితేనే చాలు నిట్టే కూడేరు
నాటుక మనెదుట మానరు సిగ్గులు
యీటున శ్రీవేంకటేశుఁడెనసె నీపె నిన్నిటా
మాటుకు రారే వత్తము మరియూఁ జెలులము ॥ తమ ॥ 376

574-వ రేకు ఆహిరి

నిన్నటి యలుక దేర్చి నేఁడాతఁడే
సన్నలకు చాయలకు సమ్మతించరాదా ॥ పల్లవి ॥

వలపులు చల్లఁగాను వాసులెంచ నేమిటికి
పిలువఁగఁ బతితోడ బిగియనేల
నెలకొని కొసరఁగ నెపము వేయనేఁటికి
కొలువు మొక్కులు మొక్కి కూచుండరాదా ॥ నిన్నటి ॥

చెక్కులు నీకు నొక్కఁగ సిగ్గువడ నేమిటికి
మక్కువలు చూపఁగాను మచ్చరమేల
యెక్కరతో మాటాడఁగా నానలువెట్ట నేఁటికి
మొక్కలాన వీడెమిచ్చి మోము చూడరాదా ॥ నిన్నటి ॥

పైకొని కాఁగిలించఁగా పంతములాడ నేఁటికి
నీకు లోనై యుండఁగాను నేరములేల
యీకడ శ్రీవేంకటేశుఁ డిరవై నిన్నిదే కూడె
యేకాలమును యిట్టే యెనయఁగరాదా ॥ నిన్నటి ॥ 377

## రామక్రియ

ఎదిరివారి మనసు తెలియఁగవద్దా
యెదుగా సతులఁ-దాను యేలేవాఁడు గాఁడా ॥ పల్లవి ॥

యెలమి నాచింతతోడ యెవ్వరి తెరువుఁ బోక
తలవంచుకుండఁగాను తడవుమురా
వలచినవాఁడు తాను వచ్చి వచ్చి రాకుండితే
నలుగరాదా అట్టే అలిడిఁ బెట్టుదురా ॥ ఎదిరి ॥

అగ్గలపుఁ దమకాన నంటఁగాక వుండి నేను
సిగ్గువడి మొక్కఁగాను చెనకుదురా
వొగ్గి తా వేడుకకాఁడు వూరసుద్దులు చెప్పఁగా-
నెగ్గులు వట్టఁగరాదా ఇంతరట్టు గలదా ॥ ఎదిరి ॥

కామించిన కోరికెతో కన్నులఁ దప్పక చూచి
ప్రేమ నుండఁగాఁ జేవట్టి పెనఁగుదురా
యీమేర శ్రీవేంకటేశుఁడిట్టే తానె నన్నుఁగూడె
మోము చూడరాదా నాకు మంచి తా నవ్వుదురా ॥ఎదిరి॥ 378

## నాట

తమకించ నేఁటికే తానే వచ్చీని పతి
నెమకితే నీవలపే నీపై వచ్చీనా ॥ పల్లవి ॥

చెఱకు సింగిణివిల్లు చిగురుటమ్ములును
మఱి మరునివి నీబొమ్మలు చూపులు
వెఱవనేలే నీకీ విరహవేళ
నెఱి నీసింగారమే నీపై వచ్చీనా ॥ తమ ॥

చక్కవలుఁ దుమ్మిదలు సరి మదనుబలాలు
నిక్కిన నీ చన్నుదోయి నెఱిఁగురులు
గక్కన నాతనిఁ జూసి కలఁగ నేమిటికే
నెక్కొన్న నీయంగములు నీపై వచ్చీనా ॥ తమ ॥

తేరునుఁ డెక్కెములును ధృతి సంగజుముద్రలు
పూరులుఁ బిరుఁదు నీకై వొనరినది *
యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనే
నేరుపులన్నియు నీవే నీపై వచ్చీనా ॥ తమ ॥ 379

## హిందోళవసంతం

ఎఱుఁగుదు నీ సుద్దు లేమి చెప్పేవు
జఱపులఁ బెట్టితే చలము రేఁగీని ॥ పల్లవి ॥

వంచి చల్లని నీశ్వేకావా కొన్చి పారేవి
కుంచి నీ మాటలేకావా మరిగించేవి
కొంచి నీవు నను వేఁడుకొనకంత సారెసారె
యెంచ నాచెక్కుల గోళ్ళింతలో నాఁటీని ॥ ఎఱు ॥

ఇసుమంత చల్లే కాదా ఇన్నిపాలూఁ బేరించేది
పసని నీ నవ్వేకాదా భ్రమయించేది
ముసరి నాచన్నులివి ముట్టి యానలు వెట్టకు
వెస నీగట్టిచేతులు కసుఁగందించీని ॥ ఎఱు ॥

మాఁగితే కాయే కాదా మంచిఫల మయ్యేది
కాఁగిటి నీపొందే కాదా కరఁగించేది
చేఁగదేర నేలితివి శ్రీవేంకటేశ నన్ను
రేఁగి రేఁగి కొసరకు రెట్టించీ వలపు ॥ ఎఱు ॥ 380

---

* ఈపోలిక యెట్లో తేటపడదు

## రామక్రియ

తెలుసుకో యింకా నీవే తేటతెల్లమిగాను
చలపట్టనేల నీతో సాదించేవు ॥ పల్లవి ॥
మచ్చరించే దానఁ గాను మనసిచ్చే దానను
పచ్చిగా నాతో నేమి పచారించేవు
రచ్చవేసే దానఁ గాను రహస్యపు దానను
అచ్చలాన నన్ను నేల ఆన వెట్టేవు ॥ తెలుసు॥
యెదురాడే దానఁ గాను యియ్యకొనేదానను
కదిసి మరేల నీవు కాకుసేసేవు
పదరేటి దానఁగాను బత్తిగలదానను
చెదరక నన్ను నేల చెక్కు నొక్కేవు ॥ తెలుసు ॥
పెనఁగేటిదానఁ గాను ప్రియపడేదానను
గనముగ నింత యేల కాఁతాళించేవు
యెనసితివి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నీవు
చనవిచ్చి నాకెంత సారె లోఁగేవు 361 ॥ తెలుసు ॥

## మధ్యమావతి

తొయ్యలివల్ల నింక దోసమేది
చయ్యాటాలు సేయఁగాను చలపట్టెను ॥ పల్లవి ॥
పొలిసి నొల్లని మాటలొకటొక టాడఁగాను
జలజలఁ జెమరించె సతిమేను
పిలువఁగానే నీవు బిగిసి వూరకుండఁగా
కెలసి కనుఁగొనల కెంపు లెక్కెను ॥ తొయ్యలి ॥
యేడో సతులఁ జూపి యెగసక్కెల నవ్వఁగా
వాడె నిట్టె మోమెల్ల వనితకును
పాడిదప్పినటువంటి పనులు నీవు సేయఁగ
గాడఁబొలిది (?) తలఁపులఁ గాఁక రేఁగెను ॥ తొయ్యలి॥

గోరికొనలటు సోఁక గుంపించి వొడికట్టఁగా
నారుకొనెఁ బులకలున్న తీఁ జెలికి
కూరిమి శ్రీవేంకటేశ గొబ్బున నీకెఁ గూడఁగ
సొరె సొరె మోవితేనె చవులుబ్బెను 382 ॥ తొయ్యలి ॥

575-వ రేకు సామంతం

కడు దంటగాదు సతి గంభీర నాయకురాలు
చిడుముడితో నిది చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

సెలవి నవ్విన నవ్వు సిగ్గులకు మూలము
చలములకు గురుతు జంకెనలు
వలపులకు మొదలు వద్దఁ బాయకుండుటలు
చెలియందే వున్నవివి చిత్తగించవయ్యా ॥ కడు ॥

కన్నుల మొక్కిన మొక్కు కాంతులకు మూలము
విన్నపాలకు గురుతు వినయములు
ఇన్ని మన్ననల మొదలిచ్చకఁపు మాటలు
చెన్నుమీఱ నీకెందే చిత్తగించవయ్యా ॥ కడు ॥

ఆసలకు మూలము ఆయము లంటుట యెల్ల
వాసివన్నెకు గురుతు వట్టిగుట్టు
వేసాలఁ గూడితివి శ్రీవేంకటాద్రి గోవిందుఁడ
శ్రీసతిని యీపె మేలు చిత్తగించవయ్యా ॥ కడు ॥ 383

వరాళి

ఎన్నఁడులేని గుణము యేల వచ్చె నీకును
మొన్నటి నిన్నటిపొందు మొగచాట్లాయనో ॥ పల్లవి ॥

బత్తి నేనెంత సేసినా భళియని మెచ్చవు
చిత్తము రాదో నీకు చెప్పుమా నాకు
వొత్తియెంత వేఁడుకొన్న వూరకే వున్నాఁడవు
వత్తులఁ గూకులునై వలపు విరిగెనో ॥ ఎన్న

వీడెము చేతికిచ్చితే వేగమే వేసుకొనవు
తాడుపడెనో మతి తమకములు
పాడితో నీకు మొక్కితే పక్కన దీవించవు
వేడుక రతులలోన వేసటలు పుట్టెనో ॥ ఎన్న ॥

కాఁగిట బిగించితే బింకములాడ విప్పదైతే
వీఁగని పరవశాలు వెల్లిగొనెనో
ఆఁగితి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
మాఁగిన మోవి చేకొంటి మన్ననలిచ్చితివో ॥ ఎన్న ॥ 384

సాళంగ నాట

మొక్కరో సేవించరో మునులాల ఋషులాల
దిక్కులు సాధించీ నదే దేవదేవుఁడు ॥ పల్లవి ॥

ఆరదముమీఁద నెక్కి అమరులు గొలువఁగ
సిరితో వీధుల నేఁగీ శ్రీవిభుఁడు
గరుడ ధ్వజముతోడ ఘనచక్రాయుధముతో
దొరదైవ మదిగో పొందుగ మెరసీని ॥ మొక్కరో ॥

గొడుగులుఁ బడిగెలు కోటానఁ గోట్లాడఁగా
వెడలె వెడలె నదే విష్ణుదేవుఁడు
నడుమను రంభాదులు నాట్యములాడఁగాను
అడరి వుత్సవమందీ నాదిమూరితి ॥ మొక్కరో ॥

సారె నింటింటి విందులు చవులు చూచుకొంటాను
సారెకు రథము దోలీ సర్వేశుఁడు
ఆరీతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
కోరిన వరములిచ్చీఁ గుంభిణీరమణుఁడు ॥ మొక్కరో ॥ 385

### ముఖారి

ఎందాఁకా నోరుచుకుండే విటువంటి తమకము
అందుకొని యెడమాట లాడించరాదా ॥ పల్లవి ॥

చెప్పరాని మాటలంటా సిగ్గులువడఁగఁ బోతే
దెప్పరాన విభునికిఁ దెలిసే దెట్టు
కుప్పళించిఁ బెంజెమట గుట్టు నీవు నడవఁగ
విప్పచుఁ జెలులచేత విన్నవింపించరాదా ॥ ఎందా ॥

చిత్తమెద్దో యంటాను శిరసు వంచఁగఁ బోతే
హత్తినపతి కెచ్చరికయ్యే దెట్టు
పొత్తుల వూహలచేతఁ బులకించె మేనెల్ల
సత్తుగా లేకలు వ్రాసి చదివించరాదా ॥ ఎందా ॥

పంతము దప్పినంటా పరాకుసేసుక వుంటే
ఇంతలో శ్రీవేంకటేశుఁ డెనసె(సీ?) నెట్టు
కాంతవలమేల్మంగ కళలెక్కె నీమోమున
సంతతపు రతులకు సన్న సేయరాదా ॥ ఎందా ॥ 386

### దేసాళం

చూడఁ గొత్తలాయ మీసుద్దులు నేఁడు
వాడవారెల్లా మెచ్చి వేడుకపడేరు ॥ పల్లవి ॥

పచ్చడము మరఁగునఁ బడఁతిఁ బెట్టుకొని
యిచ్చల వేరొక యింతి నెలయించేవు
చెచ్చెర నాపె నిన్నుఁ జెనకఁగఁ జూచితేను
పచ్చిగా నిన్నిట్టే యా(యీ?)పె పయ్యెదఁ గప్పీని ॥ చూడ ॥

కుడి దిక్కునను వొక్కకోమలిపైఁ జేయివేసి
యెడమనొక్క సతితో నిటు నవ్వేవు
జడిగొని నిన్ను నాపె సన్నలు సేసితేను
కొడిసాగ నీపె ఇట్టే గోర నొత్తీని ॥ చూడ ॥

అలమేలుమంగ నురమందు నీవు వెట్టుకొని
మలసి వీఁపున భూరమణిఁ బెట్టితి
కలసె శ్రీవేంకటేశ గక్కనఁ గాఁగిట నాపె
చలివాయఁ గూడి యా(యీ?)పె చన్నుల నొత్తిని ॥ చూడ ॥ 387

రామక్రియ

దేవరవు నీవు గావా తెలిపి చెప్పఁగనేల
ఆవిద్యలు నీకే చెల్లు ననుకో నేమిటికి ॥ పల్లవి ॥
వింతలు నన్నడిగేవు విచారాలు సేసేవు
యింత నీకుఁ జెప్పరాదా యేకతాన నను
పంతపు నీచేఁతలూను పరులాడే మాటలూ నీ
యంతరంగ మెఱఁగదా అనుకో నేమిటికి ॥ దేవర ॥
సొమ్ములు వెట్టుమనేవు సోదించేవు మామనసు
కొమ్మ నీకుఁ జూపదా గురుతులెల్లా
దిమ్మల నీవలపులు దిష్టపు నీమచ్చములు
అమ్మరో నీవు సేయవా అనుకో నేమిటికి ॥ దేవర ॥
వలపు మాపైఁ జల్లేవు వద్దనే మమ్ముఁ బాయవు
అలమేలుమంగ గాదా అరత నీకు
చెలఁగి శ్రీవేంకటేశ చెలుములు బలుములు
అల నీవిద్యలు గావా అనుకో నేమిటికి ॥ దేవర ॥ 388

576-వ రేకు ఆహిరి

ఆపెమాఁటే నామాఁట అవునయ్యా
యేపొద్దూ నిట్టే చననియ్యవయ్యా ॥ పల్లవి ॥
నవ్వించినపుడే నాతి కోపమెల్లాఁ బాసె
రవ్వలుసేయక యిఁక రావయ్యా
దవ్వులఁ జేయి చాఁచితే తగులాయ మెల్ల నాయ
పువ్వుటమ్ముల సంగడిఁ గూచుండవయ్యా ॥ ఆపె ॥

మాటాడించినప్పుడే మగువచలము దీరె
    చీటికి మాటికి నీకఁ జెనకవయ్యా
    సూటి గాఁగాఁ జూచితేనే సొంపులెల్లా సమకూడె
    గాటముగ ముందుముందే కాఁగిలించవయ్యా ॥ ఆపె ॥

చేరి మొక్కించినప్పుడే సిగ్గులెల్లాఁ దేరెను
    జోరునఁ జెమట రతిఁ జొక్కించవయ్యా
    యీరీతి శ్రీవేంకటేశ యెనసితి విన్నిటాను
    నేర్పులెల్లా నిందే నెరపవయ్యా ॥ ఆపె ॥ ౩౮౯

### శుద్ధదేశి

నీవేల సిగ్గువడేవు నేఁడిట్టే మాముందరను
    చేపట్టి యీపెచనవు చెల్లించరాదా ॥ పల్లవి ॥

మలసి మలసి నీతో మాటలాడీ తనివోదు
    తలయెత్తి నిన్నుఁ జూచీ తనివోదు
    చెలరేఁగి సేవలెల్లాఁ జేసియునుఁ దనివోదు
    యెలమి నాపెకోరికె యీడేరించరాదా ॥ నీవే ॥

అంటి ముట్టి చదురంగాలాడియునుఁ దనివోదు
    దంటతనాన జంకించీ తనివోదు
    నంటునను సారెసారె నవ్వియునుఁ దనివోదు
    కంటగించకాకె బత్తి గైకొనఁగరాదా ॥ నీవే ॥

చేరి నీపైఁ జేయి చాఁచి చెనకియుఁ దనివోదు
    ధారుణిఁ జాగిలి మొక్కి తనివోదు
    యీరీతి శ్రీవేంకటేశ యెనసియుఁ దనివోదు
    ఆరసి మమ్మేలితి వాపెను మెచ్చరాదా ॥ నీవే ॥ ౩౯౦

పాడి

నీకు నీకే యమరును నీలోననే
చౌక లేక నేమెట్లు సమ్మతించేమయ్యా ॥ పల్లవి ॥
పచ్చిదేరే మాటలూ బయలీఁగమాటలూ
కుచ్చితపు వెంగేల కొనమాటలూ
నెచ్చెలులతో నాడ నేరుతు విన్నిటా నీవు
యిచ్చగించి చెవులార నెట్టు వినేమయ్యా ॥ నీకు ॥
కాకుసేసే చేఁతలూ కతకారి చేఁతలూ
లాకల సిగ్గుమీరిన లందుఁ జేఁతలూ
దీకొని యిందుకునే సాదించితివి తొల్లే నీవు
పైకొని యింతులకెట్టు పడవచ్చునయ్యా ॥ నీకు ॥
కవకవ నవ్వులూ కాతరపు నవ్వులూ
చవులతో నెప్పుడును సాజమే నీకు
యివల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
భువిలో నిన్నెంతని పొగడేటిదయ్యా ॥ నీకు ॥ 391

కాంబోది

ఉమ్మడినే యేమనినా నూరకుండను
అమ్మరో యెంతట గర్వ యనకుమీ నన్నును ॥ పల్లవి ॥
మాటలు నీవాడితేను మంచితేనెలు గారీని
గాటమై నీచేఁతలైతే కారమయ్యీని
యీటువెట్టితేఁ జవి యిదొకటి నదొకటి
కూటమికా ననరాదు కోపగించ రాదు ॥ ఉమ్మ ॥
కన్నుల నీవు చూచితే కడు వెన్నెల గాసీని
యెన్నఁబోతే నీసుద్దులు యెండ గాసీని
పన్ని నవి నీ గుణాలు పచ్చియును వెచ్చియును
అన్నిఁ జేతఁబట్టరాదు అటు దోయరాదు ॥ ఉమ్మ ॥

నీవాసలు వెట్టితేను నిలువు నూరువండీని
భావించ నీ సింగారాలు పాలుకొనీవి
యీవల శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
చేవదేరె ననరాదు చిగురనరాదు ॥ ఉమ్మ ॥ 392

## దేసాళం

వినవే యింకనైనా నావిన్నపములు
చెనకితే నేమిటికి సిగ్గులు వడేవే ॥ పల్లవి ॥
చలమేల సాదించేవే సంగడి విరహమేలే
పిలిచితే రాఁడా ప్రియుఁడు నేఁడు
కలగంటి వంటా కాంతవద్ద నుండెనంటా
వెలయ నాతని నెంత వెంగెములాడేవే ॥ వినవే ॥
మచ్చరమేమిటికే మరగున నేలుండేవే
ఇచ్చ యెటిఁగి కూడఁడా యీతఁడు నిన్ను
మచ్చములు గంటి నంటా మరొకతె సేసె నంటా
కుచ్చితానఁ బతినెంత కోపగించేవే ॥ వినవే ॥
అప్పటిఁ బంతములేలే అండనుండి పయ్యదఁ
గప్పితే మెచ్చఁడా శ్రీవేంకట విభుఁడు
వొప్పి నిన్నుఁ గూడె నంటా వొగి మోవి యెంగిలంటా
చొప్పున నీతని నెంత సొలయఁ జూచేనే ॥ వినవే ॥ 393

## బౌళి

ఇటువలెఁ జేతువా యింతిని నీవు
సటలెల్ల మాని యింకఁ జనవియ్య వలదా ॥ పల్లవి ॥
మొగమోటమున నీ ముదిత యెదురాడదు
యెగసక్కేలకు నీవెంత సేసినా
పగటుల సరసాల నవురే యీయను నేఁడు
...కోప దీఁకఁ జనవియ్య వలదా ॥ ఇటు ॥

మిక్కిలి వాసి పట్టుకే మేర మీఱఁజాలదు
యెక్కువ తక్కువలు నీవెంత నవ్వినా
తక్కులఁ బదురంగాలతోనే మరిఁ దెల్లవారె
చక్కని రమణికింకఁ జనవియ్యవలదా ॥ ఇటు ॥

నిండిన మోహమునను నిను దూరఁజాలదు
యిండెవెట్టి యాసలు నీవెన్ని యిచ్చినా
కొండల శ్రీవేంకటేశ కూడితి వింతటిలోన
చండివెట్టకిఁక నిట్టే చనవియ్యవలదా ॥ ఇటు ॥ 394

577వ రేకు కురంజి

ఊరకే శాంతిపడి వొడివట్టేఁ గాక మమ్ము
ఆరీతి సతులమీఁది యాసలేలే తనకు ॥ పల్లవి ॥

బత్తితో వలచినాకె పానుపుపై నుండఁగాను
హత్తి నన్నేల చెనకీ నప్పటిఁ దాను
యిత్తలఁ దొలుతటాపె యెదురులు చూడఁగాను
కొత్తమగువలతోడి గొడవేలే తనకు ॥ ఊర ॥

సేసవెట్టిన వనిత చెంగటనే వుండఁగాను
వేసరక నాతో నవ్వీనే తాను
యీసరిఁ జేతికి లోనయిన దిట్టే వుండఁగాను
వాసు లెంచేవారితోడి వలపేలే తనకు ॥ ఊర ॥

కానుకలిచ్చిన యాపె కట్టెదుట నుండఁగాను
పూని వచ్చి నన్నుఁగూడి పొదిగీఁ దాను
తానే శ్రీవేంకటేశుఁడు మేనముద్దరాలుండఁగా
నానా కాంతలతోడి నను పేలే తనకు ॥ ఊర ॥ 395

బలహంస

ఎక్కడా నెఱఁగమమ్మ యిటువంటి బత్తి
చిక్కించే దెటువలెనే చేతిలోని కతని ॥ పల్లవి ॥

మనసు నొచ్చీనంటా మాటలాడ వెరచేవు
చెనకే దెట్టువలెనే చెలువునిని
వనితరో పతికొప్పు వంగినంటా లోఁగేవు
పెనఁగే దెటువలెనే ప్రియమైన వేళను ॥ ఎక్క ॥

వెంగెమవునో యనుచును వెస నవ్వఁజాలవు
సంగతయ్యే దెటులనే సరసములు
యెంగిలయ్యీ నంటా మోవి యించుకంతా నడుగవు
ముంగిటిరతుల నింక ముంచే దెటువలెనే ॥ ఎక్క ॥

సిగ్గువడీనో యంటా చెరఁగుపట్టి తియ్యవు
వెగ్గళించే దెట్టే శ్రీవేంకటేశుని
యెగ్గువట్టీనో యంటా నిట్టే గోరు దాఁకించవు
వొగ్గి కూడితివి యిట్టే వుబ్బు దెలిసే దెట్టే ॥ ఎక్క ॥ 39[illegible]

ధవళ

కానీవే తానాడినట్టే కైకొంటి నేను
మోనాన నూరకే వుండే ముద్దరాల నేను ॥ పల్లవి ॥

చలములవారమా సారెసారె నేము తన
సలిగెల బతికేటి సతులము
పలుకులవారమా పంతమాడి యిప్పటిని
చెలిమి సేసుక వుండే చెలులము గాక ॥ కానీ ॥

వెంగెములవారమా వేగినంతాఁ దనమోవి
మొంగిలిచవులు గొనే యింతులము
కొంగు వట్టేవారమా కొసరుచు నేపొద్దు
ముంగిటఁ గాచుకుండే ముదితలము ॥ కానీ ॥

సాదించేవారమా జంకించి యెమ్మెలను
పోదిసేసి కూడేటి పొలఁతులము
ఆదిగొని శ్రీవేంకటాధిపతి నన్నేలె
కాదనేవారమా తనకాఁగిటిలో దానను ॥ కానీ ॥ 397

### శుద్ధదేశి

పొద్దు వోక నీకునిట్టే బుద్ధులు చెప్పితిఁ గాక
చద్దిగట్టితే వలపు చవులవునా ॥ పల్లవి ॥
చెప్పరాని ప్రియములు చెప్పి నీకు వేసరితి
యెప్పుడు నీవోజలివి యేల మానును
తప్పకు జాసలనుచు దండములు వెట్టితిని
చిప్పిలి నీవుద్దండాలు సేయక మానితివా ॥ పొద్దు ॥
ఆదేవారి మాటలకు నడ్డమాడి వేసరితి
యెడనుండా(న్నా?)నీవె కావా యెంచనేఁటికి
పిడెము చేతికిచ్చి వేఁడుకొంటి చెక్కునొక్కి
కూడేటి సతుల పైకొసరు మానితివా ॥ పొద్దు ॥
తగిలి కాఁగిట నిన్నుఁ దనియించి వేసరితి
యెగసక్కేలకుఁ గాదా యియ్యకొంటివి
నగుతా శ్రీవేంకటేశ ననుపులు మెరసితి
మొగమోట సన్నలు ముందే మానితివా ॥ పొద్దు ॥ 398

### వసంతవరాళి

ఇన్నిటికి సెలవుగా నిదివో మొక్కే నేను
మన్నించుమింతట నన్ను మంకు నేనెఱఁగను ॥ పల్లవి ॥
చనవు గలదు గాన సరివెనఁగితి నీతో
యెనసి చన్నులొత్తుట యెఱఁగనైతి
నను మన్నింతువు గాన నవ్వులెల్ల నవ్వితిని
మనసుకు వెంగెమాత మరి నేనెఱఁగను ॥ ఇన్ని ॥

మచ్చిక గలదు గాన మాటలెల్లా నాడితిని
యెచ్చుకుందులగుట నే నెఱఁగనైతి
యిచ్చగింతువు గనక యిట్టె పాదము దొక్కితి
ని(న?)చ్చలాన మితిమీఱుటని యెంచనైతిని ॥ ఇన్ని

సేస వెట్టితివి గాన చేతులు చాఁచితి నీపై
యీసిగ్గులు రేఁగుట నే నెఱఁగనైతి
రాసికెక్కించితి గాన రతులఁజొక్కించితిని
ఆసల శ్రీవేంకటేశ అలయిక చూడను ॥ ఇన్ని ॥ 399

## ఆహిరి

నీవే యానతీవయ్య నేమేమీ నెఱఁగము
కావిరి నీమొకములోఁ గళలే కంటిమి ॥ పల్లవి ॥

చిక్కువడ్డ మనసులో చింత యెవ్వఁడెరుఁగును
చిక్కునఁబెట్టిన నీచేయిఁ గంటిమి
చక్కఁగా నవ్వటి నీసంతోస మెవ్వఁడెఱుఁగు
వుక్కుమీరే సెలవి నవ్వులే కంటిమి ॥ నీవే ॥

తడఁబడ్డ నీరతి తమక మెవ్వఁడెఱుఁగు
అదరి నీవచ్చిన రాకదే కంటిమి
పెడరేఁచి నీవుచెప్పే ప్రియము లెవ్వఁడెఱుఁగు
విడువక నీవు చేయివేసినదే కంటిమి ॥ నీవే ॥

అచ్చమైన నీలోని యానంద మెవ్వఁడెఱుఁగు
ముచ్చటలాడే సరసములే కంటిమి
విచ్చనవిడిని శ్రీవేంకటేశ కూడితివి
ఇచ్చన లెవ్వఁడెఱుఁగు దక్కినదే కంటిమి ॥ నీవే॥ 400

578-వ రేకు ఆహిరి

సేతుఁ గాక వూడిగేలు చెప్పినట్టెల్లా
చేతికి లోనైనదాన సిగ్గుపడనున్నదా ॥ పల్లవి ॥

మలసి మలసి యెన్ని మాటలు నీవాడినాను
చలములు నీతోను సాదించేనా
బలిమిసేసి నీవు పంతములు చూపితేను
వలచినదాన నాకు వాసులున్నవా ॥ సేతు ॥

యెనసి యెవ్వరి నీవు యెదురులు వెట్టినాను
కొనచూపులనుఁ జూచి కోపగించేనా
పెనఁగి నీవెంటేసి తబ్బిబ్బుగా నడచినాను
ననిచినదాన నాకు నాలి వున్నదా ॥ సేతు ॥

కొంకక నీమేన నెన్ని గురుతులు నించుకొన్నా
నంకెకు లోనౌదుఁ గాక యలిగేనా
కంకిగా శ్రీవేంకటేశ కలసితి వెట్టుండినా
లంకె నదానను వేరే లాగులుండీనా ॥ సేతు ॥ 401

వరాళి

సిగ్గువడ కిఁక నేల చెప్పవయ్యా
తగ్గు ముగ్గు లేక నీతలఁపు లిదేరెవా ॥ పల్లవి ॥

కాంత మోము చెమరించెఁ గళలు మోమున నిండె
మంతనాన నాపె నేఁడు మన్నించితివా
పంతములాడుదువు వాసలిత్తువు మాకైతే
వంతుల నీవూ నాపెవలకు లోనైతివా ॥ సిగ్గు ॥

సెలవుల నవ్వుదేరె చిగిరించెఁ బులకలు
కలికి చేసినసేవ గైకొంటివా
వలవ సెందూ నందువు వసమైతి వాకందువు
బలిమి నాపెకు నేఁడు భ్రమసితివా ॥ సిగ్గు ॥

మోవిపైఁ గెంపులు రేఁగె ముదము లన్నిటా మించె
యీవల నాపెను నన్ను నేలితివా
భావించి శ్రీవేంకటేశ పలుమ్మెమ్మె లాడుదువు
చేవల్ల(ల?) మాయిద్దరికిఁ జిక్కితివా ॥ సిగ్గు ॥ 402

## పాడి

చెలిమోవి యెంగిలి సేసినవాఁడవు మారు
వలుక ననుచు నిట్టే బాస యిమ్మీ నాకును ॥ పల్లవి ॥
ఆయములు ముట్టితివి అతివకు నింతలోనే
కాఁగు మెల్లాఁ గరఁగెను కళ దాఁకెను
చేయూర నీవే యింత సేసినవాఁడవు మరి
పాయక యేలేనని బాస యిమ్మీ నాకును ॥ చెలి ॥
ననుచ మాటాడితివి నలినాక్షి యిప్పు డిట్టే
మనసు నీకొసఁగెను మరిగె నిన్ను
పనివడి యింతేసి భ్రమయించినవాఁడవు
పనుపు నేసే నని బాస యిమ్మీ నాకును ॥ చెలి ॥
అట్టే కాఁగిలించితివి అంగన నిన్నుఁగూడి
జట్టిగొని మోహించె సతమాయను
అట్టుగా శ్రీవేంకటేశ యిట్టె కూడినవాఁడవు
పట్టము గట్టేనని బాస యిమ్మీ నాకును ॥ చెలి ॥ 403

## ఆహిరి

ఎప్పటివలెనే చెలి నేలవయ్యా
చిప్పిలుఁ జెమటతోడ సిగ్గువడనేలా ॥ పల్లవి ॥
వేడుకగల సతులు వేవేలు నాడుదురు
పాడిపెట్టి నీకు సెగ్గు పట్టనేఁటికే
వాడికెగలయింతులు వరుసలు మీరుదురు
యీడ నిట్టే తలవంచ నేఁటికి నీకు ॥ ఎప్ప ॥

సరిగెగల కాంతలు జాగుల నెలయింతురు
అలసి యింతలో నుస్సురననేలా
వలచిన మగువలు వడిగాఁ జెనఁగుదురు
పలుమారు నీకు బెండువడ నేఁటికి ॥ ఎప్పు ॥

సేసవెట్టిన లేమలు చెక్కు గోర గీరుదురు
బేసబెల్లితనానఁ దప్పించుకో నేలా
ఆసతో శ్రీవేంకటేశ ఆకె నీవూఁ గూడితిరి
బాసిచ్చితి నని నీవు పలుకఁగ వలెనా ॥ ఎప్పు ॥ 404

## నాదరామక్రియ

ఎవ్వరు మంచివారమో యెంచుకో నీవు
జవ్వనుల మిద్దరము సవతులమే ॥ పల్లవి ॥

మచ్చిక నీకుఁ జేసి మంతనాన నిన్ను రాసి
పెచ్చువెరిగాకె నిన్నుఁ బెండ్లాడెను
యిచ్చకములే యాడి యిన్నిపనులుఁ జేసి
మెచ్చులుమెచ్చి సేస నీమీఁద నేఁ బెట్టితిని ॥ ఎవ్వ ॥

చెలులచేఁ జెప్పిపంపి చేతుల నిన్నుఁ జెనకి
అలమి బలిమి నిట్టే యాపె గూడెను
పిలిచి నీకు నేను ప్రియములెల్లాఁ జెప్పి
తలఁపులు సరిదాఁక తమితోఁ గూడితిని ॥ ఎవ్వ ॥

కన్నులఁ దప్పక చూచి కడు బాసగొని యాకె
సన్నసేసి నీమోవి చవిగొనెను
విన్నపాలు నేనే సేసి వేఁడుకొని చెక్కునొక్కి
యిన్నిటా శ్రీవేంకటేశ యెనసితి నేను ॥ ఎవ్వ ॥ 405

## శంకరాభరణం

మాముందర నేల సేసీ మతకములు
మోముచూచి యాపెతోడ ముచ్చటాడుఁ గాక ॥ పల్లవి ॥
చెలిఁ బెండ్లాడినవాఁడు సిగ్గులు వడఁగనేల
నలువంక నాపెతోనే నవ్వుఁ గాక
పలచినవాఁడు తాను వాసులెంచుకొన నేల
కెలఁకులఁ గమ్మటిని కిందుపడుఁ గాక ॥ మాముం ॥
బువ్వానఁ గూచున్నవాఁడు పొంచి యెంగిలననేల
చివ్వన నారగించి చెలఁగుఁ గాక
రవ్వై వీడె మిచ్చేవాఁడు రాజసము లెంచనేల
మవ్వఁపుఁ దెల్లనాకులు మడిచి యిచ్చుఁ గాక ॥ మాముం ॥
పానుపుపై నున్నవాఁడు పరాకు సేయఁగ నేల
కానిమ్మని యాపెఁ దానుఁ గలయుఁ గాక
వేనతెం(లం?)ట నేల శ్రీవేంకటేశుఁడైనవాఁడు
మోనానఁ గూడినట్లానె మొక్కుచుండుఁ గాక॥ మాముం॥406

-వ రేకు

## శ్రీరాగం

ఏనోము నోఁచితినో యింతకు మున్ను
అనుకొని సేవసేయ నంతదాననా ॥ పల్లవి ॥
చనవిచ్చి నీవు నాతో సరసమాడేవు గాక
కనుఁగొన నేనంత చక్కని దాననా
పనివడి నామీఁద పాదము చాఁచేవు గాక
తనువు సోఁకుటకు నంతటి దాననా ॥ ఏనో ॥
నాపై మన్ననఁ గూడ నవ్వులు నవ్వేవు గాక
నీపొందు లిటుసేయ నేరుపరినా
తీపనుచు నామోవి తేనెలాడిగేవు గాక
ఆపనుల కంతేసి యరుహపు దాననా ॥ ఏనో ॥

దయఁ జూచినవాఁడవై తగిలి కూడేవు గాక
క్రియతో నీచిత్తమెరిఁగిన దానఁనా
నియతి శ్రీ వేంకటేశ నేఁడిట్టే పెండ్లాడితివి
ప్రియపడి యింతసేయ బిరుదులదానఁనా ॥ ఏనో ॥ 407

## మంగళ కౌశిక

పెనఁగితే వలపులు పిప్పిగట్టీని
గొనకొన్న యపుడే కొంగువట్టేను ॥ పల్లవి ॥
మునుప నేఁ బైకొంటే మొగచాటు దోఁచీని
ననిచి తాఁ గనుఁగొంటే నవ్వు నవ్వేను
వెనుకొంటే నింతలోనే వేసటలు పుట్టీని
మనసిచ్చినపుడే మాటలాడేను ॥ పెనఁగి ॥
బలిమి నేఁ జేసితేను పలుకులు చప్పనౌను
సలిగె గలప్పుడే పిలిపించేను
చలపట్టితే మరి చండిపెట్టినట్లయీ
వలె నన్నప్పుడు తనవద్ద నుండేను ॥ పెనఁగి ॥
తోడఁదోడనైతేను తొక్కుడువడీఁ బంతము
కూడినప్పుడే కొనగోర నూఁదేను
యీడనే శ్రీవేంకటేశుఁ డిపుడే తానన్నుఁ గూడె
జాడతోఁ దనకు నిట్టే సతమయ్యేను ॥ పెనఁగి ॥ 408

## సాళంగనాట

ముందరెంచి మెలఁగవే ముమ్మాటికి
మందలించి కోరికలు మట్టుపెట్టఁ గలవా ॥ పల్లవి ॥
సిగ్గులు వడే వదేమే చెయిచాఁచి రమణుఁడు
వెగ్గళించి చెక్కునొక్కి వేఁడుకోఁగాను
తగ్గక చనుమొనలు తలచూపి పొదలఁగ
అగ్గమైన జవ్వనము అణఁచుకోఁ గలవా ॥ ముంద ॥

తెరలోని కేఁగేవేమే దిష్టించి చూచి యాతఁడు
పరగ నీమునిగొంగు వట్టి తియ్యఁగా
పరువమై నీమోవి పండుతేనెలు గారఁగా
ఝరిపేన వేరే నీవు మూసి దాఁచఁ గలవా ॥ ముంద ॥

నివ్వెరఁగై నవ్వేవేమే నిన్ను శ్రీవేంకటేశుఁడు
చివ్వనఁ గాఁగిటఁగూడి చెమరించఁగా
పువ్వులై నీమేననెల్ల పులకలు నిండఁగాను
ఝువ్వంక నవి నీవు మోపు గట్టఁగలవా ॥ ముంద ॥ 409

## కొండమలహరి

ఇందుకు నేనేమిసేతు నెరిఁగీ నెఱఁగవు
సందడి వలపులను సారె భ్రమసితివి ॥ పల్లవి

నామనసెరుఁగుదువు నాకు నీవిచ్చిన బుద్ది
ఆ మీఁద నాతో నేల అనవెట్టేవు
నీ మాటనే నమ్మినా నీవే చేఁతలెల్లాఁ జేసి
ఆముకొని నీకు నీవే అఁకేవు గాక ॥ ఇందుకు ॥

యింటిదాననే నీకు నిచ్చలోని దాననే
వెంట వెంటవచ్చి యేల వేఁడుకొనేవు
కంటకము నాకున్నదా గజరుఁగాంతలఁ బొంది
అంటుకొని నామేను అలమేవు గాక ॥ ఇందుకు ॥

చిన్నదాని నన్నుఁదెచ్చి సేసవెట్టి కూడితివి
మన్నించి నాకేల బాసలిన్నీ నిచ్చేవు
చన్నకన్న గొల్లెతల కాఁపిరాలు సేసి వచ్చి
సన్నలు శ్రీవేంకటేశ సలిపేవు గాక ॥ ఇందుకు ॥ 410

### వరాళి

పిడెము చేతఁ బట్టుక వీఁడే వున్నాఁడు
తోడఁ దోడఁ బై కొని దోసిలొగ్గఁ గదవే ॥ పల్లవి ॥

మాఁటలఁ దేనెలు గారీ మాఁటిమాఁటికిని నీకు
కాటుక కన్నులచూపే కాఁడి పారీని
తాటించి విభునితోడ దారా మోనాఁ (?) జూపితివి
యేఁటికి జాగులుసేసే విఁక నియ్యకొనవే ॥ పిడె ॥

నిలువెల్ల వినయమే నిండాఁ గొనలు సాగీ
బలిమెల్లఁ జన్నులనే పౌఁజు చూపీని
నెలకొని యీతనిపై నీడా నెండాఁ గాసితివి
చలము లింకనేఁటికి సమ్మతించఁగదవే ॥ పిడె ॥

చేరి సేసలు వెట్టితే చిరుముత్యాలు గారీని
గోరికొన గిరితేను ఘేరు వారీని
యీరీతి శ్రీవేంకటేశు కింపూ సొంపూఁ జూపితివి
ఆరయ నిఁక నేఁటికి అట్టే మెచ్చఁగదవే ॥ పిడె ॥ 411

### లలిత

ఏఁటికి నిష్ఠూరము ఇందుకుఁగా నీతోను
నాఁటుకొన సెలవుల నవ్వు నవ్వేఁ గాక ॥ పల్లవి ॥

యెదురాడేనా(మా?) నీకు నేమేమి సేసినాను
కదిమి నీమాటల వంకలు దిద్దేమా
పదరి మగియేమైనాఁ బలుమారు సొలసేమా
సదరమనుచు నిన్ను సాదించేమా ॥ ఏఁటి ॥

పట్టి దిట్టేమా నిన్ను దిమ్మరివై తిరిగితే
యిట్టె నీమేని మచ్చాల కిసడించేమా
గుట్టు నీకు లేదనుచు గుణదోషా లెంచేమా
పట్టరాఁగా నేము నీతోఁ బంతమాడేమా ॥ ఏఁటి ॥

కాదు గూడదనేమా గర్భితసాల నుండఁగ
వాదులడిచేమా నీవనితలతో
పోదిగా శ్రీవేంకటేశ పొందితివి నన్నునిట్టే
పొదుఁదనమే కాక జంకించేమా ॥ ఏఁటి ॥ 412

580-వ తేకు భైరవి

విన్నవించ నేమున్నది విచ్చి విచ్చి ఇందులోను
అన్నిటా నీదేరించి ఆదరించు నీవే ॥ పల్లవి ॥

ఆసపడి వున్నదాన నట్టే నీవేమి సేసినా
వేసారుకొంటా నిన్ను వెంగెమాడేనా
నేసవెట్టి పెండ్లాడి సేసుకొన్న వాఁడవు
దోసము రాకుండ మన్నింతువుగాక నీవే ॥ విన్న ॥

వలచి వచ్చినదాన వంకలు గుణాల నుంటే
బలిమిఁ బెనఁగి నిన్ను బందుసేసేనా
చెలిమి సేసి తెచ్చి చేయి వట్టినవాఁడవు
చెలులు నవ్వకుండా రక్షింతుగాక నీవే ॥ విన్న ॥

వేళ గాచుకొన్నదాన వేడుక నీవు గూడితే
చాలునంటా బొమ్మలను జంకించేనా
యేలితివి శ్రీవేంకటేశ యింతలోనే నన్ను
మేలు దప్పకుండా నిట్టే మెత్తుగాక నీవే ॥ విన్న ॥ 413

నాదరామక్రియ

మగువా నీవూ నొక్కటే మమ్ము నలయించనేల
యెగసక్కేలు చెలులే యింతసేసి రందురు ॥ పల్లవి ॥

చేయివట్టి తియ్యఁగాను చెల్లఁబో జాగుసేసేవు
వేయిటికివి చెలికి విన్నవింతుమా
ఆయెడ నెదురుచూచీ అంగన మాసుద్దులకు
పాయక అనతీవయ్యా పరాకులేమిటికి ॥ మగువా ॥

ఆనవెట్టి పిలువఁగ నంగనలతో నవ్వేవు
వైనవైనాలుగ నన్ని వ్రాసెంపుద(దు?)మా
మానవతి లోననుండి మరి దూతికఁ నంపె
దానికేమనే వయ్యా యీతరి గుట్టేమిటికి ॥ మగువా ॥

వొత్తరించుకొని రాఁగా నువిద నిట్టె కూడితి-
వి త్తల శ్రీవేంకటేశ యెచ్చరింతుమా
తత్తరానఁ గమ్మటిని తరుణి సన్నలు సేసీ
చిత్తగించి యేలవయ్యా సిగ్గులిప్పు డేఁటికి ॥ మగువా ॥ 414

## సౌరాష్ట్రం

ఇంతటివాఁడవు యిన్ని నెఱఁగవద్దా
వింతగా నెదిరిఁ దమ్ము విచారించవద్దా ॥ పల్లవి ॥

కక్కసమేల సేసేవు కప్పురమేల చల్లేవు
మొక్కితే నెఱఁగవద్దా ముందరెత్తు
పక్కన నేలంటేవు బాసలేల సేసేవు
వొక్కమాటాడితే నూరకుండవద్దా ॥ ఇంత ॥

చన్నులేల పిసికేవు చలమేల నెరపేవు
సన్ననే తెలియవద్దా జాణతనము
యెన్నిమారులు నవ్వేవు యింతయేల పెనఁగేవు
వున్నట్లానే వుండి వొద్దికఁ గావద్దా ॥ ఇంత ॥

మేరలేల మీరేవు మెచ్చులేల మెచ్చేవు
చేరితేఁ గరఁగవద్దా చిత్తమెల్లాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సారెఁ గొసరితేఁ జనవియ్యవద్దా ॥ ఇంత ॥ 415

### శంకరాభరణం

ఆసపడి వచ్చె నాఁటదానిఁ దోయ
దోసమేల యీపెఁ జేసుకోవయ్యా ॥ పల్లవి ॥

కందువ చూపీని కానుక లిచ్చీని
విందులు చెప్పీని వెలఁది
యిందరిలో సిగ్గులేల పచరించ
పొందులు సేసుక భోగించవయ్యా ॥ ఆస ॥

సన్నలు చేసీని చవులు చూపీని
కన్నుల మొక్కీని కలికి
మున్నిటి వలపు మూసి దాఁచనేల
యిన్నిట నాఁకెను యియ్యకోవయ్యా ॥ ఆస ॥

శ్రీవేంకటేశ్వర సేవలు చేసీని
పూవుల వేసీని పొలఁతి
యీవల నన్నేలి తీకఁ గొంక నేల
భావించాపెఁ గూడి బదుకవయ్యా ॥ ఆస ॥ 416

### మాళవిగౌళ

కంటిమి వింటిమి అట్టే కానీ వయ్యా
వెంటనే యశోదకు విన్నపించే మయ్యా ॥ పల్లవి ॥

చల్లలమ్మె గొల్లెతతో సాములెల్లాఁ జేసితివి
చెల్లునయ్యా నేఁడు నీకు చేసినవెల్లా
గొల్లు(ల్ల?)కంపు నీమెయి నంటె గోరురేక నాపె కంటె
మొల్లవారము నిన్ను నేమనే మయ్యా ॥ కంటి ॥

మగనాండ్ల సిగ్గులు మానమే కొల్లలాడితి
తగునయ్యా తలఁచిన తలఁపెల్లాను
తగిలెఁ బయ్యెద నీకు తమక మాపెకు రేఁగె
మొగసక్కెలాడఁగా మాకేమి చలమయ్యా ॥ కంటి ॥

దొడ్డివారి వావులెల్ల దోమటి దొడికితివి
అడ్డము లేదయ్యా నీకు నన్నిటాను
జడ్డు నీకాఁగిట మించె సేస లాఁపెమీఁద నిండె
వొడ్డి శ్రీవేంకటేశ నేమెునరితి మయ్యా ॥ కంటి ॥ 417

కన్నడగౌళ

తప్పులెంకఁ బట్టి నిన్ను దగ్గరి కూచుండు మిట్టే
కుప్పళించు మాటలెల్లా కొంకకు నీ విఁకను ॥ పల్లవి ॥
వీడె మింద వేసుకో వెస దప్పి దేరుచుకో
వాడు మోముతో నలసి వచ్చితివి
ఆడనుండి తెచ్చిన సొమ్మది నా యెదుటఁ బెట్టు
యేడలేని సిగ్గువడ నిపుడేల యిఁకను ॥ తప్పు ॥
పన్నీరవధరించు పవ్వళించు తొడమీఁద
వన్నెల నసురుసురై వచ్చితివి
మున్ను వల్లెవాటు వేసుకొన్న పచ్చడమిదే
వెన్నెల గాసీ నదే వెరవకు మిఁకను ॥ తప్పు ॥
గందము మేనఁ బూసుకో కాఁగిలించు నా చన్నులు
సందనపు సంచనతో వచ్చితివి
యిందు నందు శ్రీవేంకటేశ యేలితివి నన్ను
సందడి వేడుకలకు జడియకు మిఁకను ॥ తప్పు ॥ 418

581-వ రేకు ఆహిరి

విరుల యమ్ములు వాఁడి వెన్నెల వేఁడి
సరవితోఁ గూడరయ్య జాముపోయ నిపుడు ॥ పల్లవి ॥
వుయ్యాల మంచముమీఁద నుండినట్టి నీదిక్కు-
తొయ్యలి మేడలో నుండి తొంగిచూచీని
చెయ్యెత్తి సన్న చేసి చేకొని పిలువవయ్యా
చయ్యాటపు సిగ్గులనే జాముపోయ నిపుడు ॥ విరుల ॥

సెజ్జవై మలఁగుమీఁది నీబుజముపై నాపె
కలువకాము నోరణ గండ్లఁ జూఁచీని
చలివాసి రమ్మని ఇచ్చట కప్పుణియ్యవయ్యా
చలపాది సిగ్గులనే జాముపోయ నిపుడు ॥ విరుల ॥

చేరి దోమతెరలోని శ్రీవేంకటేశ నిన్ను
గోరనూఁది కాఁగిలించి కొసరీ నాపె
గారవించి యేలితివి గక్కన మోవియ్యవయ్యా
సారెకు నొడఁబాట్ల జాముపోయ నిపుడు ॥ విరుల ॥ 419

## శ్రీరాగం

సందడిలో నెందాఁకా సారెకు గుబ్బతిల్లేవు(రు?)
కందువైన చోటనే కోకగా నుండరయ్యా ॥ పల్లవి ॥

సరసమాడినఁ గాని చవి గావు వలపులు
తెర వేసుకొన్నఁ గాని తీరదు సిగ్గు
వొరసి నవ్వినఁ గాని వొక్కటి గాదు మనసు
తరుణి నీవు నేకతాన నుండరయ్యా ॥ సందడి ॥

పచ్చి మాటాడినఁ గాని భావములు గరఁగవు
యిచ్చఁ గొసరినఁ గాని ఇంపు రేఁగదు
విచ్చనవిడైనఁ గాని వెలయవు కోరికెలు
పచ్చల మేడలోనఁ బవ్వళించరయ్యా ॥ సందడి ॥

బిగువుఁగాఁగిటఁ గాని ప్రియములు సమకోవు
తగులైనఁ గాని లేదు పరితీపు
మిగుల శ్రీవేంకటేశ మెలుఁత నేలితి విట్టే
నగరిలోననే వుండి నంటు చూపరయ్యా ॥ సందడి ॥ 420

## కురంజి

అందువల్లఁ గాని నమ్మఁ డాతఁడు
అందములుగా నింకా నానవెట్టుకొనవే ॥ పల్లవి ॥
సారె నీవు నగఁగాను సరసుఁడు తనవొళ్ళ
నేరమేదో యని మతి నెమకీని
గారవించి నీవిందుకు కప్పురవీడె మిచ్చి
ఆ రీతి నే మీరనని ఆనవెట్టుకొనవే ॥ అందు ॥
పలుమారు మొక్కఁగాను వచ్చిదేరె వెంగెమని
తలవంచుక బాసలు తలపెట్టీని
కలసి నీవీవేళ కాఁగిలించి బుజ్జగించి
అలరించి నిజముగా నానవెట్టుకొనవే ॥ అందు ॥
వొద్దఁ గాచుకుండఁగాను వొరసీ సిదేమో యని
పొద్దు వొద్దు నీతోనే భోగించీని
వొద్దిక శ్రీవేంకటేశు నొడఁబరచి నీ విట్టె
అద్దుకొని పాదముల నానవెట్టుకొనవే ॥ అందు ॥ 421

## మనోహరి

నీవు చేసిన భాగ్యము నేమేమని పొగడేము
సోవలుగ విన్నేసి నీసుద్దులెల్లా వింటిమి ॥ పల్లవి ॥
పైకొని పాదముమీఁదఁ బాదమువేసి బిగించి
ఆకు మడిచి నోరనే అందియ్యఁగా
నీకు నీకే కడునుబ్బి నిలువెల్లఁ జెమరించి
జోకతో వెరగందిన సుద్దులెల్ల వింటిమి ॥ నీవు ॥
చెక్కునఁ జెక్కును మోపి శిరసుతోడ నదిమి
వొక్కటై గుబ్బల నురమూఁదఁగాను
తక్కక నీవంతలోనే తనువెల్లఁ బులకించ
చొక్కమై [illegible] సోఁగిన సుద్దులెల్లా వింటిమి ॥ నీవు ॥

పానుపుపై నొత్తగిలి బంతినే రతులు చూపి
ఆనుక శ్రీవేంకటేశు ఆకె(గూడ(గా
తానకమై మీరిద్దరు తలకొని మోవితేనె
సోనలు గురిసిన మీ సుద్దులెల్లా వింటిమి ॥ నీవు ॥ 422

## నాగవరాళి

లోనికి రావయ్యా లోకమెల్లా రట్టాయ
దీనికి(గానే యింతి తెరలోనే వున్నది ॥ పల్లవి ॥

మగువ నీతో నిట్టే మాటలెన్నో ఆడ(గాను
చిగురుమోవి యెల్ల( జిల్లులాయను
అగడు సేతురా నీవు ఆ(టదాని నింతలోనే
తెగువలు చూపలేక తెరలోనే వున్నది ॥ లోని ॥

నలినాక్షి సారె సారె నవ్వు నీతో నవ్వ(గాను
తోల(కి చెక్కులను చంద్రుడు నిండెను
పెలుచు సిగ్గు రే(తురా ప్రియురాలి కింతలోనే
తెలిసెనంటా( దాను తెరలోనే వున్నది ॥ లోని ॥

కామిని యెపొద్దు నిన్ను( గా(గిటనే కూడ(గాను
కామించి మేనెల్లా తీగె(గ?)లు వారెను
దోమటి శ్రీవేంకటేశ తొయ్యలి నింత సేతురా
దీమసాన రతి( జొక్కి తెరలోనే వున్నది ॥ లోని ॥ 423

## గంభీర నాట

మాపుదా(కా మాటలేలే మర్మము చేత నుండ(గ
యేపున మీ నేరుపులు యిట్టె చూపరాదా ॥ పల్లవి ॥

పంతమాడ నే(టికే పడ(తులాల మీతోను
కాంతు(డే నన్నింతేసి గారవించ(గా
అంత గలితే మీరు ఆతని( జొక్కించరాదా
యింతుల జాణతనాలు యేరువడి( గాని ॥ మాపు ॥

యేతులు చూప నేటికే యిందరి ముందర నేఁడు
ఆతఁడే నాపాలఁ జిక్కి అండ నుండఁగా
చేతనైతే మీరు పతిఁ జేకొని లోఁగొనరాదా
ఘాతల నందరి సొంపు గానవచ్చీఁ గాని ॥ మాపు ॥

మురిపము లేటికే కిమ్ముల నిట్టే పచరించ
యిరవై శ్రీవేంకటేశుఁ డెనకుండఁగా
వరుసగా వలసితే వద్దనే మీరుండరాదా
గొ?మ నందుల మేలు గానవచ్చీఁ గాని ॥ మాపు ॥ 424

582-వ రేకు హిజ్జిజి

ఎటువంటివాఁడవు యేమి జాణతనము
నటనఁ గేఁకరించుకొనఁగరాదా నేను ॥ పల్లవి ॥

అగపడి యింతులు నీయండ నిలుచుండఁగా
నగరాదా నిన్నుఁ జూచి నాకు నేఁడు
తగవు చెప్పు మనుచు తామే సాకిరి గోరఁగ
మొగము చూచి నీకు మొక్కరాదా నేను ॥ ఎటు ॥

చేతులకొలఁది నీపై సేసలెల్లాఁ బెట్టఁగాను
యీతల మెచ్చఁగరాదా ఇంతలో నాకు
రాతిరీఁ బగలు జాగరాలు నిన్నుఁ జేయించఁగా
మాతలఁ జూడఁగరాదా కందువతో నేను ॥ ఎటు ॥

వొట్టుకొని నిన్నుఁగూడి వూడిగాలు సేయఁగాను
దట్టముగ అట్టుసేయఁ దగదా నాకు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చుట్టమనై ఆనందానఁ జొక్కరాదా నేను ॥ ఎటు ॥ 425

## సామంతం

సతులకుఁ బతులకు సాజము లివి
    యితవులు సేసుకొంటే నియ్యకోలౌనా(ను?) ॥ పల్లవి ॥
మనసురానియట్టి మాఁట లెన్నియైనా
    చనవరులాడితేనే చవులౌను
    పెనఁగి పెనఁగి యెంత బిగిసి కొసరినా
    వనితల కోపాలు వలపులౌను ॥ సతు ॥
సేయరానియట్టి సేఁతలెన్నియైనా
    పాయని చుట్టాలైతే బాఁతౌను
    రాయడింపులైన రచన లేన్నైనా ॥ సతు ॥
    ఆయ మెటిఁగిన వారి వందములౌను
వాలితో నెగసక్కెపు నవ్వులెన్ని నవ్వినాను
    మేలుగల వారైతే మెచ్చులౌను
    యీవల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
    చాలుకొన్న నారతులు సతములౌను ॥ సతు ॥ 426

## వరాళి

చెలియరో నీవే కదే సిస్తికర్త్రవు
    నిలువున నీ మగఁడు నిను మెచ్చు(చ్చె?)నమ్మా ॥ పల్లవి ॥
బొమ్మల జంకించితేనే పొద్దు గుంకినట్లౌను
    కమ్మి నీవు నవ్వితేనే కాయు వెన్నెల
    సొమ్మల మోవి చూపితే చుక్కలు నిండుకొనును
    నెమ్మది నీరమణుఁడు నిను మెచ్చెనమ్మా ॥ చెలి ॥
పొలిఁతి నీవు చూచితే పొద్దువొడుచు నప్పుడే
    పొలయలుకల నెండ పొడచూపును
    ఫలకించి నిలిచితే దిష్టమౌను లోకమెల్ల
    నెలకొని నీవిభుఁడు నిన్ను మెచ్చెనమ్మా ॥ చెలి ॥

యెక్కువై నీవు గూడితే నిరుసంజలునుఁ దోఁచు
మొక్కిన నీతురుముకు మూఁగు మేఘాలు
వొక్కటై నీరతులను వోలార్చఁగా నేఁడు
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను మెచ్చెనమ్మా ॥ చెలి ॥ 427

కేదార గౌళ

చెలికత్తెలము నేము సేసేదేమి
అలసితి వాకెమోవి అందుకొనవయ్యా ॥ పల్లవి ॥

కూరిమి గోసరి పూవుగుత్తిఁ గొని ఆకె వేసె
ఆరయ నీకవి మరునమ్ములై తాఁకె
ఆరితేరెఁ బనులెల్ల నందుకేమి సేయవచ్చు
మారుకొని వలపుల మందు వుయ్యవయ్యా ॥ చెలి ॥

బత్తితోడ నీపై నాపె పక్కనఁ బన్నీరు చల్లె
వొత్తిన విరహాన నీకుడుకెత్తెను
చిత్తగించి తగవులు చెప్పేదిందులో నేమి
మత్తిలి వచ్చి మాటల మంత్రించుకోవయ్యా ॥ చెలి ॥

కొమ్మ నిన్ను రతిఁ గూడి కుచముల నిన్ను నొత్తె
కమ్మి నీకు రాతికంటె గట్లాయను
యిమ్ముల శ్రీవేంకటేశ యెవ్వరూ నేమి చెప్పేరు
తమ్మికొనగోరి యంత్రము వ్రాసుకోవయ్యా ॥ చెలి ॥ 428

సాళంగ నాట

పండి పొల్లవోదె(ది?)పుడు పనులెల్లా ముందరనే
నిండు నిధానము వలె నిలవే యింకాను ॥ పల్లవి ॥

వొట్టు వెట్టుకొను నేమో వొడఁబరచఁగఁ బోతే
గుట్టుతో నాతనివద్దఁ గూచుండవే
పట్టి పెనఁగఁగఁ బోతే పంతాలు మాపునో యేమో
చుట్టరికముతోడనే చూడవే యింకాను ॥ పండి ॥

గడె వెట్టుకొనునేమో కదిసి పిలువఁబోతే
విడువక లోననుండి వీడె మియ్యవే
తడవి మాటలాడితే తమకించునో యేమో
చిడుముడి సేవలెల్లాఁ జేయవే యింకాను ॥ పండి ॥

సిగ్గులు వడునో యేమో చెనకులు నించఁబోతే
కగ్గుదీర చన్నులంటఁ గాఁగిలించవే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
వొగ్గి చేతులనే మొక్కి వోనరు మింకాను ॥ పండి ॥ 429

## పాడి

ఎట్టి యాసోదకాఁడవు యెందరికి నోపుదువు
నెట్టుకొన్న మేలుకాపె నిలుచుక వున్నది ॥ పల్లవి ॥

సందడి నందరితోడ సరసాలాడే వీడ
కందువకు వచ్చినాపె కాచుకున్నది
పొందుల పొరుగులను పొత్తులకడందుకోఁగా
విందు చెప్ప వచ్చినాపె వెరగుతో నున్నది ॥ ఎట్టి ॥

వాడవారిపై నీవు వసంతాలు చల్లేవు
వీడె మంపినాపె లోనిమేడ నున్నది
గోడ నిక్కి చూచినాపె గుబ్బలు నీ వంటఁగాను
జోడు గూడ వచ్చినాపె చూచి నవ్వుచున్నది ॥ ఎట్టి ॥

కొలువులో వారినెల్లా కూడఁగ నన్నే సేసేవు
అలమి పట్టుకున్నాపె అలుకున్నది
యెలమి శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
కలసిన పురమాపె కడు మెచ్చుచున్నది ॥ ఎట్టి ॥ 430

583-వ రేకు ముఖారి

కల్ల గాదు నామాట కదిసి చూడఁగదయ్యా
చెల్లుఁబెద లిద్దరికి సగఁబాలు సుమ్మీ ॥ పల్లవి ॥
దప్పిగొని వచ్చేవంటా తరుణి వాకిటనుండి
కప్పుర మిచ్చేనంటాఁ గాచుకున్నది
కప్పి నీయూడాయములో కడ నున్న నీసరికి
చప్పుడుగా కందులోన సగఁబాలు సుమ్మీ ॥ కల్ల ॥
బడలి వచ్చేవంటా పడఁతి మంచేన(చియా)వాలు
బెడిదానఁ జల్లారఁ బెట్టుకున్నది
తడవి నీకుఁ గలితే తగ నిన్నందాఁకఁ గూడి
జడియని యాకెకును సగఁబాలు సుమ్మీ ॥ కల్ల ॥
పొంతఁ గాఁగి వచ్చేవంటా పూజించఁగోరి నీకు
యింతేసి తా మెరలు మీఁదెత్తుకున్నది
ఇంతలో శ్రీవేంకటేశ యెనసె నిన్నాకె రతి
సంతోషములాకెకును సగఁబాలు సుమ్మీ ॥ కల్ల ॥ 131

నాట

తొల్లెరఁగమా నీదొడ్డతనము
పల్లదమింతయును నీపాలిటిదే కాదా ॥ పల్లవి ॥
వూని రమణునిఁ జూచి వురమున బెట్టుకోనేవు
కానీవే రట్టడివంటి గావా నీవు
పిసుల కిసందరు నవ్వేరంటా నుంటివి గాక
కేస తిట్టులెల్లాఁ దిట్టి చెల్లించుకోలేవా ॥ తొల్ల ॥
నచ్చి తొల్ల నాతనితో పంతము లాడుకోనేవు
మెచ్చుము లేక పెనఁగనోపవా నీవు
పిచ్చనపిడా డీకెకు వెరచి వుంటివి గాక
తచ్చి రాఁగతనపు చేఁతల మించలేవా ॥ తొల్ల ॥

శ్రీవేంకటేశు రతులఁ జెంది కడుఁ జొక్కించేవు
లేవే యింత సలిగె లేదా నీకు
కోవిదుఁ డాతని నేనే(నినే?) కూడఁగా నుంటివి గాక
నీ వొళ్ళి గబ్బితనము నెరపఁగ లేవా ॥ తొల్లె ॥ 432

## కాంబోది

చెప్పరయ్యా వినే నేను చెవుల పండువగాను
కుప్పళించీఁ జెమటలు కూడుకొంటిరా ॥ పల్లవి ॥
మంతనాన నున్నాఁడవు మగువయు నీవును
అంతరంగపు మాట లాడుకొంటిరా
వింత లేక యెనసిట్టే వేడుకతో నున్నారు
చింత దీర బాసలెల్లఁ జేసుకొంటిరా ॥ చెప్ప ॥
పానుపుపై నున్నాఁడవు పడఁతియు నీవును
మేనరికాలు దెలిసి మెయికొంటిరా
గానములు చేసుకొంటాఁ గళలతో నున్నవారు
కానీలే మీమనసులు కరఁగించు కొంటిరా ॥ చెప్ప ॥
సన్నలు చేసుకొనేవు సతియును నీవును
యిన్నేసి రతులు మీలో నెంచుకొంటిరా
నన్నుఁ గూడితివి నేఁడు ననిచి శ్రీవేంకటేశ
వున్నతితో మీరిద్దరు నొడఁబడు కొంటిరా ॥ చెప్ప ॥ 433

## శుద్ధవసంతం

వెలవకు నేఁ గూడి వెస నందుకూ నంపేను
తటి నాకు మొగమోడింతలో వెరగందేవు ॥ పల్లవి ॥
యెవ్వతెకో ఆడ వీడె మిచ్చి వచ్చి నన్నుఁ గని
అవ్వలఁ బోరాక వుపాయాలు చూచేవు
నవ్వుచు నీ కొంగువట్టి నాయింటికిఁ దీసితేను
వువ్విళ్యూర దిగులుతో నున్నార నేవు ॥ వెలవ ॥

విందాపెకుఁ జెప్పి వచ్చి వెస నీడ నన్నుఁ గని
అంది కొంపోరాక వుపాయాలు చూచేవు
సందడి నే మాటలాడి జరపులఁ బెట్టితేను
పొందుగఁ జల్లారి నంటా పొద్దులు చూచేవు ॥ వెలువ ॥
వొంటి నాకెఁ బెట్టి వచ్చి వొద్దికతో నన్నుఁ గని
అంటి పాయరాక వుపాయాలు చూచేవు
జంటయి శ్రీవేంకటేశ సమరతిఁ జొక్కించితే
పెంటగా నిందుంటి నంటా బిమ్మిటి గొనేవు ॥ వెలువ ॥ 434

## కాంబోది

కాకున్న నింత లోఁగేవా గడుసరివి
కేకలు వెట్టి నవ్వితేఁ గిందువడే విపుడు ॥ పల్లవి ॥
పక్కన మాటాడితే నీపైకి తీసుకొనేవు
చక్క దిష్టించి చూచితే జడిసేవు
మొక్కితేనే వెంగెమంటా మొగము వంచుకొనేవు
నిక్కి యెంద్రైనా* నీవు నేరమి చేసితివో ॥ కాకు ॥
పేరుకొని పిలిచితేఁ బ్రియములు చెప్పేవు
చేరి చేత నివిరితే సిగ్గువడేవు
ఆరసి కొంగు వట్టితే నానలు వెట్టుకొనేవు
దారి దప్పి యెంద్రైనా నిందలకు లోనైతివో ॥ కాకు ॥
మెచ్చి కాఁగిలించుకొంటే మేనెల్లాఁ జెమరించేవు
వచ్చి రతులఁ గూడితే భ్రమసేవు
అచ్చపు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
విచ్చనవిడి నెంద్రైనా వెల్లవిరులైతివో ॥ కాకు ॥ 435

---

* రేకుల వ్రాతసంప్రదాయము ప్రకారము ఇందు 'ఎంద్రైనా' అని యుండఁదగును. ఉన్నట్లు చదివినచో 'ఏఁద్రైన' అగును.

## మధ్యమావతి

ఎక్కడికిఁ బోనందువు యెవ్వతె నంటనందువు
గుక్కక తారుకాణించుకొందు గాని రావయ్యా ॥ పల్లవి ॥
మదిమదినుండి నీతో మాటలాడిన ఫలము
కదిసి యింతటిలోనే కంటిమయ్యా
అదివో ఆపెఁ దిట్టితినంటాఁ జెప్పితివట
కొదలేకుండాఁ దెలుపుకొందువు రావయ్యా ॥ ఎక్క ॥
చక్కజాడ నీతోడ సరసమాడిన ఫల-
మిక్కడనే నాకు ఫలియించె నయ్యా
మొక్కలపాపెవ(న?)ని నీముందల వట్టితినని
అక్కడ నంటిపట నీవాడుకొందు రావయ్యా ॥ ఎక్క ॥
పొంచి నీకాఁగిటఁ గూడి పొందుసేసిన ఫలము
వంచన లేక సరివచ్చె నయ్యా
యెంచి శ్రీవేంకటేశ నీకిడిన తమ్ములమూకె-
కుంచుమంటి నన్నది రూపించవలె రావయ్యా ॥ ఎక్క ॥ 436

584-వ రేకు దేశాక్షి

ఐనపని కిఁకనేల అంతగొరబు చేసేవు
దీన నేమివచ్చె నీకు తెలుసుకోరాదా ॥ పల్లవి ॥
యిచ్చకమాడఁగఁ బతి నేల గద్దించి వేసేవు
అచ్చపు నీలోనికోప మాఁపఁగ రాదా
పచ్చిదేరిన పనులు బయలు సేయఁగనేల
వచ్చేఁగా యింటికతఁడు వడిఁ గూడరాదా ॥ ఐన ॥
యిప్పుడిట్టే నవ్వేవాని నేల వొట్టుబువెట్టేవు
తప్పు లెంచకిట్టే దయఁ దలఁచరాదా
చెప్పేను తనచేఁతలు చిడుముడి పడనేల
కప్పేఁగా పచ్చడమిఁకఁ గానిమ్మనరాదా ॥ ఐన ॥

చెక్కునొక్కి కూడేచోట సిగ్గులేల పెంచేవు
వొక్కమైతివి చన్నుల నొరయరాదా
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను నేలె మఱఁగేల
తొక్కఁగా పాదమిట్టే సంతోసించఁగరాదా ॥జన॥ 137

## శ్రీరాగం

పడఁతి నీపతిఁ దెచ్చే భ్రమయకువే
యెడయని నీతమక మేమని చెప్పేదే ॥పల్లవి॥
వెన్నెలబయటనుండి వేసవియండ లనేవు
అన్నిటాఁ జంద్రుని రవి యని యాడేవు
పన్నిన చిలుకలను పక్కెర గుఱ్ఱాలనేవు
యెన్నరాదు నీవిరహ మేమి చెప్పేదే ॥పడఁతి॥
తుమ్మెదలఁ గనుఁగొని దొడ్డయేనుగ లనేవు
కమ్మిన చిగురుతే కత్తులనేవు
కమ్మరఁ గోయిలలను కాముని దూతలనేవు
యెమ్మెల నీవేఁపులు యేమి చెప్పేదే ॥పడఁతి॥
వేడుకతోఁ జల్లగాలి వింతమాసటిఁ డనేవు
వాడెపుఁ గప్రము చలి వేఁడి యనేవు
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బున నిన్నింతలోనే
యీడనే నీభాగ్యమిఁక నేమి చెప్పేదే ॥పడఁతి॥ 138

## భైరవి

ఇందుకే పో విచారాన నిండి వున్నది
చందమైన జవరాలు జంకెన కోరుచును ॥పల్లవి॥
గుత్తపు మనసులోని గుట్టు విడువఁగలేక
చిత్తము లోపలి మాఁట చెప్పక పోదు
పొత్తునఁ బెట్టుకొంటివి పొలతుల నందరిని
యెత్తైన పట్టపుదేవి యెంగిలి కోరుచును ॥ఇందు॥

ముంచిన చుట్టరికెపు మొగమోటెంతైనాఁ గద్దు
    యెంచవలె నీ మేకులు యీపొద్దు
మంచ మెక్కించుకొంటివి మగువల నిందరిని
    అంచితపు టిల్లాలు అటడి కోరుచునా ॥ ఇందు ॥

వాడికె కూటపురతి వలపులు గడువేఁడి
    తోడఁ గూడిన చన్నుల తునలు వాఁడి
వీడేలందుకొంటివి శ్రీవేంకటేశ యిందరిచే-
    నీడైన మోహపుటింతి యింతేసి కోరుచునా ॥ ఇందు ॥ 439

శుద్ధదేశి

ఏమి జాణతనమే యెవ్వరు మెత్తురు యిది
    చేనుట్టి పెనఁగఁగాను జీరలు దీసేవు ॥ పల్లవి ॥

వేడుక నవ్వులు నీచే వెలవెట్టి కొనరాఁగా
    జాడెరుఁగక పతిని జంకించేవు
వీడెము చేతికియ్యఁగా విట్టువీఁగుతా నీవు
    ఆడనుండి చెలికత్తె నందుకొమ్మనేవు ॥ ఏమి ॥

వెల్లవిరిమాటలు వెదవెట్టుకొని రాఁగా
    కల్లలంటా రమణునిఁ గాకు సేసేవు
మల్లెపువ్వులియ్య రాఁగా మందెమేళమున నీవు
    పల్లదాన పానుపుపైఁ బరుచుమనేవు ॥ ఏమి ॥

మోదముతోఁ బంతములు మునుపే యియ్య రాఁగా
    కాదంటా శ్రీవేంకటేశుఁ గాఁగిలించేవు
పోదిఁ బచ్చడము గప్పి పొదుగఁగ సిగ్గుతోడ
    తోదోపుఁ జెమటలు దుడువుమనేవు ॥ ఏమి ॥ 440

## దేసాళం

చూతువు రావయ్యా సుదతి నిట్టే
కాతరము లన్నియును గంపఁబెట్టి నదివో ॥ పల్లవి ॥

చెమ్మఁజెమటల చేతఁ జిప్పిలి నీపై వలపు-
లుమ్మగిలఁ బెట్టుకున్న దువిద
కుమ్మరింపుఁ బులకలఁ గోరికె లీరికెలెత్తి
దిమ్మరేఁచి తమకము తెట్టెవెట్టి నదివో ॥ చూతు ॥

వాడికె వూర్పులచేత వడి నీపె (పై ?) కాఁకాళను
కూడ పోసీ నదివో కోమలి
జాడుఁ జూపుల తోడుత జవ్వన మదముల్లెల్ల
మేడెముగాఁ బన్ని పన్ని మేడగట్టి నదివో ॥ చూతు ॥

సెలవి నవ్వులతోడ సిగ్గుల రతుల నీకు
కలయఁబెట్టి నదె కలికి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి యింతి నిట్టే
తొలగని సంతోసాలు దొడ్డిఁబెట్టి నదివో ॥ చూతు ॥ 441

## దేశాక్షి

కంటిమిగా యివి గొన్ని కారణాలు నీవల్ల
వింటిమి నిన్నా మొన్నా వేడుకాయ నేఁడు ॥ పల్లవి ॥

పల్లెవాటుఁ బయ్యదతో వచ్చి యాపె నిలుచుండి
పల్లదపు మాటలాడీఁ బచ్చిగా నిన్ను
కల్లలంటా నుంటిమి నీకతలు యిన్నాళ్ళదాఁకా
వెల్లవిరులుగాఁ జూచి వెరగాయ నేఁడు ॥ కంటి ॥

వుద్దాలు మెట్టుక వచ్చి వురుపుఁ జూపులఁ జూచి
వుద్దండపుఁజేఁత సేసి వొరసీ నిన్ను
సుద్దులే యంటా నుంటిమి చొక్కపు నీ మహిమలు
అద్దుక నీగుట్టెలిఁగి అరుదాయ నేఁడు ॥ కంటి ॥

పుక్కిటి వీడెముతోడ పొందుల నీతోడ యెక్కి
మిక్కిలి కాఁగిటఁ గూడి మేలుతో నిన్ను
తక్కులంటా నుంటిమి యిందాఁకా శ్రీవేంకటేశ
యిక్కువ నన్నేలితివి యిరవాయ నేఁడు ॥ కంటి ॥ 442

585-వ రేకు సామంతం

కంటిమి నేమీ భాగ్యము కన్నుల తుదలను వేఁడిదె
బంటులు నీకివిద్యలు సాజమె కదవయ్యా ॥ పల్లవి ॥

విందుల మోవుల యీవులు వీఁపున నానిన కుచములు
పొందుల కొనగోరొత్తులు పొలఁతికి నీకమరె
చిందెటి సెలవుల నవ్వులు సిగ్గుల మోముల వంపులు
కందువ నుండెడి యీ చెలికత్తియలకు నమరె ॥ కంటి ॥

తొడఁదొడ మోసిన మేలము దోమటి వీడెపు టుదుటులు
జడిగొని చూపుల ననుపులు సతికిని నీకమరె
యెడనెడఁ బయ్యెద మరఁగులు యెరఁగమి సేయు వరాకులు
అడియాలపు మీకొలువుల అంగనలకు నమరె ॥ కంటి ॥

ఆయములంటిన మరపులు నడఁచియు నడఁచని యూర్పులు
యీయెడ శ్రీవేంకటేశ్వర యిద్దరికిదె యమరె
చాయల సన్నల పదరులు సరిఁ దెరవాల్చిన నేర్పులు
పాయని నీయుడిగంబుల పడఁతుకలకు నమరె ॥ కంటి ॥ 443

భైరవి

నీచిత్తము వచ్చినట్టు నే మెలఁగేదానఁ గాక
నాచలమే ... చితేను నగవా నీవు ॥ పల్లవి ॥

వేసారక నే నీతో వేమారు విన్నవించఁగ
ఆసోదపుఁగత్తె యని ఆడవా నీవు
వాసుల కిందరివలె వంతులకుఁ బెనఁగితే
యీసరి వారిలో నన్ను నెంచవా నీవు ॥ నీచిత్త ॥

కొత్తలుగా నే నిన్నుఁ గోరి కొంగువట్టితేను
చిత్తిణిది యని కాకుసేయవా నీవు
వొత్తి చెలులచే నిన్ను నొడఁబరపించితేను
తత్తరపు గుణమని తలఁచవా నీవు ॥ నీచిత్త ॥

తెరవేసి నీమోవితీపులు నేనడిగితే
బెరసి నా మేలు రట్టుపెట్టవా నీవు
నిరతి శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
సరి దూఁగకుండితేను సాదించవా నీవు ॥ నీచిత్త ॥ 444

లలిత

అంపఁగానే వచ్చితిమి ఆపె నీవద్దికి మమ్ము
సంపదతో మరవక చనవులీవయ్యా ॥ పల్లవి ॥

వొలిసీనొల్లని వలపొడిఁబెట్టి వేసరించ
చలమా మాకేమి సారెసారెకు
చెలిపై నీవే వచ్చి సేసచల్లి వచ్చితట
తలఁచుక నీవే ఆకె దండకు రావయ్యా ॥ అంప ॥

సంతవేడుకలు నీకు చవి చూచి(పి?)పిలువఁగ
పంతమా మాకేమి పైపై నిట్టే
కాంతకు నీవపుడే వుంగరము వెట్టితివట
మంతనానఁ దెలుసుక మన్నించవయ్యా ॥ అంప ॥

దొమ్మికూటముల నిన్ను దొరలించి అలయించ
యెమ్మెలా మాకేమి యింతటిలోనే
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁత నేలితివట
సమ్మతాయ నిటులానే సతముగావయ్యా ॥ అంప ॥ 445

## శంకరాభరణం

కంటిమి నీజాడలెల్లా గట్టిగా నేఁడు
జంటయై నీవలపులు చల్లుదువు గాక ॥ పల్లవి ॥

చెలఁగి యాపె పలుకు చెవి సోఁకెను
మెలఁగి మరి పాదము మేను సోఁకెను
చెలువుఁడ చెప్పినట్టు సేసేవా మాకు
సొలసి నీయెమ్మెలెల్లాఁ జూపుదువు గాక ॥ కంటి ॥

సతిమోవి తేనెపెర సరి వచ్చెను
రతులనే యాపెఁగూడ తతి వచ్చెను
యితవయ్యీనా మాతో యేలాటాలు
అతిరాజసపు దొరవవుదువు గాక ॥ కంటి ॥

చేకొన్న యాపెకానికె చేయి నిండెను
లాకలఁ బుక్కిలి తములము నిండెను
కై కొనేలితివి శ్రీవేంకటేశ నన్ను
వాకముగా నాకు నిట్టె వలతువు గాక ॥ కంటి ॥ 446

## పాడి

మాకేల గరిసించ మాటికి మాటికి నిన్ను
జోకతో మీ సరితలు చూచేదే చాలును ॥ పల్లవి ॥

యిందరిలోన ఆపె యేతువలెత్తి యాడఁగా
అందుకు లోఁగేవు నీవంతలోననే
గొందినే నీవాపె మరఁగునఁ జేసిన పనులు
యెందుకు నెక్కనివిఁక నెన్నెన్ని గలవో ॥ మాకే ॥

కానిమాఁటలాడి యాపె కన్నుల జంకించఁగాను
మోనాన నున్నాడవిదె మునిపలెనే
యే నెపమున నాపెకిచ్చిన మాటపట్లు
ఆనుకొని చెప్పరానివవి యెటువంటివో ॥ మాకే ॥

కగ్గి కాఁగిటిలో నాపె కాంతలఁ దలఁపించఁగా
సిగ్గులు వడేవు నీవు శిరసు వంచి
అగ్గమై శ్రీవేంకటేశ ఆపె నీవు గూడితివి
సిగ్గుల మాపై మెచ్చులు నీకెంత ప్రియమో ॥ మాకే ॥ 447

లలిత

వెనకఁ జేతువుగాని వినోదాలన్నియును
తనివోక నీ మొగము తప్పక చూచీని ॥ పల్లవి ॥
ఇందమని బాగాలు నీకిచ్చీ దోసిట నాపె
బెందడి రెండు చన్నులుఁ బిక్కటిల్లఁగా
కందువ నీకబ్బైనంటాఁ గడుఁ బిసికే వంతలో
అందుకోవయ్యా వీడె మట్టే పట్టుకున్నది ॥ వెన ॥
సారెకు మన్నించుమని సాగిలి మొక్కీ నీకు
గారవపుఁ బిరుదులు గదలఁగాను
గోరనంటి సిగ్గులకు గొబ్బునఁ జాఁచేవు చేయి
ఆరితి నీవెత్తవయ్యా అట్టే పండి వున్నది ॥ వెన ॥
ఆలనైతి నని నిన్ను నట్టే కాఁగిలించుకొనీ
జాలువారే చెమటలు జారఁగాను
బేలవై శ్రీవేంకటేశ పెదవి తేనెలానేవు
వోలివెట్టవయ్యా అట్టే వురమెక్కుకున్నది ॥ వెన ॥ 448

586-వ రేకు భైరవి

ఎప్పుడు దయఁ జూచేవో యేమని విన్నవింతుము
దప్పిదేరే మోవితోడఁ దలపోయుచున్నది ॥ పల్లవి ॥
వీడెమిచ్చే నంటా వచ్చి వెలఁది పానుపుమీఁద
పాడుకొంటా నున్నది నీపదములెల్లా
గోడపై నీరూపము కోరి చిత్తరువుగాను
వేడుకతో వ్రాసుకొంటా వేగించుక వున్నది ॥ ఎప్పుడు ॥

యేచి నీపొందులు సేయ నిటు వచ్చి పెట్టెలలోఁ
జూచుకొంటా నున్నది నీసొమ్ములెల్లాను
ఆచాయ కెడతాఁకే నీయవసరపుఁ గాంతల
లాచుక నీసుద్దులే యాలకింపుచు నున్నది ॥ ఎప్పుడు ॥

సేవ సేసే నంటా వచ్చి చిత్తములో చెక్కుచేత
భావించుకొంటా నున్నది పనులెల్లాను
శ్రీవేంకటేశ నీవే విచ్చేసి యలమేల్మంగను
తావుకొనఁ గూడితివి తతి నలకున్నది ॥ ఎప్పుడు ॥ 449

శ్రీరాగం

ఇంతి నీ జవ్వనవన మీ మాధవుఁడు
వంతమునఁ జొచ్చి యిట్టే పాయక వున్నాఁడు ॥ పల్లవి ॥

బెట్టి యెలుఁగునఁ బతిఁ బిలువఁగాఁ గోవిలలు
చుట్టి కూయఁ దొడఁగెను చుట్టాలంటా
వొట్టికతలు చెప్పఁగా నొద్దికై చిలుకలెల్లా
మట్టి తమవారంటా మాటలాడఁ దొడఁగె ॥ ఇంతి ॥

పడఁతి నీకుచములు పాలార్చి చక్కఁబెట్టఁగా
తడఁబడీ జక్కవలు తమజాతంటా
నడపులు చూచి యట్టే నానా హంసములు
జడిఁ దిరిగీఁ దమ పాలివారలనుచు ॥ ఇంతి ॥

చెలి నీనెరిఁగురులు చిక్కుదియ్యఁగాఁ గని
అళులు తమ మూఁకని అండ చేరీని
యెలమి శ్రీవేంకటేశుఁడీతఁడే నిన్నుఁగూడితే
పులికి చూడఁగాను చకోరాలు వాలిని ॥ ఇంతి ॥ 450

## పాడి

చెలులు వద్దనఁగానే జీరలు దీసేవు మేన
కలకాలమును నెంత కాతరీఁడవయ్యా ॥ పల్లవి ॥
సగము మాటాడఁగానే సతిచెక్కు నొక్కితివి
మొగిచి చేతులెత్తి మొక్కె నీకాపె
అగపడె నంటానే ఆఁటదానిఁ బైకొంటివి
వెగటున నీకెంత వేగిరమయ్యా ॥ చెలులు ॥
కొంతగొంత చూడఁగానే కురులు వట్టి తీసితి-
వంతలో వేఁడుకొనీ నిన్నదివో యాపె
మంతనమాయ నంటానే మగువ నలయించితి -
వింతలోఁ దమకము నీకేల వచ్చెనయ్యా ॥ చెలులు ॥
సమ్మతించి రాఁగానే చన్నులు పిసికితివి
పమ్మి పవ్వళించెఁ దొడపైని యాపె
మమ్ముఁ జూచి కన్నెయంటా మన్నించి (శ్రీ) వేంకటేశ
నెమ్మదిఁ బదరితివి నిండువలపయ్యా ॥ చెలులు ॥ 451

## నారాయణి

ఒద్దికై నీనగరిలో నున్నదే చాలు
అద్దుకొని పట్టితేను ఆసకత్తె నందువు ॥ పల్లవి ॥
పలుమారు నిన్ను నేనుఁ బైకొని చెనకఁగాను
మలసీ నిదెంత చలమరి యందువు
వలచి యేపొద్దు నీవద్దఁ గాచుక వుండేను
బలిమి నవ్వటి మరి బట్టగుత్తా(?)నందువు ॥ ఒద్ది ॥
మగిడి మగిడి నీతో మాటలెల్లా నాడఁగాను
మొగసక్కెము సేసీ నిదేఁటిదందువు
మిగులా నీకూడిగాలు మేను ముట్టి సేసితేను
వెగటుగా నిదియెంత వేసరించీనందువు ॥ ఒద్ది ॥

గక్కనను నే వచ్చి కాఁగిలించుకొంటేను
కక్కసించీ నిది యెంత కల్లరందువు
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నీవే కూడితివి
మొక్కితి నన్నిటా నన్నుఁ జొక్కించెనందువు ॥ ఒద్ది ॥ 452

## శుద్ధవసంతం

మఱియేమి చెప్పేమయ్యా మాటలింకాను
మెఱసి నీవే రాపయ్యా మెలుఁతకడకును ॥ పల్లవి ॥

అక్కడికి సుద్దులు చెప్పంపిన చెలుల నాపై
నెకొ్కన్న తిట్లు దిట్టె నీమారంటా
పక్కన నీకమ్మ దనపాదపుఁ బెనువేలనుఁ
జిక్కించి యందుకొనె నీచేతిదంటాను ॥ మఱి ॥

నీవంపిన బాగాలు నెటిఁ దెల్లనాకులు
భావించి కాళాంజి లోపలఁ బెట్టించె
దేవులకు నీరాక తెలిపి చెప్పఁగఁ బోతే
కావిరిఁ దలుపు మూసి గడె వెట్టుమనెను ॥ మఱి ॥

బలిమి నీవు దెమ్మన్న పచ్చడము గొంటా రాఁగా
వెలిఁ దములములోన వేసి తొక్కించె
యెలమి శ్రీవేంకటేశ యింతలో నీవే విచ్చేసి
కలికిఁ గూడఁగానే కడు సంతోసించెను ॥ మఱి ॥ 453

## సాళంగ నాట

ఏమి గడించుకొనేవు యింతలో నొకటొకటె
చేముట్టకంటినా ఆలసేవంటిఁ గాక
యీడ నిన్ను దొబ్బితినా యింటికి రమ్మంటిఁ గాక
ఆడుకొంటినా మంచివాఁడంటిఁ గాక
పాడనోప నంటినా పని గలదంటిఁ గాఁక
పీడె మీకుంటినా నీకు వెగటంటిఁ గాక ॥ ఏమి ॥

గందము పూయనంటినా కప్రమిచ్చే నంటిఁ గాక
పందేనకాఁగిలినా చేయి వట్టితిఁ గాక
అందుకోనైతినా పూవు లందరున్నారంటిఁ గాక
నింద వేసితినా నిన్ను నేర్పరివంటిఁ గాక ॥ ఏమి ॥

కగ్గి సాము సేసితినా కాఁగిలించుకొంటిఁ గాక
సిగ్గువడితినా బ్రమసితిఁ గాక
వొగ్గి శ్రీవేంకటేశుఁడ వొగి నీవే కూడితివి
వెగ్గళించితినా పొంది వెలసితిఁ గాక ॥ ఏమి ॥ 454

587-వ రేకు రామక్రియ

అంగనకు మారుగమ్మ లంపవయ్యా
యింగితములోనే కంటి మేమందుమయ్యా ॥ పల్లవి ॥

యెంతపిలిచినా రావు యెగసక్కెలాడేవు
చెంతల మాచెలికిట్టే చెప్పదుమా
ఇంతలో నేము మొక్కితే నిటు సరసాలాడేవు
యెంత కెత్తుకొంటివి నిన్నేమందుమయ్యా ॥ అంగన ॥

కానుకయు నందుకోవు కైదండ విడువవు
కానీ కానీ యాపె యెఱఁగక మానీనా
లోనికి రాఁజూచి పైగల్లునఁ బాదము చాఁచేవు
యీనెపము గాచుకుంటి వేమందుమయ్యా ॥ అంగన ॥

ఆసలనుఁ బెట్టేవు అతివను రమ్మనేవు
వేసరి యాకె యీడకు విచ్చేసెనయ్యా
సేసవెట్టి కూడితి శ్రీవేంకటేశ నీవు
యీ సుద్దులకిఁక మరి యేమందుమయ్యా ॥ అంగన ॥ 455

### బౌళి

ఎంత కెంత మీరేల యిచ్చకములాడేరే
    దొంతిఁ బెట్టేరు వలపు దోసము గాదా ॥ పల్లవి ॥

ఇంగితాన నిష్ఠూరా లెన్నఁడూ నాడఁడాతఁడు
    అంగనలాల నామాట లటువంటివా
    సంగడి మమ్మిద్దరిని సరిసేసేరేలే మీరు
    పంగించ కాతనికి నేఁ బంత మిచ్చేనే ॥ ఎంత ॥

కొప్పువట్టి తీసినాను కోపగించఁడాతఁడు
    యెప్పుడు మాగుణములు యిటువంటివా
    కప్పి మమ్మిద్దరి నేల కాఁగిలించఁ బెట్టేరే
    చిప్పిల దిగువనుండి చేత మొక్కేనే ॥ ఎంత ॥

యెంతేసి కొసరినాను యేమి వేసారఁడాతఁడు
    వంతుల మావోరు పటువంటిదయ్యీనా
    యింతలో శ్రీవేంకటేశుఁ డెనసె నన్నిపు డిట్టే
    చెంతనుండి మెచ్చి మెచ్చి సేస వెట్టేనే ॥ ఎంత ॥ 456

### ఆహిరి

అప్పుడుగాని తేరవు అంగన కోపములెల్లా
    కప్పురము చల్లవయ్యా కాఁకలు చల్లారను
తివిరి నీవేమంటివో దేవరకే తెలుసును
    పవళించి వున్నదదే పడఁతి లోన
    వివరించి నీరాక విన్నవించ వెరతుము
    కవగూడ నీవే యాపెకడకుఁ బోవయ్యా ॥ అప్పు ॥

వొగ్గి యేమి సేసితివో వూరకే తొడిఁబడ
    సిగ్గువడి వున్నదదే చెలి వొంటిని
    నిగ్గులను బూనుకొని నీకుఁగా రారాదు మాకు
    దిగ్గన నియ్యాపె సందితెర దియ్యవయ్యా ॥ అప్పు ॥

ఆడకే యేమని చెప్పి యంపితివో యింతలోన
పాడుకొంటా నున్నదింతి పానుపుమీఁద
కూడితి శ్రీవేంకటాద్రి గోవిందరాజ నీవు
వోడక కాఁగిట నిట్టే వూరడించవయ్యా ॥ అప్పు ॥ 457

## సాళంగనాట

కా దనకు నామాట కడపరాయ-నీకు
గాదెఁబోసే వలపులు కడపరాయ ॥ పల్లవి ॥

కప్పుర మియ్యఁగరాదా కడపరాయా-నీకుఁ
గప్పితి నాపయ్యెదెల్లఁ గడపరాయ
కప్పుమివే కుచములు కడపరాయా-వో
కప్పుమొయిలు మేనిచాయ కడపరాయ ॥ కాద ॥

కందువకు రారాదా కడపరాయా-ముందే
గందమిచ్చినవాఁడవు కడపరాయ
కందము నీమాటలికఁ గడపరాయా-వో
కందర్పగురుఁడ మొక్కేఁ గడపరాయ ॥ కాద ॥

కలసితివిటు నన్నుఁ గడపరాయా-నా
కల నేఁడు నిజమాయఁ గడపరాయ
కలదా ననే నీకుఁ గడపరాయా-వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయా ॥ కాద ॥ 458

## కొండమలహరి

నేనెరఁగనా తన నేరుపులెల్ల
పూని పట్టి యింతయేల బొంకు బొంకీనే ॥ పల్లవి ॥

కతలెన్ని చెప్పినాను కాఁగిలించినట్టు గాదు
మతకములేల తాను మరి సేసీనే
యితవు లెంత సేసినా యెనసినయట్టు గా
రతులఁ బెనఁగ కేల రవ్వ సేసీనే ॥ నేనె ॥

నగవెంత నగినాను నన్నుఁ గూడినట్టు గాదు
యెగసక్కెలెల్ల నాతో నెంత సేసినే
మొగమెంత చూచినాను మోహించినట్టు గాదు
అగపడి పొందకేల ఆసవెట్టీనే ॥ నేనె ॥

మొనగోరెంత సోఁకినా మోవి యిచ్చినట్టు గాదు
పెనఁగి నామేనేల బెండువెట్టీనే
చనవిచ్చి శ్రీవేంకటేశ్వరుఁడు నన్నిపుడేలె
మనసిచ్చి యెంతకెంత మన్నించినే ॥ నేనె ॥ 459

## మంగళకౌశిక

ఔనయ్యా వూరకుండే నట్టే కాదా
మానినులఁ జెనకేవు మదమా నీది ॥ పల్లవి ॥

యెవ్వరి తెరువుఁ బోక యింటిలోన నుండేవారి
పువ్వుల వేసే వదేమి పొద్దు వోదా
నివ్వటిల్లు సిగ్గుతోడ నిలుచుండేవారిని
రవ్వగాఁ జన్నులంటేవు రాజసమా నీకు ॥ ఔన ॥

గారవానఁ జక్కజాడఁ గాఁపురము సేసే వారి
వూరకే గోర నొత్తేవు వుండఁబట్టదా
సారెకుఁ బానుపుమీఁదఁ జదువుకొనే వారి
నీరీతిఁ బాదానఁ జిమ్మే వెమ్మెలా నీకు ॥ ఔన ॥

వొచ్చము లేక నీకు నూడిగము సేసే వారి
మచ్చిక నలయించేవు మన్నించరాదా
యిచ్చట శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి
పెచ్చువెరిగే వింతేసి ప్రియమా నీకు ॥ ఔన ॥ 460

588-వ రేకు నాగవరాళి

ఇసుక పాఁతరఁలు యిద్దరి మీ జవ్వనాలు
కొసరకు మనసులో గురి దాఁకీని ॥ పల్లవి ॥

వలపు రేఁచకుమీ వద్దు వద్దు అంతేసి
మెలఁగి కలి ముదిరి మెడిదయ్యీని
చలము సాదించి నీవు జవరాలిని రతికి
పిలువకు నీమోవి పిప్పిగట్టీని ॥ ఇసుక ॥

జఱసి చన్నులంటకు చాలుఁ జాలు మీఁద మీఁద
మఱి వుప్పు చింది యినుమడయ్యీని
కఱకరింపుచు నింతి కందువకు రమ్మని
చెఱఁగువట్టి తియ్యకు చెమరించీని ॥ ఇసుక ॥

అట్టుగా నవ్వకుమీ ఆఱడి నిట్టే కూడితివి
యిట్టే గోర గీరితే నేరయ్యీని
నెట్టనఁ బంతమాడకు నీవు శ్రీవేంకటేశుఁడ
చుట్టపు సరసములు సూడువట్టీని ॥ ఇసుక ॥ 461

ముఖారి

నీకేల పొద్దు వోదు నేమెంత బాఁతి పడ్డాను
దాకొని యపుడు నీచిత్తానఁ బట్టీనా ॥ పల్లవి ॥

పొరుగు పోరచి యాపె పొందులు నీకుఁ జేయఁగా
సరసము నేనాడితే సంగతయ్యీనా
తరవాతి పనులాపె తలపెట్టుకుండఁగాను
బెరసి మా పిలుపులు ప్రియమయ్యీనా ॥ నీకే ॥

మేడమీఁద నుండి యాకె మేకులు నీకుఁ జేయఁగా
వీడెము నేనిచ్చితేను వేడుకయ్యీనా
కూడేనంటా నిన్ను నిట్టె కోరి వేఁడి వుండఁగాను
యీడ నుండుమంటే నీకు నితవయ్యీనా ॥ నీకేల ॥

తానే వచ్చి యాకె నీదగ్గరఁ గూచుండఁగాను
ఆనుకొని నే నవ్వితే నందమయ్యీనా
మానక శ్రీవేంకటేశ మమ్మిందరిఁ గూడితివి
యీ నిజము లిట్టేకాక ఇఁక వేరయ్యీనా ॥ నీకేల ॥ 462

## లలిత

మాకేమి పని నీ మర్మాలెత్తను
కాకు సేయఁ బనిగద్దా కమ్మటి నీసుద్దులు ॥ పల్లవి ॥

వొప్పుగొని మోనముతో నూరకే వుండుటే మేలు
చెప్పనేల నిగుణాలు చెలులతోడ
చొప్పువట్టి కన్నులనుఁ జూచుకొంటా నుంటే మేలు
కప్పనేల నీమేని కందువ గురుతులు ॥ మాకేమి ॥

పవ్వళించి పానుపుపై పంతాన నుండుటే మేలు
నవ్వనేల నీచేఁతకు నలుగురిలో
పువ్విళ్ళూర లోలోనే వూఁకొంటానుంటే మేలు
రవ్వ సేయనేల నీరతిలో వినయము(?) ॥ మాకేమి ॥

గద్దించి కాఁగిట నిన్నుఁ గలసినదే మేలు
తిద్దనేల నీనేరాలు దెచ్చి సభలో
వొద్దికై శ్రీవేంకటేశ వొడఁబాట్లవే మేలు
వద్దనఁగనేల నీవుద్దండపు సేఁతలు ॥ మాకేమి ॥ 463

## కాంబోది

ఏమాయ నీకును యింత మాకు లోఁగితేను
కామించినవారు గాని కతసేయ నేరరు ॥ పల్లవి ॥

మెచ్చినవారు గాని వదిఁ గొసర నేరరు
పలికేటివారు గాని పంతమియ్యరు
కలసేటివారు గాని కాఁతాళించ నేరరు
యెంమి మామాటలేల యెగ్గుపట్టేవయ్యా ॥ ఏమా ॥

చుట్టాలైనవారు గాని పొలయఁగ నేరరు
వొట్టు వెట్టేవారు గాని వొడ్డుకొనరు
తిట్టినట్టివారు గాని దీవించ నేరరు
నెట్టన మానవ్వు లేల రట్టుసేసేవయ్యా ॥ఏమా॥

పాయకుండేవారు గాని బలిమి సేయనేరరు
రాయడించేవారు గాని రతిఁ జొక్కరు
యీయెడ శ్రీవేంకటేశ యిటు నే నిన్నుఁ గూడితి
యేయెడ మాప్రియమేల యింత సేసేవయ్యా ॥ఏమా॥ 464

## ఆహిరి

తప్పులేల వేసేనే తనుఁ గూడనైతి నంటా
యిప్పుడేమాయనే తాను యిరవై తేఁ జాలు ॥పల్లవి॥

దవ్వుల జాణతనాలు తా నాడె నింతే కాక
వువ్విళ్ళూర నట్టే వచ్చి వొడివట్టెనా
నవ్వులకందరిలోన నన్నుఁ గలపెఁ గాక
నివ్వటిల్లు రతులకు నెట్టుకొనెనా ॥తప్పు॥

అలవోకగా నన్ను నాయములంటేఁ గాక
చలపట్టి కాఁగిలించవలె ననెనా
కలపుకోలు చుట్టరికము లటు చూపీఁ గాక
చలువగా నామోవి చవిచూపు మనెనా ॥తప్పు॥

పానుపుపైఁ బండి తనపాదాలు గుద్దించెఁ గాక
తానే నాపై మోహించి తమకించెనా
యీనెపాన శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁ గూడె
ఆనుక ఇందాఁకా నింత అంకెలఁ జొక్కించెనా ॥తప్పు॥ 465

ధన్నాశి

మమ్మేల వుప్పతించేవు మంచముపైకి రావయ్యా
యిమ్ముల మాతరితీపు లెలయించీనా ॥ పల్లవి ॥

చిగురుఁబెదవిమీఁదఁ జిమ్మిరేఁగే మామాటలు
యెగసక్కేలై నీకవి యేమి సేసీని
మొగమోటగల మా మోములోని చూపులు
వగవగలను నీకు వాండ్లయ్యీనా ॥ మమ్మేల ॥

అరచందురునిఁ బోలినట్టి మానొసలి బొమ్మ-
లెరవై నిన్ను జంకించి యేమి సేసీని
సరిఁదీగెవంటి మేన జనియించిన చన్నులు
పొరసి పెనఁగితే నీవొళ్ళు నొచ్చీనా ॥ మమ్మేల ॥

మించి తామెరచేతుల మొలచిన కొనగోరు
యెంచుకంత నిన్నుసోఁకి యేమి సేసీని
అంచల శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
వంచన మామొక్కు నిన్ను వంచుకొనీనా ॥ మమ్మేల ॥ 466

589-వ రేకు రామక్రియ

పదిటిలోపల నేము పదసకుం(దునొకం?)డు
యెదుట నుండఁగాఁ గాక యెంతలేదు నీకు ॥ పల్లవి ॥

దొంగిలి వెన్నలుఁ బాలు దొడికినటులనే
కొంగిలిసేసితివి నేఁడిదె మామోవి
సంగెంచి పదారువేల చలిమిఁ బట్టినట్టే
చెంగట నన్నూ నీవు చేయి వట్టితివి ॥ పదిటి ॥

గోవులఁ గాచి పాలకుండలు మోఁచినట్లనే
[illegible] కాసి మాచన్నులు మోఁచితివి
[illegible]లు [illegible]దవిఁ దెచ్చుకొనినట్లనే
[illegible] కొంటివి [illegible] మమ్మిం[illegible] ॥ పదిటి ॥

కొలనిలో వారిఁ జేరి కోకలంటినట్లనే
అలరి మా పోఁకముడి అంటితివి
యెలమి శ్రీవేంకటేశ యిందరిఁ బెండ్లాడినట్టే
కలసి నన్నుఁ బెండ్లాడి కడు మన్నించితివి ॥ పదిటి ॥ 467

## హిందోళం

ఆయనయ్యా నీ ప్రియములన్నియు వచ్చెను మాకు
చేయి మీఁదాయ సేవలు సేసేమయ్యా నీకును ॥ పల్లవి ॥
ఆనవెట్ట నేఁటికి నీవంతేసి నాతోను
కానవచ్చీని రేపల్లెకాడ నీ గుట్టు
వీనులెల్లఁ జిల్లులాయ విని విని నీకతలు
వూనిన నామనసెట్టు వొడఁబడీ నిఁకను ॥ ఆయ ॥
సాకిరి చూప నేఁటికి సారెసారె నాముందర
జోకలు కొలనికాడఁ జూచేమన్నియు
చీకాకుపడెను నాచిత్తము నీమేను చూచి
యీకడ నిఁకనట్ల యియ్యకొందు నిజము ॥ ఆయ ॥
చెక్కు నొక్కనేమిటికి చెలఁగని నీపొందు
తొక్కిన నీరతిలోనే తోఁచీ మాకు
గక్కన శ్రీవేంకటేశ కలసి నే బ్రమసితి
వెక్కసాలెట్ల నాడే వేవేలు నిన్నును ॥ ఆయ ॥ 468

## దేశాక్షి

పరగ నిఁక నేఁటిది పనులు మంతుకు నెక్కె
కెరలించి వలపులు గిజిగిజి సేసెను ॥ పల్లవి ॥
గందము తాఁ బూసుకొని కాంత నిన్నుఁ గాఁగిలించి
యిందరికి దనరతి యెటిఁగించెను
సందడి చెమటలు వచ్చుడాసఁ దుడుచుకొని
పొందేటి సతులకుఁ గొప్పులుగాఁ దాఁ జేసెను ॥ పరగ ॥

వీడెపు మోవితోడ వేసరి చెక్కులంటించి
తోడివారి చిత్తాలకు దూరుసేసెను
వీడిన కొప్పు విరులు వెస నీపై విదిలించి
యీడఁ దనపతివని యిక్కువలు సేసెను ॥ పరగ ॥

మచ్చిక నీతోఁ బెనఁగి మదనముద్ర లంటించి
రచ్చలఁ దన సొమ్మని రవ్వసేసెను
యిచ్చట శ్రీవేంకటేశ యిన్నిటా నిన్నుఁ గలసి
యిచ్చల నీవారికి మాకెఱుకగాఁ జేసెను ॥ పరగ ॥ 469

## కేదారగౌళ

చూతమే యీ సంతోసాలు సొరిదినుండి
ఐతే నేమే సవతుల మది మనమేలే ॥ పల్లవి ॥

సతి తిట్టు లతనికి చవులై వుండఁగాను
మతిలోన వగవఁగ మనకేల
యితవై యీపెగుంపెన కితఁడు లోఁగుచుండఁగా
కుతిలకుడువ నేలే కొమ్మలాల మనము ॥ చూత

ఆపె సేసే వుద్దండాలు ఆతఁడోరుచుకుండఁగా
కోపమేలే మనకును కోపులనుండి
వోపి యాలియాజ్ఞ మగఁడొట్టి జవదాటఁడు
ఆపసోపాలేలే మన మందరిలోవారము ॥ చూత ॥

కొంగాపె పట్టి తియ్యఁగాఁ గూచుండాతఁడు లోఁగాఁగా
వంగించనేలే మనము పలుమారును
యెంగిలి మోవిచ్చె నాపె యెనసి శ్రీవేంకటేశుఁ
డంగదేలే యేలిరిద్దరట్టె మనసులను ॥ చూత ॥ 470

## రామక్రియ

అటుచూడు సతినేర్పు లవుభళేశ
    అటమటములు గావు అవుభళేశా ॥ పల్లవి ॥
యెదురుఁ గొండలమీఁద నెక్కినట్టి రకిమప్ప
    అదివో నీతోడ యెక్కె నౌభళేశ
    వుదుటున నంతలోనే వురముపై నెలకొని
    అదిమీఁ జన్నుల నిన్ను నౌభళేశా ॥ అటు ॥
ముంగోపముతోడను మొక్కలీఁడపైన నిన్ను
    నంగన గద్దెపైఁ బెట్టె నౌభళేశ
    కంగక వేదాద్రి నిన్ను గరుడాద్రికిఁ దీసె
    అంగాలంటె నింటిలోన నౌభళేశా ॥ అటు ॥
చేరి నీవు నవ నారసింహరూపులైతేఁ జెలి
    ఆరీతుల నిన్నుఁ గూడె నౌభళేశ
    గారవాన నీవు శ్రీవేంకటముపై నుండఁగాను
    ఆరసి రతి మెప్పించె నౌభళేశా ॥ అటు ॥ 47

## శంకరాభరణం

అన్నిటా జాణ గదవే అవుభళనారసింహుఁడు
    కన్నెలాటలు చూపఁగాఁ గతలడిగీని ॥ పల్లవి ॥
బంతినే నవ్వులు నవ్వీఁ బ్రహ్లాదవరదుఁడు
    చెంతనే సేవలు సేసే చెంచెతలతో
    కాంతుల వారి చన్నులు కానుకలు చూపఁగాను
    అంతలోఁ జాకిటాకు పయ్యదలఁ గప్పుమని (సీని?) ॥ అన్ని ॥
చయములెల్లా నంటె నహోబలేశుఁడు
    పాయపుటింతులు తన పాదాలొత్తఁగా
    ఆయెడఁ గనుచూపుల యమ్ములు గాఁడకియ్యఁగ
    చేయగాఁ బచ్చిపుసుఁగు చల్లుకొమ్మనీని ॥ అన్ని ॥

సిగ్గులు దేరఁగఁ గూడి శ్రీసతినాయకుఁడు
వొగ్గుచుఁ గొమరెల్లా నొడివట్టఁగా
కగ్గక మోవిపండ్లు కానుకియ్యఁగా కూటము
అగ్గువాయ శ్రీవేంకటమందు రమ్మనీని ॥ అన్ని ॥ 472

590-వ రేకు కుంతల వరాళి

కాంతలకెల్లాఁ జెప్పఁ గతలాయను
చెంతనే వినేవారికి సిగ్గులాయను ॥ పల్లవి ॥

వాడల వాడలనెల్లా వనితల మీఁద నీకు
వేడుక వలపు చల్లువెదలాయను
కూడిన కూటములను గొల్లెతలకు నీకును
యేడఁ జూచినాఁ జెమట లేరులాయను ॥ కాంత ॥

ఆవుల మందలోన నాఁడువారిఁ గంటే నీకు
వావుల పొందులు పెద్ద వాములాయను
చేవ మీర రేపల్లెలో చెలుల చన్నులు నీకు
పూవుల గుత్తులవలె పూజలాయను ॥ కాంత ॥

యమునానదిలోపల నంగనల జలకేలి
సమరతి మించి నీకు జాజరాయను
అమర శ్రీవేంకటేశ అట్టే నన్ను నేలితివి
తమితోడి సేసపాలు తలపోఁతలాయను ॥ కాంత ॥ 473

ఆహిరి

రావయ్యా యెక్కడి సుద్ది రచ్చలఁ బెట్టక మమ్ము
దేవరవలె నీవుంటేఁ దిట్టఁ గలమా ॥ పల్లవి ॥

నీ విచ్చిన చనవున నిన్ను నంటిఁ గాక
వోవఁ జాలకుంటే నిన్ను నొరసేమా
వావి గలుగఁగ నీపై వలపు చల్లితిఁ గాక
తోప రాకుంటే నిన్ను దూరవచ్చేమా ॥ రావయ్యా ॥

చేతికి లోనై వుండఁగాఁ జెనకితి నింతేకాక
కాతరించి పెనఁగితే కక్కసించేమా
ఆతుమై నీవుండఁగా మాయాడకు రమ్మంటిఁ గాక
ఘాతలు చూపితే నిన్ను గాసి సేసేమా ॥ రావయ్యా ॥

మచ్చిక నీవు గూడఁగా మర్మము లంటితిఁ గాక
పెచ్చు వెరిగితే నిన్నుఁ బెడరేఁచేమా
ఇచ్చల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
పచ్చి సేసితే నీతోఁ బంత మాడేమా ॥ రావయ్యా ॥ 474

## మాళవి గౌళ

అన్నియు మరచి నీవాడిన ట్లాడుట గాక
పన్నిన పంతములేల పట్టి పెనఁగఁగను ॥ పల్లవి ॥

వోడక నిన్నెటువలె నూరక సోలయవచ్చు
యేడలేని వినయము లెల్లాఁ జేయఁగా
పాడితో నిన్నుఁ దప్పులు పట్ట నెటువలె వచ్చు
పీడెము చేతికిచ్చి వేఁడుకొనఁగాను ॥ అన్నియు ॥

చేయి చాఁచి నిన్నెట్టు చెనకకు మనవచ్చు
ఆయము గరఁగి నీవాసపడఁగా
చాయల సన్నల నిన్ను జంకించ నెట్టు వచ్చు
పాయము నానోమ్ము సేసి బాఁతిపడఁగాను ॥ అన్నియు ॥

తగిలి నీకాఁగిటిలో తనియంగ నెట్టువచ్చు
మిగులా నీనేరుపులు మెఱయఁగాను
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
ఒగివాయ నెట్టు వచ్చు పొలార్చఁగాను ॥ అన్నియు ॥ 475

## హిందోళవసంతం

ముంచుకొంటే వలపులు మొగచాటౌను
పొంచే వప్పటిని పొద్దువోదా నీకు ॥ పల్లవి ॥

వుంగిటిగాఁ జెక్కు నొక్కి వొడఁబరచేవు నన్ను
సంగడి నున్న చెలులు చాలరా నీకు
అంగవించి నాచే మాటలాడించుకొనేవు నీవు
యెంగిలిమోవి మీఁదివి యేఁటికి నీకు ॥ ముంచు ॥

కొప్పువట్టి తీసి నన్నుఁ గొనరేవు ఆసలెల్లాఁ
గప్పే వూడిగాలవారు గారా నీకు
అప్పటి మాచన్నులొరయఁగ సాము సేయించేవు
యిప్పుడిట్టే చెమరించె యితవా నీకు ॥ ముంచు ॥

కమ్మి నన్నుఁ గూడితివి గక్కన శ్రీవేంకటేశ
రమ్మంటేఁ దొంటిఁ జుట్టాలు రారా నీకు
వుమ్మడి నన్నిప్పుడిట్టే వురమెక్కించుకొంటివి
తమ్మిపాదాలు మోవఁగఁ దగవా నీకు ముంచు ॥ 476

## నట్టనారాయణి

వట్టి సటలు సేసేవు వాడికె మాముందరను
వెట్టికి నిదియూ నేనే విన్నవించవలెనా ॥ పల్లవి ॥

కూచుండు మనఁగరాదా కొమ్మను నీసంగడిని
నీచూపులకు గురై నిలుచున్నది
చేచేత మాముందరను సిగ్గువడ నేఁటికి
యీచోట నేకతమైతే నిట్టే వుండేవా ॥ వట్టి ॥

మాటలడుగఁగ రాదా మర్మములు సోకఁగ
మోటుపెట్టుకందుకే తిమురుచున్నది
కూటపు మాముందరను గుట్టుసేయ నేఁటికి
పాటించి తెరమాటైతే పలుకకుండేవా ॥ వట్టి ॥

కాఁగిలించుకొన రాదా కళలు సోఁకఁగ నిట్టే
రాఁగయై చన్నుల నిన్నొరయుచున్నది
వేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ్వర నన్ను
లోఁగిట నాపై వుండఁగా లోఁగాక మానేవా ॥వట్టి॥ 477

పాడి

ఏమి గంటి విందువంక నెమ్మోముఁ ద్రిప్పై
కామినుల మీఁదను నీకాఁక రేఁచవలెనా ॥పల్లవి॥
గరిమ నిద్దరిసంది కైలాటాలు వెట్టితివి
వరపాత నింతేసి కావలెనా నీకు
పొరి నీకు నితవైతే భోగించవలెఁ గాక
పొరుగుల వారిలోనఁ బోరు వెట్టవలెనా ॥ఏమి॥
గుట్టున నాపై నీ పెనుగోళ్ళు(ళ్ళ?)రాచితివి
వట్టి నేర్పులు మెరయవలెనా నీకు
యిట్టె నీకు నితవైతే నెదఁ బెట్టుకొందు గాక
చుట్టపు సతులలోన సూడు రేఁచవలెనా ॥ఏమి॥
కూడియుండి సవతుల కోపములు వెంచితివి
వాడికె యీతరితీపు వలెనా నీకు
వేడుకైతే రతులు శ్రీవేంకటేశ పెంతు గాక
యీడ నన్ను నేలి వారి నింత సేయవలెనా ॥ఏమి॥ 478

591-వ రేకు నారాయణి

ఎట్టి వేగిరకాఁడవు యేమయ్యా నీవు
మిట్టిపడి దయ్యమైనా మెచ్చవద్దా నిన్నును ॥పల్లవి॥
చలమరివాఁడవు చనవేల యిచ్చితివి
వలపఁగ నాడేఁ నీవు వద్దన రాదా
వెలయించి పూరివారి నింత సేయ వ్రతమా
నలుపంక నింకా నిన్ను నమ్మవద్దా చెలులు ॥ఎట్టి॥

కడుఁ బంతగాఁడవు కదిసేల నవ్వితివి
తడవకుమని దయ దలఁచ రాదా
పడుచులఁ దెచ్చి యింత పచ్చి సేయఁ దగవా
తొడిఁబడ నిల్లైతే దోసమైనా ముట్టదా ॥ ఎట్టి ॥

బిగిసేటి వాఁడవు ప్రియము చెప్పఁగనేల
పగటున నాకె నొడఁబరచ రాదా
నిగిడి శ్రీవేంకటేశ నీవే యీపె నేలితివి
మొగచాటు వలెనా నీమోహమునకుఁ గడమా ॥ ఎట్టి ॥479

## భైరవి

ఆన వెట్టుకొందునటే అటని నేను
తానే లోఁగీఁ గాక నేనిందరివంటి దానినా ॥ పల్లవి ॥

కడనేల వున్నవాఁడు కాఁగిటికి రమ్మనవే
చిడుముడి నన్నుఁ గంటే సిగ్గు వచ్చెనా
పొడిఁబడఁ గావచ్చీనా పోయిన పనులు నేఁడు
తడవ నే యిల్లాలఁ దప్పులు వట్టేనా ॥ ఆన ॥

వెలుగేల పడీఁ దాను వీడె మందుకొమ్మనవే
యెలుకప్పుడు లేనిది ఇప్పుడేఁటికే
మలచి సేసిన బాస మరి తలఁచుకొనీనా
గిలిగొన తనుదానఁ గినియ వచ్చేనా ॥ ఆన ॥

తల వంచీనేల తాను తగిలి కూడుమనవే
మొలచి నాపై బత్తి మోసువారెనా
కలసి శ్రీవేంకట ఘనుఁడింక విడిచీనా
అలుగ నే పట్టవు దేవులనై దూరేనా ॥ ఆన ॥ 480

## సామంతం

మానవుగా మాతోడ మందెమేళాలు
పానిపట్టి నీకు నాకుఁ బాఁతచుట్టరికమా ॥ పల్లవి ॥

కొప్పువట్టే వది యేమి గుట్టున నన్ను నీ
కుప్పెసవర మున్నదా కొయ్యకాఁడవు
అప్పటిఁ జన్నులు ముట్టే వదేమి నీవు
తప్పక నీసరులేమి దాఁచఁగ బెట్టితివా ॥ మానవు ॥

కొంగువట్టే వదియేమీ కొసరుచును
ముంగిట నీ పైఁడేమైనా ముడిచితివా
సంగడిఁ జేయి వట్టేవు సారెకు నన్ను నీ
వుంగరాలు తడఁబడి వున్నవా నావేలను ॥ మానవు ॥

వోడక వుర మెక్కించే వొద్దికై నీవు
జోడుగా నీకయినట్టి సొమ్మునా నేను
కూడితి కందనవోలి గోపాలకృష్ణ
యీడనే శ్రీవేంకటాద్రి యిరవాయనా ॥ మానవు ॥ 481

## కాంబోది

చెప్పేవారి బుద్దులు చెవిఁ బెట్టరు
దెప్పరపు టలుకలు దేరుచెట్టు లమ్మా ॥ పల్లవి ॥

అపరాధిగాని విభుఁ డవ్వలి మోమై వుండఁగా
ఇపుడీపై తే నమ్మదు యివ్వలిమోమై
వుపముల నొకరొకరొట్లు వెట్టుకొన్నారు
తపముల వేఁడు(వీడు?)కోరు తమపంతములను ॥ చెప్పే ॥

స్వతంత్రుఁడై నాతఁడు చలముతో నుండఁగాను
హితురాల ననే గర్వమీపె కున్నది
మితి మీటి తమలోన మేరలతో నున్నారు
ప్రతినతోఁ గలయరు భావపుఁగోపాలను ॥ చెప్పే ॥

నీటు శ్రీవేంకటేశుఁడు నేర్పుతోడ నుండఁగాను
    పాటించి యాపెఁ జాన్పుపై నే వుండఁగా
    మాటలచిలుక వోఁగా మగడిద్దరూఁ బట్టఁగా
    కోటికి నలుకదేరి కూటమబ్బెఁ గాక ॥ చెప్పే ॥ 482

నాట

నీపాపమే కాదు ఇది నిండిన లోకముజాడ
    పైపై వచ్చిన వలపు పాటించరెవ్వరును ॥ పల్లవి ॥
అట్టే మంచిమాటలాడే అతివ జాఁతి పడఁగ
    చిట్టకములాడే యింతిఁ జెనకేవు
    అట్టే కాదా పంచదార అండనెంత వుండినాను
    పట్టి పెనఁగేటి నిమ్మపంటికి నోరూరును ॥ నీపాప ॥
చేతులెత్తి మొక్కేటి చెలి గాచుకుండఁగాను
    ఆతలి మోమైనవారి కాసపడేవు
    జాతితోఁ బాలపండ్లు సంగడినే వుండఁగాను
    ఘాతఁ జెరిగే ఒూరుగుఁ గాయలు చూపట్టును ॥ నీపాప ॥
నెట్టనఁ బెండ్లాడిన నేనే నీకుండఁగాను
    అట్టు గొల్లెతలచే నాఅడిఁ బొందితి
    ఇట్టే నన్నుఁ గూడితివి యిందాఁకా శ్రీవేంకటేశ
    వొట్టితే పాలునుఁ జల్లా నొక్కరీతి నుండును ॥ నీపాప ॥ 483

భైరవి

ఏల వేగిరించ మాకు నింతలోననే
    యీ లీల నీవుంగరము యీడేరించీఁ గాక ॥ పల్లవి ॥
మొక్కలపు వాఁడవు మొదలనే నీవు
    మొక్కి యెంత వేఁడుకొన్నా మొగమోడేవా
    కక్కసించ నేమిటికి కాఁపురాలు సేయించే
    తెక్కలి మరుఁడే అన్నీఁ దేరిచీఁ గాక ॥ ఏల ॥

చలపాది వాఁడవు చాయకుఁ దెచ్చేనని
బలిమెంత సేసినాను భ్రమసేవా
అలమి పట్టి నేఁటికి అందరిఁ బొందులు సేసే
అలరు బాణములే నెయ్యము రేఁచీఁ గాక ॥ ఏల ॥

ఆసోదకాఁడవు అన్నిటా శ్రీవేంకటేశ
సేసవెట్టితే నన్నుఁ జెంద కుండేవా
బాసగొన నేఁటికి పై కొన్న వలపులే
రాసికెక్కఁ గూడించే రచలిచ్చీఁ గాకా ॥ ఏల ॥ 484

592-వ రేకు కన్నడ గౌళ

సెలవుల నవ్వే నేఁ జేసిన చేఁతలకెల్ల
తొలుతటివలె నీఁక దూరఁ బనిలేదే ॥ పల్లవి ॥

తప్పించ నేరనిదానఁ దల వంచితే నేమాయ
వుప్పతించీ నందుకుఁగా నూరకే తాను
చప్పని వలపులకు సాజ మిటువలె నౌనే
అప్పటిని తను నీఁక నాడఁ బనిలేదే ॥ సెలవు ॥

కోపించఁ జాలనిదాన గుట్టుతో నుంటే నేమాయ
రాఁపు సేసీ నందుకుఁగా రచ్చలో నెల్లా
తోపునూకుడైన వారితోడి సుద్దులిట్లానే
చాపలానఁ దను నేఁ గొసరఁ బనిలేదే ॥ సెలవు ॥

సాదించ నొల్లనిదానఁ జల్లఁగానుంటే నేమాయ
బోదించీ నందుకుఁగాను పొద్దు వోదా
యీదెసఁ గూడె శ్రీవేంకటేశుఁడు నన్నిట్లానె
కాదు గూడదనఁగ నింకాఁ బనిలేదే ॥ సెలవు ॥ 485

## ఆహిరి

ఇంతట నైన మన్నించు యేల జోలిఁ బెట్టేవు
చెంతల నీచెప్పినట్టు సేయనట్టి దాననా ॥ పల్లవి ॥

యేరా మమ్మే సుద్దులెందాఁకా నడిగేవు
గారపించి నీగుట్టించుకయుఁ జెప్పవు
సారెసారెకు నీతో చలపాదితన మేల
ఔరా నీవన్నట్టే అన్నిసుద్దులు ॥ ఇంతట ॥

లేతే యెందాఁకా నన్నాలించి మనసరసేవు
యేలాఁగులా నీగుణా లెఱఁగనీవు
శాలామాలముతైన చయ్యాటము నీతో నేల
మేలే నీసేఁతలెల్లా మెచ్చితినే ॥ ఇంతట ॥

కాని నాచన్నులైతే గట్లంటాఁ బిసికేవు
ఆనుక గోరనూఁదితే అంటనియ్యవు
పూని శ్రీవేంకటేశ్వర పొసఁగ నన్నేలితివి
నేనే నీవైనది నిజమాయ నిప్పుడు ॥ ఇంతట ॥ 486

## ధన్నాసి

ఇన్నాళ్ళవలెఁ గావు ఇవిగో నీ ప్రియములు
కొన్నిగొన్ని కానుపించి గుమితాన నున్నవి ॥ పల్లవి ॥

చెనకి నామోముచూచి సెలవుల నవ్వేవు
ననుపు నీ చేఁతలెల్ల నవ్వులే కావా
వెనకటివలె నంటా వేఁడుకొన వచ్చితేను
పెనఁగేవు మతి నేమిపెట్టుక వున్నాఁడవో ॥ ఇన్నా ॥

చిక్కని నా మోవియని సిగ్గులు వడేవు నీవు
పక్కన నీపని సిగ్గువాటే కాదా
చిక్కితివంటా నీపైఁ జేతులు నేఁ జాఁచితేను
నిక్కి తప్పించుకొనేవు నీవోజ లింకేటివో ॥ ఇన్నా ॥

పచ్చిగా నారతిఁ జొక్కి చెమసి మైమఱచేవు
మచ్చిక పంతముచూచి(చే?) మఱపే కాదా
యిచ్చట శ్రీవేంకటేశ యెనసిన నామేలు
రచ్చలఁ బెట్టేవు నీరాజన మింకేఁటిదో ॥ ఇన్నా ॥ 487

## పూర్వగౌళ

తగినట్టే మెలఁగితే దైవమైనాఁ గరఁగును
వెగటుగా నడచితే విసిగించు వలపు ॥ పల్లవి ॥

చేసినట్టే సేయవయ్యా సేయకుమంటే నం(నెం?)త
వేసరుకొందువో అండ్లు వేవేలు నీకు
ఆసపడ్డదాన నేను అయినంత నేమే చాలు
వాసులెంచఁ బోతేను వడిఁబడు వలపు ॥ తగి ॥

ఆడినట్టే ఆడవయ్యా ఆడకుమంటే నెంత
జాడ తప్పుదువో పెక్కుసతులు నీకు
తోడఁ బెండ్లికూఁతురను దొరకినంతే చాలు
పాడి పంతాలకుఁ బోతే పచ్చిదేరు వలపు ॥ తగి ॥

చూచినట్టే చూడవయ్యా చూడకుమంటే నెంత
మేచి తమకింతువో నీకింతులు కాన
కాచుక శ్రీవేంకటేశ కైకొని నన్నేలితివి
వాచవి మోవడిగితే వన్నెకెక్కు వలపు ॥ తగి ॥ 488

## అమరసింధు

ఏది దిష్టాంతము యిందులోనను
పోదిసేసేవాఁడు నన్నుఁ బొందఁగవద్దా ॥ పల్లవి ॥

యీయెడ నింతేసి నాతో యెగ్గువట్టేవాఁడు తొల్లే
నాయెడకు నిజముగా నడవవద్దా
పాయక వున్నాఁడనంటా బాసలు సేసేవాఁడు
చాయలకు నాపై మేలు చల్లఁగవద్దా ॥ ఏది ॥

చిత్తగించి నాతో నింత సిగ్గువడేవాఁడు నాఁడే
కొత్తరేకలు సేయించుకోకుండవద్దా
బత్తిగల వాఁడనంటా పైకొనవచ్చేవాఁడు
పొత్తుల నామాటకు ప్రత్తరమీవద్దా ॥ పది ॥

గక్కన నన్నిట్లాను కాఁగిలించేవాఁ డిప్పుడే
చెక్కులు నొక్కుచు నన్ను చేయఁగవద్దా
యిక్కువలంటి శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
మక్కళించి నన్నిట్లా మన్నించవద్దా ॥ పది ॥ 189

శంకరాభరణం

అమర మాటాడితివి అవునే నీవు
జమళి మనమాటలు సరివచ్చేవే వో ॥ పల్లవి ॥

అచ్చపుఁ బంతపుమాట లాడేవు మగువ నీకు
చెచ్చెర నీమోవి యేల చిల్లులాయనే
ముచ్చట నామని కాలమునఁ బండిన పంటకు
లచ్చనలు వేయరా యీలాగుల నెవ్వరును ॥ అమర ॥

సూడుఁ బాడుకుఁ జేచాఁచే సుదతి వన్నిటా నీకు
యేడలేని జీరలు నేఁడేల వచ్చెనే
కూడి విచ్చనవిడిసి కొనసాగే తీగెలకు
తోడనే ములుపొడిచి తుదఁ బోది సేయరా ॥ అమర ॥

రతుల మారు మలసే రమణి నీచన్నులకు
సతమై వొత్తిన కందుజాడ లేదవే
యితవై నన్ను శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
మతిలో ననురాగము మానునా పెమించక ॥ అమర ॥ 190

593-వ రేకు లలిత

దేవరవు నీసుద్దులు తెలియనివా నేము
చేవలెక్కించితి వింత చిగురుఁబోండ్లకు ॥ పల్లవి ॥

వువిదకు నీవిచ్చిన వుపదేశమే కాదా
సవతుల నందరిని సాదించుమని
యివల మామోము చూచి యేమి నవ్వే వప్పటిని
జవదాఁటునా ఆఁటది సలిగె లేకున్నను ॥ దేవ ॥

మగువకుఁ జెవిలోన మంతిరించినవే కావా
పగటున నందరినిఁ బరచుమని
అగడుగ మాపై నేల ఆనలు వెట్టుకొనేవు
తగవు దప్పునా యింతి దాపు లేకుండినను ॥ దేవ ॥

నెలఁతకు నేరిపిన నీతంత్రమే కాదా
నెలకొన పంతములు నెఱపుమని
కలసి శ్రీవేంకటేశ కడు నన్నే మెచ్చేవు
చెలపట్టునా యీపె నీసమ్మతి లేకున్నను ॥ దేవ ॥ 491

దేశాక్షి

అన్నియు నే నెఱుఁగుదు నంత బడలకు నీవు
సన్నలు సేయఁగఁ బైపై జడిసీఁ బులకలు ॥ పల్లవి ॥

యించుకే మాటాడవోయిటు నాతోను
పొంచిన నీమోవిఁ గెంపులు రేఁగీని
వంచకువోయి శిరసు వడిఁ జెక్కుపై
వుంచవు నీ కొప్పు పువ్వులు రాలీని ॥ అన్ని ॥

చేతులు చాఁచకువోయి చేరి నాపైని
యేతలి గురుతులు బాయిటఁ బడీని
ఘాతలఁ జూడకువోయి కన్నవారినే
రాతిరి సిగ్గులు నేఁడు రచ్చఁ బడీని ॥ అన్ని ॥

పెనఁగకువోయి ముట్టి బెరసి నాతో
తనువుపై వాసనలు తగిలీ నన్ను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసితి మిద్దరము
అనుమానించకువోయి ఆడికె వచ్చీని ॥ అన్ని ॥ 492

## సాళంగ నాట

నిండుదొరవౌదువు నీజాణతనము మేలు
అండనే సవ్వఁగ వద్దా అన్నిటా నాతోను ॥ పల్లవి ॥
వుద్దండాలు సేసి వచ్చి వొగిఁ జుట్టమవై నీవు
సుద్దులెల్లఁ జెప్పవద్దా సూటిగా నాకు
పెద్దరికాలకు నెంటఁ బెట్టుక ఆపెనుఁ దెచ్చి
గద్దించవద్దా నీవు కమ్మటి నాచెలుల ॥ నిండు ॥
కొత్తరేకలు నించుక గుణవంతుని వలెనే
బత్తులెల్లాఁ జేయవద్దా పైపై నాకు
హత్తిన తరితీపుల నాపెసొమ్ము మేనఁ బెట్టి
పొత్తునఁ గూచుండవద్దా పూని వచ్చి ఇపుడు ॥ నిండు ॥
రతులఁ దనిసి వచ్చి హితవరివలెనే
తతిఁ బెడరేఁచవద్దా తమి నాకును
ఈతిఁ బరమపదేశ శ్రీవేంకటేశుఁడవై
సతమై కూడఁగవద్దా సారె నిట్టే నన్నును ॥ నిండు ॥ 493

## సింధురామక్రియ

ఎంత బలువే నీకు నెడగొల్లకత్తెవటే
వంతువరుసల నాపె వలచి వుండఁగను ॥ పల్లవి ॥
ఇప్పుడిట్టే వచ్చి పతికేమి చేతులు చాఁచేవే
కప్పురమిచ్చిన యాపె గాచుకుండఁగా
చెప్పేవప్పటి నేమే చెవిలోన నేకతాలు
అప్పసము సేవసేసే యాపె వుండఁగాను ॥ ఎంత ॥

నలువంక సందుసుడి నవ్వులేమి నవ్వేవే
కొలువుసేసిన యాపె గూచుండఁగా
కలయవచ్చేవు పొత్తు కాతరాన నీకు నీవే
పిలిపించుకొన్నయాపె ప్రేమతోనుండఁగను ॥ ఎంత ॥

ఆసపడి నీవేల అట్టే కాఁగిటఁ గూడితి
నేసవెట్టి కూడినాపె చేరి వుండఁగా
వాసిఁ బరమపదేశ్వరు శ్రీవేంకటాద్రిపై
చేసుకొంటి వురముపై శ్రీసతి వుండఁగను ॥ ఎంత ॥ 494

శ్రీరాగం

ఏమినన రమ్మనవే యిక్కడికి రమణుని
ప్రేమపుదానఁ గాక బిగిసేటి దానవా ॥ పల్లవి ॥

ఆతఁడెటువలె నున్నా నౌఁగాదనే దానవా
చేతికిలోనేకాక శీఁట(?)దానవా
కాతరించి తనమీఁద గాతసేసే దానవా
యేతులు తనతోఁ జూప నెడ్డదానవా ॥ ఏమీ ॥

తననేరములు మరి తడవేటి దానవా
మనసులోదానఁ గాక మంకుదానవా
చనవరికత్తె నంటా సాదించే దానవా
పనిలేని యెగ్గులెన్నఁ బడుచుదానవా ॥ ఏమీ ॥

వలపులు పెడరేఁచి వలఁబెట్టే దానవా
తలఁపులోదానఁ గాక దంటదానవా
కలసి పరమపదఘనుఁడ(డు?) శ్రీవేంకటేశ(శు?)
కొలఁదెఱఁగక వుండఁ గొయ్యదానవా ॥ ఏమీ ॥ 495

ఆహిరినాట

వద్దువద్దు దోసము వలచివచ్చినవారిఁ
దిద్దుకొని కోరికలు దీరుచకుండితేను ॥ పల్లవి ॥

పలచఁగా నవ్వి యాపె భావించి చూచీ నిన్ను
నెలకొన్న వావులను నీకేమౌనో
తలవంచుకోకు నీవు దండనున్నదాన నేను
అలరి యెంతకైనాను ఆడు(దు?)కొనే నేను ॥ వద్దు ॥

పట్టి పెనఁగుచు నీకుఁ బైపై విందు చెప్పీని
నెట్టనఁ జుట్టరికము నీకెంత గద్దో
దట్టించి తప్పించుకోకు దాపు నీకు నేనుందాన
అట్టే యేపనికైనా నానుకొనే నేను ॥ వద్దు ॥

చనవుతోఁ గాఁగిలించి సారెసారె మాటలాడీ
నెనరైన నేస్తము నీకది యెట్టో
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నీడ లోఁగ-
కనువైన వూడిగాల కడ్డమయ్యే నేను ॥ వద్దు ॥ 496

594-వ రేకు దేవగాంధారి

ఎవ్వరికి జెప్పేవే యీసుద్దులు
జవ్వనము కట్టిపెట్టి సాదవయ్యేవా ॥ పల్లవి ॥

పావనము సేసాతఁడు పలుకఁగా లోఁ గేవు
సేవసేసే దానికింత సిగ్గులేఁటికే
కావుకొని సతులెల్లా దండనుండఁగాఁ గాక
భావించి యేకతమైతేఁ బైకొనకుండేవా ॥ ఎవ్వ ॥

వాడికగా నాతఁడు నవ్వఁగాఁ దలవంచేవు
వేడుకకత్తెవు నీకు వెరపేఁటికే
యీడఁ బట్టపు దేవుళ్ళ సిందరినిఁ జూచి కాక
కూడేవేళ నింటిలోనఁ గొంకఁ జూచేవా ॥ ఎవ్వ ॥

కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిలించఁగా నవ్వేవు
యెప్పటి దానవు నీకు నెమ్మోలేఁటికే
అప్పటి నేము గూడిన ఆవరుస యెంచి కాక
ముప్పిరి నీవరుసను మోసపొయ్యేవా ॥ ఎవ్వ ॥ 497

## మాళవి

ఇందరివలెఁ జూడకు యింకా నన్ను
మందలించి యెటువలె మన్నించినా మంచిదే ॥ పల్లవి ॥

తత్తరించి నీమీఁద తప్పులు మోపఁగ నోప
కొత్త కొత్త మాటలను కొసర నోప
బత్తిగలదాన నీతోఁ బంతము లాడఁగ నోప
చిత్తగించి యేమి దయసేసినాను మంచిదే ॥ ఇంద ॥

చేయి చాఁచి కొనగోరఁ జెనకఁగ నే నోప
చాయల సన్నల నిన్ను జరయ నోప
నీ యాధీనపు దానను నిన్ను వెంగెమాడ నోప
కాయడించ కెటువలె రక్షించినా మంచిదే ॥ ఇంద ॥

అట్టె కాఁగిటఁ గూడితి నలయించ నే నోప
పట్టి సటలాడి నీతో వాదించ నోప
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
పట్టముగట్టి నన్నెంత పాలార్చినా మంచిదే ॥ ఇంద ॥ 498

నాగవరాళి

మగవాఁడవౌదువు మరి నిన్ను మెచ్చితిని
తగవింత నేరకుంటే తతి నన్నేలుదువా ॥ పల్లవి ॥

యెడకేడ రుకుమిణి నెలయించి యింటికి
వేడుకతోఁ దెచ్చుకొంటివిగా నీవు
జోడుగాఁ బదారువేలు సుదతులఁ దెచ్చుకొంటి-
-వాడికెకు వెలవవు అవుఁగా నీవు ॥ మగ ॥

వూరిలోని గొల్లెతల నొకతె నొకతెనే
వీరుఁడవై యంటుకొంటివిగా నీవు
బీరాన రాచకూఁతులు పెండ్లాడినట్టివారు
అరీతిఁ బట్టవు దేవుళ్ళట కా నీకు ॥ మగ ॥

వరుస మధురలోని వారకాంతల నెల్లా
వెరసువేసి పొందితివిగా నీవు
సిరుల శ్రీవేంకటేశ శ్రీసతి నంటా నన్ను
వురమెక్కించుకొంటివి వోపికగా నీది ॥ మగ ॥ 502

595-వ రేకు సామంతం

మేలు గాదా నీభాగ్యము మెలుపె నింపిరిలోనా
యేలుకోరయ్యా మమ్ము నిట్లానే ఇంకను ॥ పల్లవి ॥

సిగ్గులెల్లా మూటగట్టి చెలి నీపై వేసినట్టు
వొగ్గి నీపై వేసెఁ బువ్వుల చెండును
అగ్గపు మరుసాముల నాయము దాఁకించినట్టు
సగ్గక పెనఁగి నీమైఁ జన్నులఁ దానొత్తెను ॥ మేలు ॥

సవ్వులెల్లా నొక్కమాటే నాతి నీపై నించినట్టు
నివ్వటిల్లు గందవొడి నీపైఁ జల్లె
జవ్వనము రాసివోసి జాజరలాడినట్టు
చివ్వన సరసమాడి చెనకిని గోళ్ళను ॥ మేలు ॥

వేవేలు తీపులతోడ విందు నీకుఁ బెట్టినట్టు
శ్రీవేంకటేశ ఆపె మోవి ఇచ్చెను
భావించి యలమేల్మంగ పట్టము గట్టుకొన్నట్టు
నీ వురముపైఁ దానే నెలకొనె నిపుడు ॥ మేలు ॥ 503

## ముఖారి

ఎఱఁగవా మీఁద శెత్తు ఇంతేసి వచ్చీనని
తఱి నాకె నీకు బుద్ధి తగఁ జెప్పదాయనా ॥ పల్లవి ॥

యిప్పుడు నామాటలకు నింత వోరిచేవాఁడవు
అప్పుడాపె రాఁగా రాకుమనరాదా
తెప్పిరిల నాయలుక దేర్చేవాఁడవు నిన్నాపె
వొప్పుగాఁ గొంగు పట్టితే నోపననరాదా ॥ ఎఱ ॥

కోటియానలికఁ బెట్టుకొనేవాఁడవటు యాపె
పూటమోవికి నోరొగ్గకుండరాదా
మూటకట్టుగా వేఁడుక మొక్కేవాఁడ వీచేతులు
చాటి యాపె చన్నులపైఁ జాఁచకుండరాదా ॥ ఎఱ ॥

పరగ శ్రీవేంకటేశ బలిమి నన్నేలితివి
బెరయక యాపెతోను పెనఁగరాదా
మరిగిన అలమేలుమంగనని మన్నించితి-
విరవుగా నాపె నిట్టే యీడకుఁ దేరాదా ॥ ఎఱ ॥ 504

### ఆహిరి

నీమగఁడు కొలువులో నీపైనే చల్లీ వలపు
నేమపు వూడిగాలెల్లా నీవే సేయవమ్మా ॥ పల్లవి ॥

తప్పక చూచీ నతఁడు తలిగొని నీదిక్కు
యిప్పుడే కానుకలెల్లా నియ్యవమ్మా
కప్పురము చల్లుకొంటాఁ గమ్మటి సుద్దులడిగీ
చిప్పిల విన్నపాలెల్లాఁ జేసుకొనవమ్మా ॥ నీమ ॥

చెంగట నీవుండఁగాను సెలవి నవ్వీ నతఁడు
యింగితమెఱిఁగి వీడె మియ్యవమ్మా
అంగమునఁ దట్టుపుణుఁగలఁదుకొంటాఁ జెనక
సంగతిఁ జేయెత్తి మొక్కి సరసమాడవమ్మా ॥ నీమ ॥

అలమేలుమంగవు నిన్నక్కునఁ గట్టుకొనెను
అలమి శ్రీవేంకటేశు కాసలీవమ్మా
పలుసొమ్ము వెట్టుకొంటాఁ బయ్యదకొంగు వట్టీని
అలరి పొత్తున నిట్టే యారగించవమ్మా ॥ నీమ ॥ 505

### శ్రీరాగం

నీకే తెలుసునయ్యా నీసుద్దులు
పైకొని నేమడిగితే బ్రమయ నేమిటికి ॥ పల్లవి ॥

చెమటేల వచ్చెనో సిగ్గువడి యంతలోనే
చమరి కప్పురదూళి చల్లుకోనేల
సముకాన నేమింతలో సారెసారె నవ్వితేను
అమరఁ దట్టుపుణుఁగు అందుపైఁ బూసేవు ॥ నీకే ॥

నీకంటేముందు కప్రము నెలంతకు మీఁదుకట్టి
దాకొని మిగిలించేల ధరియించేవు
జోకతో నేము నీమోము చూచితేఁ బరాకుచేసి
ఆకెఁ గూడి పన్నీరు అట్టె చల్లుకొనేవు ॥ నీకే ॥

తెలుపు కప్పురము నలుపు తట్టుపుణుఁగు
కలగంప రూపులేల కైకొనేవు
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు నీ-
వెలమిఁ గలసి నన్ను నెంత మన్నించేవు ॥ నీకే ॥ 506

భూపాళం

అప్పటి నీచెలులంచే నాగడానఁ బడనేల
మెప్పించేఁ గాని మేడమీఁదికి రారా ॥ పల్లవి ॥

సంగతిగాదు నీసతులెల్లాఁ జూచేరు
కొంగువట్టి తియ్యకురా కొసరి నన్ను
దొంగిలి చేసినసేఁత తుదకెక్కించ నేఁటికి
ముంగిటి వారెరిఁగేరు మూలకు రారా ॥ అప్పటి ॥

కన్నవారు విన్నవారుఁ గాకు సేసేరిట్టె నన్ను
చన్నులు ముట్టకురా సారెసారెకు
పన్ని చీఁకటిలో సుద్ది బయట వేయఁగనేల
మన్నించి దోమతెరమాటు కిట్టేరారా ॥ అప్పటి ॥

అప్పసము పురముపై నలమేల్మంగ వుండఁగా
కొప్పువట్టి తియ్యకురా కొంకక నన్ను
ఇప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చప్పుడు సేయక మంచముపైకి రారా ॥ అప్పటి ॥ 507

దేసాళం

వెట్టితనమున నిన్ను వేసరించేఁగాక నీవు
వొట్టిబాగుల వాఁడవు వొద్దిక య్యేనా ॥ పల్లవి ॥

కాముకుఁడైన వానికి కడుఁ బరాకే ఘనము
వేమారు మా విన్నపము వీనులంటీనా
ఆమీద వీడెము సేసేయప్పుడు మదమెక్కుడు
చేముట్టి నేఁ దీసితేను చేరవచ్చేవా ॥ వెట్టి ॥

కన్నెపాయపు వానికి గబ్బితనమే ఘనము
పన్ని నే మాటాడించితేఁ బలికేవా
వన్నెల నందుకుఁ దోడు వనితలలో నున్నాఁడ-
వెన్ని మొక్కులు మొక్కినా నెరఁగ వచ్చీనా ॥ వెట్టి ॥

దొరతనపువానికిఁ దొట్టి వుండు గర్వమెల్ల
గరిమ నేఁ జెనకితేఁ గైకొనేవా
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సిరులఁ బెండ్లాడితివి సిగ్గువడేవా ॥ వెట్టి ॥ 508

596-వ రేకు తెలుఁగు కాంబోది

ఒకరాస పడితే నీవొకరికిఁ జేచాఁచేవు
యెకసక్కెఁడవు నిన్ను నేమందునయ్యా ॥ పల్లవి ॥

కలువకన్నుల నిన్నుఁ గలకంటి చూచితే
నలిరేఁగి నీవిట్టే నన్నుఁ జూచేవు
మొలక చన్నుల నాపె మించి నిన్ను నంటించితే
కొలఁది నన్ను నీ కొనగోర నంటించేవు ॥ ఒక ॥

పుగిడి మగిడి యీాపె మాట నీతో నాడితేను
బగివాయకిటు నన్నుఁ బలికించేవు
నగవులాపె నీతో నవ్వితేను నీవు నా
మొగమై పకపకన ముంచి నవ్వేవు ॥ ఒక ॥

అలమేల్మంగ నీ వురమెట్టే యెక్కుకొంటేను
నెలకొని నాపురము నీవెక్కితివి
యెలమి నే శ్రీవేంకటేశ భూరమణిని
యిలనాపె కుడినుంటే యెడమ నున్నంచితి ॥ ఒక ॥ 509

ఆహిరి

మమ్మేల దూరేవు నీవు మాఁటి మాఁటికి
అమ్మరో నేమా నిన్ను నదలించే వారము ॥ పల్లవి ॥

నీమాఁటలనల్లనే నీవు రవ్వైతివి గాక
యేమీ ననకూరకుంటే నేటిఁ గేరా
వాములైన నీ చేఁతలవల్లఁ గాకైతివి గాక
చేముంచి నేమా కాకుసేసేటి వారము ॥ మమ్మే ॥

కోరి నవ్వి నీవే తెచ్చుకొంటివి గాక యీారట్టు
నేరుపుతో నుంటే నిన్ను నిందలాడేరా
సారె నీబెదరుఁ జూపే సందేహోలెత్తించెఁ గాక
సారసాన నేమా నిన్ను చండిసేసే వారము ॥ మమ్మేల ॥

రాఁపుగఁ జెనకి నీవే రతికెక్కితివి గాక
పైపై సరసమాడితే పచ్చిసేసేరా
యేపున శ్రీవేంకటేశ యేలితివల మేల్మంగ
నీవనే కాక నేమా యింత(యింత నేమా?) సేసే వారము
॥ మమేల ॥ 510

### దేవగాంధారి

ఇందుకుఁగా సవతుల నేల దూరేవే
కందము నీసత్తువెల్ల కతలేల చెప్పేవే ॥ పల్లవి ॥

వలవఁగవలె లేదా వలపించుకొనవలె
యెలమి నూరకే వుంటే నేఁటి యాఁటదే
చెలమరి విభుఁడైతే సాగిలి మొక్కవే లేదా
బలిమి నీకుఁ గలితే పంపు సేయించుకోవే ॥ ఇందు ॥

చొక్కవలెఁ దానే లేదా చొక్కించవలెఁ బతిని
యెక్కడికెక్కక వుంటే నేఁటి యాఁటదే
కక్కసీఁ డాతఁడైతే కడుఁ బ్రియాలాడు లేదా
తక్కరివి నీవైతే నాతని నగుచుకొనవే ॥ ఇందు ॥

నేరవలె రతి లేదా నేరుపనైనా వలె
యేరితికిఁ జొరకుంటే నేఁటి యాఁటదే
ఆరసి శ్రీవేంకటేశుఁడలమేల్మంగను నేను
గారవించి కూడె నీవూఁ గరుణింపించుకోవే ॥ ఇందు ॥ 511

### సాళంగనాట

నీతలనే వచ్చెనయ్యా నేరుపెల్లాను
కాతరించి సతులపై కాఁక చూపవలెనా ॥ పల్లవి ॥

కోమలుల చిట్టులకు కోపగించే పింతలోనే
యేమీ నీమగతన మిందుమీఁదనా
చేముట్టి గోరనూఁదితే చిడుముడికే పడేవు
సాము సేసిన శిరమిచ్చటఁ జూపవలెనా ॥ నీతల ॥

సతుల యెంగిలికిట్టే జడిసేవు కమ్మటిని
యితవైన నీయాచారా లిందుకోరకా
రతివేళఁ బాదములొరసితే నెగ్గుపట్టేవు
తతి నీపెద్దరిక మింతటఁ జూపవలెనా ॥ నీతల ॥

లలనల చనుఁగొండలకుఁ జేయి చాఁచేవు
బలవంతుఁడవౌత యీపాలురఁగమా
అలమేలుమంగను నేనట్టే శ్రీవేంకటేశుఁడ
కలసితివి నీమేలిక్కడఁ జూపవలెనా ॥ నీతల ॥ 512

## బౌళిరామక్రియ

అందరు నెఱిఁగినవే అన్నిపనులు
అందియ్యరాదా వీడె మంత సిగ్గులేఁటికి ॥ పల్లవి ॥

చిప్పిలి చెమటనీరు చెక్కుల వెంటాఁ గారఁగా
చెప్పరాని వూఁడిగాలు సేసీనాపె
దప్పిదేరే మోవితోడ దగదొట్టి మాటలాడీఁ
గప్పురమైనా నీరాదా కడు సిగ్గులేఁటికి ॥ అందరు ॥

పెనుఁదురు మట్టే వీడి పిక్కల వెంటా జారఁగా
పెనఁగి నిన్నుఁ బిలిచీ బ్రియురాలు
నినుపు నిట్టూర్పులతో నిలుచుండి నవ్వు నవ్వీ
పెనసి విసరరాదా యింకా సిగ్గులేఁటికి ॥ అందరు ॥

పూసిన కస్తూరిపూఁత పొడివొడియై రాలఁగ
ఆసల నలమేల్మంగ అలమీ నిన్ను
యీసులేక శ్రీవేంకటేశ యేలితివి మున్నుఁ
జేసుకొన్నపని వింతే సిగ్గువడనేఁటికి ॥ అందరు ॥ 513

కేదారగౌళ

ఇందరు జాణలే మీరు యేమని విన్నవించేము
సందడి గొల్లెతలము సంతోసించే మిదివో ॥ పల్లవి

నిద్దరించేవానివలె నీవు పవ్వళించుండఁగా
నొద్దికతోఁ బాదాలొత్తే రువిదలు
వొద్దనున్న చెలులు వొండొరుల మోములు చూచి
తిద్దుకొన్న కురులతోఁ తెరవేసే రదిగో ॥ ఇందరు ॥

అలసినవానివలె నంబరము గప్పుకోఁగా
మలసి నీదేవుళ్ళు మర్మములంటేరు
అలరి వూడిగపు వారందరూఁ దలలు వంచి
సెలవుల నవ్వి తలుపులు మూసేరదిగో ॥ ఇందరు ॥

గుట్టుగలవానివలె కొమ్మల లోలోనె కూడి
నెట్టుకొని యిందరి లోనికిఁ బిల్వఁగా
వొట్టుక శ్రీవేంకటాద్రి నున్న గోవిందరాజ నీ
చుట్టాలు కరుణఁ జెంది చొక్కి మెచ్చేరదిగో ॥ ఇందరు ॥ 514

597-వ రేకు ధన్యాశి

ఎఱుఁగుదు మన్నియును యేఁమాకుఁ జూపేవు
మఱి నీవేమి సేసినా మారుమాట లాడేనా ॥ పల్లవి ॥

మొగమిచ్చమాటలు మోరతోపు తనములు
నిగిడి తొల్లే నీవు నేరిచినవి
మొగసక్కెపు నవ్వులు యెడలేని వినయాలు
వెగటుగా చిన్ననాఁడే పెన్నుతోఁ బెట్టినవి ॥ ఎఱు ॥

కడు వట్టి సరసాలు కడగండ్ల చూపులు
యెడనెడ నీకు దయ్యమిచ్చినవి
జడిగొన్న యానలును సందుకొన్న చనవుల
పొడవకుండ వీవు పుట్టగాఁ బుట్టినవి ॥ ఎలు ॥

తక్కరి పిలుపులును తనియని రతులును
గక్కున నీవు వొడిగట్టినవి
గుక్కక శ్రీవేంకటాద్రి గోవిందరాజ నన్నేలి
అక్కర దీర్చితి విది అచ్చము నీకైనది ॥ ఎలు ॥ 515

## నాదరామక్రియ

ఇంత నిష్టూర మేఁటికే యెదుట నీకు
కొంత మొగమోట వద్దా కోసరేవు నీవు ॥ పల్లవి ॥

చెప్పుడు మాటలకే చెలువుని నింతేసి
ప్పప్పటించఁ దగునటే వోయమ్మ నీవు
కప్పుర మాతఁడిచ్చి గారవించఁగా నిన్ను
తప్పులెంచ వచ్చునటే తమకించి నీవు ॥ ఇంత ॥

నగిన యంతటిలోనే నసుపు విచారించక
మొగము వంతురటవే ముదిత నీవు
అగపడి కస్తూరి నీయంగములఁ బూయఁగా
వెగటున విదిలించి వేతురటవే (నీవు?) ॥ ఇంత ॥

జీర మేన నున్నందుకే శ్రీవేంకటేశ్వరుని
నేరములెంతు రటవే నెట్టుక నీవు
గారవించితఁడే నిన్నుఁ గాఁగిలించి కూడఁగాను
చేరడి సిగ్గులు ఇంకఁ జెంతురటే నీవు ॥ ఇంత ॥ 516

### పాట

నీవు సేసిన పనులు నిన్నే సోఁకఁగాను
ఆవటమై పవళించే వందు కోరిచేవా ॥ పల్లవి ॥

కొంగు వట్టితివి నన్ను గోవిందరాజ నీవు
యెంగిలి మోవిదానను ఇందుకోపేవా
ముంగై మురాలు వెట్టేవు ముంచి నేఁ బాదాలొత్తఁగా
అంగాలు నిన్ను దాఁకగా నందు కోరిచేవా ॥ నీవు ॥

కొసరి నవ్వేవు నాతో గోవింద రాజ నీవు
యెసఁగు చెమటదాన నిందుకోపేవా
వెస నుంగర మిచ్చే వీవేళ నే బాగాలియ్యఁగా
నెసగ నీచేయి దాఁకు నిందుకోరిచేవా ॥ నీవు ॥

కూడేవు శ్రీ వేంకటాద్రి గోవిందరాజ నన్ను
నీడ వాఁడిగోరిదాన నిందు కోపేవా
తోడఁ గడియాలిచ్చేవు వూడిగము నేఁ జేయఁగా
నేడేడఁ దాఁకునో నీవిందు కోరిచేవా ॥ నీవు ॥ 517

### కన్నడ గౌళ

ఎటువంటి నాఁడవయ్యా యింటికి విచ్చేయవయ్యా
ఘటన నీ దేవులదే కాచుకున్నదిపుడు ॥ పల్లవి ॥

వలచి కాంతలు వడినట్టే తిట్టుదురు
మలసి కోపగింతురా మగవారు
పిలచితే నాఁకువారు బిగియక మానరు
అలుగుదురా నీవు అంతలోననే ॥ ఎటు ॥

అట్టడి సతులెల్ల నాఅడి సేఁతలు సేతురు
పట్టుదురా యెగ్గులెల్లాఁ బతులేఁదైనా (లేందై?)
ముట్టితేఁ జుట్టపువారు ముంజేవట్టి పెనఁగుదు-
రట్టే సాదింతురా చలమంతలోననే ॥ ఎటు ॥

రతిలోనే వనితలు రాజసము చూపుదురు
తతిఁ బంతాలు గొందురా తమవిభులు
యితవై శ్రీవేంకటేశ యింతి నిట్టే కూడితివి
అతిబత్తి చూపుదురా అంతలోననే ॥ ఎటు ॥ 518

## దేశాక్షి

ఉండవయ్యా మమ్మునేల వుడికించేవు
బండుసేసి యాఁటదాని బతిమాలిపింతురా ॥ పల్లవి ॥

అట్టే కాఁగిలియ్యక ఆసలెన్ని వెట్టినాను
నెట్టుకొన్నమతికిఁ దనివి వచ్చీనా
గుట్టున నీవు గూడక గోరనెంత గీరినాను
వట్టి బేఁటమేకాక వచ్చేదేమున్నది ॥ ఉండ ॥

తనువులు సోఁకక తతి నెత్తమాడితే
వెనకటి విరహపు వేఁడి మానీనా
చనుమొనలు నాఁటక కనుచూపులఁ జూచితే
గొనకొన నెంచుకొన్న కోరిక దీరీనా ॥ ఉండ ॥

నన్నిట్లాఁ గూడక నవ్వులూరక నవ్వితే
కన్నెపాయపు సిగ్గులు కడతేరీనా
మన్నించి సేసవెట్టక మాటలెన్ని యాడినాను
నన్నల శ్రీవేంకటేశ చవి గానిపించునా ॥ ఉండ ॥ 519

## తెలుఁగుఁగాంబోది

అడుగవే యింకాను ఆతనినే
వొడివట్టే విదాతని కొడఁబాటు గాదే ॥ పల్లవి ॥

చిత్తము వచ్చిన సతి సేవలెల్లాఁ జేయఁగాను
పొత్తుగూడ నీవేమి కొప్పు ముడిచేవే
యిత్తల మొగమోటాన నేమీ ననకున్నాఁడింతే
తత్తరాన నాపెచేఁత యితవుగాదే ॥ అడుగ ॥

కూరిమి సేయించుకొన్న కొమ్మ మాటలాడఁగాను
తూరి సందుచొచ్చేమి సుద్దులు చెప్పేవే
వీరువారు ననేరంటా నోరుచుకున్నాఁడింతే
యేరీతి నీవాడినాను యితవుగాదే ॥ అడుగ ॥

యిట్టె కూడివచ్చినట్టి యింతి సరసమాడఁగా
నట్టనడుమ నీవేమి నవ్వు నవ్వేవే
గట్టిగా శ్రీవేంకటేశుఁ గలసితివాతఁడు
యెట్టయినాఁ జేకొనీఁ గాని యితవుగాదే ॥ అడుగ ॥ 520

598-వ రేకు ద్రావిళభైరవి

కన్నెపడుచు గనక గయ్యాళించ నేరదు
మన్ననలు చూపి నిన్ను మరిగించవయ్యా ॥ పల్లవి ॥

తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొని చెలి
తలపోసీ నీరూపు తనలోననే
జలజలఁ జెమరించె సరుగనఁ జెక్కులెల్లా
చెలఁగి కాఁగిట నించి సిగ్గువాపవయ్యా ॥ కన్నె ॥

వుదుటున మాటలాడి వొరగి పానుపుమీఁద
యెదురుచూచీ రతికి నేకతానను
ముదురుఁబులకలెల్లా మోసులెత్తె మేననిండా
యెదపైఁ జేవేసి యాస యీడేరించవయ్యా ॥ కన్నె ॥

నెట్టన నిన్నుఁ గాగిట నించి నివ్వెరఁగునొంది
గుట్టుతోఁ గోరికలెల్లాఁ గోరినిదే
ఇట్టె శ్రీవేంకటేశ యెనసి మొక్కులు మొక్కి
రట్టుసేయకింక నిట్టె దిట్టఁ జేయవయ్యా ॥ కన్నె ॥ 521

## పాడి

ఎంత సేసే విందుకుఁగా నెప్పటివారమే కామా
వంతు వరుసకు రాఁగా వద్దంటినా ॥ పల్లవి ॥

మాటల దొంతులు వెట్టి మచ్చికలు చుట్టి పెట్టి
కూటమికెసరువెట్టి కొంగువట్టేవు
యేఁటి కింతేసి సేసేవు ఇంటికి విచ్చేసి నీవు
వాఁటానఁ గాఁగిలించఁగా వద్దంటినా ॥ ఎంత ॥

వలపులఁ బంట వండి తలఁపులోఁ గూడువండి
నిలువునూరుఁ బండి నెట్టుకుండేవు
బలిమేల సేసేవు పానుపు మీఁదికి వచ్చి
వలసినట్టు సేయఁగా వద్దంటినా ॥ ఎంత ॥

చూపులనే విందుచెప్పి సొంపులు పైపైఁ గప్పి
తీపుమోవితేనె గుప్పి తిప్పేవు చేయి
రాపుగ శ్రీవేంకటేశ రవ్వలేల సేసేవు
వైపుగానే కూడితివి వద్దంటినా ॥ ఎంత ॥ 522

## లలిత

మేనవార మిద్దరము మెచ్చులాయఁ బనులు
యీ నేరుపులు గంటి నిఁక నేఁటి మరఁగు ॥ పల్లవి ॥

నవ్వులేమి నవ్వినే నయగారి తనమున
జవ్వన పాయమెల్లా జట్టిగొనెను
రవ్వలాయ మావలపు రమ్మనవే యింటాడకు
యెవ్వరూ నేమి చెప్పేరు యిఁకనేఁటి మరఁగు ॥ మేన ॥

సుద్దులేమి చెప్పినే చుట్టరికములనే
గద్దరి నామనసు తాఁ గైకొనెను
పెద్దాయ వాసలు పెనఁగి చూడుమనవే
యిద్దరము నిద్దరమే యిఁక నేఁటి మరఁగు ॥ మేన ॥

తప్పకేమి చూచీవే తన తరితీపులవే
వొప్పుగ నాకాఁగిట నొనగూడేను
చిప్పిలె నా చెమటలు శ్రీవేంకటేశుఁడు తాను
యెప్పుడూ నన్ను మన్నించు నీఁక వేఁటి మరఁగు ॥మేన॥523

మంగళ కౌశిక

ఇన్నియు నీయందే కంటి మిఁక నొకచోటఁ గాదు
సన్నల చాయల నేము సంతోసించేమయ్యా ॥ పల్లవి ॥

మగవానికేడ సిగ్గు మగువలు వద్దనుంటే
తగిలి కాఁగలించఁగఁ దమకింతురు
యెగసక్కెలాడేవారి నెరఁగరు చెలరేఁగి
పగటు వయోమదము పచరింతురు ॥ ఇన్ని ॥

కోడెకానికేడ వేళ కొమ్మలు మాటలాడితే
యేడనైనాఁ గూడుమంటా నెచ్చరింతురు
ఆడికెకు వెరవరు అండవారిఁ జూడరు
పీడెపు మోవితేనెకు వేఁడుకొందురు ॥ ఇన్ని ॥

మొక్కలీనికేడ నీతి ముదితలఁ బొడగంటే
గక్కునఁ గాఁగిట నించి కరగింతురు
మక్కువ శ్రీవేంకటేశ మందెమురా యడవై
యిక్కడ నన్నేలితివి యింతా నెరుఁగుదురు ॥ ఇన్ని ॥ 524

గౌళ

నీ గుణ మిటువంటిదా నిన్నా మొన్నాను
ఆగడానఁ బడి వచ్చి అనేవు గాక ॥ పల్లవి ॥

యెగసక్కె మేదయ్యా యింతులము నీతో
నగరాదా నీవే చనవు లియ్యఁగా
మగిడి యెవ్వతోచేత మాటఁ బడిన కోపాన
పగటు బీరము మామైఁ బూపేవు గాక ॥ నీగుణ ॥

గబ్బితన మేదయ్య కాలు నీవు దొక్కఁగాను
దొబ్బరాదా నొచ్చీ నంటాఁ దొలఁగు మని
గుబ్బున నెవ్వతో నిన్నుఁ గూడని వుడుకునను
గుబ్బలొత్తెనని నీవు గుంపించేవు గాక ॥ నీగుణ ॥

వుద్దండ మిందేదయ్య వూరకే కస్తూరి బొట్టు
దిద్దరాదా జారఁ జెక్కుటద్దాల వెంట
గద్దించి నన్నేలి శ్రీవేంకటేశ యెవ్వతొకంటెఁ
బెద్దరికానకు నాతో బిగిసేవు గాక ॥ నీగుణ ॥ 525

## సౌరాష్ట్రం

మమ్ము సాకిరివెట్టేవు మాటిమాటికి
యిమ్ముల మమ్మేలితివి యేమనేమయ్యా ॥ పల్లవి ॥

వొద్దనుండి నీతోఁ జెలి వొట్టువెట్టుక వున్నది
గద్దించి పిలిచేవిటు కమ్మటి నీవు
వుద్దండము నీవొళ్లిది వువిదవల్లఁ జలము
యిద్దరూ నిద్దరే నేము యేమనేమయ్యా ॥ మమ్ము ॥

ముప్పిరిఁ బాన్పుపై నాపె ముసుఁగు వెట్టుకున్నది
అప్పుడే మాటాడుమని యానవెట్టేవు
తప్పులు నీగుణాలవి తరుణి వాసికత్తె
యెప్పుడు మీరు మీరే యేమనేమయ్యా ॥ మమ్ము ॥

అంగన చెక్కుచేతితో నసురుసురై వున్నది
యెంగిలిగాఁ జేసి నోవి యెనసితివి
ముంగిటనాపె నవ్వితే మొక్కేవు శ్రీవేంకటేశ
యింగితపు జాణలు మిమ్మేమనేమయ్యా ॥ మమ్ము ॥ 526

599-వ రేకు

## కొండమలహరి

ఎంతవద్దన్న మాన విందుకుఁ జొచ్చితివి
మంతుకెక్కించేవు నన్ను మరియేమి సేతురా ॥ పల్లవి ॥

చెనకకు నీవు నన్ను చేతులు చాఁచి
కొనలు వాండ్లు నీగోరు దాఁకిని
నను( జూచితేఁ జెలులు నవ్వేరిఁక
యెనలేని సిగ్గు ముంచీ నేమిసేతురా ॥ ఎంత ॥

ముట్టకు నా మెడనున్న ముత్తేలు నీవేళ్ళను
గట్టులు నాచన్నులతో కంగురనీని
చుట్టిరానున్న చెలులు చూచి నవ్వేరు
యిట్టే వాకు సిగ్గు ముంచీ నేమి సేతురా ॥ ఎంత ॥

పోయ కెదుగా నేసలు పొంచి నీదోస్సైతే
చాయల సారెకుఁ దాఁకి జారీఁ గొప్పు
యీథొడఁ బెండ్లాడితివి యిట్టే శ్రీవేంకటేశ
యీయెడ సిగ్గులు ముంచీ నేమి సేతురా ॥ ఎంత ॥ 527

## దేసాళం

నన్ను నేల పొగడేవు నవ్వేరు నిన్ను
కన్నెలు నీపొందులకుఁ గాచుకిట్టేవుండఁగా ॥ పల్లవి ॥

బలిమేల సేసేవు బాఁతిపడి నాతోను
యెలమి నావంటి చెలు లెందరు లేరు
కలకాలమును వ్రాడిగపు కాంత నింతే నేను
చలమేల దొడ్డదొడ్డ సతులెల్లనుండఁగా ॥ నన్ను ॥

చేయివట్టి తీసేవు చిఱునవ్వులు నవ్వుతా
డాయ వచ్చిరిందరుఁ జుట్టాలే నీకు
బాయిట సమ్మోళిగెలుపట్టె తొత్త(నింతే?)నీకు
వేయకు మాపైఁ జేయి వేలయాండ్లుండఁగా ॥ నన్ను ॥

చన్ను లేల పిసికేవు సరి నాకాఁగిటఁ గూడి
వన్నెల నీవేళ నాఁడువారే వున్నారు
అన్నిటా నీవు భోగించినట్టి యెంగిలి నేనింతే
మన్నించు శ్రీవేంకటేశ మావారిందరుండఁగా ॥ నన్ను ॥ 528

## తోండి

మాకేల వాదులడువ మాఁటిమాఁటికి
యీకడను నీమతకము ఇంతయు నేఁ గంటిని ॥ పల్లవి ॥

వలతు నంటాఁ జెప్పి వారి వీరి తోడుతను
మెలుపున నీసతి యెమ్మెలు చూపీని
చలివాసి తిరిగీని సవతుల ముందరను
సలిగె నీవిచ్చినదే సతముగాఁ గంటిమి ॥ మాకేల ॥

నీ విచ్చిన సొమ్ము లివి నెలఁతలకెల్లఁ జూపి
దేవులతనమెల్లా నిందే నెరపీని
చేవదేరెఁ బనులెల్ల సిగ్గులు వడదిప్పుడు
భావింప నీపోలికెల్లాఁ బడఁతిపైఁ గంటిమి ॥ మాకేల ॥

కాఁగిట నిన్నుఁ గూడి కాంతలలో మెరసీని
రాఁగి నీవు నన్నేలితే రవ్వసేసీని
పాఁగెను శ్రీవేంకటేశ పచ్చిదేరించె నీమేను
నాఁగువారే పొందు లీకె నవ్వులలోఁ గంటిమి ॥ మాకేల ॥ 529

## ఛాయానాట

ఎఱుఁగనైతి నిందాఁకా నేఁటిదో యంటా నుంటి
నెఱిఁ దొరలనాడీని నేనేమందు నీఁకను ॥ పల్లవి ॥

కొండలలో నెలకొన్న కోన చెన్నరాయఁడిదే
బొండు మల్లెల వేసెనే ఘాఁచి నన్నును
పండు ముత్తేల సొమ్ములప్పటి నామెడఁ బెట్టి
దుండగము సేసె నేమందు నేనీఁకను ॥ ఎఱుఁగ ॥

గొప్పయైన యేటిదరిఁ గోన చెన్నరాయఁడిదే
దప్పికిఁ గప్పురమంపెఁ దరుణిచేత
చెప్పరాని మాటలెల్లాఁ జెవిలోఁ బానే చెప్పి
దుప్పటి గప్పి నేమందు నేనీఁకను ॥ ఎఱుఁగ ॥

గుఱితో శ్రీవేంకటాద్రి కోన చెన్నరాయఁడిదే
చెఱఁగు వట్టి ప్రియాలు చెప్పికూడెను
జఱయుచు వచ్చి వచ్చి చనవులెల్లా నొసగి
మెఱసి తొరలనాడీ మఱేమందు నిఁకను ॥ ఎఱుఁగ ॥ 580

## సావేరి

కానీవమ్మ యీపుణ్యము గట్టుకోవమ్మా
పూని యాతని కెంతేసి బుద్దులు చెప్పేవు ॥ పల్లవి ॥

నే నాతఁడు రాకుండఁగా నేరము లెంచినవెల్లా
తానుకగాఁ బట్టితివి కాంతునికి
మేనిపై మచ్చము చూచి మెల్లనే నే నవ్వితేను
కానికఁగా నాతని పంతము రేఁచేవు ॥ కానీ ॥

తక్కవుండిన యాతనిఁ దప్పులు వట్టినవెల్లా
అక్కునఁబోసి చూపితి వాతనికిని
వెక్కసపుఁ జెమటకు వెంగెము నేనాడితేను
వక్కణ చెప్పె(ప్పి య)తనికి వాసివుట్టించేవు ॥ కానీ ॥

దిమ్మరై తిరుగఁగా నేఁ దిట్లు దిట్టినవెల్లా
అమ్మరో పూసగుచ్చి నట్లప్పగించితి-
వుమ్మడి శ్రీవేంకటేశుఁ డొనగూడి నన్ను నంటె
ఇమ్ముల నిది చెప్పుమనె(నియె)మ్మెలు సేసేవు ॥ కానీ ॥ 581

## సామంతం

ఎంతకుఁ జాలవు నీవిటువంటి సుద్దులు
పంతము గొనేవి నీపనులే కావా ॥ పల్లవి ॥

తలపోఁతలో నుండి తమి రేఁచే వెల్లాను
మలసి నీవాడిన మాటలే కావా
కలలోపలను వచ్చి కరఁగించే వెల్లాను
నలువంక నీ సెలవి నవ్వులే కావా ॥ ఎంత ॥

గుట్టుతోడ మనసులో గుబ్బతిలే వెల్లాను
చిట్టకపు కొనగోరి సేఁతలే కావా
గట్టిగా నామర్మములు కరఁగించేటి వెల్లాను
జెట్టుగా నీవు మన్నించే ప్రియములే కావా ॥ ఎంత ॥

పక్కన నాకాఁగిటిలో భ్రమయించే వెల్లాను
గక్కనఁ గూడిన సంభోగములే కావా
మక్కువ శ్రీవేంకటేశ మరచిన వెల్లాను
చిక్కసి నీమేని మీఁది సింగారాలే కావా ॥ ఎంత ॥ 582

300-వ రేకు

## మనోహరి

అందుక నేఁ గాక నేను అడుగుకోనోపనా
యెందరికైనాఁ దాను ఇచ్చకములాడునే ॥ పల్లవి ॥

ఆవేళ కక్కూర్తిమాట లాడుఁగాని వేరొకతె
కైవశము సేసుకొంటేఁ గానిమ్మనునే
చేవట్టి నేఁదీసితే చిత్తగించి వచ్చీఁ గాని
వావి యెవ్వతె చెప్పినా వలపులు చల్లునే ॥ అందు ॥

వొద్దనున్న అంతవడి వొడఁబడి వుండుఁ గాని
బుద్ధియెవ్వతె చెప్పినా నపుడే వినునే
తిద్దుకొని బాసగొంటే దిష్టముగా నిచ్చుఁగాని
బద్దు లెవ్వతాడించినాఁ బలుమారు నాడునే ॥ అందు ॥

సరసములాడితేను చనవిచ్చుఁ గాని వేరే
తరుణి కాఁగిలించితే దక్కివుండునే
యిరవై శ్రీవేంకటేశుఁడిటు తానే నన్నుఁగూడె
యెరవుల వారినెల్లా నెనసీ నెనయఁడే ॥ అందు ॥ 583

## బౌళి

కాదు గూడదంటమా కమ్మటి నీతో నేను
పోదిసేసి నీకు నీవే పొదిగేవు గాక ॥ పల్లవి ॥

పంతమాడేమా నీతో బలుములు చూపేమా
వింతవారమా నేము వేగినంతాను
యెంతేసి వేడుకొనేవు ఇక్కువలేలంటేవు
కాంతల నేలంపేవు కమ్మటి మాయింటికి ॥ కాదు ॥
యేడనుంటి వంటిమా యెగ్గులు వట్టితిమా
వీడె మియ్యకుండితిమా వేగినంతాను
వోడకేల కొసరేవు వొడివట్టేల తీసేవు
ఆడకే లేకలువా (వ్రా?)సి అంపేవేల ఇంటికి ॥ కాదు ॥
సేవ సేయకుండితిమా శ్రీవేంకటేశ్వర నీకు
వేవేలు రతులందమా వేగినంతాను
పూవుల నేల వేసేవు పొంచి యేల నవ్వించేవు
ఆవటించి వచ్చేవు నీవప్పటి మాయింటికి ॥ కాదు ॥ 534

ఆరిభి

తొల్లే నేమెరుగుదుము తొడిబడ నీసుద్దులు
కల్లగాదు నిన్నప్పటి గరిసించ నేటికి ॥ పల్లవి ॥
యేతున నీవాడే మాటలిన్నియును జెల్లివచ్చె
యీతల మాకోపమిక నెందుకెక్కును
జాతితో నీ నవ్వేనవ్వు సరివచ్చె మామీదను
నీతి చెప్పి పెనగగ నీతోనేల ఇకను ॥ తొల్లే ॥
పట్టిన నీచలములు పంతములకెల్లా నెక్కె
ఇట్టె నేవేడుకొనిన నేడకెక్కును
రట్టుసేసే నీవుద్దండా లిట్టె ఇంతటా నిండె
నెట్టుకొని బాసడుగ నీతోనేల ఇకను ॥ తొల్లే ॥
కందువ నీకూటమి కాగిటికి గురుతాయ
యిందరు జెప్పె బుద్ధులేడకెక్కును
సందిట శ్రీవేంకటేశ చనవిచ్చి కూడితివి
నిందలు వేయును నాడ నీతోనేల ఇకను ॥ తొల్లే ॥ 535

## * పూరిళి

వెగ్గళించఁ జూచితేను వేసటలౌను-అందు
వెగ్గళమైతే వలపు వెల్లివిరిసీని ॥ పల్లవి ॥

సగము మాటాడవే వోసతి నీవాతనిచేత
సగము దెలుసుకొనేజాడ యెట్టిదో
తగులు గొంత చూపవే తరవాత నాతనికిఁ
దగులు గలిగితేను తమకించీ నిపుడు ॥ వెగ్గ ॥

మొదలఁ గొంత నవ్వవే మోహాసకు నీకతఁడు
మొదలుఁ దుదాఁ గలితే ముంచి నవ్వీని
యెదురు చూడవే మొక మెదురుకట్లఁ దాను
యెదురు చూచీ రతికి నితవు గలితేను ॥ వెగ్గ ॥

చేయి చాఁచవే నీవు శ్రీవేంకటేశుఁడు రెండో
చేయివట్టి తీసి నీసిగ్గు వాపీని
యీయెడనుండి కూడితి విన్నిటా నామాట విని
యీయెడనే ఆతఁడు నిన్నిదివో మన్నించె ॥ వెగ్గ ॥ 538

## నాగగాంధారి

ఎంత మన్నించెనే నన్ను నితఁడు నేఁడు
వింతలు లోకానకెల్లా వెగ్గళములే ॥ పల్లవి ॥

యేకతానఁ దాఁ బెట్టిన వెటువంటివో ఆనలు
వాకుచ్చేనంటే నావసము గాదే
చేకొని యప్పుడు నాకుఁ జెప్పినట్టి ప్రియములు
దాకొని రట్టు సేయఁగఁ దగవు గాదే ॥ ఎంత ॥

తానే మాయింటికి వచ్చి తగనిచ్చిన యీవులు
పానిపట్టి యెక్కడాఁ జూపఁగరానివే
నానావిధములు నాతో నవ్వినట్టి నవ్వులు
తానకమై మతిలోన దాఁచ వలెనే ॥ ఎంత ॥

* ఈ సంకీర్తన భావము స్పష్టముగా లేదు.

యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసిన కూటములు
చిప్పిలి నా మైనుండఁగ సిగ్గులయ్యీనే
ముప్పిరి నామీఁద నిట్టే ముంచినట్టి మోహములు
వొప్పుగా నాజవ్వనాన కుంకువాయనే ॥ ఎంత ॥ 537

## సామంతం

మగవారయినవారు మగరీతినుంట గాక
పగటులు మించి వలపటాలకు వత్తురా ॥ పల్లవి ॥
ఆపే నేసూ వాదించఁగా నడ్డాలు వచ్చేవు నీవు
కాపాడే నీపొందులిందు గాన వచ్చెనా
చేపట్టినవాఁడ నంటా సిగ్గులు విడిచి నీవు
యీ పనులకు వత్తురా యిందరు నవ్వేరు ॥ మగ ॥
తగవు లిద్దరమును తమితోఁ దేరుచుకోఁగా
తెగి మాట వోరగులు దిద్దవచ్చేవు
మిగులా మోహింతునంటా మేరలు మీరి నీవు
అగడుకు లోనౌదురా అందరు నవ్వేరు ॥ మగ ॥
సపతులము మాలోన సమ్మతించొక్కటి గాఁగ
కపతో నడుమ మమ్ముఁ గాఁగిలించేవు
తపిలి శ్రీవేంకటేశ తత్తరించి కూడితివి
యివల నీసుద్దులకు నిందరు నవ్వేరు ॥ మగ ॥ 538

# ౧-వ అనుబంధము

## (సందిగ్ధపదసమీక్ష)

[పదునెనిమిదవ సంపుటమున సంపాదకులు కొన్ని సందిగ్ధశబ్దములకు అర్థము సూచించినారు. మరి కొన్నిటికి అర్థము సందర్భానుసారముగ చెప్పుకోవలయునని వ్రాసిరి. తాళ్ళపాకవాఙ్మయములోని అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈ పని విపులముగ సాగవలసియున్నది. ఆ పనికుపస్థారముగ ఈ పందొమ్మిదవ సంపుటములోని అపూర్వపదములలో కొన్నిటికి మాయెఱుకకువచ్చిన యర్థములను ఇందు సూచించుచున్నాము.]

1. అందగాని మాటలు:-(82 పాట)

'అందగాఁడు' అనుటకు కన్నడమున 'అందగార' అని రూపము. ఇది దాని - ఔపవిభక్తికము కాగలదు. తెలుగువారికి కర్ణాటక సామ్రాజ్యముతోడి పొత్తు గలిగిన ఫలముగ వచ్చిన అనేక శబ్దములలో ఇది యొకటి

2. అప్పణ: (202)

ఆజ్ఞ అని యర్థము. కన్నడము 'అప్పణె'. అర్పణ శబ్దభవము. 'ఆజ్ఞాపన' శబ్దభవమని కిట్టెల్.

3. ఆసోదము: (18)

ఇది 'ఆస్వాద' శబ్దభవమని పండితులొకరు సూచించిరి. 'ఆచోద్య'భవమా? అని మేమనుకొనుచుంటిమి. "రమణీయత" అర్థము కావచ్చును.

4. ఈటు:-(37)

ఇంత అని కన్నడమందర్థము. (1) స్వార్థము, (2) శూన్యము అని శ. ర. ఇచ్చిన అర్థము ఇక్కడ అతుకదు. 'ఈడు' అను తమిళశబ్దమునకు గౌరవము, తృప్తి, బహుమానము-మొదలగు అనేకార్థములు గలవు.

5. ఉంగిటిగా:- (116)

ఉంగిడి=పశురోగము (నామ) అని శ. ర. ఇక్కడ దాని గౌణార్థముగ బాధ, తొందర - అనవచ్చును.

6. ఉంచాన:- (207)

'ఉచ్చ' శబ్దమునకు 'ఉంచ' అను కన్నడరూపమును కిట్టల్ ఇచ్చినాడు. దీని తెలుగురూపము ఉంచము; ఉంచమున - ఉంచాన, కావచ్చును. హిందీలోని 'ఊంచ్' కూడ నిదే కావచ్చును. పెద్దగా అని అర్థము. 492 పాటలోని 'ఉంచవు' కూడ ఉంచ + అవు కావచ్చును.

7. ఎకగొల్ల కత్తె:-(494)

నందు చూచి కొల్లగొను నాడుది,

8. ఎచ్చరవయ్యా:-(37)

'ఎచ్చిఱు' అని సూ. ని. మేలుకొను అని యర్థము. 'ఎశ్చరు' 'ఎచ్చరు' అని కన్నడ రూపములు. అరమొకిచే.

9 ఎడ్డ:- (495)

ఎడ్డె. కన్నడమున 'హెడ్డ' 'ఎడ్డ' అని రూపములు గలవు. బుద్ధిహీనుడు, మోసగాడు - అని అర్థములు,

10. ఎదుగా :- (48)

ఎక్కువగా అను నర్థమున, రాయలసీమ సామాన్య వ్యవహారములో 'ఎదగా' అను పదము కలదు. 'ఎదుగు' ధాతువు రూపమే కావచ్చును.

11. ఏలాటాలు:- (206)

పరిహాసము అని సూ. ని. 'హేలా' శబ్దభవము ఏల కావచ్చును.

12. ఒలపేము:-(28)

'వలపేము' శబ్దముయొక్క వ్యవహారరూపము కావచ్చును లోబరచుకొను, ఆకర్షించు - అని తాత్పర్యము,

13. కప్రపుఁబడివారము:- (112)

నాయకుఁడిచ్చు కర్పూరమునకు పాలివారు. నాయకుఁడు ఒప్పంద మునకై నాయికకు కర్పూరమిచ్చుట ఈ వాఙ్మయమున పలు చోట్ల గలదు.

14. కాకరి:- (98)

కాఁక గలది అని అర్థము కావచ్చును. కాని అరసున్న ఇందు లేదు. కాకు చేయునది అనియైనను చెప్పనగును.

15. కిచ్చు:- (66)

'చిచ్చు'నకు కన్నడరూపము 'కిచ్చు'

16. కోఁడి కోఁడి చూపులు:- (128)

కొనచూపులు. 'కోటి' శబ్దభవమో 'కొండి'కి రూపాంతరమో కాగలదు.

17. కోలుముందుగా:- (207)

ముందుపడి పుచ్చుకొనుట అనునర్థము కావచ్చును. అహమహ మిక.

18. గజరు:- (410)

'గదురు'నకు రూపాంతరముకావచ్చును. దుర్గంధమని యర్థము. 'గజరుఁగాంత' లనగా చెంచు, గొల్ల-మొదలగు జాతుల స్త్రీలు కాగలదు.

19. గరివడు:- (211)

గరవడు=గడ్డకట్టు అని సూ. ని. ఇక్కడ 'గరివడు'నకు గూడ దాని గౌణార్థమైన కుష్ఠమగు - అనుట తగును.

20. గరిసించు:- (417)

'గర్హించు' శబ్దభవము కావచ్చును. 'కరిసించు' అని గ్రహించి సూ. ని. 'ఘృష' ధాతుభవము - ఎదిరించు అను నర్థమిచ్చినది.

21. సుమితము:- (487)

'సంభిత' శబ్దభవము కావచ్చును. కన్నడము 'సుమిత' రహస్యవార్త, ఉపకోలు (వదంతి) అని అర్థము.

22. చదురాండ్రులు:- (79)

చతురముగ మాటలాడు స్త్రీలు. వగలాండి, తుటుకులాండి వలె. ఏకవచనాంతముపైన 'ఆండి' వచ్చుట విశేషము.

23. చలిమి - బలిమి:- (40)

'చెలిమి' శబ్దమే ఇందు చలిమి అని వాడబడి యుండును.

24. చెలప చెమటలు:- (140)

'చెలమ' శబ్దముయొక్క సామాసిక విశేషణరూపము 'చెలప' అగునేమో.

25. జంగిలి:- (155)

పశుసమూహమని సూ. ని. సమూహసామాన్యమని కన్నడము.

26. జరయు:- (24)

నిందించు అని అర్థము. ఈ యర్థమునందే 'జవె' 'జహె' అని కన్నడధాతువు.

27. జాముటు :- (53)

జాము శబ్దముయొక్క అపూర్వమైన ఔపవిభక్తిక రూపము. "యామమాత్రం సహస్వ" అను కాళిదాసువాక్య మిందు స్మరణీయము.

28. తడిసూపు:- (363)

తడియార్చు గుడ్డలు? పరమయోగివిలాసములో "తరుణికి జిలుగాపుం దడిసుదులిచ్చి" (358 పుట) అను చిన్నన్నప్రయోగ మిదియే కాగలదు. తడి + సుడు అని, ఎండింపజేయు అను సూ. ని. ఇచ్చిన వ్యుత్పత్తి సందిగ్ధము.

29. తాటుపడు:- (317)

తాటిచెట్టువలె నిక్పృయముగ నిల్చు; ప్రాన్పడు వంటిది.

30. దిచ్చరి:- (18)

దిక్చారి - ద్రిమ్మరి అని అర్థము.

31. దోమటి:- (25)

దోమట్లు అని కూడ (124) లో బహువచనరూపము గలదు. అన్నము అని సూ. ని. శ.ర, లిచ్చిన అర్థము ఇక్కడ పొసగదు. 'దోమటి దొరుకు' అను ప్రయోగము శబ్దపల్లవమువలె పలుచోట్ల నిందు కానవచ్చుచున్నది.

32. దూరై:- (136)

దూరు + ఐ దూరమై. 'దూరం' మనుశబ్దము కన్నడమున 'దూరు'గా కలదు.

33. నాగువాటే పొందులు:- (529)

నాగు=ధాన్యపువడ్డి. 'నాము, నావు' కూడ వ్యవహారమున గలవు. వడ్డి వాలు, పెరుగు - అని యర్థము.

34. నాటకీడు:- (501)

నాటకమాడువాడు, 'నాటక'ములో అరసున్న పొరబాటేమో!

35. పాలార్చు:- (112)

పాలు + ఆఱుచు = పాలార్చు, నశింపజేయు అను నర్థము స్పష్టమే. కానీ ఆయర్థమిచ్చట సరిపడదు. పాలు + ఆడించు= పాలార్చు. తనపాలిదిగా చేయు అను అర్థము సరిపడును. దీనికి 475, 498 కూడ చూచునది.

36. పుక్కటి:- (33)

పుక్కటి, పుక్కటె, పుసాటి - అని కన్నడ రూపములు. తేరకు, వ్యర్థముగా అని అర్థము దీని రూపాంతరము

పుగసాటి, పూసాటి - మొదలగు అనేకములు గలవు. 'పుక్కిటి పురాణము'లోని తొలిపద మిదియే కావచ్చును. అసందర్భమైన ప్రసంగమని యర్థము.

37. పేరడి:- (207)

పెద్ద అడుగు, ఎక్కువ అని యర్థము.

38. పొట్టఁబొడుగు:- (109)

పట్టపగలు వంటిది. మిక్కిలి సమీపమని యర్థము. అరసున్న చింత్యము.

39. మాఁట - మాట:-

ఇట్లు రెండురూపములును బహుళముగా గలవు. మాట యందు అరసున్న ఒకానొక కాలమందున్నట్లున్నది. సబిందుక - నిర్బిం దుక ప్రాస సాంకర్యమునకు ఉదాహరణముగ అనంతుడు తన 'ఛందోదర్పణము'న ఈక్రింది లక్ష్యము లిచ్చినాడు.

" వీఁపు మూఁపులు మఱి తలమోపులయ్యె
మాఁటలేఁటికి మేటి తాఁబేటి కనఁగ ". (1-52.)

ఇట్లే కొన్నియెడల 'మాఁటి మాఁటికి' అని కూడ సబిందుకముగ రేకులలో గలదు.

40. మానాపతులము:- (15)

'మానవతుల' మనుటకు వ్యావహారిక రూపము. నేటికిని కడప మండలములో గలదు.

41. మేకులు:- (18)

మేకు=పెద్దటెక్కము అని కన్నడమున.

42. రాతిట:- (53)

పై చూపిన 'జాముట' వంటిది. రాత్రియందు.

43. రావాడి:- (217)

రావు + అడు. 'రాహు' శబ్దభవము రావు. 'రావుగొట్టెముఖము' అని వ్యవహారము. రావాడు = కలుషవర్ణమును చూపు అని అర్థము కావచ్చును.

44. వలపక్షాలు :- (538)

పక్షపాతములు. ఇది వ్యవహారమున నున్నది. దీనికే 'వలపక్ష'మని గూడ వ్యవహారము.

45. వాంకపు వలపులు:- (245)

'వాంక'కు 'వాంకము' అని రూపము కలదా? అట్లైన ప్రవహించు వలపులు అను నర్థము కావచ్చును.

46. వారకాన:- (204)

వారకము=సమానత్వము. 'ఓరిగె' 'వారిగె' అనునవి కన్నడమున ఈ యర్థమునందు గలవు

47. శాలామాలము:- (186)

శాలామాలావాహ=అవకతవకలుగా (Confusedly) అని తమిళ నిఘంటువు.

ఇట్టివే 1. ఈండా - మోండా (119) 2. దారా - మోనా (111) 3. సాటికి - జేటికి అను జంటపదములు స్పష్టార్థములు కాకున్నవి.

48. సంతమౌట:- (48)

శాంతశబ్ద భవము. నెమ్మది పడుట.

# ౨-వ అనుబంధము

## రాగ - సంకీర్తన సంఖ్యా సూచిక



| అకారాదిగ రాగములు. | | సంకీర్తనల సంఖ్య. |
|---|---|---|
| అమరసింధు | .... | 137, 209, 323, 489. |
| ఆదిభి | .... | 22, 535. |
| ఆహిరి | .... | 2, 12. 21, 24. 31, 42. 56. 64, 75. 96, 99, 116. 151, 200, 240. 248, 264, 272. 284, 301, 314, 338. 367, 377. 389, 400, 401, 404, 419, 457. 465, 474, 486, 505. 510. |
| ఆహిరినాట | .... | 496. |
| కన్నడగౌళ | .... | 108. 180, 212, 355, 418, 485, 518. |
| కాంబోది | .... | 19, 57, 67. 97. 114, 146, 183, 206, 213, 237, 251, 312. 359, 392, 433, 435, 464, 482. |
| కుంతలవరాళి | .... | 375, 473. |
| కురంజి | .... | 49, 125, 203, 315, 395, 421. |
| కేదారగౌళ | .... | 11, 83, 136, 280, 428, 470, 514. |
| కొండమలహరి | .... | 225, 410, 459, 527. |
| గంభీరనాట | .... | 424. |
| గుండక్రియ | .... | 276. |
| గుజ్జరి | .... | 297. |

గౌళ .... 52, 103, 149, 233, 339, 525.

ఛాయానాట .... 59, 309, 530.

తెలుఁగుకాంబోది
తెలుఁగుఁగాంబోది .... 5, 16, 29, 140, 231, 275, 509, 520.

తోండి .... 54, 529.

దేవగాంధారి .... 28, 82, 158, 163, 170, 194, 250, 258, 274, 329, 360, 497, 511.

దేశాక్షి .... 60, 90, 95, 159, 216, 239, 290, 306, 330, 437, 442, 469, 492, 519.

దేసాళం .... 25, 68, 74, 80, 145, 177, 191, 214, 223, 244, 252, 282, 296, 310, 350, 376, 387, 393, 441, 508, 528.

ద్రావిడ(ళ)భైరవి ... 188, 521.

ధన్నాశి .... 77, 102, 197, 217, 232, 294, 300, 487, 515.

నట్టనారాయణి .... 65, 101, 165, 477.

నాగగాంధారి .... 347, 537.

నాగవరాళి .... 94, 100, 207, 255, 335, 423, 461, 502.

నాట .... 131, 204, 373, 379, 432, 483, 517.

నాదరామక్రియ .... 3, 36, 70, 105, 111, 121, 169, 195, 235, 249, 279, 327, 369, 405, 414, 516.

నారాయణి .... 112, 156, 192, 291, 324, 368, 452, 479.

నీలాంబరి .... 15, 153.

పళవంజరం .... 48

పాడి .... 45, 98, 113, 139, 144, 154, 190, 20[illegible]
... 222, 226, 229, 262, 268, 286, 287
337, 364, 391, 403, 430, 447, 451,
478, 522.

పూరిభి .... 536.

పూర్వగౌళ .... 141, 348, 488.

బలహంస .... 210, 396

భవుళి(బౌళి) .... 32, 58, 85, 142, 157. 175, 246, 253,
289, 295, 346, 372, 394, 397, 456,
466, 499, 534.

భవుళిరామక్రియ .... 234, 513.

భూపాళం .... 215, 263, 299, 507.

భైరవి .... 10, 72, 76, 127. 138, 184, 185, 212,
247, 320, 340, 413, 139, 144, 419,
480, 484.

మంగళకౌశిక .... 39, 46, 109, 133, 199, 357, 362, 408,
460, 521.

మధ్యమావతి .... 7, 33, 134, 251, 311, 382. 436.

మనోహరి .... 173, 422, 533.

మలహరి .... 305.

మాళవి .... 198.

మాళవిగౌళ .... 35, 130, 193. 349, 374, 417, 475, 501.

మాళవిశ్రీ .... 243.

ముఖారి .... 6, 44, 66, 84, 117, 124, 150, 152, 186, 196, 218, 261. 266, 322, 326, 345, 366, 386, 431, 462, 504.

మేచబౌ(భవు)ళి .... 40, 292.

రామక్రియ .... 37, 63, 88, 155, 164, 181, 227, 267, 269, 285, 317, 343, 351, 378, 381, 388, 455, 467, 471.

రీతిగౌళ .... 17, 257, 293.

లలిత .... 53, 198, 236, 281, 325, 333, 342, 365, 412, 445, 448, 463, 491, 523,

వరాళి .... 91, 119, 135, 174, 187, 202, 307, 371, 384, 402, 411, 427.

వసంతవరాళి .... 399.

శంకరాభరణం .... 1, 9, 14, 27, 30, 69, 78, 87, 110, 122, 129, 147, 168, 171, 178, 179, 208, 211, 256, 278, 288, 302, 334, 344, 363, 370, 406, 416, 446, 472, 490, 500.

శుద్ధదేశి .... 20, 118, 182, 273, 316, 390, 398, 440.

శుద్ధవసంతం .... 51, 115, 143, 189, 241, 353, 361, 434, 453.

శోకవరాళి .... 265.

శ్రీరాగం .... 8, 38, 71, 86, 93, 104, 148, 201, 238,
.... 245, 270, 298, 303, 332, 358. 407, 420, 438, 450, 495, 506.

సామంతం .... 13, 43, 61, 73, 81, 132, 160, 161, 166, 220, 260, 271, 318, 331, 352, 383, 426, 443, 481, 503, 532, 538.

సామవరాళి .... 47.

సావేరి .... 341, 531.

సారంగం .... 4, 23, 89, 126, 228, 321, 354.

సారంగనాట .... 41, 50, 62, 79, 92, 107, 120, 128, 162, 167, 172, 219, 221, 259, 308, 336, 356, 385, 409, 429, 454, 458, 493, 512.

సింధురామక్రియ ... 26, 106, 123, 230, 304, 494.

సౌరాష్ట్రం .... 18, 176, 224, 277, 313, 415, 526.

హిందోళం .... 34, 319, 468.

హిందోళవసంతం ... 55, 328, 380, 476.

హిజ్జి(జ్జె)జి .... 283, 425.

# ౩ వ అనుబంధము

* * *

## సంకీర్తనల అకారాది సూచిక


| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య |
|---|---|---|---|---|
| అంగనకు మారుగమ్మ | .... | రామక్రియ | .... | 455 |
| అంగనలెల్లా నవ్వేరు | .... | శంకరాభరణం | .... | 370 |
| అంగనవిడె మిచ్చీని | .... | నారాయణి | .... | 192 |
| అందరు నెఱిఁగినవే | .... | ధవళరామక్రియ | .... | 513 |
| అందుకనేఁ గాక నేను | .... | మనోహరి | .... | 533 |
| అందుకేమి దోసమా అట్టే | .... | దేసాళం | .... | 350 |
| అందుకేమి దోసమా అన్నిటా | .... | సాళంగనాట | .... | 259 |
| అందుకేమి దోసమా అవు | .... | రామక్రియ | .... | 267 |
| అందుననే కనుఁగొనే | .... | పాడి | .... | 113 |
| అందువల్లఁ గాని నమ్మ | .... | కురంజి | .... | 421 |
| అంపఁగానే వచ్చితిమి | .... | లలిత | .... | 445 |
| అటుచూడు సతినేర్పు | .... | రామక్రియ | .... | 471 |
| అట్టేకానీవయ్యా అన్నియు | .... | తెలుఁగుఁగాంబోది | .... | 16 |
| అడుగరే యాతనినే | .... | కేదారగౌళ | .... | 136 |
| అడుగరే యీమాట | .... | ధవళ | .... | 157 |
| అడుగరే రమణుఁడు | .... | సామవరాళి | .... | 47 |
| అడుగవే యింకాను | .... | తెలుఁగుఁగాంబోది | .... | 520 |
| అన్నిటా జాణగదవే | .... | శంకరాభరణం | .... | 472 |
| అన్నిటా జాణవు | .... | సౌరాష్ట్రం | .... | 277 |
| అన్నిటానే గురి కాక | ... | కాంబోది | .... | 254 |
| అన్నియు నే నెఱుఁగుదు | .... | దేశాక్షి | .... | 294 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| అన్నియు మరచి | .... | మాళవిగౌళ | .... | 475 |
| అప్పటిని చెలులచే | .... | భూపాళం | .... | 507 |
| అప్పుడాతనికిల్లాల | .... | దేసాళం | .... | 223 |
| అప్పుడుగాని తేరవు | .... | ఆహిరి | .... | 457 |
| అమర మాటాడితివి | .... | శంకరాభరణం | .... | 490 |
| అరయ శ్రావణ బహుళ | .... | లలిత | .... | 333 |
| అలుకలేఁటికి రావే | .... | సామంతం | .... | 260 |
| అల్లాడఁబడిపున్నదా | .... | మాళవిగౌళ | .... | 349 |
| అవునయ్య మంచివాఁడ | .... | సామంతం | .... | 352 |
| ఆతఁడు చెప్పినట్ల | .... | సాళంగం | .... | 89 |
| ఆతఁడు బత్తిగలఁడు | .... | పాడి | .... | 337 |
| ఆతని చెలిని | .... | పాడి | .... | 139 |
| ఆనతీవయ్యనాకు | .... | కాంబోది | .... | 359 |
| ఆనవెట్టుకొందునచే | .... | భైరవి | .... | 480 |
| ఆపెకు నీకు నెంత | .... | నాదరామక్రియ | .... | 105 |
| ఆపె నేమి యడిగేవు | ... | ధవళ | .... | 499 |
| ఆపెమాఁటే నామాఁట | .... | ఆహిరి | .... | 389 |
| ఆపె నేనునొక్కటే | .... | గుండక్రియ | .... | 276 |
| ఆమనిపూవువంటిది | .... | శంకరాభరణం | ... | 87 |
| ఆయనయ్య నీప్రియము | .... | హిందోళం | .... | 468 |
| ఆయనాయ నీకింత | .... | ముఖారి | .... | 66 |
| ఆయనాయ మమ్మునేల | .... | దేసాళం | .... | 191 |
| ఆయలేవే నీయేతు | .... | రీతిగౌళ | .... | 17 |
| ఆసపడి వచ్చి నాఁటదాని | .... | శంకరాభరణం | .... | 416 |
| ఇంక నీచిత్తంబెట్ట | .... | తెలుఁగుఁగాంబోది | .... | 29 |
| ఇంకనేమి సేసేవయ్యా | .... | భైరవి | .... | 72 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| ఇంకనేల పట్టిసిగ్గు | .... | దేసాళం | .... | 25 |
| ఇంకనైనా వేసుకోనీ | .... | భైరవి | ... | 138 |
| ఇంకానేఁటి సుద్దులు | .... | భైరవి | .... | 127 |
| ఇంకావేల మంకు | .. | మాళవిశ్రీ | .... | 243 |
| ఇంతకంటె నింకనేమి | .... | దేసాళం | .... | 244 |
| ఇంతటనైన మన్నించు | .... | ఆహిరి | .... | 486 |
| ఇంతటివాఁడవు | .... | సౌరాష్ట్రం | .... | 415 |
| ఇంత నిష్టూరమేఁటికే | .... | నాదరామక్రియ | .... | 516 |
| ఇంతవాఁడవు గాకున్న | .... | శంకరాభరణం | .... | 171 |
| ఇంతనేతురటవే | .... | మధ్యమావతి | .... | 134 |
| ఇంతి నీజవ్వనవన మీ | .... | శ్రీరాగం | .... | 450 |
| ఇంతుల మంచిగుణాలు | .... | శుద్ధదేశి | .... | 316 |
| ఇంతులెల్లా విని యింక | .... | దేవగాంధారి | ... | 158 |
| ఇంతేసి సేవలు సేయ | .... | కుంతలవరాళి | .... | 375 |
| ఇందరి నేలేటివాఁడు | .... | దేవగాంధారి | .... | 258 |
| ఇందరివలెఁ జూడకు | .... | మాళవి | .... | 498 |
| ఇందరు జాణలే మీరు | .... | కేదారగౌళ | .... | 514 |
| ఇందరు నున్నారు | .... | మంగళకౌశిక | .... | 357 |
| ఇందరు నెఱిఁగినవే | .... | సింధురామక్రియ | .... | 230 |
| ఇందుకుఁగా నవతుల | .... | దేవగాంధారి | .... | 511 |
| ఇందుకు నేనేమిసేతు | .... | కొండమలహరి | .... | 410 |
| ఇందుకేపో విచారాన | .... | భైరవి | .... | 439 |
| ఇందుకే యీపాటి | .... | భవుళి | .... | 346 |
| ఇచ్చకము లాడరాదా | .... | శుద్ధదేశి | .... | 182 |
| ఇచ్చకురాలను నేను | .... | శుద్ధదేశి | .... | 20 |
| ఇటువంటివానిని నిను | .... | నాదరామక్రియ | .... | 111 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఇటువలెఁ జేతురా | బౌళి | 394 |
| ఇటువలె నుండవద్దా | బౌళి | 175 |
| ఇట్టే కరుణించవయ్యా | ఆహిరి | 301 |
| ఇద్దరము మీ యెదుట | పాడి | 98 |
| ఇద్దరికిఁ జనవు | ముఖారి | 366 |
| ఇద్దరికిఁ బోరువెట్టి | బౌళి | 372 |
| ఇద్దరికిదె విన్నప | నాగవరాళి | 94 |
| ఇద్దరికి మీకె చెల్లు | లలిత | 198 |
| ఇద్దరి తమకము నిటు | మధ్యమావతి | 33 |
| ఇద్దరి సరితలు | మంగళకౌశిక | 39 |
| ఇద్దరు జాణలే మీరు యింద | కాంబోది | 206 |
| ఇద్దరు జాణలే మీరు యెంచి | శంకరాభరణం | 288 |
| ఇన్నాళ్ళు దాఁకాను | మధ్యమావతి | 7 |
| ఇన్నాళ్ళవలెఁగావు | ధన్నాశి | 487 |
| ఇన్నాళ్ళు తానెందుండె | వరాళి | 135 |
| ఇన్నాళ్ళు నెఱఁగమైతి | ధన్నాశి | 197 |
| ఇన్నిటికి నెలవుగా | వసంతవరాళి | 399 |
| ఇన్నియు నీయందే | మంగళకౌశిక | 524 |
| ఇప్పుడు విచ్చేసితివి | మలహరి | 305 |
| ఇప్పుడే తెలుసుకో | ముఖారి | 186 |
| ఇప్పుడే మచ్చికలతో | కాంబోది | 213 |
| ఇప్పుడే విన్నవించితి | శంకరాభరణం | 14 |
| ఇరవాయనయ్యా మీ | దేశాక్షి | 290 |
| ఇరవాయ నుండవయ్యా | పాడి | 45 |
| ఇరవాయ వలపులు | లలిత | 325 |
| ఇసుక పాఁతరలు | నాగవరాళి | 461 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఈడకుఁ బిలువవయ్యా | .... కాంబోది | .... 312 |
| ఈతగవు లడుగుమా | .... భవుళి | .... 32 |
| ఈయఁగదవే వీడె | .... కాంబోది | .... 19 |
| ఈరీతి దయవుట్టినా | .... ధన్నాశి | .... 300 |
| ఉండవయ్య మమ్ము నేల | .... దేశాక్షి | .... 519 |
| ఉండవయ్య యెఱుఁగుదు | .... సాళఁగనాట | .... 219 |
| ఉపచరించవయ్య | .... నాదరామక్రియ | .... 121 |
| ఉమ్మడినే యేమని | .... కాంబోది | .... 392 |
| ఊడిగపువారమైనే | .... పాడి | .... 268 |
| ఊడిగపువారినేల | .... రామక్రియ | .... 317 |
| ఊడిగపువారెల్లా | .... శంకరాభరణం | .... 363 |
| ఊడిగేలవారమట | .... ధన్నాశి | .... 294 |
| ఊరకుండితే నెఱఁగ | ... వరాళి | .... 371 |
| ఊరకే బాఁతిపడి | .... కురంజి | .... 395 |
| ఊరకే వుండఁగరాదు | .... భైరవి | .... 247 |
| ఎంతకుఁ జాలవు | .... సామంతం | .... 532 |
| ఎంతకెంతమీరేల | .... బౌళి | .... 456 |
| ఎంతకెంత సేసేవు | .... సామంతం | .... 61 |
| ఎంతగయ్యాళి వనరా | .... రీతిగౌళ | .... 293 |
| ఎంతచెప్పినా మానఁడు | .... ముఖారి | .... 152 |
| ఎంతటిది నీయాసో | .... దేశాక్షి | .... 239 |
| ఎంతటి నేరుపరివి | .... శుద్ధదేశి | .... 273 |
| ఎంతదడవు వట్టు | .... పాడి | .... 287 |
| ఎంతని పొగడేమే | .... గౌళ | .... 339 |
| ఎంత నీయాసోదము | .... సామంతం | .... 220 |
| ఎంతనేరుచుకొన్నాఁడే | .... ముఖారి | .... 44 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఎంత బలువే నీకు | సింధురామక్రియ | 494 |
| ఎంతభాగ్యవంతుఁడవో | శ్రీరాగం | 148 |
| ఎంతమన్నించెనే | నాగగాంధారి | 537 |
| ఎంతయిన మమ్ము నీవు | దేశాక్షి | 95 |
| ఎంతవద్దన్న మాన | కొండమలహరి | 527 |
| ఎంత నేసే విందుకుఁగా | పాడి | 522 |
| ఎందరి నెలయించితో | నాట | 131 |
| ఎందరెందరి సిట్లా | లలిత | 53 |
| ఎందాఁకా నోరుచుకుందే | ముఖారి | 386 |
| ఎందాఁకా మంకుఁదన | ముఖారి | 84 |
| ఎందాఁకా సిగ్గులు | పాడి | 286 |
| ఎందును బోరాడు | ముఖారి | 266 |
| ఎక్కడఁ జిత్తమున్నది | బౌళి | 289 |
| ఎక్కడ పరాకు నీకు | కొండమలహరి | 225 |
| ఎక్కడా నెఱఁగమమ్మా | బలహంస | 396 |
| ఎక్కడి పరాకులేఁటి | తెలుఁగుఁగాంబోది | 275 |
| ఎక్కడికిఁ బోనందువు | మధ్యమావతి | 436 |
| ఎక్కడౌతా నెఱఁగవు | మంగళకౌశిక | 133 |
| ఎటువంటి జాణకాఁదే | దేశాక్షి | 90 |
| ఎటువంటివాఁడవయ్యా | కన్నడగౌళ | 518 |
| ఎటువంటివాఁడవు | హిజ్జిజి | 425 |
| ఎట్టి యాసోదకాఁడవు | పాడి | 430 |
| ఎట్టివేగిరకాఁడవు | నారాయణి | 579 |
| ఎట్టు దెలుసు | శంకరాభరణం | 179 |
| ఎట్టు సేసినాఁజేయు | కాంబోది | 57 |
| ఎట్టైనా చమదలఁచి | ఆహిరి | 75 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఎట్టోరువ వచ్చు | .... ఆహిరి | .... 99 |
| ఎదిరివారి మనసు | .... రామక్రియ | .... 378 |
| ఎదురుగుదురుగాను | .... పళవంజరం | .... 48 |
| ఎన్నఁడు నెఱఁగము మీ | .... సౌరాష్ట్రం | .... 224 |
| ఎన్నఁడు లేవిగుణము | .... వరాళి | .... 384 |
| ఎన్ని సేఁతలు సేసేవే | .... గౌళ | .... 233 |
| ఎన్నైనా గలవు పను | .... శ్రీరాగం | .... 8 |
| ఎప్పటివలెనే చెలి | ... ఆహిరి | .... 404 |
| ఎప్పుడయ్యా నీకరుణ | .... ఆహిరి | .... 314 |
| ఎప్పుడు దయఁజూచేవో | .... భైరవి | .... 449 |
| ఎప్పుడూ మీరొక్కటే | .... వరాళి | .... 202 |
| ఎరవులదానివలె | .... ముఖారి | .... 322 |
| ఎఱఁగవి యాఁటదాని | .... హిందోళం | .... 319 |
| ఎఱఁగమి చేసుకొనే | .... మనోహరి | ... 173 |
| ఎఱఁగవా నాచేత | .... నాగగాంధారి | .... 347 |
| ఎఱఁగవా మీఁదపెత్తు | .... ముఖారి | .... 504 |
| ఎఱఁగ విన్నవించితి | .... దేసాళం | .... 296 |
| ఎఱిఁగితి నిదివో మీ | .... సామంతం | .... 73 |
| ఎఱిఁగిన పనులకు | .... శంకరాభరణం | .... 122 |
| ఎఱుక చెప్పేమయ్య | .... శ్రీరాగం | .... 71 |
| ఎఱుఁగనైతి నిందాఁకా | .... ఛాయానాట | .... 530 |
| ఎఱుఁగవా ఆఁడుఁదగ | .... ముఖారి | .... 150 |
| ఎఱుఁగుదు నీసుద్దు | .... హిందోళవసంతం | .... 380 |
| ఎఱుఁగుదు మన్నియును | .... ధన్నాశి | .... 515 |
| ఎలయించీఁ దానిన్నిటా | .... నాదరామక్రియ | .... 70 |
| ఎవ్వఁడెఱుఁగును | .... శంకరాభరణం | .... 9 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఎవ్వతె యెక్కుడు | పాడి | 262 |
| ఎవ్వరికిఁ జెప్పేవే | దేవగాంధారి | 497 |
| ఎవ్వరిని మెప్పించే | లలిత | 281 |
| ఎవ్వరినైనా మన్నించి | రామక్రియ | 155 |
| ఎవ్వరి వూడిగములు | నాదరామక్రియ | 249 |
| ఎవ్వరు చెప్పిన విన | శ్రీరాగం | 201 |
| ఎవ్వరుఁ జెప్పరు నీకు | ఆహిరి | 96 |
| ఎవ్వరు నేమి చెప్పేరు | సాళంగనాట | 221 |
| ఎవ్వరు మంచి వారమో | నాదరామక్రియ | 405 |
| ఎవ్వరు విన్నవించేరు | భూపాళం | 215 |
| ఏకతానకు రారాదా | సింధురామక్రియ | 304 |
| ఏఁకారే యాపెనేల | శ్రీరాగం | 245 |
| ఏఁటికిఁ బదరేవింతుల | సామంతం | 81 |
| ఏఁటికి నిష్ఠూరము | లలిత | 412 |
| ఏఁటికే దలవంచేవు | ఆహిరి | 31 |
| ఏఁటి చక్కఁదనము | శ్రీరాగం | 332 |
| ఏడ నేరుచుకొంటివి | నాదరామక్రియ | 327 |
| ఏడసుద్దులేదమాట | నాదరామక్రియ | 235 |
| ఏడేడఁజూచినాను | దేవగాంధారి | 82 |
| ఏది దిష్టాంతము | అమరసింధు | 489 |
| ఏనోము నోచితినో | శ్రీరాగం | 407 |
| ఏపున నెంతవెఱతు | ముఖారి | 117 |
| ఏమనఁగవచ్చు నిన్ను | కన్నడగౌళ | 180 |
| ఏమని యానతిచ్చెనే | శ్రీరాగం | 303 |
| ఏమాయ నీకును | కాంబోది | 464 |
| ఏమిగంటి విందు | పాడి | 178 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఏమి గట్టు కొంటివి | .... ఆహిరి | .... 200 |
| ఏమి గడించుకొనేవు | .... సాళంగనాట | .... 454 |
| ఏమి గావలెనో యాకె | .... లలిత | .... 342 |
| ఏమిచూచేవింతి దిక్కు | .... అమరసింధు | .... 323 |
| ఏమిచేసినాఁ జెల్లు | .... దేసాళం | .... 145 |
| ఏమి జాణతనమే | .... శుద్ధదేశి | .... 440 |
| ఏమి జాజాలాడేవు | .... సాళంగనాట | .... 336 |
| ఏమిటికి వట్టినేరా | .... బౌళి | .... 246 |
| ఏమిసేతు నీచిత్త | .... ఆహిరి | .... 338 |
| ఏమిసేయు మనేవయ్య | .... పూర్వగౌళ | .... 348 |
| ఏమి సేసితివో కావి | .... దేసాళం | .... 310 |
| ఏమీ నన రమ్మనవే | .... శ్రీరాగం | .... 495 |
| ఏమీనెఱుఁగదు బాల | .... ఆహిరి | .... 56 |
| ఏమేమి మర్మములో | .... గౌళ | .... 103 |
| ఏమే యిందరిలోన | .... నాట | .... 373 |
| ఏరీతి వేడుకొనేవే | .... భైరవి | .... 320 |
| ఏలకై కొనేవు నీవు | .... శుద్ధవసంతం | .... 143 |
| ఏల గుబ్బతిల్లేరు | .... శుద్ధదేశి | .... 118 |
| ఏల దాఁచుకొనేవు | .... సామంతం | .... 318 |
| ఏల దూరేవయ్యా | .... ఆహిరి | .... 284 |
| ఏల బాసలు చేసేవు | .... పాడి | .... 226 |
| ఏల మమ్ము గరిసించే | .... నీలాంబరి | .... 15 |
| ఏల మఱగున నుండే | .... కాంబోది | .... 183 |
| ఏల రట్టు సేసితి | .... ఛాయానాట | .... 309 |
| ఏలవయ్య యింతుల | .... సౌరాష్ట్రం | .... 18 |
| ఏల వేగిరించ మాకు | .... భైరవి | .... 484 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| ఏల వొడఁబరచేవే | .... | ముఖారి | .... | 326 |
| ఏల సిగ్గులు పడేరు | .... | వరాళి | .... | 187 |
| ఏల సిగ్గులు పడేవు | .... | శుద్ధవసంతం | .... | 241 |
| ఏల సిగ్గు పడేవు నీ | .... | గౌళ | .... | 149 |
| ఏల నేసేవు మాతో | .... | శుద్ధవసంతం | .... | 353 |
| ఐతివే యేలిక సాని | .... | ఆహిరి | .... | 151 |
| ఐనపని కిఁకనేల | .... | దేశాక్షి | .... | 437 |
| ఒకతె చెనకఁగా | .... | భైరవి | .... | 212 |
| ఒకరాన పడితే | .... | తెలుఁగుకాంభోది | .... | 509 |
| ఒద్దికై నీ నగరిలో | .... | నారాయణి | .... | 452 |
| ఔదువయ్యా జాణవు అన్ని | .... | సాళంగనాట | .... | 162 |
| ఔదువయ్యా జాణవు ప్రజ్ఞ | .... | శంకరాభరణం | .... | 344 |
| ఔదువే తగవరి | .... | సామంతం | .... | 13 |
| ఔనయ్యా మంచివాఁడవు | ... | శుద్ధవసంతం | .... | 189 |
| ఔనయ్యా వూరకుండే | .... | మంగళకౌశిక | .... | 460 |
| కంటిమయ్య యీ భాగ్యము | .... | మధ్యమావతి | .... | 311 |
| కంటిమిగా యివి గొన్ని | .. | దేశాక్షి | .... | 442 |
| కంటిమి నీజాడలెల్లా | .... | శంకరాభరణం | .... | 446 |
| కంటిమి నీసుద్దులెల్ల | .... | దేసాళం | .. | 68 |
| కంటిమి నేఁడీ భాగ్యము | .... | శ్రీరాగం | .... | 93 |
| కంటిమి నే మీభాగ్యము | .... | సామంతం | .... | 443 |
| కంటిమి మిమ్ముందరినీ | .... | సింధురామక్రియ | .... | 106 |
| కంటిమి మీ భాగ్యము | .... | సాళంగం | .... | 228 |
| కంటిమి వింటిమి | .... | మాళవిగౌళ | .... | 417 |
| కంటిరా యీతనిజాడ | .... | రామక్రియ | .... | 164 |
| కందువ నప్పటినుండి | .... | సాళంగనాట | .... | 172 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| కందువ మాతోడిపొందు | .... | భైరవి | .... | 340 |
| కందువ లన్నియు నందే | .... | ఆహిరి | .... | 272 |
| కడుఁగోమలమగు | .... | సామంతం | .... | 166 |
| కడు దంట గాదు | .... | సామంతం | .... | 383 |
| కనకగిరిరాయ | .... | దేసాళం | .... | 214 |
| కనుకొనవయ్యా | .... | ఆహిరి | .... | 240 |
| కనుఁగొని మొక్కరే | .... | శ్రీరాగం | .... | 104 |
| కన్నెపడుచు గనక | .... | ద్రావిళభైరవి | .... | 521 |
| కప్పుర మందుకొంటి | .... | శంకరాభరణం | .... | 302 |
| కలసిన చోటను | .... | సామంతం | .... | 271 |
| కల్లగాదు నామాట | .... | ముఖారి | .... | 431 |
| కల్లగాదు నీవు మాకు | .... | నట్టనారాయణి | .... | 165 |
| కల్లరి వౌనవరాదు | .... | పాడి | .... | 154 |
| కాంతలకెల్లాఁ జెప్ప | .... | కుంతలవరాళి | .... | 473 |
| కాంతల నెన్నదుముల | .... | అమరసింధు | .... | 137 |
| కాకున్న నింతలోఁగేనా | .... | కాంబోది | .... | 435 |
| కాఁగిలించవే యిట్టే | .... | ధన్నాశి | .... | 217 |
| కాఁగిలించుకొని యెంత | .... | హిందోళవసంతం | .... | 55 |
| కాదనకు నామాట | .... | సాళంగనాట | .... | 458 |
| కాదని సాధించి విన్న | .... | మాళవిగౌళ | .... | 193 |
| కాదు గూడదంటిమా | .... | బౌళి | .... | 534 |
| కానీవమ్మ యీ పుణ్యము | .... | సావేరి | .... | 531 |
| కానీవయ్య అందుకేమి | .... | శంకరాభరణం | ... | 500 |
| కానీవే తానాడినట్టే | .... | ధవళి | .... | 397 |
| కానీవే యెందు వొయ్యేము | .... | పాడి | .... | 144 |
| కైకొనవయ్యా ఘనుఁడవు | .... | శంకరాభరణం | .... | 110 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| కొంతగుండె పట్టుకొని | .... | శంకరాభరణం | .... | 30 |
| కొంతవడి వుండవయ్యా | .... | నాదరామక్రియ | .... | 36 |
| కొత్తపెండ్లికూఁతురవు | .... | దేసాళం | .... | 177 |
| కొలువై వున్నాఁడు | .... | శంకరాభరణం | .... | 168 |
| కోమలపుమేని సతి | .... | ముఖారి | .... | 345 |
| ఘాతలు నీపైఁజూపదు | .... | పాడి | .. | 229 |
| చందమయ్యా నన్నియు | .... | భైరవి | . | 185 |
| చవవు గలుగు చోట | .... | పాడి | .... | 364 |
| చలములు మానవె | .... | శంకరాభరణం | .... | 211 |
| చలిమి బలిమీఁ గద్దు | .... | మేఁచబౌళి | .... | 40 |
| చిడుముడి సిగ్గున | .... | శ్రీరాగం | .... | 238 |
| చిత్తగించి వినవయ్య | .... | నారాయణి | .... | 324 |
| చిత్తమురా నాతనికి | .... | నాదరామక్రియ | .... | 169 |
| చిత్తానఁ బెట్టుక వుండు | .... | ముఖారి | .... | 186 |
| చిన్నవానివలె నెంత | .... | కురంజి | .... | 125 |
| చుట్టమువలెనే | .... | శంకరాభరణం | .... | 69 |
| చూడఁ గొత్తలాయ | .... | దేసాళం | .... | 387 |
| చూడ చిన్నవాఁడు గాని | .... | దేశాక్షి | .... | 216 |
| చూడ నిన్నిటా జాణఁడ | .... | సామంతం | .... | 331 |
| చూతమే యీసంతోసా | .... | కేదారగౌళ | .... | 470 |
| చూతువు రావయ్యా సుదతి నిట్టే | .... | దేసాళం | .... | 441 |
| చూతువు రావయ్యా సుదతిలాగు | .... | శ్రీరాగం | .... | 38 |
| చెప్పకురే బుద్ధులిఁక | .... | లలిత | .... | 365 |
| చెప్పరయ్య వినే నేను | .... | కాంబోది | .... | 433 |
| చెప్పరే మీరైనా బుద్ధి | .... | ధన్నాశి | .... | 232 |
| చెప్పిన నాబుద్ధి నీకు | .... | ద్రావిళభైరవి | .... | 188 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
| --- | --- | --- |
| చెప్పేవారి బుద్ధులు | .... కాంబోది | .... 482 |
| చెలికత్తెలము నేము | .... కేదారగౌళ | .... 428 |
| చెలి చెప్పినట్టు నీవు | .... సామంతం | .... 132 |
| చెలిమోవి యెంగిలి | .... పాడి | .... 403 |
| చెలియరో నీవే కదే | .... వరాళి | .... 427 |
| చెలియా నాకు నీవు | .... ఆరిభి | .... 22 |
| చెలులము నేమైనా | .... అమరసింధు | .... 209 |
| చెలుల మెఱంగము | .... సామంతం | .... 160 |
| చెలులు వద్దనఁ గానే | .... పాడి | .... 451 |
| చెలులెల్లా నిందుకే | .... ఆహిరి | .... 64 |
| చేకాచుక రావయ్య | .... కురంజి | .... 315 |
| చేచేత నీకుపాయాలు | .... ముఖారి | .... 261 |
| చేరి ధర్మపుణ్యము | .... రామక్రియ | .... 63 |
| జడిసేవు గనక | .... రామక్రియ | .... 351 |
| జమళి వలపు లివి | .... శంకరాభరణం | .... 256 |
| తగినట్టే మెలఁగితే | .... పూర్వగౌళ | .... 488 |
| తప్పక యేమి చూచేవు | .... ముఖారి | .... 218 |
| తప్పులింకఁ బట్ట నిన్ను | .... కన్నడగౌళ | .... 418 |
| తప్పులేల వేసీనే | .... ఆహిరి | .... 465 |
| తమకించ నేఁటికే | .... నాట | .... 379 |
| తమలోనఁ దామే | .... దేసాళం | .... 376 |
| తరుణివి నీకింత | .... దేవగాంధారి | .... 28 |
| తరుణీ నీ వెఱుఁగని | .... రీతిగౌళ | .... 257 |
| తలఁచు కొమ్మనవే | .... పాడి | .... 222 |
| తలఁపు దెలియవద్దా | .... సాళంగం | .... 126 |
| తలకొని యేల యెద | .... భవుళి | .... 85 |
| తానెంత నేనెంత | .... మాళవిగౌళ | .... 374 |
| తానెప్పుడు మాకు లోనే | .... సింధురామక్రియ | .... 26 |
| తానెఱఁగడటవే | .... ఛాయానాట | .... 59 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| తూటిపాటి తెలియకే | .... | సాళంగనాట | .... | 41 |
| తెలుసుకో ఇఁక నీవే | .... | శ్రీరాగం | .... | 270 |
| తెలుసుకో యింకా నీవే | .... | రామక్రియ | .... | 381 |
| తేటతెల్లమాయ | .... | శంకరాభరణం | .... | 334 |
| తేవయ్య విడె మింక | .... | సామంతం | .... | 161 |
| తొయ్యలివల్ల నింక | .... | మధ్యమావతి | .... | 382 |
| తొల్లెరఁగమా నీదొడ్డ | .... | నాట | .... | 432 |
| తొల్లే అన్నిటా బుద్ధి | .... | రామక్రియ | .... | 313 |
| తొల్లే నేమెరుఁగుదుము | .... | ఆరిభి | .... | 535 |
| దండనున్న చెలుల | .... | కురంజి | .... | 49 |
| దయదలఁచి నపుడే | .... | శుద్ధవసంతం | .... | 115 |
| దిట్ట వన్నిటాఁ దొల్లే | .... | సాళంగం | .... | 354 |
| దేవతలు చెలఁగిరి | .... | సాళంగనాట | .... | 92 |
| దేవరవు నీవుగావా | .... | రామక్రియ | .... | 388 |
| దేవరవు నీవు నీదేవుల | .... | మాళవిగౌళ | .... | 130 |
| దేవరవు నీసుద్దులు | .... | లలిత | .... | 491 |
| దొరపాటి వాఁడతఁడు | .... | ఆహిరి | .... | 24 |
| దోసము లేదనవయ్య | .... | తెలుఁగుకాంబోది | .... | 231 |
| ధర్మముఁ బుణ్యము | .... | దేవగాంధారి | .... | 163 |
| నంటు చేసీ సిరితోడ | .... | నాట | .... | 204 |
| నన్ను నేల పొగడేవు | .... | దేసాళం | .... | 528 |
| నన్నే అట్టు సేతురు | .... | నాదరామక్రియ | .... | 3 |
| నలువంక సతులెల్ల | ... | పూర్వగౌళ | .... | 111 |
| నవ్వవే యెక్కడి సుద్ది | .... | నీలాంబరి | .... | 153 |
| నాకెంత ప్రియము చెప్పీ | .... | మాళవిగౌళ | .... | 501 |
| నాకేల వెఱచేవు | .... | ధన్నాశి | .... | 253 |
| నాతో నేఁటికి నాటకము | .... | దేవగాంధారి | .... | 170 |
| నిండు దొరవౌదువు | .... | సాళంగనాట | .... | 493 |
| నిజమరి నంటావచ్చి | .... | మధ్యమావతి | .... | 251 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| నిన్నటి యలుక దేర్చి | .... | ఆహిరి | .... | 377 |
| నిన్ను నేము గాదనేమా | .... | మంగళకౌశిక | .... | 199 |
| నీకు నాకెకుఁ గలదే | .... | భవుళి | .... | 58 |
| నీకు నీకే యమరును | .... | పాడి | .... | 391 |
| నీకే తెలుసువయ్యా నీసుద్దు | .... | శ్రీరాగం | .... | 506 |
| నీకే తెలుసునయ్యా నేరుపరి | .... | సాళంగనాట | .... | 356 |
| నీకేల కొంకను | .... | హిందోళవసంతం | ... | 328 |
| నీకేల పొద్దువోదు | .... | ముఖారి | .... | 462 |
| నీకేల వెరపు నెలఁత | .... | మంగళకౌశిక | .... | 362 |
| నీగుణ మిటువంటిదా | .... | గౌళ | .... | 525 |
| నీచిత్తము వచ్చినట్టు | .... | భైరవి | .... | 444 |
| నీతలనే వచ్చెనయ్యా | .... | సాళంగనాట | .... | 512 |
| నీతోనేఁ బంతమాడే | .... | పాడి | .... | 190 |
| నీనేర మెంచుకోక | .... | దేశాక్షి | .... | 330 |
| నీ పాపమే కాదు | .... | నాట | .... | 483 |
| నీ మగఁడు కొలువులో | .... | ఆహిరి | .... | 505 |
| నీమనసు కొలఁదింతే | .... | ఆహిరి | .... | 264 |
| నీ విచ్చిన బాసలు నిలిపి | .... | ఆహిరి | .... | 21 |
| నీవుచేసిన భాగ్యము | .... | మనోహరి | ... | 422 |
| నీవు మగవాఁడవు | .... | శుద్ధవసంతం | .... | 51 |
| నీవు నేసిన పనులు | .... | నాట | .... | 517 |
| నీవెఱఁగని తగవు | .... | శ్రీరాగం | .... | 298 |
| నీవెఱఁగని వున్నవా | .... | ముఖారి | .... | 124 |
| నీవెఱఁగవా యిది | .... | సాళంగనాట | .... | 308 |
| నీవెఱఁగవా యివి | .... | సాళంగనాట | .... | 120 |
| నీవే మన్నించేవు | .... | ఆహిరి | .... | 116 |
| నీవే యాతఁడు గావా | .... | కాంబోది | .... | 237 |
| నీవే యానతీవయ్యా | .... | ఆహిరి | ... | 400 |
| నీవేయిఁకఁ గరుణించ | .... | శంకరాభరణం | .... | 78 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| నీవే యెఱఁగవలె | .... | కాంబోది | .... | 114 |
| నీవేల పంతాలాడేవు | .... | సాళంగనాట | .... | 79 |
| నీవేల సిగ్గువడేవు నెట్టన | .... | హిందోళం | .... | 34 |
| నీవేల సిగ్గువడేవు నేఁడిట్టే | .... | శుద్ధదేశి | .... | 390 |
| నెలఁతచిత్తము కొద్దీ | .... | కేదారగౌళ | .... | 11 |
| నేనెఱఁగనా తన | .... | కొండమలహరి | .... | 459 |
| నేమెఱఁగమా నీ నెరజాణ | .... | కేదారగౌళ | .... | 280 |
| నేమెఱఁగమా నీపనులు | .... | శంకరాభరణం | .... | 208 |
| నేరని జీవులము | .... | ఆహిరి | .... | 367 |
| పండిపొల్లవోదెపుడు | .... | సాళంగనాట | .... | 429 |
| పంతగాఁడ వింక | .... | నారాయణి | .... | 112 |
| పంతగాఁడ వౌదువు | .... | భూపాళం | .... | 263 |
| పంతమాడుదువు | .... | భవుళిరామక్రియ | .... | 234 |
| పచ్చిదేరీ నీమాటలు | .... | దేశాక్షి | .... | 60 |
| పట్టరానివయసుల | .... | సాళంగనాట | .... | 167 |
| పట్టినచలము లేల | .... | భైరవి | .... | 184 |
| పడఁతి నీపతిఁదెచ్చె | .... | శ్రీరాగం | .... | 438 |
| పడఁతి నీపతికె | .... | శంకరాభరణం | .... | 129 |
| పదిటిలోపల నేము | .... | రామక్రియ | .... | 467 |
| పరఁగనిఁక నేఁటిది | .... | దేశాక్షి | .... | 469 |
| పాయపుమదమో యిది | .... | రామక్రియ | .... | 37 |
| పాయపువాఁడు దానే | .... | రామక్రియ | .... | 269 |
| పాలుదాగినసత్తువ | .... | సాళంగనాట | .... | 62 |
| పిలువరే యీకాంత | .... | ఆహిరి | .... | 248 |
| పెనఁగితే వలపులు | .... | మంగళకౌశిక | .... | 408 |
| పొంచి మొకమిచ్చలకు | .... | కాంబోది | .... | 146 |
| పొందు లిద్దరివి | .... | శంకరాభరణం | .... | 278 |
| పొగడించుకొందువు | .... | మంగళకౌశిక | .... | 46 |
| పొద్దువోక నీకు నిట్టే | .... | శుద్ధదేశి | .... | 398 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| బాపుబాపు మేలు | .... | సాళంగనాట | .... | 50 |
| బుజ్జగించ రాదా | .... | శ్రీరాగం | .... | 358 |
| బుద్ధిచెప్పేవారమా | .... | నాదరామక్రియ | .... | 369 |
| బుద్ధులాతని కెందాఁక | .... | మేచబౌళి | .... | 292 |
| భయమెల్లాఁ బాసె | .... | కన్నడగౌళ | .... | 355 |
| భావమెఱిఁగిన | .... | దేవగాంధారి | .... | 329 |
| మంచితనము సేయఁగ | .... | శుద్ధవసంతం | .... | 361 |
| మగఁడ వన్నిటి కోర్చి | .... | భైరవి | .... | 10 |
| మగనితో మమ్ము | .... | సాళంగం | .... | 23 |
| మగవాఁడ వౌదుష | .... | నాగవరాళి | .... | 502 |
| మగవాని కింతయేల | .... | నాగవరాళి | .... | 335 |
| మగవారయినవారు | .... | సామంతం | .... | 538 |
| మగువను దయఁజూచు | .... | లోకవరాళి | .... | 265 |
| మగువ మాటనే | .... | దేవగాంధారి | .... | 360 |
| మగువ యప్పటనుండి | .... | ధన్నాశి | .... | 77 |
| మగువా నీవు నొక్కటే | .... | నాదరామక్రియ | .... | 414 |
| మన్నించవయ్యా | .... | ఆహిరి | .... | 42 |
| మన్నించు నే నిలుచుండే | .... | నట్టనారాయణి | .... | 65 |
| మమ్ము సాకిరి వెట్టేవు | .... | సౌరాష్ట్రం | .... | 526 |
| మమ్మేల దూరేవు | .... | ఆహిరి | .... | 510 |
| మమ్మేల వుప్పతించేవు | .... | బౌళి | .... | 466 |
| మఱి యేఁటి విన్నపాలు | .... | దేవగాంధారి | .... | 250 |
| మఱి యేమి చెప్పేమయ్యా | .... | శుద్ధవసంతం | .... | 453 |
| మాకేమి పని | .... | లలిత | .... | 463 |
| మాకేల అంతలేసి | .... | రామక్రియ | .... | 181 |
| మాకేల గరిసించ | .... | పాడి | .... | 447 |
| మాకేల వాయిలదువ | .... | తోండి | .... | 529 |
| మాతోనైతే మారు | .... | సాళంగం | .... | 4 |
| మానవయ్యా యిటువంటి | .... | బౌళి | .... | 295 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| మానవుగా మాతోడ | .... | సామంతం | .... | 481 |
| మాపంతము లేదేరె | .... | తెలుఁగుకాంబోది | .... | 5 |
| మాపుద్దాఁకా మాటలేనే | .... | గంభీరనాట | .... | 424 |
| మా ముందర నేల | .... | శంకరాభరణం | .... | 406 |
| మావంటివా రేమన్నా | .... | భైరవి | .... | 76 |
| మావలె నోర్వదు | .... | పాడి | .... | 205 |
| మిక్కిలి నేరుపరివి | .... | కన్నడగౌళ | .... | 108 |
| మీఁద మిక్కిలి సన్నలు | .... | వరాళి | .... | 119 |
| మీరైతే నెఱుఁగరు | .... | నట్టనారాయణి | .... | 101 |
| ముంచుకొంటే వలపులు | .... | హిందోళవసంతం | .... | 476 |
| ముందరెంచి మెలఁగవే | .... | సాళంగనాట | .... | 409 |
| ముందెఱఁగక కడు | .... | సామంతం | .... | 43 |
| మూసి దాఁపిరము | .... | కాంబోది | .... | 97 |
| మెచ్చితి నీసుద్దులు | .... | ముఖారి | .... | 6 |
| మెచ్చితిమి నిన్నును | .... | తోండి | .... | 54 |
| మెచ్చిరి గొల్లెతలెల్ల | .... | దేసాళం | .... | 80 |
| మేనవార మిద్దరము | .... | లలిత | ... | 523 |
| మేలము లమరెఁగా | .... | నాగవరాళి | .... | 207 |
| మేలుగలంతాను | ... | సింధురామక్రియ | .... | 123 |
| మేలుగాదా నీభాగ్య | .... | సామంతం | .... | 503 |
| మేలు మేలు నీగుణాలు | .... | రామక్రియ | .... | 88 |
| మొక్కరో సేవించరో | .... | సాళంగనాట | .... | 385 |
| మొక్కితి ననవే తన | .... | సాళంగం | .... | 321 |
| మొగము చూడఁగానే | .... | వరాళి | .... | 91 |
| రమణుఁడు నాకు | .... | గుజ్జరి | .... | 297 |
| రమ్మనవే యింకనేల | .... | దేశాక్షి | .... | 159 |
| రమ్మని పిలువగదె | .... | వరాళి | .... | 174 |
| రావయ్యా యెక్కడిసుద్ది రచ్చల | .... | ఆహిరి | .... | 474 |
| రావయ్యా యెక్కడిసుద్ది రవ్వ | .... | నారాయణి | .... | 368 |

| సంకీర్తన | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| లోనికి రావయ్యా | ... | నాగవరాళి | .... | 423 |
| వట్టి చేఁతలు సేయఁగ | .... | ఆహిరి | .... | 2 |
| వట్టి నటలు సేసేవు | ... | నట్టనారాయణి | .... | 477 |
| వద్దువద్దుదోసము | .... | ఆహిరినాట | .... | 496 |
| వన్నెకాఁడవన్నిటాను | .... | దేసాళం | .... | 74 |
| వరుసలు వెట్టుక | .... | శంకరాభరణం | ... | 1 |
| వాఁడె వాఁడె వీఁడె వీఁడె | .... | సాళంగనాట | .... | 107 |
| వారేమి సేతురు వనిత | .... | కాంబోది | .... | 67 |
| వాసికే బతికేవారు | .... | హిజ్జిజి | .... | 283 |
| వింటిఁ దనసుద్దులెల్ల | .... | దేసాళం | .... | 252 |
| వింటివావోయి | .... | మాళవిగౌళ | .... | 35 |
| వింటివో వినవో కాని | .... | దేశాక్షి | .... | 306 |
| వింతలేల సేసేవే | .... | బలహంస | .... | 210 |
| విడువు వేసాలు | .... | నాగవరాళి | .... | 255 |
| వినవే యిఁకనైనా | .... | దేసాళం | .... | 393 |
| విన్నప మిదియొకటి | .... | కేదారగౌళ | .... | 83 |
| విన్నపము లింకనేల | .... | శంకరాభరణం | .... | 147 |
| విన్నపము లేమిసేసే | .... | దేవగాంధారి | .... | 274 |
| విన్నవించ నేమిటికి | .... | సౌరాష్ట్రం | .... | 313 |
| విన్నవించ నేమున్నది | .... | భైరవి | .... | 413 |
| విన్నవించుమనె మమ్ము | .... | ధన్నాశి | .... | 102 |
| విభుఁడవు నీవందుకు | .... | సౌరాష్ట్రం | .... | 17[illegible] |
| విరహతాపము | .... | తెలుఁగుఁగాంబోది | .... | 140 |
| విరులయమ్ములు వాఁడి | .... | ఆహిరి | .... | 419 |
| వీడెము చేతఁబట్టుక | .... | వరాళి | .... | 411 |
| వీరట నీవట యిఁక | .... | లలిత | .... | 236 |
| వెగ్గళించఁ జూచితేను | .... | పూరిధి | .... | 536 |
| వెనకఁ జేతువు గాని | .... | లలిత | .... | 448 |
| వెన్నతోఁ బెట్టిరి నీకు | .... | భూపాళం | .... | 299 |

356


| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| వెన్నెలలు గడువేడి | .... కన్నడగౌళ | .... 242 |
| వెలవకు నేఁగూడి | .... శుద్ధవసంతం | .... 434 |
| వెఱ్ఱితనమున నిన్ను | .... దేసాళం | .... 508 |
| వెలయఁగఁ దెరయిఁక | .... శ్రీరాగం | .. 86 |
| వేగినంతా నీరాకకే | .... ఆహిరి | .... 12 |
| వేగిరించే విదే నీకు | .... శంకరాభరణం | .... 27 |
| వేడుక మీవలపులు | .... వరాళి | .... 307 |
| వేడుక లింతే కాని | .... కురంజి | .... 203 |
| వేడుక లెటువంటివో | .... నాదరామక్రియ | .... 195 |
| వేవేలకు నీకు నీవే | .... సావేరి | .... 341 |
| వేసరింతురా చెలిని | .... దేసాళం | .... 282 |
| శిరసుంద మోఁకాలికి | .... గౌళ | .... 52 |
| సందడించీ వలపు | .... రామక్రియ | .... 227 |
| సందడిపెండ్లి నీకు | .... నారాయణి | .... 291 |
| సందడిలో నెందాఁకా | .... శ్రీరాగం | .... 420 |
| సతికివిఁ బతికిని | .... నారాయణి | .... 156 |
| సతులకుఁ బతులకు | .... సామంతం | .... 426 |
| సతులకు నిటువంటి | ... రామక్రియ | .... 285 |
| సరకుఁ గొనేవా నీవు | ... నాదరామక్రియ | ... 279 |
| సరసుఁడ వన్నిటాను | ... దేవగాంధారి | ... 194 |
| సిగ్గువడఁడిదివో | ... సాళంగనాట | ... 128 |
| సిగ్గువడకిఁకనేల | ... వరాళి | ... 402 |
| సిగ్గువడి మూలనేమి | ... బౌళి | ... 14 |
| సిగ్గువడుదురా | ... శంకరాభరణం | — 178 |
| సుదతుల కితవికి | ... నాగవరాళి | — 100 |
| సెలవుల నవ్వేనే | ... కన్నడ గౌళ | — 485 |
| [illegible]ఁగాక వూడిగేలు | ... ఆహిరి | — 401 |
| [illegible]నే బలిమింతే | ... మంగళకౌశిక | — 109 |


42830

ధర్మం ఆచరించండి ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు
ధర్మ ప్రచార పరిషత్